# తెలుగు దివ్వెలు - 2

## తెలుగు వాచకం (ప్రథమభాష)

## పదో తరగతి


### సంపాదకమండలి

**డా॥ పోరంకి దక్షిణామూర్తి ,** విశ్రాంత ఉపసంచాలకులు, తెలుగు అకాడమి, హైదరాబాద్.

**డా॥ డి.చంద్రశేఖరరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యులు, ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల హైదరాబాద్.

**డా॥ దహగాం సాంబమూర్తి ,** విశ్రాంత ప్రధానాచార్యులు, ఉపాధ్యాయ విద్యాకళాశాల, వరంగల్.

**డా॥ బూదాటి వేంకటేశ్వర్లు,** తెలుగువిభాగాధిపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం, చిత్తూరు జిల్లా.

### విషయనిపుణులు

**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

**డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి,** వేమన విశ్వవిద్యాలయం, వై.యస్.ఆర్., జిల్లా కడప.

**డా॥ ఆశావాది ప్రకాశ రావు,** విశ్రాంత ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీకళాశాల, పెనుగొండ, అనంతపురం జిల్లా.

**డా॥ నోరి రాజేశ్వర రావు,** ఉపన్యాసకులు, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రాచ్యకళాశాల, హైదరాబాద్.

### సమన్వయకర్తలు

**శ్రీ వొజ్జల శరత్ బాబు,** తెలుగు పండితులు, ప్ర.ఉ.పా.(బాలుర & బాలికల), సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**డా॥ యస్.రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**శ్రీ పల్లెర్ల రామమోహన రావు,** యస్.ఎ.-తెలుగు, జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్.

**చిత్రాలు, ముఖచిత్రం : శ్రీ కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. కుర్మెడ, నల్లగొండ జిల్లా.



### పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి

**శ్రీ జి. గోపాల్ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆం.ప్ర., హైదరాబాద్.

**డా॥ ఎన్. ఉపేందర్ రెడ్డి**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక,
పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆం.ప్ర., హైదరాబాద్.

**శ్రీ బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
ఆం.ప్ర., హైదరాబాద్.


*విద్యవల్ల ఎదగాలి*
*వినయంతో మెలగాలి*

*చట్టాలను గౌరవించండి*
*హక్కులను పొందండి*


**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్**


'దేశభాషలందు తెలుగు లెస్స'

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ**

© Government of Andhra Pradesh, Hyderabad

*New Edition*

*First Published 2014*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Andhra Pradesh.

This Book has been printed on 70 G.S.M. SS Maplitho
Title Page 200 G.S.M. White Art Card

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ**

*Printed in India*
at the Andhra Pradesh Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Andhra Pradesh.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# ముందుమాట

పాఠశాల విద్యలో పదోతరగతి చివరిది. ఆలోచించడం, వ్యక్తీకరించడం, అనే ప్రధాన ఉద్దేశంతో ప్రాథమికస్థాయి నుండి భాషావాచకాల రూపకల్పన జరిగింది. 10వ తరగతి పూర్తయేసరికి పిల్లల్లో విన్నదాన్ని గురించి, చదివినదాన్ని గురించి విమర్శనాత్మకంగా ఆలోచించి విచక్షణతో విశ్లేషించే సామర్థ్యాలు వృద్ధిచెందాలి. వ్యవహారంలో ఉన్న మౌఖిక, లిఖిత, భాషారూపాలను / ప్రక్రియలను అర్థంచేసుకొని సందర్భోచితంగా వినియోగించగలగాలి. సాహిత్య పఠనంద్వారా భాషా సౌందర్యాన్ని, శైలిని, కవులను, రచయితలను ప్రశంసించగలగాలి. విమర్శనాత్మక దృక్పథంతో విశ్లేషించి వివిధ రచనలలోని భావార్థాలను, అంతరార్థాలను ఆకళింపు చేసుకోవాలి. సమకాలీన అంశాలతో అన్వయించగలగాలి. పఠనం ఒక అలవాటుగా మార్చుకొని ఉన్నత వ్యక్తిత్వాన్ని, వైఖరులను పెంపొందించుకోవాలి. తమ జ్ఞానపరిధిని విస్తృత పరచుకోవాలి. ఇందుకోసం వివిధ విషయాల గురించి అదనపు పఠన సామగ్రిని, ఉపయుక్తగ్రంథాలను చదవడం, విషయనిపుణులతో, భాషావేత్తలతో చర్చించడం అలవరచుకోవాలి. మాతృభాష కట్టుబాట్లు, నియమాలు, సూత్రాల ఆధారంగా అన్యభాషలను అర్థంచేసుకోగలగాలి.

పైన తెలిపిన అంశాలను సాధించడానికి వీలుగా **"తెలుగు దివ్వెలు-2"** అనే పేరుతో పదో తరగతి ప్రథమభాషకు తెలుగు వాచకాన్ని రూపొందించారు. తొమ్మిదో తరగతి వరకు పిల్లలు పొందిన భాషాసామర్థ్యాలు, సృజనాత్మకతలు మరింత పెంపొందించడానికి వీలుగా దీన్ని రూపొందించారు. దీని ద్వారా పిల్లల్లో అవగాహన చేసుకొని ప్రతిస్పందించే సామర్థ్యాలు, స్వీయ రచనాశక్తితోపాటు సామాజిక స్పృహ, మానవతావిలువలు, మానవ సంబంధాలు, స్త్రీలపట్ల గౌరవం, శ్రమను గౌరవించడం వంటివి పెంపొందేలా పాఠ్యాంశాలను ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుండి ఎంపికచేసారు. ప్రకృతి వర్ణన, విలువలు, స్ఫూర్తి, విమర్శ, సంస్కృతి, స్త్రీలపట్లగౌరవం, మానవస్వభావం, శాస్త్రీయ పరిశీలన, సామాజికసేవ, స్త్రీ సాధికారత హాస్యం మొదలైన ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యాంశాలను ఎంపికచేశారు. పాఠ్యాంశాలు పద్యం, కథ, లేఖ, అభినందన వ్యాసం, నాటిక, ద్విపద, పీఠిక, వచన కవిత, అనువాదకథ, కథానిక మొదలైన ప్రక్రియల్లో ఉన్నాయి. విస్తారపఠనానికై భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని ఉపవాచకంగా పెట్టారు. ఇది భారతీయ సంస్కృతి, విలువలు పెంపొందించడానికి, ఇతిహాసాలపట్ల అభిరుచి కలిగించడానికి తోడ్పడుతుంది.

ప్రతి పాఠంలో సామర్థ్యాల సాధనకనుగుణంగా **"ఇవి చేయండి"** శీర్షికతో అభ్యాసాలున్నాయి. ఆలోచించడం, ప్రతిస్పందించడం, అభిప్రాయాలు చెప్పడం, బహుకోణాల్లో విశ్లేషించడం, విభిన్న కోణాల్లో ఆలోచించడం, సకారణంగా వివరించడం, అన్వయించడం, సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా వ్యక్తీకరించడం వీటి స్వభావం. పిల్లలు పాఠ్యపుస్తక పరిధిని దాటి నేర్చుకోవడానికి వీలుగా ప్రాజెక్టుపనుల వంటివి చేర్చారు. ఇవి స్వయం అధ్యయనాన్ని, అదనపు / పరామర్శ గ్రంథాలను సంప్రదించడాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయి. పాఠంలోని విషయాన్ని అవగాహన చేసుకోడానికి వీలుగా సందర్భోచిత అర్థాలను పదవిజ్ఞానం పేరుతో పుస్తకం చివర చేర్చారు.

ఉపాధ్యాయులు సోపానక్రమం ప్రకారం పాఠ్య బోధన జరపడానికి వీలుగా పాఠంలోని విషయాలను అమర్చారు. గద్య, పద్య పాఠాలను వేర్వేరుగా ఇవ్వకుండా పాఠాల స్వభావం, నిడివి ఆధారంగా వరుస క్రమంలో అమర్చారు. వ్యాకరణ సూత్రాలను సులభంగా ఆకళింపు చేసుకునేలా ఉదాహరణలు పొందుపరిచారు. భాషోపాధ్యాయులు పాఠంలోని విషయాన్ని నేరుగా బోధించకుండా పాఠ్యాంశం ముందున్న అంశాలతో ప్రారంభించి తర్వాత పాఠ్యాంశాన్ని చర్చలు, ప్రతిచర్చల ద్వారా అవగాహన కల్పించి అభ్యాసాలపై సాధన చేయించాలి. పాఠ్యాంశంలోని జాతీయాలు, పదబంధాలు, ముఖ్యమైన సందేశాత్మక వాక్యాలు, సంఘటనల గురించి లోతైన చర్చద్వారా అవగాహన, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందింప జేయాలి. భాషాసామర్థ్యాల సాధనలో పాఠ్యపుస్తకం ఉపాధ్యాయుడికి ఒక సహకారి మాత్రమే. పరామర్శ గ్రంథాలను, పాఠశాల గ్రంథాలయాన్ని తాను వినియోగించుకుంటూ పిల్లలు వినియోగించుకునేలా భాషావాతావరణాన్ని కల్పించాలి.

ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న సంపాదక మండలి సభ్యులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులు, సలహాలు, సూచనలు అందజేసిన వారందరికీ ధన్యవాదాలు. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషాసామర్థ్యాల సాధనకు దోహదపడి ఉత్తమ వైఖరులు కల్గిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

**జి. గోపాల్ రెడ్డి**
**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

తేది : 30-11-2013
స్థలం : హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- ఈ వాచకాన్ని సమర్థంగా వినియోగించడానికి **"ముందుమాట, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యా"లను** తప్పనిసరిగా చదవాలి.
- **"విద్యార్థులకు సూచన"లను** ముందుగా మీరు చదవండి. వాటిని మీ పిల్లలతో చదివించండి. వారికి అవి అర్థమైనాయో లేదో పరిశీలించండి.
- ఈ వాచకాన్ని 180 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. వీటిలో 168 కాలాంశాలు పాఠ్యాంశాల బోధనకు, మిగతా కాలాంశాలను ఉపవాచకంలోని అంశాలను చర్చించడానికి వినియోగించాలి.
- ఉపవాచకాన్ని ఒక్కొక్క టర్మ్‌కి రెండు కాండల చొప్పున పూర్తిచేయాలి.
- ఉపవాచకాన్ని పిల్లలతో తప్పక చదివించాలి. ముఖ్యాంశాలపైన మాట్లాడించాలి. పఠనావగాహనకు సంబంధించిన అభ్యాసాలను రూపొందించి నిర్వహించాలి.
- సగటున ఒక్కొక్క పాఠానికి 12 కాలాంశాలు అవసరమవుతాయి.
- వీటిలో **"చదవండి - ఆలోచించండి, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం, విద్యార్థులకు సూచనల్లో"** ఇచ్చిన అర్థసంగ్రహణ కృత్యాలకు కలిపి రెండు కాలాంశాలను వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించడానికి పాఠంలోని విషయం నిడివిని బట్టి రెండు నుండి నాలుగు కాలాంశాల వరకు కేటాయించుకోవాలి. ఇందుకనుగుణంగా పాఠాన్ని విభజించి రోమన్ అంకెల్లో సూచించారు.
- **"ఇవిచేయండి"**లో ఇచ్చిన అభ్యాసాలకు మిగతా 7 కాలాంశాలను వినియోగించాలి. **"అవగాహన-ప్రతిస్పందన"** అభ్యాసాలకు 2 కాలాంశాలు, **"వ్యక్తీకరణ-సృజనాత్మకత"కు** 2 కాలాంశాలు, భాషాంశాలలో ఇచ్చిన **"పదజాలం, వ్యాకరణాంశా"లకు** కలిపి 2 కాలాంశాలు, **"ప్రాజెక్టుపని"**ని ప్రదర్శింపజేసి చర్చించడానికి 1 కాలాంశాన్ని కేటాయించుకోవాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన **"చదవండి - ఆలోచించి చెప్పండి"** అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పాఠ్యాంశం ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయంలోని అంశాలను పిల్లలతో చదివించి చర్చించాలి.
- **"విద్యార్థులకు సూచనలు"**లోని అర్థ సంగ్రహణ కృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- పాఠంలోని విషయం పట్ల పిల్లలకు అవగాహన కల్పించడానికి చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శనా పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయాపాఠాల స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. పాఠం మధ్యలో **'ఆలోచించండి-చెప్పండి'** అనే పేరుతో గడిలో ప్రశ్నలున్నాయి. వీటిని పాఠం బోధించే సమయంలో అడగాలి. ఆలోచించి జవాబులు చెప్పమనాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థం చేసుకునేలా చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చద్వారా, ప్రశ్నించడం ద్వారా పిల్లలే అవగాహన పొందేలా చేయాలి. పిల్లల అభిప్రాయాలను చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహుకోణాల్లో విశ్లేషించడంవంటివి జరగాలి.
- "ఇవిచేయండి"లోని అభ్యాసాలు పిల్లల భాషా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని పిల్లలే సొంతంగా రాసేలా చూడాలి.
- ఒక్కొక్క అభ్యాసానికి ఒక కాలాంశం చొప్పున కేటాయించారు. కాబట్టి ఆయా కాలాంశాలలో పిల్లలు వాటిని ఎలా రాయాలో అవగాహన కల్పించాలి. పిల్లలు రాసిన అంశాలను పరిశీలించి సరిదిద్దాలి.
- పదో తరగతి వార్షిక పరీక్షలు బోర్డు పరీక్ష కాబట్టి పిల్లలు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించాలి. ఎట్టి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీమెటీరియల్సు, ప్రశ్నల బ్యాంకులు వంటివి చూసి రాయడాన్ని పూర్తిగా నిషేధించాలి. ఎందుకంటే బోర్డు పరీక్షలో పుస్తకంలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగానే రావు. ఇలాంటి స్వభావం కలిగిన ప్రశ్నలు వస్తాయి. పాఠంలోని అభ్యాసాలను సొంతంగా రాయగల్గిన పిల్లలు మాత్రమే వీటికి సమాధానాలు రాయగల్గుతారు.
- **"అవగాహన - ప్రతిస్పందన"** అభ్యాసంలో ఇచ్చిన వినడం - మాట్లాడడానికి సంబంధించిన ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. **"చదవడం - అర్థం చేసుకోవడా"**నికి ఉద్దేశించిన అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. పాఠం చదివి జవాబులు రాయాల్సిన ప్రశ్నలను ఇంటిపనిగా ఇవ్వాలి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

- **"వ్యక్తీకరణ – సృజనాత్మకత"** అభ్యాసంలోని ప్రశ్నలు స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస సామర్థ్యాలకు సంబంధించినవి. వీటిలో లఘుసమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటిపనిగా ఇవ్వాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా వాక్యాలు, పదాలు, అక్షరదోషాల పరంగా సరిచేయాలి.
- సృజనాత్మకతకు సంబంధించిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. జట్లలో రాయమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి. ఆ తరవాత వీటిని వ్యక్తిగతంగా రాయమనాలి.
- ప్రాజెక్టు పనులను కూడా ఇదేవిధంగా నిర్వహించాలి.
- పాఠం పూర్తి కావడమంటే **"చదవండి – ఆలోచించి చెప్పండి"** అనే ఉన్ముఖీకరణ అంశంతో మొదలుకొని పాఠంలో చివర ఇచ్చిన సూక్తివరకు అన్ని అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి అవగాహన కల్పించడం. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తయారుకావాలి.
- ఇందుకోసం ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- వార్షిక ప్రణాళికలో కింది అంశాలుంటాయి.

  1) తరగతి  2) సబ్జెక్టు  3) అవసరమైన కాలాంశాల సంఖ్య

  4) విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

  5) మాసవారీగా పాఠాల విభజన

| మాసం పేరు | బోధించే పాఠం | అవసరమైన కాలాంశాలు | బోధనా వ్యూహాలు | అవసరమైన వనరులు / సామగ్రి | రిమార్కులు |
|---|---|---|---|---|---|
| | | | | | |

  6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు  7) ప్రధానోపాధ్యాయుని సలహాలు సూచనలు

- ఒక పాఠాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.

  1) పాఠం పేరు  2) అవసరమైన కాలాంశాల సంఖ్య  3) పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు

  4) కాలాంశాల వారీగా విభజన

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహం | సామగ్రి |
|---|---|---|---|
| | | | |

  5) ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచారసేకరణ  6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

- ప్రతికాలాంశంలో భాషాబోధనను కింది సోపానాల ప్రకారం నిర్వహించాలి. అవి–

  I. **ఉపోద్ఘాతం** : పలకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం లేదా పలకరింపు, పునశ్చరణ.

  II. **పాఠ్యాంశబోధన చర్చ – అవగాహన** : విద్యార్థుల ప్రకాశ పఠనం, ఉపాధ్యాయుల ఆదర్శ పఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ – అవగాహన, సామర్థ్యాల సాధన.

  III. **పిల్లల అవగాహన – పరిశీలన;** IV. **ఇంటిపని.**

- భాషాబోధనను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయరాదు. పాఠశాల గ్రంథాలయాన్ని, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్), మేగజైన్‌లు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం వంటివి ఉపయోగించుకునేలా చూడాలి.
- తరగతి గదిలో పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించే వాతావరణాన్ని కల్పించాలి.
- తరగతి గదిలో భాషావాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన నిఘంటువులు, కవుల జీవిత చరిత్రలు, దృశ్యశ్రవణ సామగ్రి వంటివి సమకూర్చుకొని వినియోగించాలి.
- పాఠశాలలో భాషాభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలు, భాషామేళాలు, భాషోత్సవాలు, బాలకవిసమ్మేళనాలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, వార్షికోత్సవాలు వంటివి నిర్వహించాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

# వందేమాతరం

- బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

# మా తెలుగు తల్లి

- శంకరంబాడి సుందరాచారి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదిలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం - నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ !



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# జాతీయ గీతం

– రవీంద్రనాథ్ టాగూర్

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## రూపకల్పనలో పాల్గొన్నవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్,
విద్యాప్రణాళిక, పాఠ్య పుస్తక విభాగం,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

**శ్రీ పల్లెర్ల రామమోహన రావు,** స్కూల్ అసిస్టెంట్ (తె),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ వి. చెన్నయ్య,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**డా॥ దోనెపూడి నరేశు బాబు,** తెలుగుపండితులు,
జి.ప.ఉ.పా., గోస్పాడు, కర్నూలు జిల్లా.

**శ్రీ ముప్పల రాంబాబు,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జి.ప.ఉ.పా., మాకవరపాలెం, విశాఖపట్టణం జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగుపండితులు,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లిహిల్స్, హైదరాబాద్.

**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**శ్రీ వొజ్జల శరత్ బాబు,** తెలుగు పండితులు,
ప్ర.ఉ.పా.(బాలుర & బాలికల), సీతాఫల్‌మండి,
హైదరాబాద్.

**శ్రీ అవుసుల భానుప్రకాశ్,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**శ్రీ చెఱకూరి వేంకట సూర్యనారాయణ శర్మ,**
స్కూ.అ., తెలుగు, జి.ప.ఉ.పా., మగటపల్లి, తూ.గో. జిల్లా.

**శ్రీ కట్టా శ్రీనివాస రావు,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జి.ప.ఉ.పా., తాడువాయి, ప.గో. జిల్లా.

**శ్రీ ఆకుల వేంకటరాములు,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా., కోటగల్లి (శంకర్‌భవన్), నిజామాబాద్ జిల్లా.

## రూపకల్పనలో సహకరించినవారు

**శ్రీమతి జి.కనకవాణి,**
ప్రొఫెసర్, ఐ.ఎ.యస్.ఇ.,
హైదరాబాద్.

**శ్రీ వి.జనార్దన రెడ్డి,**
ఉపన్యాసకులు, జిల్లా విద్యాశిక్షణ సంస్థ,
కర్నూలు.

**శ్రీ తల్లావొజ్జల మహేశ్‌బాబు**
ఉపన్యాసకులు,
జిల్లా విద్యాశిక్షణ సంస్థ,
నిజామాబాద్.

**శ్రీమతి గూడ సుబ్బలక్ష్మి**
తెలుగు పండితులు,
జి.ప.ఉ.పా., పూడిపర్తి,
నెల్లూరు జిల్లా.

**శ్రీమతి యు.బుగ్గమ్మ**
తెలుగు పండితులు,
యు.పి.ఎస్., భీమారం,
మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ అయ్యగారి శ్రీనివాస రావు,**
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జి.ప.ఉ.పా., కోనాడ,
విజయనగరం జిల్లా.

**డి.టి.పి., లే ఔటు & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# విషయసూచిక

## పాఠ్యాంశాలు


| క్ర.సం. | పాఠం పేరు | కవి/రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | వెన్నెల | ఎఱ్ఱన | ప్రకృతి వర్ణన | పద్యం (ప్రాచీనం) | జూన్ | 1 |
| ✦ 2. | ధన్యుడు | చిన్నయసూరి | విలువలు | కథ | జూలై | 13 |
| 3. | మాతృభావన | గడియారం వేంకటశేషశాస్త్రి | స్త్రీలపట్ల గౌరవం | పద్యం (ఆధునికం) | జూలై | 22 |
| ✦ 4. | జానపదుని జాబు | బోయి భీమన్న | శ్రమపట్ల గౌరవం | లేఖ | ఆగష్టు | 34 |
| 5. | శతక మధురిమ | శతక కవులు | నైతికవిలువలు | పద్యం | ఆగష్టు | 45 |
| 6. | నేనెరిగిన బూర్గుల | పి.వి.నరసింహారావు | స్ఫూర్తి | అభినందన వ్యాసం | సెప్టెంబర్ | 58 |
| 7. | నగరగీతం | అలిశెట్టి ప్రభాకర్ | సామాజిక స్పృహ | వచనకవిత | సెప్టెంబర్ | 71 |
| 8. | యక్షుడి అప్పు | విశ్వనాథ సత్యనారాయణ | హాస్యం | నాటిక | అక్టోబర్ | 80 |
| 9. | బసవేశ్వర పరిణయం | పాల్కురికి సోమనాథుడు | సంస్కృతి | ద్విపద | నవంబర్ | 96 |
| 10. | మా ప్రయత్నం | ఓల్గా, వసంత, కల్పన | స్త్రీసాధికారత | పీఠిక | నవంబర్ | 106 |
| ✦ 11. | మాణిక్యవీణ | విద్వాన్ విశ్వం | సామాజికస్పృహ | వచనకవిత | డిసెంబర్ | 117 |
| 12. | గోరంతదీపాలు | పులికంటి కృష్ణారెడ్డి | మానవసంబంధాలు సామాజికసేవ | కథ | డిసెంబర్ | 127 |
| ✦ 13. | భిక్ష | శ్రీనాథుడు | మానవస్వభావం | పద్యం (ప్రాచీనం) | జనవరి | 143 |
| 14. | చిత్రగ్రీవం | ధనగోపాల్ ముఖర్జీ | శాస్త్రీయపరిశీలన | అనువాదకథ | ఫిబ్రవరి | 155 |

## ఉపవాచకం

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | రామాయణం | వాల్మీకి రామాయణానికి సంక్షిప్త వచనరూపం | సంస్కృతి, విలువలు | ఇతిహాస కథ | జూలై – ఫిబ్రవరి | 170 |

**(జూలై – సెప్టెంబర్ : బాలకాండం, అయోధ్యాకాండం, అక్టోబర్ – డిసెంబర్ : అరణ్యకాండం, కిష్కింధాకాండం, జనవరి – ఫిబ్రవరి : సుందరకాండం, యుద్ధకాండం.)**

పదవిజ్ఞానం 207


## సూచనలు

✦ *సంస్కృతం కాంపోజిట్ కోర్సుగా చదివేవారు 'భిక్ష, మాణిక్యవీణ, జానపదునిజాబు, ధన్యుడు' పాఠాలు చదువవలసిన అవసరంలేదు.*

✿ *పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.*

# విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

**I. అవగాహన – ప్రతిస్పందన**

దీంట్లో **"వినడం – మాట్లాడడం, ధారాళంగా చదివి, అర్థంచేసుకొని, వ్యక్తీకరించడం"** అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.

- విన్న, చదివిన అంశాలు అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలు వ్యక్తపరచాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి, కారణాలు వివరించగలగాలి.
- నచ్చిన సందర్భాన్ని అనుభూతులను వర్ణించగలగాలి.
- పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, కథలు, కథానికలను సొంతమాటల్లో చెప్పగలగాలి.
- వక్తృత్వ పోటీల్లో పాల్గొని మాట్లాడగలగాలి. సద్యోభాషణం చేయగలగాలి. (ఇచ్చిన అంశం గురించి అప్పటికప్పుడే మాట్లాడడం).
- పాఠం చదివి జాతీయాలు, సామెతలు గుర్తించగలగాలి.
- ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు? గుర్తించగలగాలి.
- పాత్రల స్వభావాన్ని పట్టికరూపంలో తయారుచేయగలగాలి.
- భావాలకు తగిన పద్యపాదాలను, గేయపాదాలను గుర్తించాలి.
- వివరాల కనుగుణంగా పట్టికలు తయారుచేయగలగాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలు, కీలకపదాలు రాయగలగాలి.
- పేరాలకు శీర్షికలు పెట్టడం, శీర్షికలకనుగుణంగా పేరాలను గుర్తించడం చేయగలగాలి.
- అపరిచిత గద్యం లేదా పద్యాలు చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.
- పాఠంలో చుక్కగుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని ప్రతిపదార్థం – రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత**

దీంట్లో **"స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస"** సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కిందివి చేయగలగాలి.

- కారణాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి.
- అభిప్రాయాలు రాయగలగాలి. ఇష్టాయిష్టాలు రాయగలగాలి.
- రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.
- ప్రకృతి దృశ్యాలను వర్ణించి రాయగలగాలి.
- రచనాశైలిని అభినందిస్తూ రాయడం, అభినందన వ్యాసం, కరపత్రాలు తయారుచేయడం, ఇంటర్వ్యూ కోసం ప్రశ్నావళి తయారుచేయడం, కవితలు రాయగల్గడం, సన్మానపత్రం తయారుచేయగలగడం, పత్రికలకు లేఖ లేదా సాహిత్యవ్యాసాలు రాయడం, సంభాషణలు రాయడం వంటివి చేయగలగాలి. సృజనాత్మకత సంభాషణలు, కథనాలు రాయగలగాలి.

**III. భాషాంశాలు**

ఇది **"పదజాలం, వ్యాకరణాంశా"**లకు సంబంధించినది. కింది తరగతుల్లో నేర్చుకున్నవాటితోపాటు పిల్లలు కిందివి చేయగలగాలి.

- పదాలకు అర్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు రాయగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. జాతీయాలను సమర్థంతంగా వాక్యాల్లో ఉపయోగించాలి.
- ప్రకృతికి వికృతులను, వికృతికి ప్రకృతి పదాలు రాయగలగాలి.
- దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలు జాతీయాలు, సామెతలు వినియోగించగలగాలి.
- ఆటవెలది, సీసం, ద్విపద లక్షణాలు అర్థం చేసుకోవాలి. ఆయా ఛందాలను గుర్తించగలగాలి.
- పుంప్వాదేశసంధి, విసర్గసంధి, నుగాగమ సంధి, ప్రాతాదిసంధి. శ్చుత్వసంధులను అర్థం చేసుకొని ఆయా సంధుల గురించి వివరించి రాయగలగాలి.
- అవ్యయీభావసమాసాన్ని అవగాహన చేసుకొని ఉదాహరణలు ఇవ్వగలగాలి.
- ముక్త పదగ్రస్త, లాటానుప్రాస, అతిశయోక్తి, అర్థాంతరన్యాస అలంకారాలు అవగాహన చేసుకొని గుర్తించగలగాలి.

**IV. ప్రాజెక్టుపనులు**

ఇవి వివిధ సామర్థ్యాల సమాహారం, వివిధ సామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించే శక్తిని పిల్లలకు కలిగిస్తాయి. కథలు, కవితలు, రచయితల వివరాలు, సమాజసేవలో పాల్గొన్నవారి వివరాలు, జీవన విధానాల వివరాలు, సమీక్ష వ్యాసాలు మొదలైనవి సేకరించి నివేదికలు రాసి ప్రదర్శించాలి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# 1

# వెన్నెల

– ఎఱ్ఱాప్రెగ్గడ (ఎఱ్ఱన)

## చదవండి - ఆలోచించి చెప్పండి.

ఈ కవిత చదవండి

కొండకోనల్లో
నవ్వుతూ, తుళ్ళుతూ పరుగెడుతున్న
సెలయేరు
కాలుజారి లోయలో పడిపోయింది.
అదిచూసి
ఆకులు చాటుచేసుకొని,
మొగ్గలు బుగ్గలు నొక్కుకున్నాయి.
ఇదంతా చూస్తున్న సూరీడు
పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ
పడమటి కొండల వెనక్కి
పడిపోయాడు.

## ప్రశ్నలు:

1. ఈ కవిత దేన్ని వర్ణిస్తున్నది?
2. సూరీడు పడమటి కొండల వెనక్కి పడిపోవడమంటే ఏమిటి?
3. సెలయేరు కొండకోనల మీద నవ్వుతూ తుళ్ళుతూ పరుగెత్తడం అంటే మీకేమని అర్థమయ్యింది?
4. వర్ణనాత్మకమైన కవిత్వం చదవడంవల్ల కలిగే ప్రయోజనాలేవి?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

హిరణ్యకశిపుడు వనవిహారం చేసిన సందర్భంలో వసంత ఋతువును, సాయం సమయాన్ని, చంద్రోదయాన్ని కవి వర్ణించాడు. రోజంతా తీవ్రమైన ఎండను ప్రసరింపజేసిన సూర్యుడు, ఇంకా ఉష్ణతాపాన్ని పెంచితే అసురనాయకుడైన హిరణ్యకశిపుడు సహింపడేమో అన్నట్లు నెమ్మదిగా పక్కకు తొలగి పోయాడు. తదనంతరం ప్రకృతిలో వచ్చిన మార్పులను రమణీయంగా వర్ణించిన రీతిని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కావ్య ప్రక్రియకు చెందింది. కావ్యం వర్ణన ప్రధానంగా సాగుతుంది. ప్రస్తుత పాఠ్యాంశం ఎఱ్ఱన నృసింహపురాణం తృతీయాశ్వాసం లోనిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీతగీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.

## కవి పరిచయం


(ఊహాచిత్రం)

కవిత్రయంలో మూడవ వాడు ఎఱ్ఱన. 14వ శతాబ్దపు ప్రథమార్థంలో జీవించిన ఎఱ్ఱన తల్లిదండ్రులు పోతమాంబిక, సూరనార్యులు. ఈయన గురువు శంకరస్వామి. అద్దంకిని రాజధానిగా చేసుకొని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి. ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వశేషము, నృసింహపురాణము, రామాయణము, హరివంశము మొ॥ గ్రంథాలను ఎఱ్ఱన రచించాడు. వీటిలో రామాయణం అలభ్యం. తన రామాయణ, హరివంశాలను వేమారెడ్డికి అంకితం చేసిన ఎఱ్ఱన, భారతాన్ని రాజరాజనరేంద్రునికి, నృసింహపురాణాన్ని అహోబల నృసింహస్వామికి అంకితమిచ్చాడు. ఎఱ్ఱన రచనలో వర్ణనలు అధికంగా ఉంటాయి. తదనంతర కాలంలోని కవుల వర్ణనకు ఎఱ్ఱన వర్ణనలే ప్రేరణనిచ్చాయి. ప్రబంధ లక్షణమైన అష్టాదశ వర్ణనల్లో ఇంచుమించుగా అన్ని వర్ణనలూ నృసింహపురాణంలో కనిపిస్తాయి. ఎఱ్ఱనను **'ప్రబంధ పరమేశ్వరు'** డంటారు. ఇతని శివభక్తి పారమ్యాన్ని అనుసరించి **'శంభుదాసు'**డని పేరు గాంచారు. ఎఱ్ఱన రచనా ప్రభావం పోతన మీద ఉన్నదని విమర్శకులు భావిస్తున్నారు.

## ప్రవేశిక

*ఆబాలగోపాలానికి ఆత్మీయ బంధువు చందమామ. చందమామ నుండి జాలువారే అమృతం వెన్నెల. అందమైన చందమామను చూపిస్తూ 'చందమామ రావే! జాబిల్లి రావే!' అంటూ కమ్మని పాటను వినిపిస్తూ అమ్మ గోరుముద్దలు తినిపించడం మనందరికీ అనుభవంలోని విషయమే.*

*చిన్న పిల్లలకు వెన్నెల అంటే ఎంతో ఇష్టం. శ్రీరామచంద్రుని అంతటివాడే బాల్యంలో చందమామ కావాలని పోరు పెట్టాడంటే, చంద్రబింబం ఎంత ఆకర్షణీయమో తెలుస్తుంది. అటువంటి చందమామ వెలుగైన - వెన్నెలను మనకవులు కావ్యాల్లో ఎంతో అద్భుతంగా వర్ణించారు, ఇప్పటికీ వర్ణిస్తూనే ఉన్నారు. అమృతకిరణుని ఆ అమూల్య సంపదను ఎంతో రమణీయంగా వర్ణించాడు నృసింహ పురాణంలో ఎఱ్ఱన. ఆయన వర్ణనాసామర్థ్యాన్ని ఆస్వాదిద్దాం.*

## I

చ. ఇను నసమానతేజు దివసేంద్రుఁ గనుంగొనుమాడ్కిఁ జూడఁగాఁ
జన దొరు నల్పతేజు నను చాడ్పునఁ జంచలభృంగతారకా
ఘన వనజాతలోచనము గ్రక్కున మీలన మొందఁజేసెఁ బ
ద్మిని పతిభక్తి సత్త్వమున మేలిమికిం గుఱి దానపొమ్మనన్. 1

✿చ. సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిఁ గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపఁగ నిశాసతి కెత్తిన క్రొత్తతోఁపుఁబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్. 2

తే. పొదలి యొండొండ దివియును భువియు దిశలుఁ
బొదివికొనియుండు చీఁకటిప్రోవు వలన
మిక్కుటంబుగఁ గాటుక గ్రుక్కినట్టి
కరవటంబన జగదండఖండ మమరె. 3

వ. అంత, 4

### ఆలోచించండి-చెప్పండి

- *సూర్యుడికి, కమలాలకు మధ్య ఉన్న అనుబంధాన్ని భార్యాభర్తల బంధంతో పోల్చాడుకదా! ఇదే విధంగా ప్రకృతిలోని ఇంకా వేటిని పోల్చవచ్చు?*
- *రెండో పద్యంలో కవి దేనిని దేనితో పోల్చాడు? ఎందుకు?*
- *ఆకాశాన్ని కవి ఏమని వర్ణించాడు? రాత్రివేళ చుక్కలతో కూడిన ఆకాశాన్ని చూస్తే మీకెలా అనిపిస్తుంది?*

## II

చ. దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ బ్రియం
బెసఁగఁగ నూఁది నిక్కి రజనీశ్వరుఁ డున్నతలీలఁ బేర్చు నా
కస మను పేరి భూరుహము కాంతనిరంతర తారకా లస
త్కుసుమ చయంబు గోయుటకొకో యనఁ బ్రాఁకె సముత్సుకాకృతిన్. 5

ఉ. వెన్నెలవెల్లి పాల్కడలి బ్రేఁకదనంబునఁ బేర్చి దిక్కులున్
మిన్నును ముంప నందు రజనీకరబింబము కుండలీ భవ
త్పన్నగతల్పకల్పనము భంగిఁ దనర్చెఁ దదంతరంబునన్
వెన్నునిభంగిఁ జూడ్కులకు వేడ్కయొనర్చెఁ గలంక మత్తఱిన్. 6

### ఆలోచించండి - చెప్పండి

- "చంద్రోదయాన్ని" చూస్తున్నప్పుడు ఎలా అనిపిస్తుంది?
- నిండు పున్నమినాడు చంద్రబింబాన్ని చూస్తే ఏమేమి ఉన్నట్లుగా అనుభూతిచెందుతాము?
- పౌర్ణమినాటి కలువలను చూస్తుంటే కలిగే ఆనందం ఎలా ఉంటుంది?
- 'రజనీకర బింబం" అని కవి దేని గురించి అన్నాడు?



## III

చ. వడిగొని ఱేకులుప్పతిల వాలిన కేసరముల్ దలిర్పఁ బు
ప్పొడి దలమెక్కి తేనియలు పొంగి తరంగలుఁగాఁ జెలంగి పైఁ
బడు నెలదేఁటిదాఁటులకుఁ బండువులై నవసౌరభంబు లు
గ్గడువుగ నుల్ల సిల్లె ఘనకైరవషండము నిండువెన్నెలన్. 7

సీ. కరఁగెడు నవచంద్రకాంతోపలంబుల
తఱచు సోనలఁ గడు దలముకొనుచుఁ
జటుల చకోరసంచయముల యెఱకల
గర్వంపుదాఁటులఁ గడలుకొనుచు
విరియు కైరవముల విపుల రంధ్రములపైఁ
దీవ్రంబుగాఁ గ్రమ్మి త్రిప్పుకొనుచుఁ
గామినీజనముల కమనీయవిభ్రమ
స్మితకాంతిలహరుల మెండుకొనుచుఁ

ఆ॥వె॥ బొదలిపొదలి చదలఁ బొంగారి పొంగారి
మించి మించి దిశలు ముంచిముంచి
యభినుతేందు చంద్రికాంభోధి యఖిలంబు
నీట నిట్టలముగ నిట్టవొడిచె. 8

వ. ఇట్లతిమనోహర గంభీరధీరంబైన సుధాకరకాంతిపూరంబు రాత్రి యను తలంపు దోఁపనీక తమంబను
నామంబును విననీక యవ్యక్తయను శంక నంకురింపనీక లోచనంబులకు నమృతసేచనంబును,
శరీరంబునకుఁ జందనా సారంబును, నంతరంగంబునకు నానందతరంగంబును నగుచు
విజృంభించిన సమయంబున 9

### ఆలోచించండి-చెప్పండి

- *వెన్నెలను చూసిన కలువలు ఎలా ప్రతిస్పందించాయి?*
- *చంద్రుడు తన వెన్నెలతో ప్రపంచానికి ఆహ్లాదాన్ని ఎలా కలిగించాడు?*
- *"పొదలిపొదలి చదలఁ బొంగారి పొంగారి మించి మించి దిశలు ముంచి ముంచి" అనే పాదంలోని పద సౌందర్యం గురించి చెప్పండి.*
- *'మనోహరగంభీర ధీరంబైన సుధాకర కాంతి పూరంబు" దీని భావం ఏమిటి?*

## భావాలు

1) అసమానమైన కాంతితో ప్రకాశించే సూర్యుణ్ణి చూసినట్లు తక్కువ కాంతితో ప్రకాశించేవారిని చూడడానికి ఇష్టపడనన్నట్లు మిణుకు మిణుకు మంటున్న చుక్కలను చూడక పద్మం గబుక్కున కళ్ళుమూసుకుంది. (అంటే సూర్యాస్తమయం కాగానే పద్మం ముడుచుకున్నది అని అర్థం) పతిభక్తికి తానే ఆదర్శమన్నట్లున్నది పద్మం.

సూర్యుని కిరణాలతో పద్మాలు విచ్చుకుంటాయి. సూర్యుణ్ణి కమలప్రియుడు, కమలబాంధవుడు అని అంటారు. కమలాలకు, సూర్యునికి మధ్య గల సంబంధాన్ని భార్యాభర్తల అనుబంధంగా ఎఱ్ఱన చిత్రించాడు.

2) ప్రకాశించే చుక్కల పూలతో అలంకరింపబడిన ఆకాశమనే రంగస్థలం మీద, కాలమనే సూత్రధారి ప్రయత్నం వల్ల దిక్పాలకసమూహం ముందు, నిశాసతి (రాత్రి అనే స్త్రీ) సరసంగా నటిస్తూ ఉంది. ఆ సమయంలో పశ్చిమదిశా తీరంలోని కొత్తకాంతి ఆమెకు అడ్డుగా ఎత్తిన ఒకవిధమైన ఎఱ్ఱనితెరలాగా అలరారుతూ ఉంది. (పూర్వం నాటక ప్రదర్శనల్లో ముందు సూత్రధారి ప్రవేశించేవాడు. తర్వాత తెరచాటునుండి నటి ప్రవేశించేది. ఆ సంప్రదాయాన్ని కవి ఇక్కడ చక్కగా ఆవిష్కరించాడు.)

3) అధికమైన చీకటి కారణంగా దిక్కులు, ఆకాశం, భూమి ఒక దానిలో ఒకటి కలిసిపోయి, బాగా కాటుక నింపిన బరిణెలాగా విశ్వమంతా నల్లగా కనిపించింది.

4) అంతలో

5) దిక్కులనే కొమ్మలతో, వెలుగులీనే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తున్నది ఆకాశం. తన పొడవైన చేతులతో ఆ పూవులను అందుకునేందుకా అన్నట్లు చంద్రుడు విజృంభించాడు.

(చంద్రుని కాంతి ఆకాశమంతా వ్యాపించింది అని అర్థం.)

6) పాలకడలి గర్భం నుంచి పుట్టిన వెన్నెల ఉప్పెనలా విజృంభించి దిక్కులన్నీ ముంచెత్తింది. అప్పుడు చంద్రబింబం ఆదిశేషుని పానుపులాగా కనిపిస్తూ ఉంది. అందులోని మచ్చ కన్నులకు విష్ణువులాగా కనిపిస్తూ అలరిస్తున్నది. (కవి భావనావిస్తృతి ఎంత గొప్పగా ఉందో ఈ పద్యం తెలియజేస్తూ ఉంది.)

7) ఆ నిండు వెన్నెలలో కలువపూల సమూహపు రేకులు వేగంగా విచ్చుకున్నాయి. వాడిపోయిన కేసరాలు చిగురించాయి. పుప్పొడిపై తేనెలు పొంగి తరంగాల్లా విజృంభించి, తమపైకి వస్తున్న తుమ్మెదల బృందానికి పండుగ చేశాయి. ఆ నిండు వెన్నెలలో కొత్త పరిమళాలతో పరిసరాలను కలువలు సంతోషభరితం చేశాయి.

8) ప్రశంసమానుడైన చంద్రుడు తన వెన్నెల వర్షంతో మెత్తని చంద్రకాంతశిలలను కరిగిస్తూ; విహరిస్తున్న చకోర పక్షుల రెక్కలను స్పృశిస్తూ (దాటుతూ); విచ్చుకుంటున్న కలువపూల రంధ్రాలను నింపి, తనవైపు తిప్పుకుంటూ; అందమైన స్త్రీల అద్భుతమైన చిరునవ్వుల తెల్లని కాంతితరంగాలను పెంపుచేస్తూ; అంతకంతకూ అధికమై, పొంగి, పొంగి, దిశలన్నీ ముంచెత్తుతూ, సమస్తాన్నీ ఆ వెన్నెల అనే సముద్రపు నీటితో నింపుతూ నిండుగా ఆవిర్భవించాడు.

9) ఈ విధంగా చాలా అందంగా, గంభీరంగా, సమున్నతంగా విస్తరించింది వెన్నెల. అది రాత్రి అనే ఆలోచన రానీయక, చీకటి అనే పేరును విననీయక, అవ్యకము అనే అనుమానాన్ని తలెత్తనీయక, కళ్ళకు అమృతపు జల్లులా, శరీరానికి మంచిగంధంలా, మనసుకు ఆనంద తరంగంలా విజృంభించింది.

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలో వెన్నెలను వర్ణించడం గమనించారు కదా! ప్రకృతిలోని వివిధ సందర్భాలను వర్ణించడం వల్ల మీకు కలిగే అనుభూతులను తరగతిలో చర్చించండి.

2. మీకు నచ్చిన ఒక సందర్భాన్ని వర్ణించండి.

3. ఎఱ్ఱన రాసిన కింది పద్యం చదవండి...

సీ॥ కలఁడు మేదిని యందుఁ గలఁ డుదకంబులఁ
    గలఁడు వాయువునందుఁ గలఁడు వహ్నిఁ
గలఁడు భానుని యందుఁ గలఁడు సోముని యందుఁ
    గలఁ డంబరంబునఁ గలఁడు దిశలఁ
గలఁడు చరంబులఁ గలఁ డచరంబులఁ
    గలఁడు బాహ్యంబున గలఁడు లోన
గలఁడు సారంబులఁ గలఁడు కాలంబులఁ
    గలఁడు ధర్మంబులఁ గలఁడు క్రియలఁ

తే॥గీ॥ గలఁడు కలఁవాని యందును, గలఁడు లేని
వాని యందును, గలఁడెల్లవాని యందు
నింక వేయును నేల సర్వేశ్వరుండు
కలఁడు నీయందు నాయందుఁ గలఁడు కలఁడు

(నృసింహపురాణం - పంచమాశ్వాసం - 78)

అ) పై పద్యంలో చాలా సార్లు పునరుక్తమైన పదమేది?

ఆ) పునరుక్తమైన పదం పలుకుతున్నప్పుడు, వింటున్నప్పుడు మీకు కల్గిన అనుభూతిని చెప్పండి.

ఇ) గీత గీసిన మాటల అర్థాలు తెలుసుకోండి.

ఇప్పుడు పోతన రాసిన కింది పద్యం చదవండి...

మ॥ కలఁడంబోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునన్ కుంభినిన్
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలఁ డోంకారమునం త్రిమూర్తులఁ త్రిలింగవ్యక్తులం దంతటన్
గలఁ డీశుండు గలండు తండ్రి! వెదకంగా నేల నీయాయెడన్.

(శ్రీమదాంధ్ర మహాభాగవతం - సప్తమస్కంధం - 78)

అ) ఎట్టిన పద్యంలో మీరు గుర్తించిన పదాలకు ఈ పద్యంలో ఉన్న సమానార్థకాలేవి?

ఆ) రెండు పద్యాలను పోల్చి చూడండి.

**4. పువ్వు గుర్తుగల పద్యాలను భావస్ఫోరకంగా చదవండి.**

**5. రెండో పద్యానికి ప్రతిపదార్థం ఈ కింద ఉన్నది. ఇదే విధంగా 8, 10 సంఖ్యగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.**

| | | |
|---|---|---|
| సురుచిర | = | చాలా అందమైన |
| తారకా | = | చుక్కల |
| కుసుమ | = | పూల (చే) |
| శోభి | = | అలంకరింపబడిన |
| నభః+ | = | ఆకాశమనె |
| అంగణభూమిన్ | = | రంగస్థలం (వేదిక) పై |
| కాలము + అన్ | = | కాలం అనే |
| గరువపు | = | గొప్ప |
| సూత్రధారి | = | సూత్రధారి (దర్శకుడు) |
| జతనంబున | = | ప్రయత్నపూర్వకంగా |
| దిక్పతికోటి | = | దిక్పాలకుల సమూహం |
| ముందటన్ | = | ముందు (ఎదుట) |
| సరసముగా | = | చక్కగా (యుక్తంగా) |
| నటింపగ | = | నాట్యం చేయడానికి సిద్ధపడిన |
| నిశాసతికి | = | రాత్రి అనె స్త్రీకి |
| ఎత్తిన | = | నిలిపిన (పట్టిన) |
| క్రొత్త | = | కొత్తదైన |
| తోఁపున్ | = | ఎర్రని |
| పెన్ + తెర | = | పెద్ద తెర |
| అనన్ | = | అన్నట్లుగా |
| పశ్చిమ దిక్ + తటంబునన్ | = | పడమటి తీరంలోని (పడమటి దిక్కున) |
| సాంధ్య | = | సంధ్యకు సంబంధించిన (సంధ్యాకాలపు) |
| నవ దీధితి | = | కొత్త వెలుగు |
| ఒప్పెన్ | = | ప్రకాశించింది |

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) "కాటుక గ్రుక్కినట్టి కరవటంబన జగదండఖండ మమరె' ఈ మాటలు కవి ఏ సందర్భంలో పేర్కొన్నాడో వివరించండి.

ఆ) ఈ పాఠంలో కవి వెన్నెలను వర్ణించడానికి ఏయే అంశాల నెన్నుకున్నాడో తెల్పండి.

ఇ) పాఠం ఆధారంగా ఆకాశంలోని రంగులు ఏ ఏ సమయాల్లో ఎట్లా మార్పు చెందాయో తెల్పండి.

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) పద్య భావాలను ఆధారంగా చేసుకొని పాఠ్యభాగ సారాంశాన్ని ఇరవై వాక్యాలకు కుదించి రాయండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) ఈ పాఠంలోని వర్ణనల్లాగే మీకు నచ్చిన ఒక ప్రకృతి దృశ్యాన్నిగాని, సన్నివేశాన్నిగాని, సమయాన్నిగానీ వర్ణిస్తూ రాయండి. ఉదా: సూర్యోదయం / సూర్యాస్తమయం.

ఆ) పాఠం ఆధారంగా ఎఱ్ఱన రచనాశైలి గురించి 10 వాక్యాలు రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన మాటల అర్థాన్ని గ్రహించి, వాటిని అర్థవంతంగా సొంతవాక్యాల్లో ఉపయోగించండి.**

అ) భరతమాత <u>మందస్మితకాంతి</u> అందరినీ ఆకట్టుకున్నది.

ఆ) మేఘం <u>దివి</u> నుండి భువికి రాల్చిన చినుకుపూలే ఈ వర్షం.

ఇ) కష్టాలు <u>మిక్కుటమై</u> రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఈ) <u>రజనీకరబింబం</u> రాత్రిని పగలుగా మారుస్తున్నది.

**2. నిఘంటువు సాయంతో కింది పదాలకు నానార్థాలు వెతికి రాయండి.**

అ) వెల్లి : ____________ ____________ ____________

ఆ) కుండలి : ____________ ____________ ____________

ఇ) నిట్టవొడుచు : ____________ ____________ ____________

**3. కింది మాటలకు పర్యాయపదాలు రాయండి.**

అ) చాడ్పు : ___________ ___________ ___________

ఆ) వెల్లి : ___________ ___________ ___________

ఇ) కైరవం : ___________ ___________ ___________

ఈ) కౌముది : ___________ ___________ ___________

ఉ) చంద్రుడు : ___________ ___________ ___________

ఊ) తమస్సు / తమం : ___________ ___________ ___________

**4. కింది ప్రకృతి పదాలకు వికృతి పదాలు రాయండి.**

అ) సంధ్య : ___________

ఆ) దిశ : ___________

ఇ) ధర్మము : ___________

ఈ) రాత్రి : ___________

ఉ) నిశ : ___________

**5. కింది వికృతి పదాలకు ప్రకృతి పదాలు రాయండి.**

అ) గరువము : ___________

ఆ) జతనము : ___________

ఇ) దెస : ___________

ఈ) చందురుడు : ___________

## వ్యాకరణాంశాలు

**1. కింది సంధులకు సంబంధించిన పదాలు ఈ పాఠంలో గుర్తించి, వాటిని విడదీసి సూత్రాలు రాయండి.**

అ) సవర్ణదీర్ఘ సంధి

ఆ) గుణ సంధి

ఇ) ఉత్వ సంధి

2. కింది పదాలు విడదీసి, సంధులను గుర్తించి సూత్రాలు రాయండి.

అ) అత్యంత = ________ + ________

ఆ) వంటాముదము = ________ + ________

ఇ) ఏమనిరి = ________ + ________

ఈ) అవ్విధంబున = ________ + ________

3. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి.

అ) నలుదెసలు

ఆ) సూర్యచంద్రులు

4. కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. సమన్వయం చేయండి.

అ) కుముదినీరాగ రసబద్ధ గుళికయనగఁ
జంద్రుఁడుదయించెఁ గాంతి నిస్తంద్రుఁడగుచు.

5. పాఠంలోని తేటగీతి పద్యాన్ని గుర్తించి లక్షణాలతో సమన్వయం చేసి చూడండి.

కింది తరగతిలో తేటగీతి లక్షణాలు అర్థంచేసుకున్నారు గదా! ఇప్పుడు ఆటవెలది పద్యం గురించి తెలుసుకుందాం.

ఉదా॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| | న | న | న | త | త |
| | I II | I II | III | UUI | UUI |
| 1. | పొదలి | పొదలి | చదలఁ | బొంగారి | పొంగారి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | హ | హ | న | హ | హ |
| | UI | UI | III | UI | UI |
| 2. | మించి | మించి | దిశలు | ముంచి | ముంచి |

పై పద్యాపాదాల్లో ప్రతిపాదానికి ఐదు గణాలుంటాయి. కాని,

1వ పాదంలో 5 గణాలు (3 సూర్య + 2 ఇంద్ర) }
2వ పాదంలో 5 గణాలు (5 సూర్య) } వేర్వేరుగా ఉంటాయి.

(* 'హ' గణాన్నే 'గలం' అనడం వాడుకలో ఉన్నది, 'వ' గణాన్ని 'లగం' అన్నట్లు.)

♦ మిగతా యతి, ప్రాస నియమాలు తేటగీతికి సంబంధించినవే దీనికీ వర్తిస్తాయి. పరిశీలించండి.

1. ఇది ఉపజాతి పద్యం. దీనికి 4 పాదాలుంటాయి.
2. 1, 3 పాదాల్లో వరుసగా మూడు సూర్యగణాలు, రెండు ఇంద్రగణాలు ఉంటాయి.
3. 2, 4 పాదాల్లో ఐదూ సూర్యగణాలే ఉంటాయి.
4. ప్రతిపాదంలో 4వ గణంలోని మొదటి అక్షరం యతి. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది.
5. ప్రాస నియమం పాటించనవసరం లేదు.

* బొదలి పొదలి........ అనే పద్యంలోని రెండు పాదాలు పరిశీలించి లక్షణ సమన్వయం చేయండి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ 'నరసింహ స్వామి కథ' నేపథ్యంతో వచ్చిన గ్రంథాలు, వివరాలను ఈ కింది పట్టికలో రాయండి.

| క్ర.సం | గ్రంథం పేరు | ప్రక్రియ | కవి | కాలం |
|---|---|---|---|---|
| | | | | |

**సూక్తి**

మనచుట్టూ ఉన్న చెట్లూ చేమలు నదులు ఇవన్నీ ప్రకృతిలో భాగమే. అవి మనకు జీవనాధారమై, రక్షణ కవచమై నిలుస్తున్నాయి. వాటిని కాపాడుకోవడం మన ధర్మం. ప్రకృతికి హాని కలిగించడం అంటే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవడమవుతుంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# 2

# ధన్యుడు

– పరవస్తు చిన్నయసూరి

## చదవండి – ఆలోచించి చెప్పండి.

*లఘుపతనకుండు మంథరునితో నిట్లనియె. చెలికాఁడా! యీ మూషిక రాజును నీవు మిక్కిలి సమ్మానింపుము. ఇతఁడు పుణ్యకర్ములలోపల ధురీణుఁడు, గుణరత్నాకరుఁడు, హిరణ్యకుఁడనువాఁడు. ఈతని గుణములు శేషుఁడు సహితము వర్ణింపజాలఁడు. నే నేపాటివాడఁను – అని పలికి మొదటి నుండి హిరణ్యకుని వృత్తాంతము సర్వము వినిపించెను. అంతట మంథరుఁడు 'హిరణ్యకుని మిక్కిలి సమ్మానించి యిట్లనియె "హిరణ్యకా! నీవు నిర్జన వనమునందు వాసము చేయుటకు నిమిత్తమేమి? చెప్పుము" అని యడిగెను. హిరణ్యకుఁడిట్లనియె.*

**ప్రశ్నలు:**

1. *ఇలాంటి శైలిలో ఉన్న పాఠాలను చదివారా? లేదా? (ఈ రూపంలో ఉన్న మీకు తెలిసిన పుస్తకాల పేర్లు చెప్పండి.)*
2. *మంథరుడు ఎవరి వృత్తాంతాన్ని వినిపించాడు?*
3. *హిరణ్యకుని నివాసమెక్కడ?*
4. *హిరణ్యకుడు తన నివాసం గురించి ఏం చెప్పి ఉంటాడు?*

## ఉద్దేశం

*మంచిమిత్రుల కలయిక మన జీవితాన్ని ఓ మలుపు తిప్పుతుంది. అందుకే ఎప్పుడూ సన్మిత్రులను పొందాలని పెద్దవాళ్ళు చెబుతుంటారు. సజ్జన సాంగత్యం ఎప్పటికీ మంచిదని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.*

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యాంశం కథా ప్రక్రియకు చెందింది. సంస్కృతంలోని విష్ణుశర్మ పంచతంత్రం విశ్వవిఖ్యాతిగాంచింది. దాన్ని అనుసరించి అనేక గ్రంథాలు వచ్చాయి. వాటిలో లక్ష్మీనారాయణ పండితుడి 'హితోపదేశం' ఒకటి. దాని ఆధారంగా చిన్నయసూరి నీతిచంద్రికను తెలుగులో రచించాడు. ఇది గ్రాంథిక వచనంలో సాగుతుంది. పశుపక్ష్యాదులే పాత్రలుగా లోకరీతిని, నీతిని ప్రబోధిస్తూ కథనాలు సాగుతాయి. ప్రస్తుత పాఠ్యాంశం 'నీతిచంద్రిక'లోని మిత్రలాభం నుండి గ్రహించింది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని అర్థంగాని పదాలను పదవిజ్ఞానం లేదా నిఘంటువు ద్వారా తెలుసుకోండి.
- పాఠం ప్రారంభించడానికి ముందున్న ప్రవేశిక చదవండి. దాని ద్వారా పాఠంలో ఏముందో ఊహించండి.

## రచయిత పరిచయం



(1809-1862)

పరవస్తు చిన్నయసూరి తమిళనాడులోని చెంగల్‌పట్టు జిల్లాలోని శ్రీపెరంబుదూరులో జన్మించాడు. మద్రాసులోని పచ్చయ్యప్పకళాశాలలో తెలుగుపండితుడుగా పనిచేశాడు.

'సూరి' అనేది ఈయన బిరుదు. సూరి అంటే పండితుడు అని అర్థం. తెలుగు, తమిళ, సంస్కృతాంగ్ల భాషలలో చిన్నయసూరి మంచి పండితుడు.

చిన్నయసూరి అక్షరగుచ్ఛము, ఆంధ్ర కాదంబరి, పద్యాంధ్ర వ్యాకరణము, సూత్రాంధ్రవ్యాకరణము, శబ్దలక్షణసంగ్రహము, బాలవ్యాకరణము, నీతిచంద్రిక మొదలైన గ్రంథాలు రాశాడు. ఈయన రచనాశైలి పాఠకుడిని ఆకట్టుకొనేలా ప్రాచీన కావ్య భాషలో ఉంటుంది. ఈయన రాసిన బాలవ్యాకరణము నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉంది. నీతిచంద్రిక - బాలవ్యాకరణాలు లక్ష్య - లక్షణ గ్రంథాలుగా ప్రసిద్ధి పొందాయి.

**ప్రవేశిక**

*మానవ జీవితంలో నీతి అనేది చాలా ముఖ్యమైన విషయం. ప్రతి మనిషికి సంపాదన ఎంత ముఖ్యమో పరోపకారం కూడా అంతే ముఖ్యం. లోభం అనేది ఉండకూడదు. లోభత్వం వల్ల తనకు కాని, ఇతరులకు కాని ప్రయోజనం ఉండదు. 'పిల్లికి బిచ్చం పెట్టనివాడు' అనే సామెత లోభిని దృష్టిలో పెట్టుకొని వచ్చిందే. మనం లోభం లేకుండా మన మిత్రులకు సహాయం చేయాలి. దీనికి సంబంధించిన కథను చదువుదాం. ఈ కథలు ఉత్తమపురుష కథనంలో ఉంటాయి.*

I

## హిరణ్యకుని పూర్వ వృత్తాంతం

చంపకవతి యను పట్టణము గలదు. అందు సన్న్యాసులు పెక్కండ్రు వాసము చేయుచుండుదురు. అందుఁ జూడాకర్ణుండను పరివ్రాజకుఁడు గలఁడు. అతఁడు తాను భోజనము చేసి మిగిలిన వంటకము భిక్షాపాత్రలోఁ బెట్టి చిలుక కొయ్య మీఁద నుంచి నిద్రపోవును. నేను సద్దుచేయక దానిమీఁదికెగిరి ప్రతిదిన మావంటకము భక్షించి పోవుచుందును. ఒకనాఁడు చూడాకర్ణుడు తన స్నేహితుఁడు వీణాకర్ణుఁడను సన్న్యాసితో మాటలాడుచుండ మాటిమాటికి మీఁదివంక చూచి తన గిలుకకఱ్ఱతో నేలమీఁద గొట్టి నన్ను వెఱపించుచు వచ్చెను. అప్పుడు వీణాకర్ణుఁడు "చూడాకర్ణుఁడా! యేమది మీఁదు చూచి నేల కఱ్ఱతోఁ దట్టుచున్నాఁడ"వని యడుగఁగాఁ జూడాకర్ణుఁ డిట్లనియె; "ఒక ఎలుక ప్రతిదినము చిలుకకొయ్య మీది పాత్రమునందున్న యన్నము భక్షించిపోవుచున్నది. నాకు దీని యుపద్రవము పెద్దదిగా నున్నది"యని చెప్పెను. ఆమాటలు వీణాకర్ణుఁడు విని "యెక్కడి యెలుక? యెక్కడి చిలుకకొయ్య? యింత యల్పజంతువున కింత పొడవున కెగురు బల మెక్కడినుండి వచ్చెను? దీని కేమయినను నిమిత్తము లేకమానదు. ఈ మూషికమునకింత బలిమియు నిక్కడి సదావాసమును, నిమిత్తము లేక సంభవింపవు".

**ఆలోచించండి - చెప్పండి**

- *ఎక్కడి ఎలుక? ఎక్కడి చిలుకకొయ్య? అనడంలో అంతరార్థం ఏమై ఉంటుంది?*



అని వీణాకర్ణుఁడు చెప్పఁగా విని చూడాకర్ణుఁడు "తడవులఁబట్టి యీ యెలుక యిక్కడ నొక లాఁగ తావు చేసికొని విడువక వాసము చేయుచున్నది. ఇట్లు వసించుటకు నిమిత్తము తెలిసినది కాదు. త్రవ్వి చూచెదఁగాక" యని చెప్పి యొక గుద్దలితో నేను వసించు వివరము త్రవ్వి చిరకాలోపార్జితమైన నాధనము సర్వము గ్రహించెను. తర్వాత సత్త్వోత్సాహములు లేక నానాఁడాహారము సహితము సంపాదించుకొనఁజాలక దిగులుపడి కృశించి, మెల్ల మెల్లఁగ సంచరించుచుండఁగాఁ జూచి చూడాకర్ణుఁ డిట్లనియె : "ధనము గలవాఁడె బలవంతుఁడు. ధనము గలవాఁడె పండితుఁడు. ధనము సర్వశ్రేయములకు నిదానము, ధనము లేనివాని జీవనమేల? ఈ మూషికము తన ధనము కోలుపోయి కదా తొంటి జవసత్త్వములుడిఁగి స్వజాతిసామ్యమును బొందెను. అర్థపరిహీనునకు నిరంతరము ఖేదము సంభవించును. నిరంతర ఖేదము వలన బుద్ధిహీనత్వము ప్రాప్తించును. బుద్ధిహీనతవలన సమస్తకార్యములు నిదాఘనదీపూరము లట్లు వినాశము నొందును, ధనవంతునకే పౌరుషమును, మేధాసంపత్తియు, బంధుమిత్రులును కలుగుదురు. పుత్రమిత్రవిరహితుని గృహమును, మూర్ఖుని చిత్తమును శూన్యములు. దారిద్ర్యము సర్వశూన్యము. దారిద్ర్యము కంటె మరణము మేలు. మరణ మాపాతయాతనావహము. దారిద్ర్యము యావజ్జీవము తీవ్ర వేదనాకరము. ఇంద్రియముల నామమున బుద్ధిని వచోధోరణిని బురుషుఁడు తొంటివాఁడయ్యు ధనమును బాసిన క్షణముననే లాఁతివాఁడగును. ఇది మహాచిత్రము" అని యా పరివ్రాజకుఁడు చెప్పఁ గావిని మిక్కిలి ఖిన్నుఁడనయి యిట్లు చింతించితిని.

> **ఆలోచించండి – చెప్పండి**
>
> - *'ధనము సర్వశ్రేయములకు నిదానము' మీ అభిప్రాయం చెప్పండి.*
> - *'దారిద్ర్యము సర్వశూన్యము' అనే మాటను బట్టి మీకేమర్థమయింది?*

## II

ఇఁక నా కిక్కడ వసింపఁ దగదు. ఇప్పుడు నా వృత్తాంతము పరులతోఁ జెప్పికోలును యుక్తము గాదు. అర్థనాశము, మనస్తాపము గృహమందలి దుశ్చరితము, వంచనము, పరాభవమును ప్రకాశింపఁ జేయఁదగదని పెద్దలు చెప్పుదురు. దైవానుకూల్యము లేక పౌరుషము చెడినప్పుడు మానవంతునికి వనవాసము కంటె సుఖము లేదు. కుసుమస్తబకము వలె మానవంతుఁడు సర్వజనుల మూర్ధము మీఁదనయిన నుండవలె. లేదా వనమందు సమసిపోవలె. ఇక్కడనే వాసము చేసుకొని యాచనతో జీవించెద నంటినా దానికంటె గర్హితము లేదు. ఒక ముక్కడిని యాచించుకంటె నిప్పులోఁబడి శరీరము తొఱఁగుటమేలు. అనృతమాడుటకంటె మౌనముమేలు. పరధనాపహరణముకంటెఁ దిరియుట మంచిది. వివేకహీనుఁడయిన ప్రభువును సేవించుటకంటె వనవాస ముత్తమము. యాచించుకొని బ్రతుకుటకంటె మరణము శ్రేయము, సేవావృత్తి మానమునువలె, యాచనావృత్తి సమస్త గౌరవమును హరించును. ఒకరి యిల్లు కాచి, వారి పెట్టువోఁతలకు దోసిలియొగ్గి యునికియు మిక్కిలి నింద్యము" అని నానావిధముల విచారించియు లోభము త్రిప్పులకు లోనయి మరల నర్థసంగ్రహము చేయవలె నని తలఁచి యచ్చోటనే నిలిచితిని. లోభము మోహమును బుట్టించును. మోహము దుఃఖము నుత్పాదించును, దుఃఖము జ్వలనము వలె స్వాశ్రయమునకు నాశము పుట్టించును కాఁబట్టి లోభమునకు బుద్ధిమంతుఁడు లోపడఁడు. తరువాత నేనక్కడ వదలకుంట చూచి చూడాకర్ణుఁడు నన్నుఁ గఱ్ఱతో విసరివ్రేసెను. ఆ వ్రేటు దైవవశము వలనఁ దప్పిపోయినది, తగిలియుండెనా యింతకు యమలోకములో బాఁతకాఁపనయి యుండనా? అనంతర మిట్లు చింతించితిని, ఆహా! ధనలోభము సర్వాపదలకు మూలము గదా! తద్వర్జనముకంటె లోకమందు సుఖమేదియు లేదు. ఆశ దిగనాడినవాఁడే సత్పురుషుఁడు. వాఁడే సర్వశాస్త్రములు చదివినవాఁడు. వాఁడే సర్వధర్మము లాచరించినవాఁడు. ఉదరముకయి పరులగోఁజక ప్రాప్తలాభమునకు సంతోషించువాఁడొక్కడు లోకమందు ధన్యుఁడు. వాఁడే సుఖి. తత్తత్కర్మానురూపముగా దేహికి దుఃఖములట్లు సుఖములు కోరకయే ప్రాప్తించుచున్నవి. అందులకయి ప్రయాసపాటు నిరర్థకము.

ఈ తావు తాతముత్తాతలు సంపాదించిన కాణాచిగాదు. భూమండలములో నింకఁ దావు దొరకదా! ఇక్కడ నుండనేల? ఈ చెడగరపుబోఁడ కట్టుమోఁదులు వడి ప్రాణములు గోలుపోనేల? ఇంక నెక్కడనైన నొక్క విజనప్రదేశము చేరి కాలము పుచ్చుట మంచిది. శిలాంతరాళమందలి కప్పను భరించు దయామయుఁడయిన యీశ్వరుఁడు నన్నుఁ గాపాడకుండునా? అని చింతించి, మనసు గట్టిపఱచుకొని, యచ్చోటు విడిచి యీనిర్జనవనము చేరితిని. వనములోఁ గాయగసురులు భక్షించి పడియనీరు త్రాగి, యొక చెట్టునీడలో వసించి కాలము పుచ్చుట మంచిది గాని, ధనహీనుఁడనయి నలుగురిలో నుండరాదు. అనంతరము నాపుణ్యము వలన నా కీమిత్రుఁడు లభించెను. నా మహాభాగ్యము వలననే యిపుడు నీ యాశ్రయమను స్వర్గము దొరికినది. సత్సంగతికంటె లోకమందు మేలేదియులేదు. సంసార విష వృక్షమునకు రెండు ఫలము లమృతతుల్యములు; కావ్యామృతరసపాన మొక్కటి; సజ్జనసంగతి యొకటి."

అనిన విని మంథరుఁడిట్లనియె.

అర్థములు నిత్యములుగావు. యౌవనము ఝరీవేగతుల్యము. జీవనము బుద్బుదప్రాయము. కాఁబట్టి బుద్ధిమంతుఁడు సత్వరముగా ధర్మము సమాచరింపవలెను. సమాచరింపనివాఁడు పశ్చాత్తాపముఁబొంది శోకాగ్ని సంతప్తుఁడగును. నీవతి సంచయము చేసితివి. దాని దోషమిది. కాఁబట్టి యతి సంచయేచ్ఛతగదు. ఒరులకిచ్చి తాను భుజించినదే తనసొత్తు. పరుల కీక తాను గుడువక కూడఁబెట్టిన ద్రవ్యము చచ్చినతఱి వెంటరాఁబోదు, అని చెప్పి కూర్మము మఱియు నిట్లనియె.

జీవనార్థము మిక్కిలి యాయాసంపాటు సయితము వ్యర్థము. నీవు సకల ధర్మములు తెలిసినవాఁడవు. నీకు విస్తరించి చెప్పఁబనిలేదు. నీకు లఘుపతనకుఁడొకఁడు నే నొకఁడనుగాము. మనలను మువ్వురను దైవ మొక్కచోఁజేర్చెను. దొరికినంతటితోఁ గాలము గడుపుకొని సుఖముగా జీవింతము, అనిన హిరణ్యకుఁడు మిక్కిలి సంతోషించి యిట్లనియె.

మంథరా! నీవచనామృతము వర్షించి నా దురంతతాపము నివారించితివి. నేను ధన్యుఁడనయితిని. "మిత్రలాభమను లాభసంపద"యను వచనము నేఁడు నాకు లక్ష్యసమన్వితమయ్యెను.

**ఆలోచించండి - చెప్పండి**

- *ఆశ దిగనాడినవాడే సత్పురుషుడు. ఎట్లు?*
- *ధనహీనుడై నలుగురిలో నుండరాదు. ఎందుకు?*
- *'మనసుగట్టి పరచుకోవటం' అంటే ఏమిటి?*
- *'చచ్చిన తమ వెంట రాబోదు' అనడంలో మీకేమర్థమైంది?*

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

1. చూడాకర్ణుని మాటలను బట్టి మీకర్థమైన విషయమేమి? దానిపై మీ అభిప్రాయమేమిటో చెప్పండి.
2. 'ఆహా! ధనలోభము సర్వయాపదలకు మూలము కదా!' ఈ విషయాన్ని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ మీ అభిప్రాయాలు చెప్పండి.
3. ఈ పాఠానికి పెట్టిన శీర్షికను విశ్లేషిస్తూ చెప్పండి.

4. కింది వాక్యాలు ఎవరు, ఎవరితో అన్నారో గుర్తించి రాయండి.

అ) అనృత మాడుటకంటె మౌనము మేలు.

ఆ) దీని కేమైనను నిమిత్తము లేక మానదు.

ఇ) సత్సంగతి కంటె లోకమందు మేలేదియు లేదు.

5. కింది పద్యాన్ని చదివి భావాన్ని పూరించండి.

ఒక్కఁడె చాలు నిశ్చల బలోన్నతుఁ డెంతటి కార్యమైన దాఁ
జక్క నొనర్పఁ గౌరవు లసంఖ్యులు పట్టిన ధేనుకోటులం
జిక్కగ నీక తత్త్రబలసేన ననేక శిలీముఖంబులన్
మొక్కవడంగ జేసి తుదముట్టఁడె యొక్క కిరీటి భాస్కరా!

**భావం :** ______________ ఎంతటి పని ఐనా ______________ ______________ ఆవులమందను ______________ తన బాణాలతో ఆ బలమైన ______________ అర్జునుడే కదా!

6. చూడాకర్ణునికి, వీణాకర్ణునికి మధ్య జరిగిన సంభాషణను రాయండి.

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. 'సంసార విషవృక్షమునకు రెండు ఫలము లమృతతుల్యములు' పాఠాన్ని ఆధారంగా చేసుకొని దీని గురించి వివరించండి.
2. 'అర్థనాశం, మనస్తాపం, గృహమందలి దుశ్చరితం, వంచనం పరాభవం' – ఈ పదాల గురించి మీ రేరకంగా అర్థం చేసుకున్నారో సోదాహరణంగా రాయండి.
3. 'వివేకహీనుడైన ప్రభువును సేవించుట కంటె వనవాస ముత్తమం' – దీని ఔచిత్యాన్ని గురించి చర్చించండి.
4. ఈ పాఠంలోని కథనవిధానాన్ని, రచయిత రచనావిధానాన్ని ప్రశంసిస్తూ రాయండి.
5. ఈ కథను ఓ చిన్న నాటికగా మలచండి.
6. మంథరుని మాటలను మీరు సమర్థిస్తారా? ఎందుకు?

## III. భాషాంశాలు

### పదజాలం

1. కింది వాక్యాలకు అర్థాన్ని మీ సొంత పదాల్లో రాయండి.

అ) బుద్ధిహీనత వలన సమస్తకార్యములు నిదాఘ నదీపూరములట్లు వినాశము నొందును.

ఆ) ధనమును బాసిన క్షణముననే లాతివాఁడగును.

ఇ) పరధనాపహరణము కంటె దిరియుట మంచిది.

ఈ) ఉదరమునకయి పరుల గోజక ప్రాప్తలాభమునకు సంతోషించు వాఁడొక్కడు లోకమందు ధన్యుఁడు.

**2. కింది పదాలకు ప్రకృతి – వికృతులను పాఠం నుండి వెతికి ఆ వాక్యాలను రాయండి.**

అ) బోనం ఆ) శబ్దం ఇ) కర్జం ఈ) గీము

ఉ) గారవం ఊ) చట్టం ఋ) దమ్మము ౠ) సంతసం

**3. కింది వాక్యాలు చదవండి. వ్యుత్పత్త్యులకు తగిన పదాలు రాయండి.**

అ) పున్నామ నరకము నుంచి రక్షించువాడు. ________________

ఆ) దేహాన్ని ధరించినవాడు. ________________

ఇ) ఐశ్వర్యం ఉన్నవాడు. ________________

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాల్లోని సంధి పదాలను గుర్తించి, వాటిని విడదీయండి. అవి ఏ సంధులో సూత్రయుక్తంగా తెల్పండి.**

అ) అందుఁ జూడాకర్ణుఁడను పరివ్రాజకుఁడు గలడు.

ఆ) తడవులఁ బట్టి ఈ యెలుక విడువక వాసము చేయుచున్నది.

పై వాక్యాల్లో సరళాదేశ, గసడదవాదేశ, ఉత్వ సంధులు, యడాగమము ఉండటాన్ని గమనించారు కదా! ఈ పాఠంలో సరళాదేశ, గసడదవాదేశ సంధిపదాలు ఇంకా ఏమేమున్నాయో గుర్తించి, సంధి సూత్రాలను రాయండి.

**2. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసాలను పేర్కొనండి.**

అ) చంపకవతి పట్టణము

ఆ) మహాభాగ్యము

ఇ) సేవావృత్తి

ఈ) పదాబ్జములు

ఉ) కలువకన్నులు

ఊ) మామిడిగున్న

ఎ) మృదుమధురము

ఉదా॥ చంపకవతి పట్టణము – చంపకవతి అనే పేరు గల పట్టణం.
సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం.

**3. 'పుంప్వాదేశసంధి'**

* కింది పదాలు విడదీయండి. మార్పును గమనించండి.

ఉదా॥ అచ్చపు పూలతోట = అచ్చము + పూలతోట

అ) నీలపు గండ్లు =

ఆ) ముత్తెపు సరులు =

ఇ) సరసపుమాట =

* పైన పేర్కొన్న వాటిలో రెండు మార్పులను గమనించవచ్చు.

అ) మొదటిపదాలచివరన 'ము' వర్ణం లోపించింది. ము వర్ణం స్థానాన్ని పు వర్ణం ఆక్రమించింది.

ఆ) ప్రతి సంధిలోనూ మొదటిపదం గుణాలను తెల్పుతుంది. ఇవి విశేషణాలు.

* మొదటిపదం విశేషణం అయితే ఆ సమాసాలను 'విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం' అంటారని మీకు తెలుసు. అంటే ఈ సంధి కర్మధారయ సమాసాల్లో ఏర్పడుతుందని తెలుస్తుంది. అంటే...

* కర్మధారయ సమాసాల్లో మువర్ణానికి బదులు పు, ంపులు ఆదేశంగావస్తే దాన్ని పుంప్వాదేశసంధి అంటారు. ('ము' వర్ణం స్థానాన్ని పు 'పు' ంపు వర్ణం ఆక్రమిస్తుంది. దీన్నే వ్యాకరణ పరిభాషలో 'ఆదేశం' అంటారు.)

♦ కింది పదాలను విడదీసి సంధిసూత్రాన్ని సరిచూడండి.

అ) సింగపుకొదమ

ఆ) ముత్యపుచిప్ప

ఇ) కొంచెపునరుడు

## 4. వచనంలో శైలీభేదం

* కింది వాక్యాలు చదవండి. భేదాలు గమనించండి.

అ) ఆ పరివ్రాజకుడు సెప్పగా విని మిక్కిలి ఖిన్నుడనయితిని.

ఆ) ఆ సన్యాసి చెప్పగా విని చాలా బాధపడ్డాను.

ఇ) ఆ సన్యాసి జెప్పింది యిని శానా దుక్కమొచ్చింది.

* మొదటి వాక్యం ప్రాచీన శైలిని తెలుపుతున్నది.
రెండో వాక్యం శిష్టవ్యవహార శైలిని అనుసరించి ఉంది.
మూడో వాక్యం మాండలిక పద్ధతికి లోబడి ఉంది.

* కాలాన్ననుసరించి, ప్రాంతాన్ననుసరించి, సందర్భాన్ని బట్టి భాషను ఉపయోగించే విధానంలో మార్పు ఉంటుంది. ఇది భాషలో వైవిధ్యమేగాని, గొప్ప, తక్కువ అనే సంకుచితదృష్టికూడదు.

* కింది వాక్యాలను ఆధునిక వ్యవహారశైలిలోకి, స్థానిక మాండలికశైలిలోకి మార్చండి.
[ఈ మార్పులు చేసేటప్పుడు 'ము' వర్ణాలు, బిందుపూర్వక 'బు' కారాలు (ంబు), యడాగమాలు, క్రియారూపాలు (చేయును, జరుగును, చూడుము... వంటివి) మారడాన్ని గమనించండి.]

అ) వివేకహీనుడయిన ప్రభువును సేవించుటకంటె వనవాస ముత్తమము.

ఆ) ఎలుక ప్రతిదినము చిలుకకొయ్య మీఁది కెగిరి పాత్రమునందున్న యన్నము భక్షించిపోవుచున్నది.

ఇ) బుద్ధిహీనతవలన సమస్తకార్యములు నిదాఘనదీపూరములట్లు వినాశము నొందును.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- పాఠశాల గ్రంథాలయంలో పంచతంత్ర కథల పుస్తకంలోని కథలను చదవండి. మీకు నచ్చిన కథను మీ సొంతమాటల్లో రాసి ప్రదర్శించండి.

## చదవండి - తెలుసుకోండి


కందుకూరి వీరేశలింగం
(1848-1919)

*భారతదేశం కథాసాహిత్యానికి ప్రసిద్ధిపొందింది. ప్రాచీనకాలంనుండే భారతీయ సాహిత్యంలో ప్రాచుర్యం పొందిన కథలు ఎన్నో ఉన్నాయి. విష్ణుశర్మ అనే పండితుడు అమరశక్తి అనే రాజు కొడుకులను వివేకవంతులను చేయడానికి పంచతంత్ర కథలను బోధిస్తాడు. అవే కథా రూపంలో వ్యాప్తి చెందాయి. వీటిని దాదాపు 200 భాషల్లోకి అనువదించారు. ఈ పంచతంత్ర కథలు మిత్రలాభం, మిత్రభేదం, కాకోలూకీయం (సంధి, విగ్రహం), లబ్ధప్రణాశం, అపరీక్షితకారకం (అసంప్రేక్ష్యకారిత్వం) అనే భాగాలుగా ఉన్నాయి. వీటిని తెలుగులోకి అనువదించినవారిలో ముఖ్యులు చిన్నయసూరితో పాటు కందుకూరి వీరేశలింగం. వీరేశలింగం పంతులు సంధి, విగ్రహం అనే భాగాలను తెలుగులోకి అనువదించాడు. ఈయన వీటితోపాటు రాజశేఖర చరిత్ర, ఆంధ్రకవుల చరిత్ర, అభాగ్యోపాఖ్యానం మొదలైన గ్రంథాలను, శతకాలను, నాటకాలను రాసి గద్యతిక్కనగా ప్రసిద్ధికెక్కాడు. స్త్రీవిద్యావ్యాప్తికి కృషిచేశాడు. సంఘసంస్కర్తగా పేరు పొందాడు.*

### సూక్తి

న్యాయంగా సంపాదించిన ధనంతోనే తనను పోషించుకోవాలి. అన్యాయంగా సంపాదించిన ధనంతో ఎవరు జీవిస్తుంటారో వారు సర్వ కర్మ బహిష్కృతులు అవుతున్నారు.

\- పరాశరస్మృతి

# 3

# మాతృభావన

– డా॥ గడియారము వేంకటశేషశాస్త్రి

## చదవండి - ఆలోచించి చెప్పండి.

*తే. సర్వతీర్థాంబువులకంటె సమధికంబు*
*పావనంబైన జనయిత్రి పాదజలము*
*వరతనూజున కఖిలదేవతల కంటె*
*జనని యెక్కుడు సన్నుతాచారనిరత*

### ప్రశ్నలు:

1. *"పావనంబైన జనయిత్రి పాదజలము" అంటే ఏమిటి?*
2. *తల్లి పాదజలం దేనికంటే గొప్పదని తెలుసుకొన్నారు? ఎందుకు?*
3. *కుమారునికి అన్నింటికంటే ఏది మిన్న? ఎందుకు?*
4. *ఈ పద్యం ద్వారా తల్లికిగల స్థానమేమిటని గ్రహించారు?*
5. *"ప్రతి స్త్రీమూర్తి మనకు తల్లితో సమానం" అని ఎందుకంటారు?*

## నేపథ్యం

*మొదటి దండయాత్రలో 'కళ్యాణి' దుర్గం జయించిన తరువాత అబ్బాజీసోన్‌దేవుడు, విజయోత్సాహంతో శివాజీ వద్దకు వస్తాడు. అప్పుడు సోన్‌దేవుడు శివాజీతో "దేవా మీ ఆజ్ఞ ప్రకారం కళ్యాణిని జయించి దాని సర్దారులను పట్టి బంధించి, సర్వస్వాన్నీ, రాణివాస స్త్రీలను బందీలుగా తెచ్చాను" అని మనవి చేశాడు. ఇది విన్న శివాజీ పరస్త్రీలు తల్లులతో సమానం అని చెప్పి, ఆమెకు అగౌరవం కల్గించినందుకు చింతిస్తూ, ఇలా చేయడం తగదని హితవు పలికిన సందర్భంలోనిదీ పాఠ్యాంశం.*

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం చారిత్రక కావ్య ప్రక్రియకు చెందింది. చరిత్ర ఆధారంగా రచించిన కావ్యం చారిత్రకకావ్యం. ఇది డా॥ గడియారం వేంకటశేష శాస్త్రి రచించిన 'శ్రీశివభారతము' తృతీయాశ్వాసం లోనిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

## కవి పరిచయం



**(1901-1981)**

ఆధునికాంధ్ర కవుల్లో ప్రముఖులు, శతావధాని డా॥ గడియారం వేంకటశేషశాస్త్రి. ఈయన తల్లిదండ్రులు - నరసమాంబ, రామయ్యలు. కడపజిల్లా, జమ్మలమడుగు తాలూకా నెమళ్ళ దిన్నె గ్రామంలో జన్మించాడు.

ఈయన దుర్భాక రాజశేఖర శతావధానితో కలిసి కొన్ని కావ్యనాటకాలు రాశాడు. గడియారం వారి పేరు చెప్పగానే "శ్రీశివభారతము" కావ్యం గుర్తుకు వస్తుంది. పారతంత్ర్యాన్ని నిరసించి స్వాతంత్ర్య కాంక్షను అణువణువునా రగుల్కొల్పిన మహాకావ్యం ఇది. 'మురారి', 'పుష్పబాణ విలాసము', 'రఘునాథీయము', 'మల్లికామారుతము' మొదలైన కావ్యాలు, 'వాస్తు జంత్రి' (అముద్రిత వచన రచన), 'శ్రీనాథ కవితా సామ్రాజ్యము' (విమర్శ) ఈయన లేఖిని నుండి వెలువడ్డాయి. 'కవితావతంస', 'కవిసింహ', 'అవధాన పంచానన' అనే బిరుదులను అందుకున్నాడు.

### ప్రవేశిక

*జాతి జీవనవిధానాన్ని ప్రతిబింబించేది సంస్కృతి. భారతీయసంస్కృతి స్త్రీలకు గొప్ప స్థానాన్నిచ్చింది. పరస్త్రీలను తల్లులుగా, పరధనాన్ని గడ్డిపరకతో సమానంగా భావించు మని చెప్పింది. అటువంటి ఉదాత్తమైన భావనలను జీవనశైలిగా మలచుకొని పరిపాలన సాగించిన ధీరోదాత్త చక్రవర్తి ఛత్రపతి శివాజీ.*

*శివాజీ జీవితంలోని ఒక సంఘటన మాతృభావనకు అద్దం పడుతున్నది. దాన్ని గడియారం వేంకటశేషశాస్త్రి తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. సహృదయతకు, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఆ సన్నివేశాన్ని ఈ పాఠంలో చదువుకుందాం...*

## I

శా. "ఆ-యేమీ? యొక రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా
వా? యేహైందవుఁడైన నీ గతి నమర్యాదన్ బ్రవర్తించునే?
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ" 1

✿మ. అనుచున్ జేవుఱుమీఱు కన్నుఁగవతో నాస్పందదోష్ఠంబుతో
ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో గర్జిల్లు నా భోన్సలే
శునిఁ జూడన్ బయిలోడెఁ గొల్వు; శివుఁడీసున్ గుత్తుకన్ ద్రింగి, బో
రన నవ్వారల బంధ మూడ్చి గొనితేరన్ బంచె సోన్‌దేవునిన్ 2

మ. త్వరితుండై యతఁ డట్టులే సలిపి "దేవా! నన్ను మన్నింపు; మీ
సరదారున్ గొని తెచ్చుచో సరభసోత్సాహంబు కన్గప్పె; దు
శ్చరితాలోచన లేదు, లేదు భవదాజ్ఞా లంఘనోద్వృత్తి; మీ
చరణద్వంద్వము లాన" యంచు వినిపించన్, సుంత శాంతించుచున్ 3

### ఆలోచించండి-చెప్పండి

- 'విజయగర్వంతో నీవు చేసిన పని సరికాదని' అనే మాటలనుబట్టి శివాజీ ఎలాంటివాడని భావిస్తున్నారు?
- స్త్రీలపట్ల మర్యాదగా ప్రవర్తించడం అంటే ఏమిటి?
- శివాజీ కోపానికి కారణమేమిటి? కోపంలో శివాజీ ఎలా ఉన్నాడు?
- "సరభసోత్సాహంబు కన్గప్పె" అంటే మీకేమర్థమైంది?

## II

✿మ. శివరా జంతట మేల్మొసుంగుఁ దెరలో – స్నిగ్ధాంబుదచ్ఛాయలో
నవసౌదామినిఁ బోలు నా యవనకాంతారత్నమున్ భక్తి గౌ
రవముల్ వాఱఁగఁ జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్యహైం
దవభూజంగమ పుణ్యదేవతలు; మాతా! తప్పు సైరింపుమీ!" 4


సీ. హరి హర బ్రహ్మలఁ బురిటిబిడ్డలఁ జేసి
జోలఁబాడిన పురంధ్రీలలామ,
యమధర్మరాజుపాశముఁ ద్రుంచి యదలించి
పతిభిక్ష గొన్న పావనచరిత్ర,
ధగధగ ద్దహనమధ్యము పూలరాసిగా
విహరించియున్న సాధ్వీమతల్లి,
పతి నిమిత్తము సూర్యభగవానును దయంబు
నరికట్టి నిలుపు పుణ్యములపంట,

తే. అట్టి యెందఱో భరతాంబ యాఁడుబిడ్డ
లమల పతిదేవతాత్వ భాగ్యములు వోసి
పుట్టినిలు మెట్టినిలుఁ బెంచు పుణ్యసతులు
గలరు, భారతావని భాగ్యకల్పలతలు 5

✿మ. అనలజ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులై డాయు భూ
జనులెల్లన్ నిజసంపదల్ దొఱఁగి యస్తధ్వస్తులై పోరె? వి
త్తనమే నిల్చునె? ము న్నెఱుంగమె పులస్త్యబ్రహ్మసంతాన? మో
జననీ! హైందవ భూమి నీ పగిది దుశ్చారిత్రముల్ సాగునే? 6

### ఆలోచించండి–చెప్పండి

- స్త్రీలను ఎవరితో పోల్చారు? ఎందుకు?
- స్త్రీల పట్ల సమాజంలో ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయి? దీనిపై మీ అభిప్రాయాలు తెల్పండి.
- స్త్రీల వల్ల భారత కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతున్నాయనడానికి ఉదాహరణలు తెల్పండి.
- "అనలజ్యోతుల............. సాగునే?" అనే పద్యం ద్వారా మీకేమర్థమైంది?



## III

తే. యవన పుణ్యాంగనామణి వగుదుగాక
హైందవులపూజ తల్లియట్లందరాదె?
నీదురూపము నాయందు లేద యైనఁ
గనని తల్లివిగా నిన్ను గారవింతు 7

✿శా. మా సర్దారుఁడు తొందరన్ బడి యసన్మార్గంబునన్ బోయె, నీ
దోసంబున్ గని నొచ్చుకోకు, నినుఁ జేర్తున్ నీ గృహం బిప్పుడే,
నా సైన్యంబును దోడుగాఁ బనిచెదన్, నాతల్లిగాఁ దోడుగా
దోసిళ్లన్ నడిపింతు; నీ కనులయందున్ దాల్మి సారింపుమీ!" 8

మ. అని కొండాడి, పతివ్రతా హిత సపర్యాధుర్యుఁడాతండు యా
వన కాంతామణి కర్హసత్కృతు లొనర్పన్ జేసి, చేసేతఁ జి
క్కిన సర్దారుని గారవించి హితసూక్తిన్ బల్కి, బీజాపురం
బునకున్ బోవిడె – వారితోఁ దనబలంబుల్ గొన్ని తోడంపుచున్ 9

మ. శివరా జంతట సోనదేవుమొగమై "స్త్రీరత్నముల్ పూజ్య, లే
యవమానంబు ఘటింపరా, దిది మదీయాదర్శ మస్మచ్ఛమూ
ధవు లీయాజ్ఞ నవశ్య మోమవలె; నీతాత్పర్యమున్ జూచి, లో
కువ చేకూరమి నెంచి, నీయెడ దొసంగు ల్లేమి భావించితిన్" [అని వాక్రుచ్చెను.] 10

### ఆలోచించండి-చెప్పండి

- *తల్లిగా గౌరవించడం అంటే ఏమిటి? ఆ ప్రవర్తన ఎలా ఉంటుంది?*
- *సన్మార్గంలో నడవడం అంటే ఏమిటి? విద్యార్థులుగా మీరు చేయాల్సిన కొన్ని పనులను తెల్పండి.*
- *"స్త్రీరత్నముల్ పూజ్య, లే యవమానంబు ఘటింపరాదు," అంటే ఏమిటి?*
- *"హితసూక్తిన్ బల్కి" అంటే ఏమిటి?*

### భావాలు

1. ఆ..... ఏమిటి? పుణ్యానికి నిలయమైన ఒక రాణివాసాన్ని బందీగా తెచ్చావా? ఏ హైందవుడైనా ఈ విధంగా మర్యాద తప్పి ప్రవర్తిస్తాడా? నా ఆజ్ఞను నీవు గమనించలేదా? విజయగర్వం మత్తులో చెలరేగి నీ ప్రాణానికి నీవే ఆపద తెచ్చుకొంటావా? నీవు చేసిన ఈ పనిని నేను సహించను.

2. అంటూ ఎర్రబడిన కన్నులతో, అదిరిపడే పై పెదవితో, గొప్ప హుంకారముతో, కదలాడే కనుబొమ్మ ముడితో గర్జిస్తున్న భోంసలేశుని చూసి సభంతా నిశ్చేష్టితమైంది. శివాజీ తన కోపాన్నంతా దిగమింగి "వెళ్ళి వారి బంధనాలు తొలగించి ఇక్కడకు తీసుకురండి" అని సోన్‌దేవుని పంపించాడు.

3. సోన్‌దేవుడు త్వరత్వరగా శివాజీ ఆజ్ఞను పాటించి "దేవా! నన్ను మన్నించండి. ఈ సర్దారును పట్టి తెచ్చే ఉత్సాహ తీవ్రత నా కళ్ళను కప్పేసింది. అంతేగాని ఇందులో ఎటువంటి చెడు ఆలోచన నాకు లేదు. మీ ఆజ్ఞను మీరి ప్రవర్తించాలనే ఉద్దేశం కూడా లేదు. మీ పాదాల మీద ఒట్టు" అని మనవి చేయగా, శివాజీ కొంత శాంతిస్తూ

4. అంతలోనే మేలిముసుగు తెరలో దట్టమైన నీలిమేఘం మాటున ఉన్న మెరుపుతీగ లాంటి యవనస్త్రీని భక్తి గౌరవాలతో చూస్తూ ఇలా అన్నాడు "స్త్రీలు శుభప్రదమైన ఈ హైందవభూమిపై సంచరించే పుణ్యదేవతలు. అమ్మా ఈ తప్పును మన్నించు."

5. త్రిమూర్తులను (బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) తన పాతివ్రత్యంతో చంటిబిడ్డలుగా చేసి వారికి జోలపాడిన మహనీయురాలు (అనసూయ). యమధర్మరాజు పాశాన్ని ఎదిరించి తన భర్త ప్రాణాన్ని రక్షించుకున్న పావన చరిత (సావిత్రి). భగభగ మండే అగ్ని గుండంలో కూడా పూలరాసిలో తిరిగినట్టు తిరుగాడి బయటకువచ్చిన పతివ్రత (సీత). భర్తకోసం సూర్యభగవానుని ఉదయించకుండా నిలిపిన పుణ్యస్త్రీ (సుమతి). ఇలా భారతీయ స్త్రీలు ఎందరో తమ పాతివ్రత్యంతో పుట్టినింటికీ మెట్టినింటికీ కీర్తిని పెంచిన వారు ఉన్నారు. వారు భారతదేశానికి అదృష్టకల్పలతలు.

6. ఓ తల్లీ! అగ్నిజ్వాలల వంటి పతివ్రతలపట్ల అపచారం చేసేవారు తమసంపదలు కోల్పోయి నాశనమై పోరా? అసలు వంశం నిలుస్తుందా? పులస్త్యబ్రహ్మ సంతానమైన రావణాసురుని పతనం గురించి మనకు తెలియదా? భారతభూమిపై ఇటువంటి దుశ్చర్యలు సాగుతాయా? సాగవు.

7. నీవు యవన దేశ పుణ్యస్త్రీవి కావచ్చు. అయినా హైందవుల పూజను స్వీకరించు. నీ రూపం నాలో లేకపోయినా నన్ను కనని తల్లివి నీవు. నిన్ను నా తల్లిగానే గౌరవిస్తాను.

8. మా సర్దారు తొందరపాటు వల్ల జరిగిన ఈ దోషానికి బాధపడకు. నిన్ను ఇప్పుడే నీ ఇంటికి చేరుస్తాను. నా సైన్యాన్ని తోడుగా పంపిస్తాను. నా తల్లిగా భావించి నిన్ను దోసిళ్ళపై నడిపిస్తాను. నీ కన్నుల్లో సహనం పూనుం.

9. అని స్తుతించి పతివ్రతా స్త్రీల మంచిని కోరుకునే శివాజీ యవన స్త్రీకి తగిన సత్కారాలు జరిపించి, తన చేతికి చిక్కిన సర్దార్‌ను గౌరవించి వారితో మంచి మాటలు పలికి వారికి తోడుగా తన బలగాలను బీజాపురానికి పంపించాడు.

10. తరువాత శివాజీ సోన్‌దేవుని వైపు తిరిగి "స్త్రీలు పూజింప దగినవారు. వారికి ఏ అవమానం చేయగూడదు. ఇది నా ఆదర్శం. నా సైన్యాధిపతులందరూ ఈ ఆజ్ఞను తప్పని సరిగా ఆచరించాలి. నీ ఉద్దేశం చూసి, లోపం లేదని తలచి నీ తప్పేమీ లేదని భావించాను" అని అన్నాడు.

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాల గురించి చర్చించండి.**

అ) "ప్రస్తుతం స్త్రీలపై జరిగే దాడులకు కారణాలు - నివారణోపాయాలు"

ఆ) "కుటుంబం - సమాజం అభివృద్ధిలో స్త్రీల పాత్ర"

2. * గుర్తుగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.

ఉదా॥ "ఆ-యేమీ? యొక రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా
వా? యే హైందవుఁ డైన నీగతినమర్యాదన్ బ్రవర్తించునే
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ.

ప్రతిపదార్థాలు:

| | | |
|---|---|---|
| ఆ - యేమి | = | (ఆశ్చర్యం, కోపం కలిపి) ఆ ఏమిటి? |
| పుణ్య + ఆవాసమున్ | = | పుణ్యానికి నిలయమైన |
| ఒక | = | ఒక |
| రాణివాసమును | = | రాణివాసాన్ని |
| తెచ్చినావా | = | బందీగా తీసుకొచ్చావా? |
| ఏ హైందవుఁడు + ఐననూ | = | హైందవుడు ఎవడైనా |
| ఈ గతిన్ | = | ఈ విధంగా |
| అమర్యాదన్ | = | మర్యాద తప్పి (మర్యాద లేకుండా) |
| ప్రవర్తించును + ఏ | = | ప్రవర్తిస్తాడా? |
| మా + ఆజ్ఞన్ | = | నా ఆజ్ఞను |
| గమనింపవు + ఓ | = | గమనించలేదా? (పట్టించుకోలేదా?) |
| జయ | = | (యుద్ధంలో) విజయం పొందిన |
| మద + ఉన్మాదంబునన్ | = | గర్వం మత్తులో |
| రేఁగి | = | అతిశయించి |
| నీ | = | నీయొక్క |
| ఆయుః + సూత్రములు | = | ప్రాణాలనే సూత్రాలు (దారాలు) |
| ఈవ | = | నీవే |
| త్రుంచుకొనెదు + ఓ | = | తెంచుకుంటావా? |
| ఔద్ధత్యము | = | ఈ తెగింపును (ఏపు) |
| ఓర్వన్ + సుమీ | = | సహించను సుమా! |


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) శివాజీ కొలువులోని వారంతా నిశ్చేష్టులవడానికి కారణం ఏమిటి?

ఆ) సోన్‌దేవుడు శివాజీని ఎలా శాంతపరిచాడు?

ఇ) భారతదేశ భాగ్య కల్పలతలని శివాజీ ఎవరిని, ఎలా కీర్తించాడు?

ఈ) శివాజీ యవన కాంత పట్ల చూపిన ఆదరాభిమానాలు ఎటువంటివి?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) సోన్‌దేవుని మనస్తత్వాన్ని గురించి పాఠం ఆధారంగా సొంతమాటల్లో రాయండి.

ఆ) శివాజీ రాజై ఉండీ తన వద్దకు బందీగా తెచ్చిన యవన కాంతతో "మాతా! తప్పు సైరింపుమీ!" అన్నాడు. దీని మీద మీ అభిప్రాయాలేమిటి?

ఇ) "శివాజీ ఆదర్శం" లోని గొప్పతనాన్ని సొంతమాటల్లో రాయండి.

ఈ) మీ తోటి బాలికలను మీరెలా గౌరవిస్తారు?

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) మీ పాఠం ఆధారంగా శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

ఆ) "స్త్రీరత్నములు పూజ్యులు" అన్న శివాజీ మాటలను మీ సొంత అనుభవాల ఆధారంగా సమర్థించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) పాఠ్యాంశాన్ని "ఏకాంకిక" రూపంలో రాసి ప్రదర్శించండి.

ఆ) ఈ పాఠం ఆధారంగా స్త్రీల పట్ల మనం ఎలా ప్రవర్తించాలో, మన బాధ్యతలు ఏమిటో తెలిపేలా నినాదాలు / సూక్తులు రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పర్యాయ పదాలకు సంబంధించిన పదాన్ని పాఠంలో గుర్తించి గడిలో రాయండి.**


అ) ______ - ఆదేశము, ఆన, ఉత్తరువు, నిర్దేశము.

ఆ) ______ - అక్షి, చక్షువు, నేత్రము, నయనము.

ఇ) ( ) – అగ్ని, నిప్పు, వహ్ని, జ్వలనము.

ఈ) ( ) – మగువ, కొమ్మ, ఇంతి, పడతి.

**2. కింది ఆధారాలను బట్టి గళ్ళను పూరించండి.**




**అడ్డం :**

1. సీతకు అగ్నిగుండం కూడా ఇలా ఉంటుంది (4)
4. 'అంబుదం' దీన్నే ఇలా కూడా అంటారు (2)
5. సావిత్రి చరిత్ర విశేషణం (3)
6. పాపం కాదు పుణ్యానికి నిలయం (4)
9. కుడివైపు నుండి సీతకు మరో పేరు (3)
10. కుడివైపు నుండి శివాజీ కోపించిన సేనాని (4)
12. ఈ పాఠం కవి ఇంటి పేరు (4)
14. పాఠంలో శివాజీ తొలిపలుకు (1)

**నిలువు :**

2. సోన్‌దేవుడు దీనిని బంధించాడనే శివాజీ కోపించింది(4)
3. శివాజీ గౌరవించిన కాంత వంశం (3)
6. రావణుని తాత (4)
7. యవన కాంత స్వస్థలం (4)
8. సోన్‌దేవుని మదోన్మాదానికి కారణం (2)
11. శివాజీని సోన్‌దేవుడు పిలిచినట్టు మీరూ పిలవండి (2)
13. శీర్షాసనం వేసిన త్వరితం, వేగం (2)

**3. కింది ప్రకృతులకు సరైన వికృతులను జతపరచండి.**

| ప్రకృతి | | వికృతి |
|---|---|---|
| అ) రాజ్ఞి | ( ) | 1) ఆన |
| ఆ) ఆజ్ఞ | ( ) | 2) రతనము |
| ఇ) ఛాయ | ( ) | 3) బత్తి |
| ఈ) రత్నము | ( ) | 4) రాణి |
| ఉ) భక్తి | ( ) | 5) చాయ |

**4. కింది పదాల్లోని ప్రకృతి – వికృతి పదాలను వేరుచేసి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| గౌరవము | బమ్మ | పుణ్యము | బ్రహ్మ | జోతి | పున్నెం |
| రాసి | గీము | జ్యోతి | దోషము | గృహము | అంబ |
| అమ్మ | భాగ్యము | దోసము | గారవము | రాశి | బాగ్గెము |

| ప్రకృతి | వికృతి |
|---|---|
| | |

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాలు పరిశీలించండి. వాటిలో సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి సంధులున్నాయి. గుర్తించి, విడదీసి సూత్రాలు రాయండి.**

అ) పుణ్యావాసము ఆ) మదోన్మాదము ఇ) స్నిగ్ధాంబుద

ఈ) సరభసోత్సాహం ఉ) గుణౌద్ధత్యం ఊ) రసైక స్థితి

**2. కింది పదాల్లో ఉత్వ, త్రిక, రుగాగమ, ులునల సంధులున్నాయి. పదాలు విడదీసి, సంధి జరిగిన తీరును చర్చించండి.**

అ) బంధమూడ్చి ఆ) అవ్వారల ఇ) భక్తురాలు

ఈ) బాలెంతరాలు ఉ) గుణవంతురాలు ఊ) దేశాలలో

ఋ) పుస్తకాలు ౠ) సమయాన

**3. కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణాలను సరిచూసుకోండి.**

అ) అనుచున్ జేవుఱుమీఱు కన్నుఁగవతో, నాస్పందదోష్ఠంబుతో ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో, గర్జిల్లునా భోన్సలేశుని జూడన్ ......

**4. కింది పద్యపాదాలకు గురులఘువులను గుర్తించి, గణవిభజనచేసి, అవి ఏ పద్యాలకు సంబంధించినవో నిర్ణయించండి. లక్షణాలను చర్చించండి.**

అ) ఆ – యేమీ యొకరాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా

ఆ) అనలజ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులైడాయు భూ

5. * కింది పదాలను విడదీయండి.

అ) వాఙ్మయం

ఆ) రాణ్మహేంద్రవరం

ఇ) జగన్నాథుడు

వాటి విసంధిరూపాలు కింద పేర్కొన్నట్లే ఉన్నాయా? సరిచూసుకోండి. సంధిజరిగిన తీరు గమనించండి.

అ) వాక్ + మయం = వాఙ్మయం = 'క్' స్థానంలో 'ఙ' వచ్చింది.

ఆ) రాట్ + మహేంద్రవరం = రాణ్మహేంద్రవరం = 'ట్' స్థానంలో 'ణ' వచ్చింది.

ఇ) జగత్ + నాథుడు = జగన్నాథుడు = 'త్' స్థానంలో 'న' వచ్చింది.

- పై మూడు సందర్భాల్లో పూర్వపదాంతంలో వరుసగా క, ట, త లున్నాయి.
- వాటికి 'మ' గాని, 'న' గాని పరమయినాయి –
- అప్పుడు పదాంతంలోని 'క' కారం కవర్గ అనునాసికమైన 'ఙ' (క ఖ గ ఘ 'ఙ') గాను; 'ట' కారం దాని అనునాసికమైన 'ణ' (ట, ఠ, డ, ఢ, 'ణ')గాను; 'త'కారం దాని అనునాసికమైన 'న' (త థ ద ధ 'న') గాను మారాయి. దీన్ననుసరించి–
- **వర్గప్రథమాక్షరాలకు (క, చ, ట, త, ప లకు) 'న' గాని, 'మ' గాని పరమైనప్పుడు అదేవర్గ అనునాసికాలు ఆదేశమవుతాయి. దీన్నే 'అనునాసిక సంధి' అంటారు.**

* కింది పదాలను విడదీసి, అనునాసిక సంధి సూత్రంతో అన్వయించి చూడండి.

అ) తన్మయము  ఆ) రాణ్మణి  ఇ) మరున్నందనుడు

6. ఉపజాతిపద్యాల్లో తేటగీతి, ఆటవెలది పద్యాల లక్షణాలను తెలుసుకున్నారు కదా! ఇప్పుడు సీసపద్యలక్షణాలను పరిశీలిద్దాం.

♦ సీసపద్యంలో ప్రతిపాదం రెండు భాగాలుగా ఉంటుంది. ప్రతిభాగంలో నాల్గేసి గణాల చొప్పున ఒక్కొక్క పాదంలో ఎనిమిది గణాలుంటాయి. ఈ 8 గణాల్లో మొదటి ఆరు ఇంద్రగణాలు. చివరి రెండు సూర్యగణాలు. (పాదం మొదటి భాగంలో 4 ఇంద్రగణాలు, 2వ భాగంలో వరుసగా రెండు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలుంటాయి.)

| | నగ | భ | నగ | సల | | |
|---|---|---|---|---|---|---|
| | I I I I | U I I | I I I U | I I U I | | |
| ఉదా॥ | హరిహర | బ్రహ్మలం | బరిటి బి | డ్డలంజేసి | – మొదటిభాగం | ఒక పాదం |
| | ఇంద్ర | ఇంద్ర | ఇంద్ర | ఇంద్ర | | |
| | ర | నగ | హ | హ | | |
| | U I U | II I U | U I | U I | | |
| | జోలం బా | డిన పురం | ధ్రీల | లామ | – రెండవభాగం | |
| | ఇంద్ర | ఇంద్ర | సూర్య | సూర్య | | |

- యతి ప్రతిపాదంలోనూ 3వగణం మొదటి అక్షరంతో సరిపోతుంది. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది. పై పాదంలో ప్రాసయతిని గమనించారు కదా!
- ప్రాసనియమం లేదు.
- సీసపద్యం నాల్గుపాదాల తర్వాత తేటగీతిగాని, ఆటవెలదిగాని తప్పనిసరిగా ఉంటుంది.

ఈ కింది పద్య పాదాన్ని గణ విభజన చేసి లక్షణ సమన్వయం చేయండి.

- ధగధగద్దహన మధ్యము పూలరాసిగా
  విహరించియున్న సాధ్వీమతల్లి.

- మీ పాఠంలోని 5వ పద్యం సీసం. ఆ పద్యం లక్షణాలను సరిచూడండి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- స్త్రీల అభ్యున్నతికి కృషి చేసిన సంస్కర్తల వివరాలు సేకరించి ప్రదర్శించండి.

(లేదా)

వివిధ రంగాలలో ప్రసిద్ధిగాంచిన స్త్రీల వివరాలను సేకరించి ప్రదర్శించండి.

## చదవండి - తెలుసుకోండి

*పులస్త్యబ్రహ్మ సంతానం* : *బ్రహ్మ మానసపుత్రుడు పులస్త్యుడు. పులస్త్యుని కుమారుడైన విశ్రవసునికి కైకసి అనే భార్యవల్ల రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణఖలు జన్మించారు.*

## సూక్తి

యత్రనార్యస్తు పూజ్యంతే, రమంతే తత్రదేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే, సర్వాస్తత్రాఽ ఫలాఃక్రియాః

స్త్రీలను పూజించేచోటనే దేవతలు ఆనందిస్తారు. స్త్రీలను గౌరవించనిచోట జరిగే సర్వక్రియలూ నిష్ఫలములే.

# 4 జానపదుని జాబు

డా|| బోయి భీమన్న

## చదవండి - ఆలోచించి చెప్పండి.

ప్రియసఖా!

నీ లేఖ అందింది. పట్నం జీవితం ఎలా ఉంటుందో అందులో వర్ణించావు. పల్లెటూరి జీవితాన్ని చిత్రిస్తూ ఉత్తరం రాయమన్నావు. నీది ఉత్తమమైన వాంఛ. ఒకచోటి జీవిత విధానంతో మరొకచోటి జీవిత విధానాన్ని నిత్యమూ పోల్చితెలిసికొంటూ ఉండాలి. మంచి చెడ్డలు, హెచ్చుతగ్గులు, ఏమైనా ఉంటే సరి చేసుకోవాలి. ఈ వాంఛ నీకు కల్గినందుకు అభినందిస్తున్నాను. నీ పట్న జీవితం – నా పల్లెటూరి జీవితంతో పోలిస్తే పరస్పర విరుద్ధంగా ఉంటుంది. నా జీవిత విధానాన్ని గురించి రాయడమంటే పల్లెటూళ్ళ జీవిత విధానాన్ని గురించి రాయడమన్నమాట. పల్లెటూళ్ళు, అక్కడి వాళ్ళజీవితాలు ఎలా ఉంటాయో నీకు తెలుసా? విద్యుద్దీపాలతో, పంఖాలు ఉన్న మేడలలో హాయిగా సుఖించే నీకు ఏమి తెలుస్తుంది. నీకు మా గ్రామజీవితం అర్థం కావాలంటే మా ఇంటికి ఒకసారి రా! ఈ పూరిగుడిసెలో ఒక్కరోజు ఉండు.

ఇట్లు
నీ మిత్రుడు

### ప్రశ్నలు:

1. ఉత్తరాన్ని ఎవరు, ఎవరికి రాసి ఉంటారు?
2. దేని గురించి రాశాడు?
3. లేఖను చదివారు కదా? మీరు ఏం గ్రహించారు?
4. పల్లెటూళ్ళు, పట్టణాల జీవితాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయని ఎందుకన్నారు?
5. పల్లెటూళ్ళ గురించి మీకు తెల్సింది చెప్పండి.

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. అందువల్లనే భారతదేశం గ్రామాల్లో నివసిస్తోంది అంటారు. "గ్రామంలోని ప్రతి ఇల్లు విద్యాగంధంతో గుబాళించి, అభివృద్ధి చెందితేనే మనదేశం సుసంపన్నంగా, సస్యశ్యామలంగా ఉంటుంది" అని మహాత్మాగాంధీ అన్నారు. ఐతే గ్రామాలు ఎలా ఉన్నాయి? వారి జీవితాలు ఎలా ఉంటాయి? అనే విషయాలను వివరిస్తూ, గ్రామాల్లోని దళితులు, పేదల జీవితాలను చిత్రిస్తూ "పల్లెటూరి లేఖలు" అనే పేరుతో 1932లో 'జనవాణి' పత్రికలోనూ, 1933లో 'జానపదుని జాబులు' అనే పేరుతో 'ప్రజామిత్ర'లోనూ బోయి భీమన్న ప్రచురించాడు. చదువుకొని, బీదతనంవల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రీమంతుడైన తన మిత్రునికి తన అవస్థలను, గ్రామాల్లోని పరిస్థితులను 'లేఖల' రూపంలో రాస్తాడు. గ్రామపరిస్థితుల గూర్చి తెలపడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

### పాఠ్యభాగ వివరాలు

ప్రస్తుత పాఠ్యాంశం లేఖా రూపంలో ఉంది. "జానపదుని జాబులు" పేరుతో డా|| బోయి భీమన్న రాసిన లేఖల సంపుటి నుండి పాఠాన్ని ఎంపికచేశారు. తూర్పుగోదావరి జిల్లా యాసలో ఈ లేఖా రచన సాగింది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న "పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.
- పాఠం మధ్యలో ఉన్న ప్రశ్నల గురించి ఆలోచించండి. మీ తరగతిలో చర్చించండి.

## కవి పరిచయం



(1911–2005)

"ప్రతిభను తలెత్తనివ్వరు పండితులు
పాండిత్యాన్ని తలెత్తనివ్వరు పామరులు"

"ఈనాడు సాహిత్యమంటే కులం, మతం, వర్గం, ముఠా" అని ధైర్యంగా తన మనస్సులోని మాటను కలం ద్వారా, గళం ద్వారా వెలిబుచ్చిన కవి బోయి భీమన్న. తనదైన శైలితో, వివిధ సాహితీ ప్రక్రియలతో బడుగుల జీవితాల గురించి, దళితుల జీవితాల గురించి రచనలు చేపట్టిన చైతన్యశీలి.

తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో పేద దళిత కుటుంబంలో జన్మించాడు. అస్పృశ్యత ప్రబలంగా ఉన్న నాటి కాలంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి విద్యనభ్యసించాడు. మహాత్మాగాంధీ, డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధనలతో ప్రభావితుడై అస్పృశ్యతను తన కలం ద్వారా రూపుమాపాలని తలచిన మేధావి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాలుపంచుకొన్నాడు. కొంతకాలం జర్నలిస్టుగా పనిచేసాడు. 1940–45 మధ్యకాలంలో ఉపాధ్యాయవృత్తిని చేపట్టాడు. వీరు 1978 నుండి 1984 వరకు రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా ఉన్నాడు.

ఈయన 11వ ఏట నుండే రచనలు చేశాడు. ఈయన రాసిన 'పాలేరు' ఎంతో మంది పేదలు, దళిత కుటుంబాలలో వెలుగులు నింపింది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాలేరుతనం మాన్పించి పాఠశాలల్లో చేర్చారు. 'పాలేరు' నాటకం స్ఫూర్తితో విద్యనభ్యసించి ఉన్నత పదవులు అధిష్ఠించిన పేదలు, దళితులు ఎంతో మంది ఉన్నారు. గుడిసెలుకాలిపోతున్నాయ్, ఉశారులు, జానపదుని జాబులు, రాగవైశాఖి, పిల్లీశతకం, ధర్మంకోసం పోరాటం మొదలైన రచనలు చేశాడు.

ఇతని గుడిసెలు కాలిపోతున్నాయ్" రచనకు 1975లో సాహిత్య అకాడమి అవార్డు లభించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం వారి కళాప్రపూర్ణ అనే బిరుదు రూపంలో గౌరవ డాక్టరేటును పొందాడు. భారత ప్రభుత్వం ఈయనను 1973లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్‌లతో సన్మానించింది.

## ప్రవేశిక

*పంటను కైలుచేసి, ధాన్యం రాసులు పోసి, తమ కడుపులు కాలుతూవున్నా, కన్నీళ్ళు కారుతూ ఉన్నా, ఇనాందారులకు ఫలితం అంతా అప్పగించి వట్టిచేతులు నలుపుకొంటూ ఇండ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి ఎవరి హృదయం కరిగించదు? ఈ మాటలు చెబుతున్నది ఎవరు? ఏ సందర్భంలో చెబుతున్నాడో తెల్సుకోవడానికి పాఠం చదవండి.*

# I

**నెచ్చెలీ!**

క్షమిస్తావనే అనుకొంటున్నాను. లేఖ ఆలస్యమైంది. ఆలస్యానికి కారణం లేకపోలేదు. మీ పట్నాల్లోలాగ కాలం కరకట్టుగా నడవదు మా పల్లెల్లో. ఈవేళ నిరుద్యోగం అయితే రేపు తీరిక లేని పని – మళ్ళీ ఆ మరునాడు పని మందం – ఈ విధంగా ఉంటుంది స్థితి. అందుచేత స్థిరంగా ఈ వేళ ఇది చేయాలి – ఆవేళ అది చేయాలి – అని కార్యక్రమం తయారు చేసికొనడానికి ఏమీ అవకాశం ఉండదు.

గ్రామాల్లో సాధారణంగా ఉండే ఈ అస్థిరభావమే నీకు లేఖ వ్రాయుట ఆలస్యం చేయించింది. కాలం చాలా విలువైంది. గ్రామాలు ఈ విలువ గ్రహించడానికి ఇట్టి అస్థిర స్వభావం తొలగాలి.

మొన్ననే నీకు లేఖ రాయాలని అనుకొన్నాను. కాని, ఆ వేళ అంతా పని. ఒక్క క్షణమైనా తీరుబడి అయింది కాదు. ఆ రాత్రి రాయాలని కలమూ, కాగితమూ పట్టుకొని దీపంబుడ్డి దగ్గిర కూర్చున్నాను.

'కిరసనాయిలు పొగ కళ్ళలో పడుతోంది. కళ్ళు జబ్బు చేస్తాయి' అని మాయమ్మ అన్నది.

'ప్రొద్దస్తమానమూ పని చేశావు, పడుకోకూడదా!' అన్నాడు మామయ్య.

'అన్నోయ్! ఈ లెక్క చెప్పి పడుకో' అంటూ పలక తీసికొని వచ్చింది మా చెల్లి.

అది రూపాయిల గుణకారం లెక్క, లెక్క చెప్పుతున్నాను. 'రూపాయల్ని అణాలు చేయాలంటే ఏమి చేయాలి?' అన్నాను.

మా చెల్లి ఆలోచిస్తోంది.

'దుకాణం మీదికి తీసుకువెళ్ళి మార్చాలి' అన్నాడు మా తమ్ముడు.

'కాదు, పదహారు పెట్టి గుణించాలి' అన్నది మా చెల్లి.

మాయమ్మ మా తమ్ముడి పక్షం అయింది.

'అయితే ఈ రూపాయిని గుణించి అణాలు చేయి' అంటూ ఒక రూపాయిని దొర్లించింది మా చెల్లి దగ్గరికి.

నాకు ఆశ్చర్యం కలిగింది.

అచ్చుట కలిగిన చమత్కారానికి కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. ఇటువంటి చమత్కారాలెన్నో నిత్యమూ చూస్తూ ఉంటాం గ్రామాల్లో.

మాయమ్మ మా తమ్ముడి పక్షం అవలంబించినందుకు కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. వినోదం కోసం, బిడ్డల సాన్నిధ్యాన్ని తల్లులు అనుభవించే ఆనందాన్ని అనుభవించడం కోసం ఆవిడ ఒక పక్షం వహించి మాతో తర్కానికి దిగింది.

మాయమ్మకు ఆ రూపాయి ఎక్కడినుంచి వచ్చింది అని కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. పదిరోజులు కష్టపడి పనిచేస్తే వచ్చిన కూలి ఆ రూపాయి.

రూపాయి కంటికి కనపడితే ఎంతో ఆనందం. అందుకనే చిల్లర తీసుకొనక మినపకుడుం వంటి రూపాయి తీసుకొన్నాడు మా అయ్య.

ఆ రూపాయిని అందరూ తలకొక కాస్తసేపూ దగ్గర పెట్టుకొని ఆడుకొన్నారు దానితో.

కాని నాకు ఆశ్చర్యం కలిగించింది వేరొక విషయం. మనం అభ్యసించే విద్యకూ, జీవితంలో చేయబోయే పనికి ఉన్న అంతరం హఠాత్తుగా నా మనస్సుకు తట్టింది.

మనం నేర్చుకొన్నది, నేర్చుకొంటున్నది, రూపాయిని పదహారుతో గుణించి అణాలు చేయడమే.


కాని చేయవలసిన పని రూపాయిని దుకాణం దగ్గిరకు తీసుకొని వెళ్ళి మ్రోగించి చూపి పదహారు అణాలనూ లెక్క పెట్టుకొని ఇంటికి రావడం. అంత ఉంది అంతరం!

'చూశావా? చదువులు చదువుతున్నాం. పట్నాల్లో ఒక రూపాయి ఒక దమ్మిడీలాగ ఖర్చు పెడతాం.'

చదువు పూర్తి అవగానే ఉద్యోగాలకు దేవుళ్ళాట మొదలు పెడతాం. అందరి కాళ్ళూ పట్టుకొంటాం.

సఖా! ఇన్ని త్రిప్పలూ ఎందుకు? బ్రతకడానికి! బ్రతికి ఎందుకు? మన స్వార్థాన్ని నింపుకోవడానికి! అంతేగా?

సంఘం ఏమైపోయినా సరే, మనతో వారు ఎన్ని కట్టళ్ళు కడుస్తున్నా సరే, దేశం అధోగతికి దించుకొని పోతున్నా సరే మనకు చీమ కుట్టిన చందం అయినా ఉండదు.



మన జిల్లా కాదు, మన తాలూకా కాదు, మన గ్రామం కాదు, మన ఇల్లు ఉండి, తక్కిన ప్రపంచం అంతా మునిగిపోతున్నా సరే, మనం లెక్కచేయం. అంతే.

మిత్రమా! చదువుకొన్నవాళ్ళంతా తమ కష్టఫలాన్ని తింటూ పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూ, కులుకుతూ ఉండడం చూచి పల్లెటూళ్ళు కన్నీరు విడుస్తున్నవి.

గ్రామోద్ధరణం అంటూ పత్రికల్లో రాసుకొంటే పని కాదు. ఉపన్యాసాలిస్తే పని కాదు. రోడ్ల వెంట మోటారు కార్లలో నాలుగుసార్లు తిరిగి నాలుగు వందలు భత్యాలు కొడితే పని కాదు. అవన్నీ రూపాయిని పదహారు చేత గుణించినట్లే వ్యర్థాలు. కాగితం మీద కోట్లు కోట్లు సంఖ్యలు వేసుకొని 'ఇంత ధనం ఉంది నాకు' అని సంతోషించడం ఎట్లో, అవన్నీ అట్లే.

ఈ ఊహ ఆ క్షణంలో తట్టింది నాకు. ఆశ్చర్యం కలిగింది.

ప్రజాసముదాయం కోరే ప్రత్యక్షఫలం ఆడంబరం కాదు.

అంతట్లోకే 'వరికుప్పచేలో నీరుపడ్డది, నీవు రావాలి' అంటూ వచ్చాడు, ఒక రైతు కోటయ్య. ఆవేళ నీకు లేఖ రాయడానికి వీలే చిక్కలేదు.

### *ఆలోచించండి – చెప్పండి*

- *లేఖలు ఎప్పుడెప్పుడు రాస్తారు? ఎందుకు?*
- *'అస్థిరభావం' అంటే మీకేమి అర్థమైంది?*
- *మన చదువులు దైనందిన జీవితంలో ఉపయోగపడతాయని భావిస్తున్నారా? ఎలా?*
- *మీరు చదువు పూర్తయిన తర్వాత ఏం చేస్తారు? ఏం కావాలనుకొంటున్నారు?*
- *ఈ రోజుల్లో మనుషుల్లో స్వార్థం ఎందుకు పెరుగుతుంది?*

## II

ఆ రాత్రి అంతా పొలాలలో జాగారం చేశాం.

కోతలు అయినవి. కొందరు కోతలు కోయగానే నూర్చి వేసుకొంటారు. కొందరు కుప్పలు వేసికొని వేసవి కాలం తలసూపగానే చైత్రారంభంలో నూర్చుకొంటారు.

కుప్పలు చేలలోనే వేస్తారు. కుప్పల చుట్టూ పైరులు చక్కగా పెరుగుతూ ఉంటాయి.

నీటి బోదెకు దగ్గరగా ఉన్న చేలో కోటయ్య కుప్ప వేశాడు.

కాలువ ఇంకా ఎండిపోలేదు. బోదె కన్నం తెగి కుప్పచేలో నీరు పడింది.

బోదె కన్నం కట్టివేసి చేలో పడ్డ నీరు పోయేలాగున పిల్లబోదెలు తీసి ఒక గట్టు మీద కూర్చున్నాం కోటయ్యా, నేనూ.

హాయిగా నక్షత్రాలు మెరుస్తున్నాయి. గుబురు గుబురుగా యెదుగుతూ, చల్లని గాలికి 'జోరు' మంటూ పైరుచేలు ఎంతో ఆనందాన్ని కూరుస్తున్నాయి.

'పల్లెటూరి జీవితం ఎంతో మనోహరమైంది!' అని అనుకున్నాను. కాని, 'పస్తులు పడాలి, కష్టాలకు ఓర్చుకోవాలి. ఈ రెండూ తప్పితే పల్లెటూరే ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిల్లు.'

'కుప్ప పల్లాన్ని పడ్డది. ఆ మెరక చేలో వేద్దాం అనుకొన్నాను' అన్నాడు కోటయ్య. 'అంతర్వేది వెళ్ళగానే నూర్చేయాలి.'

'అంత తొందర ఏమి వచ్చింది? సంవత్సరాదికి నూర్చుకోవచ్చు' అన్నాను.

'అబ్బే, పన్నులు వచ్చి తల మీద తన్నుతాయి. ఇంట్లో ఒక పింగాణీచిప్ప అయినా లేదు అమ్మడానికి. అన్నీ మట్టిమూకుళ్ళే' అన్నాడు.

సఖా! కష్టం వొకళ్ళది, ఫలితం మరొకళ్ళది.

పేదల నోళ్ళు కొట్టి, కడుపులు మాడ్చి, ఉన్నదంతా ఊడ్చుకపోయి ఏమి చేస్తారో తెలుసా? బేంకులలోనూ, ఇనుప పెట్టెలలోనూ కుప్పలు పోసికొని కూర్చుని అనుభవిస్తారు సర్వభోగాలూను.

ఎప్పుడు తొలకరిస్తాది అని కళ్ళు విప్పి కని పెట్టుకొని ఉండి –

ఎప్పుడు కాలువకు నీరు వొస్తాది అని రాత్రింబవళ్ళు మననం చేసి –

మందున్ని, విత్తనాలు చల్లి – నీటి కొరకూ – కూలి కొరకూ ఇతరులతో పోటీలు పడి –

ఆకుమళ్ళు పశువులు తొక్కితినివేయకుండా రాత్రింబవళ్ళు పొలాలలోనే, వట్టి నేలనే పండుకొని కాపలా కాచి –

కుట్టే జెర్రిలకూ, పొడిచే తేళ్ళకూ, కరిచే పాములకూ శరీరాన్ని అర్పిస్తూ –

విసుగూ విరామమూ లేకుండా పొలాలకు నీరు పెట్టి, దున్ని, ఊడ్చి –

వర్షం అనక, బాడిబందలు అనక – పైరుల్ని – నిత్యమూ చూస్తూ, కాస్తూ –

ఎరువులు వేసి, కలుపులు దీసి, పంట పండించి –

పంటను ఎలుకలు, చిలుకలు తినివేయకుండా జాగ్రత్త చేసి –

పంటను కైలు చేసి – ధాన్యం రాసులు పోసి – తమ కడుపులు కాలుతూవున్నా, కన్నీళ్ళు కారుతూ ఉన్నా –

మిత్రమా! ఇనాందారులకు ఫలితం అంతా అప్పగించి వట్టిచేతులు నలుపుకొంటూ ఇండ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి ఎవరికి హృదయం కరిగించదు?

చాలాకాలం గడిచిపోయింది నాకు ఈ ఊహ లోనే, కోటయ్య ఏమి ఆలోచిస్తున్నాడో నాకు తెలియదు. ఇద్దరమూ తెలివొంది చూచుకొనేసరికి మంచుచేత మా తలలు నానిపోయినై. పోదాం పద అని లేచాడు కోటయ్య.

రాత్రి అంతా నాకు నిద్దర పట్టలేదు. పైగా అమితమైన చలి కూడాను. చలిమంటలు వేసుకొంటూ కబుర్లు చెప్పుకొంటూ ఆ రాత్రి గడిపాం.

ఆ మర్నాడు నిద్దుర బద్ధకం చేత (ఏమీ పనిలేకపోవడమే బద్ధకానికి కారణం) నీకు లేఖ రాయలేకపోయాను. ఆ రాత్రి అన్నం తినకుండానే నిద్ర పోయానట, మాయమ్మ అన్నానికి ఎంత లేపినా లేచాను కానట.

రేపంతా పని ఉంది. మెట్టదుక్కులు వచ్చాయి. తోటల్లో అరకలు కట్టాలి. రేపు మూర్తిగారి ఇంటికి వెళ్ళాలి అనుకొంటున్నాను. ఎలా ఉంటుందో.

ఇంతవరకూ నా లేఖ ఎందుకు ఆలస్యమయిందో రాశాను. అసలు నీకు రాయాలి అనుకొన్న సంగతి రాయనే లేదు.

క్రిస్టమసు వస్తుంది. క్రిస్టమసుకూ, సంక్రాంతికీ కలిపి కాలేజీకి సెలవులు ఇస్తారు. నేను ఈ ఏడు చదువు సాగిస్తే నిన్ను మా ఊరు తీసుకొని రావాలి అనుకొన్నాను. కాని పురిటిలోనే సంధి కొట్టింది నా చదువుకు.

## ఆలోచించండి - చెప్పండి

- *"పల్లెటూరి జీవితం ఎంతో మనోహరమైంది. దీనిపై మీ అభిప్రాయాలు తెల్పండి.*
- *"కష్టం వొకళ్లది, ఫలితం మరొకళ్లది" అంటే మీకేమి అర్థమైంది? దీన్ని ఏ ఏ సందర్భాలలో ఉపయోగిస్తారు?*
- *చలిమంటలు వేసుకుంటూ, రైతులు కబుర్లు చెప్పుకొంటారు కదా! వారు ఏ ఏ విషయాల గురించి కబుర్లు చెప్పుకుంటారు. ఊహించండి.*
- *పల్లెటూళ్లకు వెళితే మనం ఏ ఏ విషయాలు తెలుసుకోవచ్చు?*

డబ్బు లేని చదువు ఇబ్బందుల చేటు. వచ్చే ఏడైనా చదువుతానో చదవనో, కాలం జరిగిపోయే కొలదీ స్నేహాలు పాతబడిపోతూ ఉంటాయి. కొత్త పరిచయాలు కలిగే కొలదీ పాత పరిచయాలు అడుగున పడిపోతూ ఉంటాయి. ఇది ప్రపంచ స్వభావం.

కనుక ఈ సెలవులకు మా ఊరు వస్తావనే అనుకొంటున్నాను.

నీవంటి ఆర్ద్రహృదయుడు పల్లెటూళ్ళు వచ్చి ఇచ్చట ప్రజలు పడే కష్టాల్నీ – కష్టాలు తొలగిపోతే పల్లెటూళ్ళు మానవసంఘానికి ఈయగల ఆనందాన్నీ – చూస్తే ఎప్పటికైనా మంచిది.

ఏ విషయమూ వెంటనే తెలపాలి. నారింజపళ్ళూ, వెలగపళ్ళూ, కొబ్బరి కురిడీలూ జాగ్రత్తచేసి ఉంచుతాను. తప్పకుండా రావాలి. సెలవు.

## ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

1. **పల్లె గొప్పదా? పట్నం గొప్పదా? మీరైతే దేన్ని సమర్థిస్తూ మాట్లాడతారు? ఎందుకు?**
2. **గతంతో పోలిస్తే నేడు వ్యవసాయం చేసేవారి సంఖ్య క్రమేణా తగ్గుతోంది. దీనికి కారణాలు ఏమై ఉంటాయి? తెల్సుకొని చర్చలో పాల్గొనండి.**
3. **కింది వాక్యాలు చదవండి. వీటిని ఏ సందర్భంలో ఎవరు అన్నారు?**

   అ) అన్నాయ్! ఈ లెక్క చెప్పి పడుకోకూడదా!

   ఆ) "అయితే యీ రూపాయిని గుణించి అణాలు చేయి".

   ఇ) "వరిచేలో నీరుపడ్డది, నీవు రావాలి".

**4. (బోయి భీమన్న రాసిన ధర్మం కోసం పోరాటంలోని) కింది పేరా చదవండి. పేరాలోని కీలకమైన ఐదు పదాలను గుర్తించండి.**

పనిచేస్తూ ఉంటే అనుభవం కలుగుతూ ఉంటుంది. అనుభవాన్ని మళ్ళీ ఆచరణలో పెడితే, పని మరింత చక్కగా సాగుతుంది. అప్పుడు అనుభవానికి మరింత పదునూ, కాంతి లభిస్తుంది. వాస్తవ జ్ఞాన సముపార్జన పద్ధతి ఇది. వాస్తవ జ్ఞానమే సరియైన జ్ఞానం. వాస్తవ జ్ఞానం ఎడతెగని పని ద్వారా, పరిశీలన ద్వారా లభిస్తుంది. వాస్తవ జ్ఞానం దేశ కాల ప్రాంతానుగుణమై ఉంటుంది. దేశ కాల ప్రాంతానుగుణంగా మారుతుంది. మన వస్త్రధారణ, వివాహాలు, పరిపాలన విధానాలు ఈ విధంగా విభిన్న విషయాల్ని తీసుకొని మనం పరిశీలించినా, ఈ సత్యం కనిపిస్తుంది. మంచిచెడ్డలు, ఆచారవ్యవహారాలు, విధివిధానాలు అన్నీ దేశకాల ప్రాంతానుగుణంగా ఎలా మారిపోతున్నాయో స్పష్టమవుతుంది. మార్పుకు అతీతమైంది ఏదీ ఈ లోకంలో లేదు.

పై పేరా ఆధారంగా కింది వాక్యాలలో ఏవి సరైనవో (✓) ద్వారా గుర్తించండి.

అ) అనుభవం వల్ల మన పనితీరు మెరుగుపడుతుంది. (     )

ఆ) 'జ్ఞానం' అనేది చదివితే, వింటే లభించేది. (     )

ఇ) వాస్తవజ్ఞానం స్థిరంగా ఉండదు. అది కాలానుగుణంగా మారుతుంటుంది. (     )

ఈ) అనుభవం, పరిశీలన వల్ల వాస్తవ జ్ఞానం సిద్ధిస్తుంది. (     )

ఉ) మన ఆచారవ్యవహారాలు, విధివిధానాలు ఎప్పుడూ స్థిరంగా ఉంటాయి. (     )

**5. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) జానపదుని లేఖలో కవి ఏ ఏ విషయాలను గురించి రాసాడు?

ఆ) వ్యవసాయదారుల కష్టాన్ని కవి ఏమని వివరించాడు?

ఇ) చదువుకొన్నవాళ్ళ గురించి, పట్టణవాసుల గురించి కవి ఏమని ప్రస్తావించాడు?

ఈ) జానపదుడు తన పట్టణంమిత్రుణ్ణి పల్లెటూరుకు ఎందుకు రమ్మని ఆహ్వానించాడు?

ఉ) బోయి భీమన్న గురించి సొంతమాటల్లో రాయండి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) "ఏమీ పని లేకపోవడమే బద్ధకానికి కారణం" దీనిపై మీ అభిప్రాయం తెల్పండి.

ఆ) "కాలం చాలా విలువైంది" ఎందుకు?

ఇ) చదువుకున్నవాళ్ళంతా తమ కష్టఫలాన్ని తింటూ పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూన్నారన్న రచయిత అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?

ఈ) "కష్టం ఒకళ్ళది ఫలితం మరొకళ్ళది" అని అనడంలో రచయిత ఉద్దేశం ఏమై ఉంటుంది?

ఉ) "పల్లెటూళ్ళు మానవ సంఘానికి ఈయగల ఆనందాన్ని చూసే తెలుసుకోవాలి" అని ఎందుకన్నారు?

ఊ) "పల్లెటూళ్ళు కన్నీళ్ళు పెడుతున్నవి" దీన్ని వివరిస్తూ రాయండి.

2. **కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) పల్లెటూళ్ళు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అలాంటి పల్లెటూళ్ళు రోజురోజుకూ తమ ఉనికిని, సంస్కృతిని, ఆత్మను కోల్పోతున్నాయి. ఇందుకుగల కారణాలు ఏమై ఉంటాయి? ఇవి కళకళలాడాలంటే మనం ఏం చేయాలి?

ఆ) "పల్లెటూళ్ళు ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిళ్ళు" దీన్ని సమర్థిస్తూ సమాధానం రాయండి.

3. **కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) మీరు చూసిన పల్లెటూరులోని మనుషుల మధ్య సంబంధాలు, అక్కడి ప్రకృతి దృశ్యాలను వర్ణిస్తూ మీ మిత్రుడికి లేఖరాయండి.

ఆ) ఈ పాఠం ఆధారంగా కొన్ని నినాదాలు, సూక్తులు రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

1. **కింది పదాలు చూడండి. వాటికి సంబంధించిన పదాలతో కలపండి.**

ఉదా॥ రైల్వేస్టేషను, ________, ________, చేరుకోవడం

రైల్వేస్టేషను, టిక్కెట్టు, ప్రయాణం, చేరుకోవడం.

అ) వర్షాకాలం, ________, ________, ధాన్యం.

ఆ) మడిదున్నడం, ________, ________, పంట.

ఇ) పాఠశాల, ________, ________, జీవితంలో స్థిరపడడం.

ఈ) లేఖ, ________, ________, చేరడం.

ఉ) పనిచేయడం, ________, ________, ఆనందంగా జీవించడం.

2. **కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ) పొద్దస్తమానం

ఆ) చమత్కారం

ఇ) సాన్నిధ్యం

ఈ) కష్టఫలం

ఉ) కడుపులు మాడ్చుకొను

ఊ) అడుగున పడిపోవు

3. **కింది పదాలు / వాక్యాలను వివరించి రాయండి.**

అ) పురిటిలోనే సంధి కొట్టడం ________________________________

________________________________________________

ఆ) కలుపుదీయడం ______________________________

______________________________

ఇ) గ్రామోద్ధరణం ______________________________

______________________________

ఈ) ఉన్నదంతా ఊడ్చుకపోవడం ______________________________

______________________________

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాల్లోని సంధులను విడదీసి, సంధి సూత్రంతో సమన్వయం చేయండి.**

అ) ఆహాహా! ఎంత వైపరీత్యము!

ఆ) జంతుప్రదర్శనశాలలో ఏమేమి చూశావు?

ఇ) అక్కడక్కడ కొన్ని సమస్యలు తలెత్తవచ్చు.

ఈ) వెన్నెల పట్టపగలును తలపిస్తున్నది.

**2. కింది వాక్యాలను సంశ్లిష్టవాక్యాలుగా మార్చండి.**

అ) రాము పాఠం చదివాడు. రాము పాఠం అర్థం చేసుకున్నాడు.

ఆ) వైద్యుడు ప్రథమ చికిత్స చేస్తాడు. వైద్యుడు మందులు ఇస్తాడు.

ఇ) అక్క టీవీ చూస్తున్నది. అక్క నృత్యం చేస్తున్నది.

**3. కింది వాక్యాలను సంయుక్తవాక్యాలుగా మార్చండి.**

అ) రామకృష్ణుడు గురువు. వివేకానందుడు శిష్యుడు.

ఆ) సీత సంగీతం నేర్చుకుంటున్నది. సీత నృత్యం నేర్చుకుంటున్నది.

ఇ) రంగారావుకు పాడటమంటే ఆసక్తి. రంగారావుకు వినడమంటే విరక్తి.

ఈ) శ్రీను బడికివచ్చాడు. జాన్‌రెడ్డి బడికి వచ్చాడు. హస్మత్ బడికి వచ్చాడు.

ఉ) ఆయనకవి. ఆయన గాయకుడు. ఆయన విద్యావేత్త.

### ప్రాతాదిసంధి

**4. కింద గీతగీసిన పదాలను విడదీయండి. మార్పులు గమనించండి.**

అ) పూరెమ్మ అందంగా ఉన్నది.

ఆ) గురుశిష్యులు పూఁదోటకు వెళ్ళారు.

ఇ) రవికి పాలమీఁగడ అంటే చాలా ఇష్టం.

ఈ) కొలనులో కెందామరలు కొత్త శోభను వెదజల్లుతున్నాయి.

- సంధి జరిగిన తీరును గమనించండి.

| | |
|---|---|
| పూవు + రెమ్మ<br>పూవు + తోట<br>మీదు + కడ<br>కెంపు + తామరలు<br>ప్రాత + ఇల్లు | ఐదు సందర్భాల్లోనూ మొదటి పదంలోని మొదటి అచ్చు తర్వాత ఉన్న అక్షరాలు లోపించాయి కదా!<br>సూ॥ ప్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగానగు.<br>• ప్రాతాదులనగా ప్రాత, లేత క్రొత్త, క్రింద, కెంపు, చెన్ను మొ॥నవి. |

ప్రా + ఇల్లు - యడాగమం జరిగి 'ప్రాయిల్లు' అనురూపం ఏర్పడింది.

| | |
|---|---|
| పూ + తోట<br>మీ + కడ<br>కె + తామరలు | ఈ మూడింటికి సరళాదేశసంధి సూత్రాలననుసరించి మార్పులు జరిగి పూఁదోట, మీఁగడ, కెందామరలు - అనే రూపాలు ఏర్పడ్డాయని తెలుసుకోండి. |

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- ♦ అందమైన పల్లెటూరు ఎలా ఉంటుందో ఊహించండి. ప్రకృతి శోభలతో అలరారే అలాంటి గ్రామ సీమ చిత్రాన్ని సేకరించండి. దాన్ని వర్ణిస్తూ, వివరాలను రాసి ప్రదర్శించండి. మీ మిత్రులు కూడా ఇలాగే రాస్తారు కదా! వీటితో "అందమైన గ్రామ సీమలు" అనే పుస్తక సంకలనం చేయండి. దానికి ముఖచిత్రం కూడా గీయండి. విషయసూచిక, ముందుమాట రాసి ప్రదర్శించండి.

### సూక్తి

లక్షలమంది పేదరికంలో, అజ్ఞానంలో మగ్గిపోతున్నంత కాలం వారి కష్టార్జితంతో విద్యావంతులై, వారిని కనీసం పట్టించుకోవడం మానివేసిన ప్రతివ్యక్తిని నేను వంచకుడిగానే భావిస్తాను. పీడితులై చెమటోడ్చే లక్షలమంది పేదల హృదయార్తితో విద్యావంతులై సుఖాల్లో మునిగితేలుతూ, వారి గురించి కనీసం ఆలోచించనివారిని నేను నయవంచకులనే అంటాను.

- వివేకానంద

# 5

# శతక మధురిమ

– శతక కవులు

## చదవండి – ఆలోచించి చెప్పండి.

| | | |
|---|---|---|
| రాజేశ్ | : | రవీ! బాగున్నావా! |
| రవి | : | బాగున్నాను రాజేశ్. నువ్వేంచేస్తున్నావు? మన చిన్ననాటి మిత్రులు ఎవరైనా కలుస్తున్నారా? |
| రాజేశ్ | : | ఆ! ఆ! అందరూ కలుస్తున్నారు. సంతోష్ లాయరైనాడు. భాను టీచరైనాడు. మధు వ్యాపారం చేస్తున్నాడు. సుభాష్ రాజకీయనేతగా ఎదిగాడు. ఇలా అందరూ ఒక్కోరంగంలో నీతి నిజాయితీలతో రాణిస్తున్నారు. |
| రవి | : | చిన్నప్పుడు మనం చదివిన చదువు, నేర్చుకున్న జ్ఞానం ఊరికేపోతుందా? ఆ చదువుల ఫలితం, గురువుల దీవెనలు అన్నీ కలిస్తేనే మన అభివృద్ధి. |
| రాజేశ్ | : | ఔనౌను! ముఖ్యంగా శతక పద్యాల్లోని నీతులు మనవ్యక్తిత్వానికి బాటలు వేశాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపాయి కదూ! |
| రవి | : | బాగా చెప్పావు రాజేశ్! శతక పద్యాలు నేటికీ మార్గదర్శకాలు మీపిల్లలకు కూడా నేర్పించు బాగా! |
| రాజేశ్ | : | నేర్పుతున్నాను. సరే రవీ! బస్సు వచ్చింది. మళ్ళీ కలుద్దాం. |

### ప్రశ్నలు:

1. సంభాషణను బట్టి వారు ఎవరని భావిస్తున్నారు?
2. వారి అభివృద్ధికి కారణాలేవి?
3. వ్యక్తిత్వాన్ని ఏవి తీర్చిదిద్దుతాయి?
4. ఏవి నేటితరానికి మార్గదర్శకాలని రవి చెప్పాడు?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

శతకాలు నైతిక విలువలను పెంపొందింపజేస్తాయి. భావిజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. శతక పద్యాల్లోని నైతిక విలువలను తెల్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

శతక పద్యాలలో మకుటం ప్రధానమైంది. ఈ పద్యాల్లో ప్రతి పద్యం చివర మకుటం ఉంటుంది. ఇవి ముక్తకాలు, అంటే ఏ పద్యానికదే స్వతంత్ర భావంతో ఉంటుంది. ప్రస్తుత పాఠంలోని పద్యాలు మల్లభూపాలీయం, చిత్త శతకం, తరిగొండ నృసింహ శతకం, భక్త చింతామణి శతకం, ఉత్పలమాల, విశ్వనాథేశ్వర శతకం, నింబగిరి నరసింహ శతకం, లొంకరామేశ్వర శతకం అనే నీతి శతకాలలోవి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని పద్యాలను రాగంతో, భావంతో చదవండి.
- పాఠం చదివి అర్థంకాని పదాల కింద గీతలు గీయండి.
- అర్థంకాని పదాలకు అర్థాలను 'పదవిజ్ఞానం' పట్టిక చూసిగాని లేదా నిఘంటువు చూసిగాని తెల్సుకోండి.
- ప్రవేశిక చదవండి. మిత్రులతో చర్చించండి.

## కవయిత్రి / కవుల పరిచయం

1. మల్లభూపాలీయం నీతిశతక కర్త – ఎలకూచి బాలసరస్వతి :

   క్రీ.శ.1600 ప్రాంతంవాడు. మహబూబ్‌నగర్ జిల్లా జటప్రోలు సంస్థానంలో సురభిమాధవరాయల ఆస్థానకవి. తెలుగులో తొలి త్ర్యర్థికావ్యమైన 'రాఘవ యాదవ పాండవీయం' కర్త. ఆంధ్రశబ్దచింతామణి వ్యాఖ్యాత. దాదాపు పన్నెండు గ్రంథాలు రచించాడు. భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన వారిలో మొదటివాడు. పాండిత్య స్ఫోరకంగా, ధారాళమైన శైలిలో ఈయన రచన సాగుతుంది.

2. చిత్తశతక కర్త – శ్రీపతి భాస్కరకవి :

   17వ శతాబ్దికి చెందినవాడు. శైవ పండిత త్రయంలోని శ్రీపతి పండితుని వంశీయులని పరిశోధకుల భావన.

3. తరిగొండ నృసింహ శతక కర్త్రి – తరిగొండ వెంగమాంబ :

   18వ శతాబ్దికి చెందిన కవయిత్రి. చిత్తూరు జిల్లా తరిగొండ గ్రామ నివాసిని. బాల్యం నుంచే భగవద్భక్తురాలు. తరిగొండ నృసింహశతకంతో పాటు శివనాటకం, నారసింహవిలాసకథ అనే యక్షగానాలు, రాజయోగామృతం అనే ద్విపద కావ్యం, శ్రీవేంకటాచల మాహాత్మ్యం, అష్టాంగ యోగసారం, వాశిష్ఠ రామాయణమనే పద్యకావ్యాలు రచించి ప్రసిద్ధికెక్కింది.



(ఊహాచిత్రం)



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

4. భక్త చింతామణి శతకం – వడ్డాది సుబ్బారాయకవి :

'వసురాయకవి'గా ప్రసిద్ధి పొందిన వడ్డాది సుబ్బారాయకవి 20వ శతాబ్దానికి చెందినవారు. ఈయన రాజమహేంద్రవరంలోని దొరతనంవారి ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశాడు. 'హిందూ జనసంస్కారిణి' అనే పత్రికలో 'భక్తచింతామణి' పేర ఎనభై పద్యాలు రాశాడు. తరవాత దాన్ని భక్తచింతామణి శతకంగా పూర్తిచేశాడు. వీరి 'వేణీసంహారం' అనే నాటకం చాలా ప్రసిద్ధిపొందింది. 'ప్రబోధ చంద్రోదయం' అనే నాటకం, 'నందనందన శతకం', భగవత్కీర్తనలు అనేవి ఈయన ఇతర రచనలు.

5. ఉత్పలమాల శతక కర్త–ఉత్పల సత్యనారాయణచార్య :


(1923– 2007)

వీరు ఖమ్మం జిల్లాలోని చింతకాని ప్రాంతంవాడు. రసధ్వని, ఈ జంట నగరాలు – హేమంత శిశిరాలు, గజేంద్రమోక్షం, భ్రమరగీతం, శ్రీకృష్ణ చంద్రోదయం, మొదలైన పుస్తకాలు రాశాడు. వీరిని 2003లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వరించింది. ఈయన శైలి లలితమధురంగా, సరళంగా, సున్నితమైన హాస్యంతో కూడి ఉంటుంది.

6. విశ్వనాథేశ్వర శతక కర్త – గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ :


(1934 – 2011)

మెదక్ జిల్లా పోతారెడ్డి పేటలో జన్మించాడు. కవితాకళ్యాణి, అవధాన సరస్వతి, వాగీశ్వరస్తుతి, ఆద్యమాతృక, పద్యోద్యానము గ్రంథాలను రచించారు. మూడువందలకు పైగా అవధానాలు చేసి 'అవధాన శశాంక', 'ఆశుకవిశేఖర' అనే బిరుదులు పొందాడు.

7, నింబగిరి నరసింహ శతక కర్త – అందెవేంకటరాజం :


(1933 – 2006)

కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించిన ఈయన నవోదయం, మణిమంజూష, కళాతపస్విని అనే పద్యకావ్యాలు, భారతరాణి నాటికల సంపుటిని రచించాడు. నింబగిరి శతకం, ఈశ్వర శతకాలతోపాటు, వానమామలై వరదాచార్యుల కృతులు – అనుశీలన అనే సిద్ధాంతగ్రంథాన్ని రాశాడు. 'కవిశిరోమణి', 'అవధాన యువకేసరి', 'అవధాన చతురానన' బిరుదాంకితులు.

8. శ్రీ లొంక రామేశ్వర శతక కర్త నంబి శ్రీధరరావు :


(1934 – 2000)

వీరు నిజామాబాద్ జిల్లా భీంగల్ నివాసి. 'కవిరాజు' బిరుదాంకితుడు. శ్రీమన్నింబాచల మాహాత్మ్యం, శ్రీమన్నింబగిరినరసింహశతకం, శారదాగణితం, శ్రీలొంక రామేశ్వర శతకం ఈయన ఇతర రచనలు.

## ప్రవేశిక

*విశిష్టమైన సాహిత్య ప్రక్రియల్లో పద్యం ఒకటి. పద్యం ఛందోబద్ధమైంది. లయాత్మకంగా గానయోగ్యంగా ఉంటుంది. ధారణకు అనువుగా ఉంటుంది. అందుకే మన ప్రాచీన కవులు స్తుతులు, శాస్త్రవిషయాలు, నైతిక విషయాల్ని పద్యాల్లో చొప్పించి అందించారు. పద్య ప్రక్రియలో 'శతకం' ఒక విభాగం. మేలిముత్యాల్లాంటి శతక పద్యాలనుండి కొన్నింటిని ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం! పద్య రసానుభూతిని ఆస్వాదిస్తూ నైతిక విలువల్ని పెంపొందించుకుందాం....*

## I

మ॥ సిరిలేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్
గురుపాదానతి కేలనీగి చెవులందు న్వినిక్కి వక్త్రంబునన్
స్థిరసత్యోక్తి భుజంబులన్విజయమున్జిత్తం బునన్సన్మనో
హర సౌజన్యము గల్గిన న్సురభిమల్లా! నీతివాచస్పతీ! 1

– ఎలకూచి బాల సరస్వతి

ఉ॥ బీదలకన్న వస్త్రములు పేర్మినొసంగుము తుచ్ఛసౌఖ్యసం
పాదనకై యబద్ధముల బల్కకు, వాదములాడబోకు, మ
ర్యాదనతిక్రమింపకు, పరస్పరమైత్రి మెలంగు, మిట్టివౌ
వేదములంచెరుంగుము, వివేకధనంబిదినమ్ముచిత్తమా! 2

– శ్రీపతి భాస్కర కవి

### ఆలోచించండి-చెప్పండి

- 'సంపద లేకున్నా పండితుడు శోభిస్తాడు' అని ఎలా చెప్పగలవు?
- బీదలకు ఏమివ్వాలి?
- మంచి లక్షణాలేవి?
- 'మైత్రి' అనే పదానికి పర్యాయపదాలు చెప్పండి.

## II

ఉ॥ పట్టుగ నీశ్వరుండు తన పాలిట నుండిపుడిచ్చినంతలోఁ
దిట్టక దీనదేహులను తేటగ లాలనజేసి, యన్నమున్
పెట్టు వివేకి మానసముఁ బెంపొనరించుచు నూరకుండినన్
గుట్టుగ లక్ష్మిఁబొందుఁ; దరిగొండనృసింహా! దయాపయోనిధీ! 3

– తరిగొండ వెంగమాంబ

మ॥ తనదేశంబు స్వభాష నైజమతమున్ అస్మత్సదాచారముల్
తనదేహాత్మల నెత్తెఅంగున సదాతానట్లు ప్రేమించి, త
ద్ఘనతా వాప్తికి సాధనంబులగు సత్కార్యమ్ములన్ జేయఁగా
అనువౌబుద్ధి యొసంగుమీ ప్రజకు దేవా! భక్త చింతామణీ! 4

– వడ్డాది సుబ్బరాయకవి

### ఆలోచించండి-చెప్పండి

- ఎవరిని ఆదరించాలి? లక్ష్మి ఎప్పుడు వచ్చి చేరుతుంది?
- మంచి పనులకు అవసరమైన బుద్ధి అనగా ఏమిటో వివరించండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

## III

✿చ॥ అనయము దోషమే పరులయందు కనుంగొని పల్కునట్టి యా
జనుని కొగిన్ గుణగ్రహణశక్తి నశించును; మంచి మాత్రమే
జనములలోన చూడగల చక్కని చూపులు పల్కునాల్క నా
కెనయగనిమ్ము వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియ:పతీ! 5

– ఉత్పల సత్యనారాయణాచార్య

✿మ॥ ఇతిహాసామృత రుక్ప్రభా ధవళితంబీ భారతం బార్షసం
స్కృతి జీవత్సరిదంబు సేవితము; సాహిత్యస్వరానంద దీ
పితమున్ పావన భావనావహమహావేశంబె జాతీయతా
వ్రతమౌ ధర్మపరాయణర్షి పరివారా! విశ్వనాథేశ్వరా! 6

– గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ

### ఆలోచించండి - చెప్పండి

- *ఇతరులలో చూడవలసిందేమి?*
- *ఉత్పలవారు ఏం కోరుకొంటున్నారు?*
- *భారతదేశం గొప్పతనం ఏమి?*
- *'జాతీయతావ్రతం' అంటే మీరేమనుకుంటున్నారు?*

## IV

సీ॥ గుణమింత కుదురక గుళ్ళు తిరుగుటయేల?
సంస్కారమబ్బని చదువులేల?
చిత్తంబు నిలువని శివపూజలవియేల?
శాంతిగూర్చని యోగసాధనేల?
మంచిని పెంచని మలినమతము లేల?
హితబుద్ధి గలుగని వ్రతములేల?
అభ్యుదయము గాని ఆచారతతియేల?
తగురక్ష సేయని ధర్మమేల?

తే॥ దమము శమము కూడని జపతపము లేల?
స్వామి! నీభక్తి కలుగని జన్మమేల?
వరశుభ విలాస! శ్రీనింబగిరి నివాస!
భవ్యగుణధామ! నరసింహ! దివ్యనామ!! 7

– అందె వేంకటరాజం

✿శా॥ ఇల్లాలింటికి దీపమౌననగ హీహీయంచు మందుల్ మహా
భల్లూకాకృతి దోప నవ్వుదురు, దీవ్యద్వ్యోమగంగన్ జటా
వల్లిన్ నీవు ధరించుటన్ వినరొ, యెవ్వారైన మర్యాద వ
ర్ధిల్లన్ కాంతల జూడకున్న హితమా? శ్రీలొంక రామేశ్వరా! 8

– నంబి శ్రీధరరావు

### ఆలోచించండి - చెప్పండి

- *సంస్కారంలేని చదువు అంటే ఏమిటి?*
- *ఇంటికి దీపం ఇల్లాలని ఎందుకంటారు?*
- *కవి 'వృథా' అని వేటిని పేర్కొన్నాడు? దీనిపై మీ అభిప్రాయమేమిటి?*

భావాలు

1. నీతిలో బృహస్పతి అంతటి వాడవైన ఓ సురభిమల్లా! శిరస్సువంచి గురువుల పాదాలకు నమస్కరించేవాడు, దానగుణం కలిగినవాడు, చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినగలిగినవాడు, సత్యవ్రతుడైనవాడు, భుజబలంతో విజయాలను పొందేవాడు, మనసునిండా దయగలవాడైన పండితుడు సంపద లేకున్నా ప్రకాశిస్తాడు.

2. చిత్తమా! పేదవారికి అన్నదానం, వస్త్రదానం అధికంగా చేయుము. నీచమైన సుఖాలకోసం అబద్ధాలాడకు. అనవసరంగా ఎవరితోనూ వాదనకు దిగకు. మర్యాదమీరి, హద్దుమీరి ప్రవర్తించకు. అందరితో సఖ్యతతో మెలగు. ఈ సూత్రాలనే వేదాలుగా భావించు. వివేకులకు ఈ లక్షణాలే సంపదగా భాసిల్లుతాయి.

3. దయాసముద్రుడా! తరిగొండ నృసింహదేవా! వివేకి అయినవాడు తనకు భగవంతుడు ప్రసాదించిన దానిలో – అనాథలను నిరుపేదలను కసరుకోక ఆప్యాయతతో లాలిస్తూ అన్నంపెడతాడు. అలాంటి సహృదయుణ్ణి సంపదలకు అధిదేవత అయిన లక్ష్మి గుట్టుచప్పుడు కాకుండా వచ్చి వరిస్తుంది. దీనులకు చేసే అన్నదానానికి ఇంతటి ప్రాశస్త్యం ఉందని తాత్పర్యం.

4. భక్తుల పాలిట చింతామణియైన ఓస్వామీ! ఎవరైనా తన శరీరాన్ని ఆత్మను ఎట్లా అభిమానిస్తాడో, అలాగే తన దేశాన్ని, తన భాషను, మతాన్ని, ఆచారాన్ని కూడా అభిమానించేటట్లు, వాటి ఔన్నత్యానికి సాధనాలైన మంచి పనులను చేసేటట్లు తగిన బుద్ధిని ప్రజలకు ప్రసాదించు.

5. అఖిలాండనాయకా! లక్ష్మీవల్లభా! వేంకటపతీ! ఇతరుల్లో ఎల్లప్పుడూ తప్పులు వెతికేవానికి మంచిని గ్రహించేశక్తి సన్నగిల్లుతుంది. అందరిలోనూ మంచిని దర్శించే చూపులు, అందరితో మంచిగా మాట్లాడే నాలుక నాకివ్వుతండ్రీ! (వ్యక్తిత్వ వికాససూత్రం ఇందులో దాగిఉంది. సకారాత్మక ఆలోచన, సమ్యక్‌దృష్టి అనే శ్రేష్ఠ భావన అత్యంతావశ్యకం.)

6. ధర్మపరాయణులైన మహర్షులను పరివారంగా కలిగిన ఓ విశ్వనాథేశ్వరా! భారత దేశం వేదాల శోభతో ఇతిహాసాలనే అమృతంతో, అలరారుతున్నది. ఆర్ష సంస్కృతి అనే జీవనది నీటిచే సేవితమౌతున్నది. సాహిత్య స్వరానందంచేత శోభిల్లుతున్నది. పవిత్రమైన ఆలోచనలను తీవ్రంగా ఆవాహన చేసుకోవడమే భారతదేశానికి జాతీయవ్రతం.

7. నింబగిరిలో వెలసినదేవా! శ్రేష్ఠమైన శుభాలతో అలరారేవాడా! అత్యుత్తమ గుణాలు కలవాడా! నరసింహదేవా! మంచి స్వభావం లేకుండా ఎన్నికార్యాలు చేసినా ఏంలాభం? సత్ప్రవర్తన లేకుండా ఆలయాలు తిరగడం వృథా. సంస్కారం నేర్పని చదువు, చాంచల్య మనసుతో చేసే శివపూజ కూడా వ్యర్థమే! శాంతినివ్వని యోగసాధన, మంచినిపెంచని మతం, మేలుకోరని వ్రతం, చైతన్యం కల్గించని ఆచారాలు, లోకరక్షణచేయని ధర్మం వల్ల ప్రయోజనం శూన్యం. ఓ స్వామీ! బాహ్య, అంతరింద్రియ నిగ్రహం లేని జపతపాలు, నీమీద భక్తి లేని జన్మ వ్యర్థమే కదా!

8. ఓ రామేశ్వరా ! 'ఇల్లాలే ఇంటికి దీపం' అనే మాట వింటేనే అల్పజ్ఞానులు ఎలుగుబంట్లలాగా విరగబడి నవ్వుతారు. కానీ పవిత్రమైన ఆకాశగంగను నీవు తలపై దాల్చిన విషయం వారికి తెలియదేమో! ఎవరైనా స్త్రీని గౌరవించకపోవడం మంచిది కాదు కదా!


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాల గూర్చి మాట్లాడండి.**

అ) సంస్కారం

ఆ) వ్రతాలు

ఇ) ఆచారాలు

ఈ) దానగుణం

**2. పాఠంలోని పద్యాల ఆధారంగా కింది వాక్యాలకు తగిన పద్యపాదం గుర్తించండి.**

అ) ఎల్లప్పుడు ఇతరుల దోషాలను చూడటం.

ఆ) పేదవారికి ఆహారం, బట్టలు దానం చేయడం.

ఇ) సంపద రహస్యంగా వచ్చి చేరుతుంది.

**3. కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించండి.**

అ) ఇల్లాలింటికి .......................... రామేశ్వరా!

ఆ) సిరిలేకైన ........................ వాచస్పతీ!

**4. కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

సత్యసూక్తి ఘటించు, ధీజడిమ మాన్పు
గౌరవమొసంగు, జనులకుఁగలుషమడచు
కీర్తిప్రకటించు, చిత్త విస్ఫూర్తి జేయు
సాధుసంగంబు సకలార్థ సాధకంబు.

♦ ప్రశ్నలు

అ) సూక్తి అంటే ఏమిటి?

ఆ) కీర్తి ఎలా వస్తుంది?

ఇ) సాధుసంగం వల్ల ఏం జరుగుతుంది?

ఈ) ఈ పద్యానికి శీర్షిక సూచించండి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) వివేకి లక్షణాలేవి?

ఆ) సంపద ఎవరి వద్దకు వచ్చి చేరుతుంది?

ఇ) దేశభాషల ఔన్నత్యాన్ని పెంచడమంటే ఏంటి?

ఈ) "ఇతిహాసామృత..." అనే పద్యభావాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

**2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) సజ్జన లక్షణాలు పేర్కొనండి.

ఆ) నైతిక విలువలంటే ఏమిటి? మీరు గమనించిన విలువల్ని పేర్కొనండి.

**3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

ఎదుటి వారిలో తప్పులు వెతకటం కన్నా వారి నుండి మంచిని స్వీకరించటం మేలు అని తెలియజేస్తూ మిత్రుడికి లేఖ రాయండి.

(లేదా)

పాఠశాలలో జరిగే భాషోత్సవాన్ని తిలకించడానికి ప్రముఖ శతక కవులు వచ్చారు. వారి ద్వారా శతకాల గురించి, వారి రచనల గురించి తెలుసుకోవడానికి పిల్లలు ఇంటర్వ్యూ చేయాలనుకున్నారు. మీరైతే ఏమని ఇంటర్వ్యూ చేస్తారు? ఇంటర్వ్యూకు అవసరమైన ప్రశ్నావళిని రూపొందించండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు అర్థాలు రాసి వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా॥ బుధుడు = పండితుడు

బుధులతో కలిసి ఉండడం వల్ల జ్ఞానం పెరుగుతుంది.

అ) అనయం =

______________________________________________

ఆ) శమం =

______________________________________________

ఇ) మైత్రి =

______________________________________________

ఈ) సౌజన్యం =

______________________________________________

**2. కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి.**

అ) విశ్వనాథుడు    ఆ) శివుడు    ఇ) శ్రియ:పతి

**3. కింది పదాలకు పర్యాయ పదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా ॥ గంగ – భాగీరథి, జాహ్నవి

భాగీరథి తీరంలో ఋషులు తపస్సు చేస్తున్నారు. పరమ పావనిగా జాహ్నవి పేరు గాంచింది.

అ) శివుడు –

ఆ) మైత్రి –

ఇ) కాంత –

ఈ) గుడి –

**4. కింది వాక్యాలను గమనించండి. ఆయా వాక్యాల్లోని ప్రకృతి వికృతుల్ని గుర్తించి పట్టికగా కూర్చండి.**

అ) భారతీయ ధర్మం సర్వోత్కృష్టమైంది. బుద్ధుడు దమ్మాన్ని బోధించాడు.

ఆ) ఓ సామి! కుడివైపుగా వెళ్తే స్వామి వారి గుడివస్తుందా?

ఇ) సిరిని కురిపించి లక్ష్మీదేవి శ్రీమంతుల్ని చేస్తుంది.

ఈ) ఆలోచనలు స్థిరంగా ఉండాలి. తిరమైన బుద్ధి వివేకుల లక్షణం.

## వ్యాకరణాంశాలు

**1. కింది సందర్భాలలో పునరుక్తమయిన హల్లులను పరిశీలించండి. అవి వృత్త్యనుప్రాస అలంకారాలవునో కాదో చర్చించండి.**

అ) నీ కరుణాకటాక్ష వీక్షణములకై నిరీక్షించుచున్నారము.

ఆ) అడిగెదనని కడువడిఁజను
నడిగినఁదను మగుడనుడుగడని నడయుడుగున్.

ఇ) మకరంద బిందు బృంద రసస్యందన మందరమగు మాతృభాషయే.

ఈ) చూరుకు, తేరుకు, యేరుకు, నారకు, దారువును వాడు నరవరులిలలోన్.

## విసర్గసంధి :

**2. సంస్కృత పదాల మధ్య విసర్గ మీద తరచు సంధి జరుగుతూంటుంది. అది వేర్వేరు రూపాలుగా ఉండటం గమనిద్దాం. కింది ఉదాహరణలు విడదీసి చూడండి.**

అ) నమోనమః

ఆ) మనోహరం

ఇ) పయోనిధి

ఈ) వచోనిచయం

- **పై పదాలను విడదీస్తే – ఈ కింద విధమైన మార్పులు జరిగాయా?**

| | |
|---|---|
| అ) నమః + నమః<br>ఆ) మనః + హరం<br>ఇ) పయః + నిధి<br>ఈ) వచః + నిచయం | అకారాంత పదాల విసర్గకు శ, ష, స లు, వర్గ ప్రథమ, ద్వితీయాక్షరాలు (క, ఖ, చ, ఛ, ట, ఠ, త, థ, ప, ఫ లు) గాక మిగతా అక్షరాలు కలిస్తే – అకారాంత పదాల మీదున్న విసర్గ లోపించి, అకారం 'ఓ'కారంగా మారింది. |

- **కింది పదాలు కలిపి, మార్పును గమనించండి.**

అ) మనః + శాంతి

ఆ) చతుః + షష్టి

ఇ) నభః + సుమం

- పదాలను కలుపగా వరుసగా మనశ్శాంతి, చతుష్షష్టి, నభస్సుమం అనే రూపాలు ఏర్పడ్డాయి కదా! (విసర్గమీద శ, ష, స లు ద్విత్వాలుగా మారడం గమనించండి.)

- **కింది పదాలను విడదీయండి.**

అ) ప్రాతఃకాలము

ఆ) తపఃఫలము

- 'స' కారం (స్) విసర్గరూపంగా ప్రయోగింపబడుతుంది. అందుకే నమస్కారము, శ్రేయస్కరము, వనస్పతి మొదలగు సందర్భాల్లో మార్పులేదు.

- **కింది పదాలను కలిపి, మార్పును గమనించండి.**

ఉదా॥ అంతః + ఆత్మ = అంతరాత్మ

| | | | |
|---|---|---|---|
| అ) దుః + అభిమానం | = | ________ | అంతః, దుః, చతుః, ఆశీః, పునః మొదలైన పదాలకు వర్గప్రథమ, ద్వితీయాక్షరాలు, శ, ష, సలు గాక మిగతా అక్షరాలు కలిస్తే విసర్గ రేఫ (ర్) గా మారడం గమనించండి. |
| ఆ) చతుః + దిశలు | = | ________ | |
| ఇ) ఆశీః + వాదము | = | ________ | |
| ఈ) పునః + ఆగమనం | = | ________ | |
| ఉ) అంతః + మథనం | = | ________ | |

- **కింది పదాలు విడదీయండి.**

ఉదా॥ ధనుష్కోటి = ధనుః + కోటి ( ధనుస్ + కోటి )
అ) నిష్ఫలము = ________ (        )
ఆ) దుష్కరము = ________ (        )

ఇస్, (ఇః), ఉస్ (ఉః)ల విసర్గకు క, ఖ, ప, ఫ లు పరమైనప్పుడు విసర్గ (స్) 'ష' కారంగా మారుతుంది.

- **కింది పదాలు విడదీయండి.**

ఉదా॥ నిస్తేజము = నిః + తేజము
అ) దుశ్చేష్టితము = ________ + ________
ఆ) ధనుష్టంకారము = ________ + ________
ఇ) మనస్తాపము = ________ + ________

విసర్గకు చ, ఛ లు పరమైతే 'శ' ట, ఠ లు పరమైతే 'ష' త, థ లు పరమైతే 'స' వస్తుంది.

- పై ఉదాహరణలన్నీ పరిశీలించిన మీదట **విసర్గ సంధి** ఆరు విధాలుగ ఏర్పడుతున్నదని తెలుస్తున్నది.

i) అకారాంత పదాల విసర్గకు వర్గ ప్రథమ ద్వితీయాక్షరాలు (క, చ, ట, త, ప; ఖ, ఛ, ఠ, థ, ఫ), శ, ష, స లు గాక మిగతా అక్షరాలు పరమైనప్పుడు విసర్గలోపించి 'అ'కారం 'ఓ' కారంగా మారుతుంది.

ii) విసర్గకు శ, ష, స లు పరమైనప్పుడు శ, ష, స లు ద్విత్వాలుగా మారుతాయి.

iii) విసర్గమీద క, ఖ, ప, ఫ లు వస్తే, మార్పురాదు (సంధి ఏర్పడదు).

iv) అంతః, దుః, చతుః, ఆశీః, పునః మొదలైన పదాల విసర్గ రేఫ (ర్) గా మారుతుంది.

v) ఇస్, ఉస్‌ల విసర్గకు క, ఖ; ప, ఫ లు పరమైతే విసర్గ 'ష' కారంగా మారుతుంది.

vi) విసర్గకు, చ, ఛ లు పరమైతే 'శ' కారం; ట, ఠ లు పరమైతే 'ష' కారం; త, థ లు పరమైతే 'స' కారం వస్తాయి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ పాఠశాల గ్రంథాలయంలో శతక పద్యాలున్న పుస్తకాలు తీసుకొని చదవండి. వాటిలో ఏవైనా ఐదు శతక పద్యాలను వాటి భావాలను రాసి ప్రదర్శించండి.

### సూక్తి

జ్ఞానం పెన్నిధి వంటిది.
అది జ్ఞాతులు పంచించి తీసుకోడానికి వీలులేనిది.
దొంగలు అపహరించలేనిది.
దానం చేసినా తరగనిది.
అది ఓ అనర్ఘ రత్నం.

– చాణక్యనీతి

చదవండి-తెలుసుకోండి

# మహాత్మాగాంధీ బోధనలు

**సత్యం :**

ప్రపంచానికి బోధించటానికి నా వద్ద కొత్త ఏమీ లేదు. సత్యాహింసలు పర్వతాలంతటి ప్రాచీనమైనవి.

సత్యాహింసలే నా మతం. సత్యం నా భగవంతుడు. ఆయనను ప్రసన్నం చేసుకోవటానికి అహింస మార్గం.

సత్యమనేది, నీవు ఎంత ఎక్కువగా పోషిస్తే అంత ఎక్కువగా ఫలాలిచ్చే విశాల వృక్షం వంటిది. సత్యమనే గనిలో ఎంతలోతుగా అన్వేషిస్తే అక్కడ నిక్షిప్తమైవుండి దొరికే వజ్రం అంత విలువైనదిగా వుంటుంది. ఇతోధిక సేవా మార్గాలకు దారులు కనిపించవచ్చు.

నా జీవితమంతటా, సత్యంపై ధృఢంగా నిలబడటం రాజీయొక్క సౌందర్యాన్ని మెచ్చుకోవటం నాకు నేర్పింది. ఈ భావన సత్యాగ్రహం (అహింసా ప్రతిఘటన)లో తప్పనిసరి భాగమని ఉత్తరోత్తర జీవితంలో నేను చూడగలిగాను.

నిలకడవున్న వ్యక్తిగా కనిపించేందుకు నేనెప్పుడూ శ్రద్ధచూపలేదు. నా సత్యాన్వేషణ ప్రయత్నంలో అనేక భావాలను విడనాడాను. అనేక కొత్త విషయాలు నేర్చుకున్నాను. నా వయోభారం పెరిగే కొలది నా అంతర్గత వృద్ధి ఆగిపోతుందని గాని లేదా మాంసం కరిగిపోవటంతో నా వృద్ధి ఆగిపోతుందనే భావనగాని నాకు లేదు. నేను ఆలోచిస్తున్నదల్లా సత్యం. నా భగవంతుడు క్షణక్షణానికి యిచ్చే పిలుపును శిరసావహించేందుకు నా సంసిద్ధత గూర్చే.

సత్యం స్వభావరీత్యా స్వయం ప్రదర్శితం. దానిని ఆవహించివున్న అజ్ఞానమనే సాలెగూళ్ళను నీవు తొలగించగలిగితే అది స్పష్టంగా ప్రకాశిస్తుంది.

**అహింస :**

నేను నాలో ఉన్నట్లు చెప్పుకునే ఏకైక సుగుణం సత్యం, అహింస. మానవాతీత శక్తులున్నట్లు నేను చెప్పుకోజాలను. అటువంటివాటిని నేను కోరుకోను. నాతోటి మానవులలో దుర్బలుని శరీరముకున్న దుష్టమాంసఖండములే నా శరీరమునకూ ఉన్నవి. అందువల్ల అందరిలాగే నేనూ తప్పు చేయవచ్చును. నా సేవలకు అనేక పరిమితులున్నవి.

అహింస మానవాళికి అందుబాటులో ఉన్న గొప్ప శక్తి. అహింస రూపుదిద్దుకోవలసిన లేదా పాటించమని ఆదేశించవలసిన గుణం కాదు. అది అంతర్గతంగా వృద్ధిచెందేది. ఒక వ్యక్తి చేసే తీవ్రమైన ప్రయత్నంపై దాని మనుగడ ఆధారపడి ఉంటుంది.

మన సూత్రాలను ఇతరులు గౌరవించాలని మనం ఎలా ఆశిస్తామో తమ సూత్రాల పట్ల అదే పరిగణనకు ప్రత్యర్థికూడా పాత్రుడు. ప్రత్యర్థులను గెలుచుకోవటానికి మనం ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకోవాలని అహింస కోరుతుంది.

**క్రమశిక్షణ – విధి నిర్వహణ :**

జీవిత ముఖ్య ప్రయోజనం సక్రమంగా జీవించడం, సక్రమంగా ఆలోచించడం, సక్రమంగా వ్యవహరించడం.

మనం ఏదైనా గొప్పదైన, శాశ్వతమైనదానిని సాధించే ముందు కఠినమైన, ఉక్కు క్రమశిక్షణ ఉండి తీరాలి. ఆ క్రమశిక్షణ కేవలం విద్యాసంబంధమైన వాదన నుండి, హేతువుకు, తర్కానికి విజ్ఞప్తి చేయటం ద్వారా రాదు. క్రమశిక్షణను ప్రతికూలత అనే పాఠశాలలోనే నేర్చుకోవాలి.

సంతృప్తి ప్రయత్నంలో వుంటుంది గాని సాధించటంలో వుండదు. సంపూర్ణ కృషి సంపూర్ణ విజయాన్నిస్తుంది.

నిరంతర అభివృద్ధి జీవిత సూత్రం. నిలకడగా వున్నట్లు కనిపించే నిమిత్తం తన పిడివాదాలను కాపాడుకునేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నించే మనిషి తనను తాను బూటకపు స్థితిలోకి నెట్టుకుంటున్నాడు.

హక్కులకు సిసలైన మూలం విధి. మనందరం గనుక మన విధులను నిర్వర్తించినట్లయితే హక్కును పొందటం దూరం కాజాలదు. విధులు నిర్వర్తించకుండా హక్కుల వెంట మనం పరుగెడితే అవి అగమ్య గోచరంగా మన నుండి తప్పించుకుంటాయి. మనం ఎంతగా వాటి వెంట పడితే అవి అంతగా దూరం ఎగిరిపోతాయి.

తన విధులు సవ్యంగా నిర్వర్తించే వ్యక్తికి హక్కులు వాటంతట అవే సమకూరుతాయి.

**ధైర్యం - దృఢ విశ్వాసం :**

ధైర్యం అనేది కండర సంబంధమైన పదార్థంగా ఎవ్వరూ ఎన్నడూ చెప్పలేదు, అది హృదయానికి సంబంధించింది. అతి గట్టి కండరం కూడా ఊహాజనితమైన భయం ముందు వణికిపోతుందని మనకు తెలుసు. కండరాన్ని వణికించేది హృదయం.

శారీరక దారుఢ్యం నుండి బలం చేకూరదు. అది మొక్కవోని సంకల్పం నుండి వస్తుంది.

బలానికి సంయమనాన్ని, మర్యాదను జత చేసినపుడు అది ప్రబలమవుతుంది.

ప్రపంచంలో చూడాలని నీవు కోరుకుంటున్న మార్పు నీలో రావాలి.

**నమ్రత :**

అహింసా స్ఫూర్తి విధిగా నమ్రతకు దారి తీస్తుంది.

నమ్రత అనేది ప్రత్యేకించి పాటించేటటువంటిది కాదు. ఎందుకంటే, అది ఉద్దేశపూర్వకంగా ఆచరించటానికి ఉద్దేశించింది కాదు. అయితే అది 'అహింస'కు తప్పనిసరి పరీక్ష. ఎవరిలోనైతే 'అహింస' వుంటుందో వినయం అతని స్వభావంలో భాగమవుతుంది.

తప్పులు చేయనివారు ఎవరూ వుండరు - దైవాంశ సంభూతులైనా సరే. తప్పిదాలు లేకపోవటం వల్ల వారు దైవాంశసంభూతులు కాలేదు. తమ తప్పులను తాము తెలుసుకోవటం వలన, వాటిని దిద్దుకోవటానికి కృషిచేయటం వలన, వాటిని దాచుకోక పోవటం వలన, తమను తాము దిద్దుకోవటానికి ఎల్లప్పుడూ సంసిద్ధులుగా వుండటం వలన వారు దైవాంశ సంభూతులైనారు.

మరో వ్యక్తి ఆలోచనలు చెడ్డవని, మనవి మాత్రమే మంచి ఆలోచనలని చెప్పటం, మన అభిప్రాయాలకు భిన్నమైన వాటిని కలిగి వున్నవారు దేశానికి శత్రువులని చెప్పడం దురలవాటు.

**సహనశీలత - అస్పృశ్యత :**

అసహనం అనేది కూడా ఒక హింసారూపం. నిజమైన ప్రజాస్వామిక భావన వృద్ధిచెందటానికి ప్రతిబంధకం. మనం నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తిని అలవరచుకోవాలంటే మనం అసహన పరులుగా వుండకూడదు. అసహనం ఒకని లక్ష్యంలోగల విశ్వాస వాంఛను దెబ్బతీస్తుంది.

ఇతరులు మనలను చూస్తున్నట్లుగా మనల్ని మనం చూసుకోవటం మంచిది. మనం ప్రయత్నించినా, మనల్ని మనం సంపూర్ణంగా ఎన్నడూ తెలుసుకోలేము. ముఖ్యంగా మనలోని దుష్టపార్శ్వాన్ని అసలు తెలుసుకోలేము. మనలను విమర్శించేవారిపట్ల ఆగ్రహం చెందకుండా వున్నప్పుడు ఆ పని మనం చేయగలుగుతాము. వారు ఏమి చెప్పినప్పటికీ సహృదయంతో స్వీకరించాలి.

**స్వేచ్ఛ - ప్రజాస్వామ్యం :**

అంతర్గత ప్రమాదాలు లేనటువంటి మానవ వ్యవస్థ వుండదు. వ్యవస్థ ఎంత పెద్దదైతే దుర్వినియోగ అవకాశాలు అంత హెచ్చుగా వుంటాయి. ప్రజాస్వామ్యం గొప్ప వ్యవస్థ. అందువల్ల అది ఎక్కువగా దుర్వినియోగానికి గురి అయ్యే అవకాశముంది. కనుక దానికి పరిష్కారం ప్రజాస్వామ్యాన్ని తప్పించటం కాదు, దుర్వినియోగ అవకాశాన్ని కనీసస్థాయికి తగ్గించటమే.

ప్రజాస్వామ్యం సారాంశం ఏమంటే, అందరి సమిష్టి ప్రయోజనానికి సేవచేయటంలో అన్ని విభాగాల ప్రజల యావత్ భౌతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక వనరులను సమీకరించే కళ, శాస్త్రం అని అర్థం.

# 6 నేనెరిగిన బూర్గుల

– పి.వి.నరసింహారావు

## చదవండి – ఆలోచించి చెప్పండి.

*సహనమ్ము, సత్యమ్ము, శాంతగంభీరమ్ము,*
*ఆత్మవిశ్వాసమ్ము, నహరహరము*
*సాధన, దక్షత, సాధుభాషణమును,*
*సద్వివేచనమును, సద్గమనము,*
*దానమ్ము, ధైర్యమ్ము, త్యాగమ్ము, సునిశిత*
*బుద్ధి, మేల్గాంచుట, పుణ్యగుణము,*
*కరుణ, క్షమ, పరోపకారబుద్ధియనెడి*
*యాలోచనారీతు లమరియుండు*
*మనుజులెపుడును మాన్యులు, మంగళస్వ*
*రూపులు, మహోన్నతులు, విరాడ్రూపశోభి*
*తులు, సుకీర్తికాంతవరపతులు, సుమతులు,*
*జగతిగతి విరచితులు, సజ్జనులువారు.*

**ప్రశ్నలు:**

1. ఈ పద్యం దేన్ని గురించి చెబుతున్నది?
2. ఈ పద్యం ద్వారా గుర్తించిన లక్షణాలేవి?
3. మంచి లక్షణాలు కలిగిన వారినేమంటారు?
4. అలాంటివారి గురించి ఎందుకు తెలుసుకోవాలి? వారితో ఎందుకు సాంగత్యం చేయాలి?

## పాఠ్యాంశ ఉద్దేశం

సమాజంలో కొద్దిమందే ప్రభావశక్తి సంపన్నులు ఉంటారు. ఈయన సాంగత్యంపొందినా, ఈయన గురించి తెలుసుకున్నా, స్ఫూర్తి కలుగుతుంది. మంచిమార్గంలో నడవడానికి అవకాశం కలుగుతుంది. ఇలా స్ఫూర్తిదాయకులైన వారిలో బూర్గుల రామకృష్ణారావు ఒకరు. ఈయన హైదరాబాదు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసి, రాజనీతిజ్ఞులుగా, బహుభాషావేత్తగా, పరిపాలనాదక్షులుగా పేరెన్నికగన్నాడు. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేలా పి.వి.నరసింహారావు వ్యాసం రాశాడు. మహోన్నత వ్యక్తిత్వాల నుండి స్ఫూర్తి పొందడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

**అభినందన వ్యాసం :** గొప్పవారి జీవితాన్ని, వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తూ ప్రశంసిస్తూ రాసిన వ్యాసమే అభినందన వ్యాసం.

**పాఠ్యపరిచయం :** ఈ వ్యాసం 'ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక' (డిసెంబర్, 1972) లోనిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరున్న 'పదవిజ్ఞానం' పట్టికలో వెతకండి. లేదా నిఘంటువును చూసి తెలుసుకోండి.

## రచయిత పరిచయం



**(1921 – 2004)**

భారత ప్రధానిగా, బహుభాషావేత్తగా, భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహులుగా పేరొందిన పి.వి.పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. వరంగల్లు జిల్లా నర్సంపేట మండలంలోని లక్నేపల్లి గ్రామంలో జన్మించాడు. కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామస్థులు రుక్మిణమ్మ, రంగారావుగారలకు దత్తపుత్రుడు. స్వామి రామానంద తీర్థ పి.వి.కి రాజకీయ గురువు. బూర్గులవారు గురుతుల్యులు.

విద్యార్థిదశలోనే హైద్రాబాద్ విముక్తి పోరాటంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరణకు గురైనాడు. 1938లో హైద్రాబాద్ రాష్ట్రకాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ఆరంభించాడు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో బహుకాలం మంత్రిగాను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగాను, భారతప్రధానిగాను విశిష్టమైన సేవలందించాడు. చతురతతో భారత రాజకీయయవనికపై ఒక వెలుగు వెలిగిన రాజనీతిజ్ఞులు.

తెలుగు భాషతో సహా హిందీ, ఉర్దూ, ఆంగ్లం, మరాఠీ మొదలగు 17 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన బహుభాషావేత్త. తెలుగులో 'కాకతీయ' అనే పత్రికను నడిపించాడు. విశ్వనాథ 'వేయిపడగలు' నవలను హిందీలోకి "సహస్రఫణ్" అనే పేరుతో అనువదించాడు. దీనికి కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఈయన ఆత్మకథగా ప్రసిద్ధికెక్కిన 'ది ఇన్‌సైడర్' అనేక భాషల్లో అనువదించబడింది. 'పన్‌లక్షత్‌కొన్‌ఘతో' అనే మరాఠి పుస్తకాన్ని తెలుగులో 'అబలా జీవితం'గా ఈయన అనువదించాడు.

నిరాడంబరజీవితం, నిజాయితీ, దేశభక్తి కలిగిన పి. వి. నరసింహారావు జీవిత పర్యంతం నిండుకుండలా స్థితప్రజ్ఞుడిగా వెలిగాడు.

## ప్రవేశిక

*ప్రతి మానవునిలోనూ సాధారణంగా ఉన్నదానికంటే తనను గురించి ఘనంగా చిత్రించుకొనే స్వభావం ఉంటూ ఉంటుంది. ఇందుకు భిన్నంగా ప్రవర్తించేవారు బహు అరుదుగా ఉంటారు. రకరకాల ఒడిదుడుకులను ఎదుర్కొన్నా, విపత్కర పరిస్థితులు సేనావాహినిలా చుట్టుముట్టినా చలించకపోవడం, మనఃస్థైర్యాన్ని, సమచిత్తాన్ని విడనాడక పోవడం గొప్పవారికే సాధ్యమౌతుంది. జయాపజయాలను సమానంగా స్వీకరించడం, మిత్రులుసైతం ద్రోహం తలపెట్టినా, ప్రత్యర్థులు దూషించినా "సరే! ఇవన్నీ ఆటలో భాగమేగా!" అని స్థితప్రజ్ఞతను ప్రదర్శించడం అందరికీ సాధ్యమౌతుందా? మరి ఇటువంటి వ్యక్తిత్వం కలిగిన వారు ఎవరు? ఈ పాఠం ద్వారా తెలుసుకోండి.*

## I


*డా॥ బూర్గుల రామకృష్ణారావు*

స్వర్గీయ డా.బూర్గుల రామకృష్ణారావు గారి 5వ వర్ధంతి సందర్భంలో వారిని గురించి వ్యాసమేదైనా యివ్వవలసిందిగా మిత్రులు కొందరు నన్ను కోరారు. డా.రామకృష్ణారావు గారి పేరు వినగానే గత స్మృతులెన్నో ముప్పిరిగొని భావోద్రేకంతో నా మనస్సు ఉక్కిరిబిక్కిరైపోతూ ఉంటుంది. నా భావాలన్నింటిని యీ వ్యాసంలో వివరించడం ఎలాగ? అవన్నీ వ్రాస్తే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. అందుకని రేఖామాత్రంగా నా భావాలను యిక్కడ పొందుపరుస్తాను.

కీ.శే.డా.రామకృష్ణారావుగారిని గురించి చరిత్రకారులు ఏమి వ్రాస్తారో మనం తేలికగానే ఊహించుకోవచ్చు. "డాక్టరు రామకృష్ణారావుగారు ఫలాన తేదీన ఫలాన గ్రామంలో పుట్టారు. పూనాలోని ఫెర్గూసన్ కాలేజి నుండి పర్షియన్ భాష ఐచ్ఛిక విషయంగా తీసుకొని పట్టభద్రులయ్యారు. పర్షియన్ ట్యూటరుగ కొంతకాలం పనిచేశారు. తరువాత న్యాయవాద పట్టా పొంది ఫలానా సంవత్సరంలో న్యాయవాదిగా నమోదు అయ్యారు. ఇన్ని సంవత్సరాలు న్యాయవాదిగా పనిచేసారు. ఇన్ని ప్రజా ఉద్యమాలలో ఇన్నిసార్లు సత్యాగ్రహం జరిపి జైలుకు వెళ్ళారు. హైదరాబాదు స్టేటు కాంగ్రెసులో వారొక ప్రముఖ నాయకులు. మంత్రిగాను, ముఖ్యమంత్రిగాను, రెండు రాష్ట్రాలకు గవర్నరుగాను పని చేశారు. కొంతకాలం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. అనేక

కమిటీలకు, కమీషన్లకు అధ్యక్షులుగా ఉన్నారు. గుండెపోటు వలన 1967 సెప్టెంబరు 14వ తేదీన కన్నుమూశారు" మొదలయిన అంశాలు వ్రాస్తారు. చారిత్రికంగాను, కాలక్రమ ప్రకారంగాను అది అంతా నిజమే. కాని, అంతమాత్రం చేత డా.రామకృష్ణారావుగారి అసలు వ్యక్తిత్వం మనకు అవగతం కాదు.

ప్రతి మానవునిలోను సాధారణంగా ఉన్నదానికంటే ఘనంగా తనను గురించి చిత్రించుకొనే స్వభావం ఉంటూ ఉంటుంది. దానిని గురించి వాని అంతరాత్మ బోధిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ తాను చిత్రించుకొన్న ఆ కృత్రిమ ఘనతను ఇతరుల ముందు ప్రదర్శించి ఇతరులకంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, వెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంది. తత్ఫలితంగా ఒకరినొకరు కించపరుచుకొంటూ తమ శక్తి సామర్థ్యాలను, అమూల్య సమయాన్ని వ్యర్థపరుచుకొంటూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. కాని యిందుకు డా.రామకృష్ణారావుగారు మాత్రం అరుదుగా కనవచ్చే ఒక చక్కని మినహాయింపు అని చెప్పవచ్చు. వారెల్లప్పుడు అన్ని విషయాలు ఆఖరికి తమలోని లోపాలను కూడా ఉన్నవి ఉన్నట్లుగా చెపుతూ వుండేవారు. ఎంత ఉంటే అంతే. వీసం ఎత్తు ఎక్కువాలేదు, వీసం ఎత్తు తక్కువా లేదు.

వారి పొట్టితనం కొంతవరకు వారిని మరుగుపరుస్తూ ఉండేదని కొంతమంది అంటారు. కాని అంతకంటే సత్యదూరమైన విషయం మరొకటి లేదని నా భావన. నిజానికి ఒడ్డూ పొడుగూ ఉన్న చాలామందికంటే కూడ వారు అతి చక్కగా గుర్తింపబడుతూ ఉండేవారు. తమ వామన రూపాన్ని గురించి స్నేహపూరితమైన ఎన్నో పరిహాసాలను వారే స్వయంగా చక్కటి భావనిర్లిప్తతతో చెప్తూ ఉండేవారు. లోగడ మన దేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన ప్రొఫెసర్ గాల్‌బ్రైత్ అసాధారణ పొడగరితనం కంటె డా.రామకృష్ణారావు గారి పొట్టితనం వారిని ఏమాత్రం మరుగుపరచలేదు. పూర్వపు హైదరాబాదు సంస్థాన ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా.రామకృష్ణారావు గారు బేగంపేట విమానాశ్రయంలో అరేబియారాజు ఇబన్‌షాఉద్‌ను పుష్పమాలాలంకృతునిగా చేసిన సందర్భంగా అతిథి ఆతిథేయులిర్వురు పరస్పర సౌజన్య సౌహార్ద్రాలతో ఎటువంటి ఫీటు చేయవలసి వచ్చిందో ఆ వినోదకర దృశ్యం యిప్పటికీ చాలా మందికి జ్ఞాపకముండే ఉంటుంది. అలాగే ఒక విందు సందర్భంలో ప్రొ.గాల్‌బ్రైత్, డా.రామకృష్ణారావు గార్ల ఫొటో తియ్యడం ఫొటోగ్రాఫర్ల కళానైపుణ్యానికొక గీటురాయి అయి ఆ సందర్భానికొక చక్కని వినోదాన్ని చేకూర్చింది.

**ఆలోచించండి - చెప్పండి**

- *భావోద్వేగంతో ఉక్కిరి బిక్కిరికావటమంటే ఏమిటి?*
- *వ్యక్తిత్వం అవగతం కావటమంటే ఏమిటి? మీ వ్యక్తిత్వం గురించి మాట్లాడండి.*
- *అంతరాత్మ బోధించడం అంటే ఏమిటి? మీకు ఎప్పుడైనా ఇలాంటి అనుభవం ఎదురైందా? ఎప్పుడు?*
- *ఇతరులకంటే తాను అధికుడనని-పించుకోవాలనే ఉబలాటం. వెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. ఈ వాక్యం ద్వారా మీరేమి గ్రహించారు?*
- *సత్యదూరమైన విషయం అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?*

## II

### అవసరమైతే విరాట్ రూపం....

వారు గుర్తించబడడానికి, గుర్తించబడకపోవడానికి వారి శరీరాకృతి కారణం కానేలేదు. అంతకన్న గహనమైన దేదో వారి వ్యక్తిత్వంలో వుండి ఉండాలి. ఏదో నిత్య నైమిత్తికంగా (**routine**) వారు గుర్తించబడడంకాని, గుర్తించబడకపోవడం గాని జరుగలేదు. అవసరం వచ్చినప్పుడు వారు అలనాటి వామనమూర్తివలె ఇంతింతై ముల్లోకాలు ఆక్రమించి తమ విరాట్ రూపాన్ని ప్రదర్శించేవారు. పని పూర్తి అయిన వెంటనే తిరిగి తమ వామన రూపంలో ఇమిడిపోతూ ఉండేవారు,

మరొక అవసరం వచ్చేవరకు. అందుచేత వారు కావాలని నిరాడంబరంగా తెరమరుగున ఉండడం జరుగలేదు. అసలు రహస్యం ఏమిటంటే చిన్న మూర్తిలో యిమిడి ఉన్న వారి బహుముఖ ప్రతిభాయుత మూర్తిమత్త్వం అవసరం వచ్చినప్పుడు తమ మహోన్నత రూపంలో ప్రదర్శితం కావడం, అవసరం తీరగానే తిరిగి స్వస్వరూపంలో యిమిడిపోవడం అనేది వారి స్వభావంలోనే ఉంది. విచిత్రం ఏమిటంటే డా.రామకృష్ణారావుగారి వ్యక్తిత్వపు మహోన్నత శిఖరాలు దాని అగాధపు లోతులలోనే పరిలక్షితమౌతూ ఉండేవి.

## న్యాయవాదిగా

న్యాయవాదిగా వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలుండేవి. వారి ప్రాక్టీసు **roaring practice** (క్షణం తీరికలేనిది) అని చెప్పడానికి వీలులేదు. అలా అని వారికి కేసుల కొరత ఎప్పుడూ ఉండేదికాదు. కాని వాటిలో ఎక్కువ కేసులు రాజకీయాలకు సంబంధించినట్టివి. ఫీజు లేనట్టివీను. ప్రజాహిత జీవితం కొందరు న్యాయవాదులకు ఫైలు పెరగడానికి, ధనసంపాదనకు ఉపకరిస్తే, డా.రామకృష్ణారావుగారి విషయంలో మాత్రం అది తారుమారైంది. వారి వద్దకు వచ్చే క్లయింట్లలో చాలామందికి ఒక రకమైన మిశ్రిత భావం ఉంటూ ఉండేది. డా.రామకృష్ణారావుగారి శక్తిసామర్థ్యాలు, ప్రజ్ఞా ప్రాభవాలలో సంపూర్ణ విశ్వాసానికి తోడు వారు రాజకీయ వ్యగ్రతవలన కేసులమీద ఎక్కువ ధ్యానముంచలేరేమో అన్న అనుమానంకూడా ఆ క్లయింట్ల మనస్సులలో ఉంటూ ఉండేది. నిజానికి రామకృష్ణారావుగారికి కేసును క్షుణ్ణంగా చదివి తయారవడానికి అవకాశమే ఉండేదికాదు. కేసు చేపట్టేటప్పుడే వారు విషయమంతా శ్రద్ధగా విని ఆ కేసు తాలూకు ఫైలు యొక్క వెనుక అస్పష్టమైన నోటులను కొన్నిరేఖామాత్రంగా వ్రాసిపెట్టుకొనే వారు అంతే. నిజానికి వాటిని కేసుకు తయారీ అనడానికి వీలు లేదు. కాని కోర్టులో ఆ రేఖామాత్రపు నోట్సే డా.రామకృష్ణారావుగారి జాజ్జ్వల్యమానమైన ప్రతిభా విశేషతతో ఎదుటి న్యాయవాదుల వాదనాఘాతములకు దుర్భేద్యమైన కంచుగోడలుగా నిలవడం నేను స్వయంగా చూచాను. న్యాయవాద వృత్తిలో నిష్ణాతమైన సునిశిత మేధాసంపత్తిని వారు ప్రదర్శిస్తున్నారా అన్నట్లుగా ఉండేది వారి అనన్యమైన వాదనా పటిమ.

## ప్రోత్సాహం

సీనియర్ న్యాయవాదిగా వారిదొక ప్రత్యేక తరహా. నేను వారివద్ద అందరికంటె జూనియర్‌గా ఉండేవాడిని. కాని తల్లికి తన కడగొట్టు బిడ్డపై ఎటువంటి విశేషమమకారం ఉంటుందో అటువంటి మమకారమే డా.రామకృష్ణారావుగారికి నామీద ఉంటూ ఉండేది. చొరవతోను, నిరాఘాటంగాను, నేను వారి ఆఫీసును ఒక న్యాయవాద కాఫీ పానశాలగా పరిగణించి నాకు కావలసిన కేసులను – ముఖ్యంగా జూనియర్లకు కొరుకుడుపడని చిక్కు కేసులను – స్వయంగా ఏరుకొని చదువుతూ ఉండేవాడిని. నా యీ చొరవ వారి సీనియర్ గుమాస్తాకు కోపకారణమై ఆయన నామీద కారాలు మిరియాలు నూరుతూ ఉండేవాడు. ఒకసారి డా.రామకృష్ణారావుగారు దానిని గమనించి నా చేష్టపై తమ ఆమోదముద్ర వెయ్యడం, అంతటితో కారాల మిరియాల ప్రకరణం ముగియడం జరిగింది. అప్పటినుండి మా యిరువురి మధ్య సీనియర్, జూనియర్ సంబంధంపోయి నిష్కాపట్యంతో కూడిన సమానస్థాయి చర్చాసంబంధం ప్రారంభమైంది. నేను అంచనా వేసుకొన్న దానికంటే ఎక్కువగానే నాలో శక్తిసామర్థ్యాలున్నాయని, స్వయంగా గుర్తించగలిగేలా నన్ను రూపొందించిన డా.రామకృష్ణారావుగారి విశేష నైపుణ్యానికి నేను ఎల్లపుడూ జోహారు లర్పిస్తూనే ఉంటాను. వారు నాలో పూరించిన ఆ ఆత్మవిశ్వాసమే నాకు శాసనసభలలోను, యితర చోట్లను కూడ శ్రీరామరక్షగా ఉంటూ వస్తూంది. ప్రాతఃస్మరణీయులైన నా సీనియర్ రామకృష్ణారావుగారి విశిష్టవ్యక్తిత్వ మట్టిది.

రాజకీయాలలో వారి సమ్యక్ దృష్టికోణం సంకుచిత సైద్ధాంతిక అరలకు తావివ్వలేదు. వారు పుట్టింది జాగీర్దారీ కుటుంబంలో అయినప్పటికి వారు పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో తరతరాల నుండీ వస్తూఉన్న జాగీర్దారీ వ్యవస్థను రూపుమాపడానికి వెనుకాడలేదు. వారి స్నేహకోటిలో పెద్ద పెద్ద భూస్వాములు చాలామంది ఉండేవారు. అయినప్పటికినీ వారు పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో దున్నేవానికి భూమిహక్కు నిచ్చే కౌలుదారీచట్టాన్ని తయారుచేసి, దేశంలో సామ్యవాద వ్యవస్థకు మార్గదర్శకులైనారు. ఆ చట్టాన్ని అమలు పరచడానికి వారు ఎంపిక చేసిన జిల్లాల్లో ఎక్కువగా నష్టపోయిన భూఖామందులు వారి బంధువులూ, రాజకీయ సహచరులే.

పూర్వపు హైదరాబాద్ సంస్థానవిచ్ఛిత్తి తన రాజకీయ ప్రాబల్యానికి స్వస్తివాచకం పలుకుతుందని వారికి ముందే తెలుసు. అయినప్పటికీ తనకు నష్టం ఇతరులకు మేలు చేకూర్చే నిర్ణయాలు తీసుకొంటూ తన రాజకీయ జీవితాన్నంతా ఆత్మపరిత్యాగానికీ, చివరకు సక్రియ రాజకీయాలనుండి తన నిష్క్రమణకు దారితీసే పరిస్థితులకు వీరివలె అంకితం చేసుకొనే రాజనీతి విశారదులు బహు అరుదు. డా.రామకృష్ణారావుగారు ఏ నిర్ణయం తీసుకొన్నా దానిని అన్ని విధాలైన జాగ్రత్తలతోను, మంచి వ్యవహార దక్షతతోను తీసుకొనేవారు. ఒకసారి నిర్ణయం తీసుకొన్నారంటే ఆరునూరైనా దానిమీద స్థిరంగా నిల్చేవారు. ఇదీ డా.రామకృష్ణారావుగారి సంక్షిప్త రాజకీయచరిత్ర.

### *ఆలోచించండి–చెప్పండి*

- *ఎవరైనా గుర్తింపుపొందడానికి శరీరాకృతి కారణం కాదని తెల్సుకొన్నారు కదా! దీన్ని మీరెలా సమర్థిస్తారు?*
- *అనన్యమైన వాదనాపటిమ అంటే ఏమిటి? ఇది ఎవరికి అవసరం? ఎందుకు?*
- *సునిశిత మేధాసంపత్తి అంటే ఏమిటి? దీనికి కొన్ని ఉదాహరణలు తెల్పండి.*
- *"కొరుకుడు పడకపోవడం" అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?*
- *"దున్నేవారికే భూమి" అనే కౌలుదారీ చట్టాన్ని ఎవరికి మేలు జరగాలని రూపొందించి ఉంటారు? ఎందుకు?*

## III

### సౌజన్యానికి మారుపేరు :

వారి విశిష్టవ్యక్తిత్వానికి సంబంధించిన మరో ముఖ్యాంశం ఉంది. గత తరంలోని అన్ని సుగుణాల మూర్తిమత్వమే శ్రీరామకృష్ణారావుగారు. శరాఫత్ అంటే సౌజన్యానికి మారుపేరే వారు. మతదురభిమానాన్ని పెంపొందిస్తూ రాజ్యమేలుతున్న నాటి నిజాంకు బద్ధవ్యతిరేకి అయినప్పటికినీ రాష్ట్రంలోని ముసల్మానులందరికీ వారు పరమమిత్రులు, ఆప్తులూను! అతి నిరాడంబరముగా వారు మతాతీతస్థితిని పాటించేవారు. వారి డ్రాయింగు రూం ఒక సంస్కృతీ ప్రదర్శనశాలలా ఉండేది. నాటి హైదరాబాద్ ప్రభుత్వ పెద్దలు, కుచ్చుటోపీల మౌల్వీలు, గడ్డాల ముల్లాలు, తలపాగాల పండితులు, మహామహోపాధ్యాయులు, గాంధీ టోపీలవారు, ఖద్దరుధారులు, అధునాతన టెరిలిన్ యువకులు – ఒకరేమిటి, అన్ని రకాలవారు, వారిని ఆహ్వానించడానికి అక్కడ హాజరు అయేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే డా.రామకృష్ణారావుగారు మూడు విభిన్నతరాల చివరి వారధిలా కన్పించేవారు. ఇంతటి విశాలవ్యక్తిత్వంతో వారు ఆనాటి ప్రజాజీవితాన్ని తీర్చిదిద్దారు.

నాటి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో శాసనసభా నాయకులుగా వారు సునిశితమేధ, పరిమార్జితభాష, వ్యవహార దక్షతలను మేళవించి ఏర్పరచిన ఉన్నతప్రమాణాలను, నేటికి – ముఖ్యంగా యీ రోజులలో – ఎంతో గౌరవంతో చాలామంది

స్మరించుకొంటూ ఉంటారు. అవసరమైనపుడు వారు ప్రత్యర్థులను చీల్చి చెండాడేవారు. కాని అలా చేయడంలో ప్రత్యర్థుల నుండి రక్తపుబొట్టుమాట అలా ఉంచి, ఒక్క కన్నీరుబొట్టు పడడంగాని, వారి హృదయాలకు రవ్వంత నొప్పి తగలడంగాని జరిగేదికాదు. పార్లమెంటేరియన్‌గా డా.రామకృష్ణారావుగారి అద్వితీయ కళాకౌశలమట్టిది.

## బహుభాషావేత్త :

వారు చాలా ప్రతిభావంతులైన భాషావేత్తలనే విషయం అందరికీ తెలిసినదే. వారు చదువుకున్న చాలా భాషలు వాటియందలి అభిరుచులచే ప్రయివేటుగా చదువుకొన్నవే. ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా.రామకృష్ణారావుగారు ప్రతిరోజూ అర్థరాత్రివరకు ఆఫీసుఫైళ్ళు చూచుకొని, ఆ తర్వాత నమ్మశక్యంగాని ఉత్సాహంతో సంస్కృత ప్రాచీన కావ్యాలు చదవడంలో ఎలా మునిగి పోయేవారో నాకిప్పటికీ స్పష్టంగా జ్ఞాపకం ఉంది. బహుముఖ ప్రతిభావంతులైనప్పటికీ, డా.రామకృష్ణారావుగారు ప్రధానంగా సాహితీజగత్తుకు చెందినవారని నా నమ్మకం. ఇది చాల వింతగానే తోచవచ్చు. ఎందుకంటే వారి సాహిత్య వ్యాసంగం జరుగవలసినంత ఎక్కువగా జరుగలేదు.

బహుముఖప్రజ్ఞతో వచ్చిన చిక్కే ఇది. డా.రామకృష్ణారావుగారు ముట్టని, పెంపొందించని క్షేత్రం ఏదీ లేదంటే అందులో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. కాని ఏం లాభం? ఏ సాహిత్య క్షేత్రానికైతే వారి సునిశిత మేధాసంపత్తి ఎక్కువ అనుకూలంగా ఉండేదో, ఆ సాహిత్య క్షేత్రంలో చెప్పుకోదగ్గ రచనలు చేయడానికే వారికి అవకాశం కలుగలేదు. రాజకీయవేత్తగా కూడ వారు తమ కాలంనాటి అంటే దేశచరిత్రలో చాల ప్రధానమైన, ఉత్తేజకరమైన దశాబ్దాలకు సంబంధించిన స్మృతులను గ్రంథస్థం చేసి ఉండవలసింది. నాబోటి హితైషులెంత చెప్పినప్పటికీ వా రాపనులు చేయలేకపోయారు. ఆవిధంగా వారు తమ జీవితకాలంలో ఎంతో విలువైన పనులు చేసినప్పటికీ, చేయకుండా వదిలివేసింది కూడా అంతకన్న ఎక్కువ విలువైనదే అని నా అభిప్రాయం. ఎందుకంటే ఆ పనులు చేయడానికి ఇతరులెవరికంటె కూడ వారే మిక్కిలి సమర్థులు. ఇందుకు నేనూ, నాలాగే ఇతరులు చాలామంది కూడా ఎప్పుడూ బాధపడుతూనే ఉన్నాం.

వారి ఔదార్యం, ఉపకారబుద్ధి ఎంతవరకు ఉండేదంటే, ఒక్కొక్కపుడది ఒక దోషంగా పరిణమించేది. అసాధ్యమైన కోరికలు కోరినప్పుడు కూడ వారు నెమ్మదిగా నచ్చచెప్తూ ఓపికగా చాలసేపు కూర్చొనేవారు. అప్పుడు వారి స్థానంలో మరొకరెవరైనా ఉండిఉంటే ఒక్క చీదరింపుతో దానిని వెంటనే పరిష్కరించి ఉండేవారు. కాని డా.రామకృష్ణారావుగారి ఔదార్యం అలా చేయనిచ్చేది కాదు. వారి ఉదార ప్రవృత్తి వల్ల న్యాయముగా ఎక్కువ ధ్యానముంచవలసిన పనులకంటే, శక్తిని, సమయాన్ని వ్యర్థపరిచే పనులకు అప్పుడప్పుడు వారు ప్రాధాన్యమివ్వడం జరుగుతుండేది. ఏమైతేనేమి? వారావిధంగా మలచబడ్డారు. అది అంతే.

## ఉపకారశీలి

డా.రామకృష్ణారావుగారిది పెద్దకుటుంబం. ఆ కుటుంబానికి వారొక ఆత్మీయులైన తండ్రి. ఆ కుటుంబానికే కాదు, ప్రతిచోటా ఆత్మీయుడైన తండ్రిగానే ఉంటూ ఉండేవారు. వారు ఎక్కడైనా బయలుదేరితే దారిలో వారిని ఎవరైనా ఎక్కడైనా ఆపి కష్టసుఖాలు చెప్పుకోవచ్చు. అందుచేత వారు ప్రతిదానికి ఆలస్యంగా రావడానికి పేరుబడ్డారు. అయినప్పటికీ మిత్రులు, సహచరులు, ప్రజలుకూడ ఎంతో ప్రేమతోను, ఓర్మితోను, గంటల తరబడి వేచిఉంటూ ఉండడం, వారు రాగానే "సోదర సోదరీమణులారా; నేను అలవాటు ప్రకారం నేడు కూడ ఆలస్యంగానే వచ్చాను" అంటూ ఉండడం పరిపాటి అయిపోయింది.

వారి సామాజికయాత్ర ఎప్పుడూ సాఫీగా జరుగలేదు. రకరకాలైన ఒడిదుడుకులను వారు ఎదుర్కొనవలసివచ్చేది. చాలా సందర్భాలలో విపత్కర పరిస్థితులు సేనావాహినిలా వచ్చి చుట్టుముట్టేవి. అయినప్పటికీ వారు చలించేవారు కాదు. మనస్థైర్యాన్ని సమచిత్తతను వారు ఎన్నడూ విడనాడేవారు కాదు. విజయాలు లభించినప్పుడు సంతోషంతో ఉప్పొంగనూ లేదు, కష్టాలు సంభవించినప్పుడు అధైర్యంతో క్రుంగిపోనూ లేదు. స్నేహితులు ద్రోహం తలపెట్టినప్పుడు కాని, ప్రత్యర్థులు దూషించినప్పుడుగాని వారనేదల్లా ఒకటే – "సరే – అవన్నీ ఆటలో ఉండేవేగా" అని.

డా. రామకృష్ణారావుగారిని గురించి ఎంతైనా వ్రాయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు పూర్ణపురుషులు.

## ఆలోచించండి - చెప్పండి

- *ప్రత్యర్థులను చీల్చిచెండాడడ మంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?*
- *"పార్లమెంటేరియన్‌గా బూర్గులవారు అద్వితీయ కళాకౌశలం కలిగినవారు" ఈ వాక్యంద్వారా మీకేమి అర్థమైంది?*
- *గొప్పవారు తమ జీవితానుభవాలను గ్రంథస్థంఎందుకు చేయాలి?*
- *మీరు వెచ్చించే సమయం దేనికి ఎక్కువగా ఉంటోంది? మీకుపయోగపడేవాటికా? లేక ఇతరపనులకా?*
- *రామకృష్ణారావుగారిని పి.వి.గారు ప్రాతఃస్మరణీయులు అని పేర్కొన్నారు'కదా! నేటి రాజకీయ నాయకులు కూడా రామకృష్ణారావుగారిలా గొప్పపేరు సంపాదించుకోవాలంటే ఎలా ఉండాలి? ఏమేం చేయాలి?*

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశం గురించి మాట్లాడండి.**

ఇతరుల కంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. దీని గురించి మీ అభిప్రాయాలను తెలపండి.

**2. కింది విషయాలు పాఠంలో ఏయే పేరాల్లో ఉన్నాయి. వాటికి సంబంధించిన అంశాలను పట్టికలో రాయండి.**

| వ్యక్తిత్వం | పేరా సంఖ్య | సంబంధించిన అంశాలు |
|---|---|---|
| మహోన్నత వ్యక్తిత్వం | | |
| విశిష్ట వ్యక్తిత్వం | | |
| విశాల వ్యక్తిత్వం | | |

3. **పాఠం మొత్తాన్ని చదవండి పాఠంలో ఉన్న జాతీయాలను గుర్తించి రాయండి.**

4. **కింది గద్యాన్ని చదవండి.**

క్లిష్టపరిస్థితుల్లో రాజ్యాధికారం చేపట్టిన రుద్రమ నిరంతరం యుద్ధాల్లో నిమగ్నమైనా, పరిపాలనా నిర్వహణలో మంచి సమర్థురాలుగా పేరొందింది. స్త్రీలు రాజ్యాధికారం చేపట్టడం అరుదైన ఆ కాలంలో రుద్రమాంబ తన తండ్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయక వీరనారిగా చరిత్రలో నిలిచింది. స్త్రీ అయినప్పటికి పురుషవేషం, పురుషనామం ధరించి సమకాలీన రాజులందరికంటే మిన్నగా రాజ్యాన్ని పరిపాలించి సాహసవంతమైన జీవితాన్ని గడిపింది. గ్రామాలను దానంచేసి వాటిమీద ఆదాయంతో విద్యార్థులకు పాఠశాలలు, ఉచిత వసతి గృహాలు నెలకొల్పింది. ఆరోగ్యశాలలు, ప్రసూతిశాలలు ఏర్పాటు చేసింది. ఒక విద్యాపీఠం స్థాపించి అందులో వేదాలను, సాహిత్యాన్ని, ఆగమవ్యాఖ్యానాలను బోధింపచేసేది. పాఠశాలల్లో ఉపాధ్యాయులను, గ్రామాల్లో కరణాలను నియమించి వారికి వస్తువాహనాలను, ధాన్యాన్ని సమకూర్చేది. మార్కోపోలో అనే విదేశీయ యాత్రికుడు ఈమె పరిపాలనా దక్షత, సాహిత్యసేవ, శిల్పకళలు, మహదైశ్వర్యం గురించి ప్రశంసిస్తూ తన డైరీలో రాసుకున్నాడు. అదీ రుద్రమదేవి ఘనత.

♦. **కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రుద్రమాంబపై ఆమె తండ్రి ఉంచిన నమ్మకమేమిటి?

ఆ) రుద్రమాంబ చేసిన సత్కార్యాలేవి?

ఇ) మార్కోపోలో ఏయే అంశాల్లో రుద్రమదేవిని పొగిడాడు?

ఈ) రుద్రమదేవి సమర్థత యేమిటి?

ఉ) ఈ గద్యం ద్వారా రుద్రమదేవి వ్యక్తిత్వాన్ని ఒక వాక్యంలో రాయండి.

5. **పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) బూర్గులవారు మతాతీతవ్యక్తులు – అని ఎలా చెప్పగలరు?

ఆ) బూర్గులవారిని గురించి చరిత్రకారులు ఏయే విషయాలు పొందుపరచి ఉంటారని చెప్పారు?

ఇ) బూర్గులవారి వాదనాపటిమ గురించి తెల్పండి.

ఈ) పాఠ్యాంశ రచయిత పి.వి.నరసింహారావు గారి గొప్పతనం గురించి తెలుపండి.

ఉ) రామకృష్ణారావు గారి విశిష్ట వ్యక్తిత్వం గురించి పి.వి.గారు ఏమని తెలిపారు?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. **కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) బూర్గుల – పి.వి.గార్ల సంబంధం గురుశిష్య సంబంధం లాంటిది. దీన్ని సమర్థిస్తూ రాయండి.

ఆ) 'సరే–అవన్నీ ఆటలో ఉండేవేగా' అని బూర్గులవారు అనేవారు కదా! ఏ సందర్భంలో ఎందుకనేవారో దానికిగల కారణాలను రాయండి.

ఇ) బూర్గులవారిని ప్రాతఃస్మరణీయులని పి.వి.నరసింహారావుగారు పేర్కొనడాన్ని సమర్థిస్తూ రాయండి.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) బూర్గుల వ్యక్తిత్వంలోని మహోన్నతలక్షణాల గురించి సొంతమాటల్లో రాయండి.

ఆ) ఈ పాఠం ఆధారంగా "గొప్పవారి సాంగత్యంవల్ల కలిగేస్ఫూర్తి గొప్పగా ఉంటుంది" అనే అంశం గురించి సమర్థిస్తూ రాయండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.

అ) పాఠంలోని పదజాలం, విశిష్టలక్షణాల ఆధారంగా ఒక కవిత రాయండి.

ఆ) ఈ పాఠం ఓ అభినందన పత్రంగా ఉంది కదూ! దీని ఆధారంగా మీకు నచ్చిన ఉపాధ్యాయుడిని ప్రశంసిస్తూ సన్మాన పత్రాన్ని రాయండి. ప్రదర్శించండి.

## III. భాషాంశాలు

### పదజాలం

1. కింది జాతీయాలను మీ సొంత వాక్యాలలో ప్రయోగించండి.

అ) శ్రీరామరక్ష ఆ) గీటురాయి ఇ) రూపుమాపడం

ఈ) కారాలుమిరియాలు నూరడం ఉ) స్వస్తివాచకం

2. కింది 'వికృతి' పదాలకు పాఠంలో ఉన్న 'ప్రకృతి' పదాలను వెతికి రాయండి.

అ) దవ్వు ఆ) గారవం ఇ) పగ్గె / పగ్గియ

ఈ) దోసం ఉ) రాతిరి ఊ) బాస

3. ప్రతి వృత్తికి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయని పాఠం ద్వారా తెలుసుకున్నారు కదా! మీకు తెలిసిన కొన్ని వృత్తులు, వాటికున్న ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన పదాలను పట్టిక రూపంలో రాయండి.

| వృత్తి | వ్యక్తిత్వం / ప్రత్యేక లక్షణం |
|---|---|
| ఉదా : ఉపాధ్యాయ | నిరంతర అధ్యయనం,<br>విద్యార్థుల పరిశీలనం |

### వ్యాకరణాంశాలు

1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలను విడదీసి, సంధులను గుర్తించండి.

అ) పల్లెటూళ్ళు పాడిపంటలకు నిలయాలు.

ఆ) ఆయన అతి నిరాడంబరంగా జీవించేవారు.

ఇ) అభిమానం మంచిదే. దురభిమానం కీడు కలిగిస్తుంది.

ఈ) తేనెటీగ తేనెను సేకరిస్తుంది.

ఉ) దుర్భేద్యమైన సింహఘడ్‌కోటను తానాజీ సాధించాడు.

ఊ) ఈనాటి మనుషులు నిశ్చింతగా జీవించలేకపోతున్నారు.

ఋ) విశ్వామిత్రుడు గొప్ప తపోధనుడు.

ౠ) మా ఇంట్లో నిలువుటద్దం ఉంది.

**2. కింది సమాస పదాల్లోని తత్పురుషభేదాలను గుర్తించి, విగ్రహవాక్యాలు రాయండి. సమాస నిర్ణయం చేయండి.**

ఉదా॥ సత్యదూరము – సత్యమునకు దూరము – షష్ఠీతత్పురుష సమాసం

అ) అమెరికా రాయబారి – ______________________

ఆ) వాదనాపటిమ – ______________________

ఇ) అసాధ్యం – ______________________

ఈ) నెలతాల్పు – ______________________

ఉ) గురుదక్షిణ – ______________________

ఊ) వయోవృద్ధుడు – ______________________

ఋ) దొంగభయము – ______________________

**3. 'కర్త' ఆధారంగా రూపొందిన వాక్యాలు కర్తరి వాక్యాలని, 'కర్మ' ప్రధానంగా రూపొందించిన వాక్యాలను కర్మణి వాక్యాలంటారని మీకు తెలుసు. కింది వాక్యాలలో ఏవి కర్తరి వాక్యాలో, కర్మణి వాక్యాలేవో గుర్తించండి. కారణాలతో సమన్వయించండి.**

ఉదా॥ రామకృష్ణారావు ఆమోదముద్ర వేశారు. – కర్తరి వాక్యం.

రామకృష్ణారావుచే ఆమోదముద్ర వేయబడింది. – కర్మణి వాక్యం.

(ఆమోదముద్రవేయడం – కర్తకు సంబంధించిన క్రియ.

ఆమోదముద్ర వేయబడటం – కర్మకు సంబంధించిన క్రియ.)

అ) దున్నేవానికి భూమినిచ్చే హక్కు తయారయ్యింది.

ఆ) బూర్గులవారు మంచినిర్ణయాలు తీసుకున్నారు.

ఇ) వారి న్యాయవాదపటిమ ఇతరులను అబ్బురపరచింది.

ఈ) రేఖామాత్రంగా నా భావాలు ఇక్కడ పొందుపరచబడ్డాయి.

ఉ) పర్షియన్ ట్యూటర్‌గా ఆయన కొంతకాలం పనిచేశారు.

ఊ) ఆయన కన్నుమూసిన విషయం పత్రికలో వ్రాశారు.

### నుగాగమసంధి :

**4. కింద పదాలను విడదీయండి. మార్పును గమనించండి.**

అ) చేయునతడు.

ఆ) వచ్చునప్పుడు.

పై పదాలను విడదీస్తే -

అ) చేయు + అతడు

ఆ) వచ్చు + అప్పుడు

- చేయు, వచ్చు క్రియలకు చివర 'ఉత్తు' ఉంటుంది. వీటికి అచ్చు కలిసింది. ('అ'తడు, 'అ'ప్పుడు). అప్పుడు రెండు పదాల్లోనూ లేని 'న్' అనే హల్లు కొత్తగా వచ్చి చేరి చేయు అతడు అనేది చేయు'న'తడు గాను, వచ్చు అప్పుడు వచ్చు 'న'ప్పుడు గానూ మారిపోయింది. ఈ సందర్భాల్లో 'న్' కొత్తగా వచ్చి చేరింది. 'న్' ఆగమం కాబట్టి ఇట్లా ఏర్పడటాన్ని 'నుగాగమ సంధి' అంటారు.

కింది ఉదాహరణలు విడదీసి, లక్షణాలు సరిచూడండి -

1) పోవునట్లు

2) కలుగునప్పుడు

**5. పై సందర్భంలోనే గాక మరికొన్ని చోట్ల 'నుగాగమం' వస్తుంది. కింది పదాలను పరిశీలించండి.**

అ) తళుకు + గజ్జెలు
- తళుకుఁ గజ్జెలు
- తళుకు న్గజ్జెలు
- తళుకుం గజ్జెలు

ఆ) ఉన్నతంపు + గొడుగు
- ఉన్నతంపు గొడుగు
- ఉన్నతంపు న్గొడుగు
- ఉన్నతంపుంగొడుగు

కింది ఉదాహరణలు పరిశీలించి లక్షణాలు సరిచూడండి.

1) చిగురుంగయిదువు -

2) సరసపుఁదనము -

**పైన ఇచ్చిన పదాలు**

1. ఉత్తు చివరగల స్త్రీసమాలు అయినందువలన నుగాగమం వచ్చింది.

2. నుగాగమానికి సరళాలు, స్థిరాలు (మహాప్రాణాక్షరాలు, య ర ల వ శ ష స హ లు) పరమైతే 'ను'కి లోపం కాని, సంశ్లేషకాని జరుగుతుంది.

3. మహాప్రాణాక్షరాలు, సరళాలు పరమైతే కొన్ని చోట్ల 'ను'కు పూర్ణబిందువు వస్తుంది.

**6. ఇంకా కొన్ని సందర్భాల్లోనూ నుగాగమం వస్తుంది.**

కింది పదాలను విడదీసి, పరిశీలించండి.

అ) విధాతృనానతి – (విధాత యొక్క ఆనతి) = విధాతృ + ఆనతి.

ఆ) రాజునాజ్ఞ – (రాజు యొక్క ఆజ్ఞ) = రాజు + ఆజ్ఞ.

- విగ్రహవాక్యాలననుసరించి పై సంధి పదాలు షష్ఠీతత్పురుషానికి సంబంధించినవని తెలుస్తున్నది.
    - పూర్వస్వరం స్థానంలో 'ఋ'కారం, ఉత్తు ఉన్నాయి. వీటికి అచ్చుపరమైనప్పుడు నుగాగమం వచ్చింది.

అంటే– షష్ఠీతత్పురుషాల్లో ఉకారానికి, ఋకారానికి అచ్చుపరమైనప్పుడు నుగాగమం వస్తుంది.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- **మహోన్నత వ్యక్తిత్వంతో పరిపాలనాదక్షతతో సేవచేసిన వారి వివరాలు సేకరించండి. ఒక సంకలనాన్ని రూపొందించండి. తరగతిలో ప్రదర్శించండి.**

### సూక్తి

ప్రజాకార్యం తు తత్కార్యం, ప్రజాసౌఖ్యం తు తత్సుఖం,
ప్రజాప్రియః ప్రియస్తస్య, స్వహితం తు ప్రజాహితమ్.

– మహాభారతం

ప్రజాకార్యమే పాలకుని కార్యం. ప్రజల సుఖమే పాలకుని సుఖం. ప్రజల ప్రియమే పాలకుని ప్రియం. ప్రజల హితమే పాలకుని హితం.

# 7

# నగరగీతం

– అలిశెట్టి ప్రభాకర్

## చదవండి – ఆలోచించి చెప్పండి.

చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్లు చెరుగుతున్నప్పుడు
సంసారం బరువెంతో సమీక్షించగలిగినవాణ్ణి
ఆకుపచ్చని చెట్టు, ఆహ్లాదభరితమైన వాతావరణమేమి లేకుండానే
పగలూరాత్రి ఆస్బెస్టాస్ రేకులకింద పడి ఎంత వేడెక్కినా
మాడిపోకుండా ఉండగల్గిన మానవాతీతుణ్ణి
నరకప్రాయమైన నగరనాగరికతను నరనరానా జీర్ణించుకున్నవాణ్ణి
రోజుకో రెండు కవితా వాక్యాల్ని రాయలేనా...
అది మనకు పెన్నుతో పెట్టిన విద్య... అఫ్‌కోర్సు...
కవిత్వం ఎంత నిత్యనూతనంగా వెలికి వచ్చినా
రాసిన ప్రతిదీ ఆణిముత్యం కాదని అందరికి తెలుసు

– అలిశెట్టి ప్రభాకర్

### ప్రశ్నలు:

1. "చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్ళు చెరుగుతున్నప్పుడు" వాక్యం ద్వారా మీరేమి గ్రహించారు?
2. కవి నివాసం ఎలా ఉంది?
3. నగర నాగరికతను నరకప్రాయమని కవి ఎందుకని ఉంటాడు? దానిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
4. కవితాత్మక వాక్యాలు చదివారు కదా! ఈ కవి గురించి మీ కేమి అర్థమైంది?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ఆధునిక కాలంలో మనుషులంతా నగరాల్లో జీవించాలని కోరుకుంటున్నారు. మరోవైపు పల్లెల్లో ఉపాధి అవకాశాలు తగ్గడంతో బతుకుతెరువుకోసం నగరాలకు వలసలు పెరిగిపోయాయి. నగరంలోని అనుకూలాంశాలన్నింటిని వినియోగించుకోవాలనే కోరికతో మనుషులు నగరంలో ఉండడానికి తాపత్రయపడుతున్నారు. దీనితో అనేక నగరాలు అత్యధిక జనాభాతో కిక్కిరిసిపోతున్నాయి. చాలా సమస్యలు పెరిగిపోయాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నగరం శరవేగంగా తన రూపం మార్చుకుంటుంది. సామాన్యుడికి అందనంత దూరంగా కదిలిపోతుంది నగరం. మధ్యతరగతికి అంతుచిక్కని ప్రాంతంగా మారిపోయింది నగరం. మనిషి యాంత్రిక స్థితిలోకి మారిపోతున్నాడు. తనకుతానే పరాయీకరణకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో నగరజీవితంలోని యథార్థదృశ్యాల్ని మన కళ్ళ ముందు నిలుపుతూ, నగరపు మరో పార్శ్వాన్ని చూపుతూ, వాస్తవాల్ని కఠినంగా నిర్వచించిన విధాన్ని తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం “మినీ కవిత” అనే ప్రక్రియకు చెందింది. ఏదైనా ఒక అంశాన్ని కొసమెరుపుతోనో, వ్యంగ్యంతోనో, చురకతోనో తక్కువ పంక్తుల్లో చెప్పడమే మినీ కవిత. ‘అలిశెట్టి ప్రభాకర్ కవిత’ అనే గ్రంథంలోని ‘సిటీలైఫ్’ మినీ కవితలలో కొన్నిటిని ‘నగరగీతం’గా కూర్చడమైంది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న ‘పదవిజ్ఞానం’ పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

## కవి పరిచయం



**(1954 – 1993)**

కరీంనగర్ జిల్లా జగిత్యాల జన్మస్థలం. మొదట చిత్రకారుడుగా జీవితం ప్రారంభించాడు. ప్రారంభంలో పత్రికలకు పండగలు, ప్రకృతి, సినీనటుల బొమ్మలు వేసేవాడు. తరవాత జగిత్యాలలో ‘సాహితీ మిత్ర దీప్తి’ సంస్థ పరిచయంతో కవిత్వరంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వారపత్రికలో వచ్చిన ‘పరిష్కారం’ అచ్చయిన మొదటి కవిత. జగిత్యాలలో ‘స్టూడియో పూర్ణిమ’ (1976), కరీంనగర్‌లో ‘స్టూడియో శిల్పి’ (1979) హైదరాబాద్‌లో ‘స్టూడియో చిత్రలేఖ’ (1983) ఏర్పాటు చేసుకొని జీవికకోసం ఫోటోగ్రాఫర్‌గా, జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. ఏనాడూ సంపాదన కోసం ఆరాటపడలేదు. తన కళ ప్రజల కోసమే అని చివరివరకు నమ్మాడు. ఎర్ర పావురాలు (1978) మొదటి కవితా సంకలనం. మంటల జెండాలు, చురకలు (1979), రక్తరేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభగీతం (1990), సిటీలైఫ్ (1992) అచ్చయిన కవిత్వ సంకలనాలు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళపాటు సీరియల్‌గా “సిటీలైఫ్” పేరుతో హైదరాబాదు నగరంపై రాసిన మినీ కవితలతో ప్రఖ్యాతిపొందాడు. తన కవిత్వంతో పాఠకుల్లో ఆలోచనాదృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన కవి అలిశెట్టి ప్రభాకర్.

## ప్రవేశిక

*దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది.*

*కొందరిని కొన్ని సన్నివేశాలు విశేషంగా ఆకర్షిస్తాయి.*

*సహృదయుడు ప్రతి కదలిక నుంచీ ప్రేరణ పొందుతాడు.*

*అతనికి భాష ఆయుధమైతే, భావం కవితారూపం సంతరించుకుంటుంది.*

*నగరంలోని మూలలను, మూలాలనూ ఓ కవి హృదయం ఎట్లా దర్శించిందో – 'అలిశెట్టి' మినీ కవిత(లు) మన కళ్ళకు గడుతుంది. మనసు కిటికీ తెరిచి చూస్తే అక్షరాల వెనుక అనంత దృశ్యాలు కనిపిస్తాయి...*

## I

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
నాలుగురోడ్ల కూడలిలో ఏమది?
అదే, నగరారణ్యహోరు
నరుడి జీవనఘోష


తల్లి ఒడివంటి
పల్లెసీమల్నొదిలి
తరలివచ్చిన పేదరైతులూ
ఇనప్పెట్టెల్లాంటి
ఈ పట్టణాల్లో
ఊపిరాడని మీ బతుకులూ

నగరంలో ప్రతిమనిషి
పఠనీయ గ్రంథమే
మరి నీ బతుకు
పేజీలు తిరగేసేదెవరో!

ఉదయమే
బస్సుల్లో రిక్షాల్లో
పేవ్‌మెంట్లపై విరబూసిన
కాన్వెంటు పువ్వుల సందడి
రాలే చదువుల పుప్పొడి!

### ఆలోచించండి–చెప్పండి

- *పల్లెసీమల్ని కవి తల్లిఒడితో ఎందుకు పోల్చాడు?*
- *పట్టణాలను ఇనప్పెట్టెలు అని అనడంలో కవి ఉద్దేశం ఏమై ఉంటుంది?*
- *"నగరంలో ప్రతి మనిషి పఠనీయ గ్రంథమే" అనే వాక్యం గురించి మీకేమి అర్థమైంది?*
- *""పేవ్‌మెంట్లపై విరబూసిన కాన్వెంటు పువ్వుల సందడి" అని కవి ఎవరి గురించి అన్నాడు? దీని గురించి మీ అభిప్రాయం తెల్పండి.*



## II

సిటీ అంటే అన్నీ
బ్యూటీ బిల్డింగ్‌లు కావు
అటు భవంతులూ ఇటు పూరిళ్ళూ
దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలు!
        ఇది వెరైటీ సమస్యల మనుష్యుల
        సమ్మేళన కోలాహలం!
        ఎంతచేసినా ఎవరికీ
        తీరిక దక్కదు కోరిక చిక్కదు
మెర్క్యూరీ నవ్వులు, పాదరసం నడకలు
కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడుకాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు!
        నగరంలో అన్నిపక్కలా
        సారించాలి మన చూపులు
        మహానగరాల రోడ్లకి
        మరణం నాలుగువైపులు!
నగరం మహావృక్షంమీద
ఎవరికి వారే ఏకాకి!
నగరం అర్థంకాని రసాయనశాల!
నగరం చిక్కువీడని పద్మవ్యూహం!!

### ఆలోచించండి - చెప్పండి

- *"సిటీ అంటే అన్నీ బ్యూటీ బిల్డింగ్‌లు కావు!" ఇది వాస్తవమేనా? ఎందుకు?*
- *రెండు కాళ్ళు, మూడు కాళ్ళు, నాలుగు కాళ్ళు అని కవి అనడంలో ఉద్దేశం ఏమిటి?*
- *"మహానగరాల రోడ్లకి మరణం నాలుగువైపులు" అంటే ఏమిటి?*
- *నగరాన్ని రసాయనశాల అనీ, పద్మవ్యూహం అనీ కవి అనడంలో ఉద్దేశం ఏమై ఉంటుంది?*

## భావాలు

అనేక వాహనాల శబ్దాలు, మనుషుల మాటలు, చిరువ్యాపారుల అరుపులతో నగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో వినిపించే రణగొణ ధ్వనులు గుండెలదిరిపోయేలా మోగిస్తున్న ఢంకానాదంలా, ఉధృతమైన వేగంతో దూకే నయాగారా జలపాతం హోరులా అనిపిస్తుంది. నిజానికది అరణ్యంలాంటి నగరం చేస్తున్న ధ్వనిలా, నగరజీవి బతుకుపోరాటంలోంచి వచ్చిన ఉఋములాంటి శబ్దంలా ఉన్నాయని కవి వర్ణిస్తున్నాడు.

అమ్మఒడిలాంటి పుట్టినఊరిని వదిలి ఉపాధికోసం నగరం తరలివచ్చిన వారికి ఇంత పెద్దపట్నంలో తలదాచుకోవడానికి కాసింత స్థలం కూడా దొరకదు. పేదరైతులు ఇనప్పెట్టెల్లాంటి ఇరుకిరుకు మురికి ప్రదేశంలో ఊపిరాడని స్థితిని అనుభవిస్తూ బతుకుతుంటారు.

నగరంలో ప్రతిమనిషీ చదవవలసిన ఒక పుస్తకం లాంటివాడు. అయితే ఎవరూ అతని బతుకు పుస్తకంలోని పేజీలను చదివేవారే ఉండరు. నగరంలోని మనిషివెనక అనేక ఆసక్తికరమైన ఆనంద, విషాదగాథ లుంటాయి. ఒక్కరైనా అతని బాగోగులు పట్టించుకునేవారే ఉండరనే చేదునిజాన్ని చెపుతున్నాడు కవి.

నగరంలో ఉదయాన్నే సిటీబస్సుల్లో, ఆటోల్లో, పేవ్‌మెంట్లపై విరబూసిన పువ్వుల్లాంటి స్కూల్‌పిల్లలు సందడిచేస్తుంటారు. వారి మాటల్లోంచి చదువుల పుప్పొడి రాలుతుంది.

నగరం నిండా అన్నివైపులా అందమైన ఎత్తైన భవనాలు ఉంటాయనుకోవద్దు. ఒకవైపు ఖరీదైన భవంతుల పక్కనే చిన్న చిన్న పూరిపాకలూ ఉంటాయి. ఇక్కడ ఐశ్వర్యం దారిద్ర్యం పక్కపక్కనే సమాంతర రేఖలుగా కనిపిస్తాయి. నగరం వైవిధ్యమైన సమస్యలతో, విభిన్నమనస్తత్వాలతో కలసిపోయి కలకలంతో నిండి ఉంటుంది. ఎంత నిరంతరాయంగా పనిచేసినా నగరంలోని మనిషికి విశ్రాంతి తీసుకోవడానికి అనువైన సమయం దొరకదు. సంపాదించిన ధనంతో కోరికను తీర్చుకునే తీరిక దొరకదు. కృత్రిమమైన వెలుగుల్లాంటి అసహజపు నవ్వులతో, స్థిరత్వంలేని హడావుడి నడకలతో వెళ్ళేవారు ఆటోరిక్షాల్లో తిరిగేవాళ్ళు, కార్లలో ప్రయాణించే ధనవంతులూ ఉంటారు.

నగరంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అక్కడ అన్నివైపులా ప్రమాదాలు పొంచి ఉంటాయి, నాలుగుదిక్కుల్లోని రోడ్లలో మృత్యువు పొంచి ఉంటుందని కవి హెచ్చరిస్తున్నాడు.

వృక్షాలమీద ఉండే పక్షులు పరస్పరం కలిసిపోయి కలివిడిగా ఉంటాయి. నగరమనే మహావృక్షంమీద నివసించే ఈ మనుషులు సాటిమనిషితో ఎటువంటి ఆత్మీయమైన పలకరింపులు లేకుండా ఇరుగూపొరుగనే భావన కూడా లేకుండా ఎవరికి వారే ఏకాకిగా బతుకుతుంటారు. ఈ యాంత్రిక మానసికస్థితిని నిరసిస్తున్నాడు కవి.

ప్రయోగశాలలో ఏవేవో రసాయన ద్రవాలు, ఆమ్లాలు ఉంటాయి. వాటి చర్యలు అందరికీ అర్థం కావు. నగరం అంతకంటే అర్థంకాని రసాయనశాలలా ఉంటుంది. నగరంలో బతుకుదామని వచ్చినవారు, ఉపాధి దొరకకపోయినా ఏదో ఒకరోజు దొరుకుతుందని ఆశగా వేచిచూస్తూంటారు. ఇక్కడి సౌకర్యాలు, విలాసాలు, వినోదాలు పైపై మెరుగులు బలంగా ఆకర్షిస్తాయి. మరోవైపు నిరుద్యోగం, జీవనవ్యయం భయపెడుతున్నా నగరం విడిచి వెళ్ళబుద్ధికాదు. కాలుష్యం కలవరపెట్టినా, ట్రాఫిక్ జామ్‌లో జీవితం ఇరుక్కుపోయినా నగరం విడిచి ప్రశాంతంగా మన పల్లెలకు వెళ్ళనివ్వని, చిక్కుముడి విడదీయలేని పద్మవ్యూహం లాంటిది నగరం.

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాల గురించి చర్చించండి.**

అ) మీరు ఇప్పటివరకు ఏఏ నగరాలను చూశారు? మీరు చూసిన నగరాల్లో మీకు నచ్చిన, నచ్చని అంశాలు తెలపండి?

ఆ) మీ ఊరి నుండి ఎవరైనా నగరాలకు వలస వెళ్ళారా? ఎందుకు వెళ్ళవలసి వచ్చింది? వాళ్ళు అక్కడ ఏం చేస్తున్నారు?

**2. పాఠం ఆధారంగా కింది కవితా పంక్తుల్లో దాగిన అంతరార్థాన్ని గుర్తించి రాయండి.**

అ) నగరంలో ప్రతి మనిషి పఠనీయ గ్రంథమే.

ఆ) నగరం మహావృక్షం మీద ఎవరికి వారే ఏకాకి.

ఇ) మహానగరాల రోడ్లకి మరణం నాలుగు వైపులు.

**3. కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

కుందుర్తి ఆంజనేయులు రచించిన వచన పద్య ఖండిక 'నగరంలో వాన' కవిత్వంలా మొదలై రాజకీయ శాసనంతో అంతం అవుతుంది. అందరూ వాస్తవికత నుంచి వ్యంగ్యాన్ని పుట్టిస్తే, ఇందులో కవి వ్యంగ్యం నుంచి వాస్తవికతను సృష్టిస్తాడు. ప్రబంధకవి అయ్యలరాజు రామభద్రుడు వర్షధార నుంచి కవితాధారను శ్లేషించాడు. అది కేవలం శబ్దగతమైన శ్లేషమాత్రమే. ఇందులో భావసంఘర్షణ నుంచి వెలువడిన వ్యంగ్యం గుబాళిస్తుంది. కవి భావుకత వ్యంగ్యధనువును ఎక్కుపెడితే, సంస్కారం వాస్తవికత భాగాన్ని గుండెలకు గురిపెట్టి కొడుతున్నది. ఆ దెబ్బ తప్పదు. అది ఎంత సున్నితంగా తాకుతుందో అంత గాఢంగా ముద్రవేస్తుంది. వచనపద్యం ఎంత సహజమైనదో, ఈ ఖండికలోని రచన కూడా అంత సహజంగా రూపు దిద్దుకొన్నది. కుందుర్తి వాన కురిసింది నగరంలోనే అయినా, ఆ వానలో తడిసింది మాత్రం సామాన్యుడి జీవనమే! ఇందులో వాన కేవలం కేన్వాసు మాత్రమే. దాన్ని ఆధారం చేసుకుని కవి చిత్రించిన వాస్తవికదృశ్యాలు మనల్ని నిలబెట్టి ఆలోచింపజేస్తాయి.

అ) కవులు సామాన్యంగా వ్యంగ్యాన్ని ఎలా సృష్టిస్తారు?

ఆ) అయ్యలరాజు రామభద్రుడి కవితాధారను విశ్లేషించండి.

ఇ) కుందుర్తి నగరంలోవాన కవితను ఏ శైలిలో రాశాడు?

ఇ) నగరంలో వాన కవితలోని ప్రధానాంశం ఏమిటి?

ఈ) కుందుర్తి వాస్తవికత ఎలాంటిది?

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) అలిశెట్టి ప్రభాకర్ కవితాదృక్పథం ఏమిటి?

ఆ) 'నగరగీతం' రాయడానికి గల నేపథ్యాన్ని వివరించండి.

ఇ) నరుడి జీవనఘోష కవికి ఎలా వినిపించింది?

ఈ) నగరంలో దారిద్ర్యం, సౌభాగ్యం ఏ విధంగా కనిపిస్తాయి?

ఉ) అలిశెట్టి ప్రభాకర్ 'సిటీలైఫ్' కవితల ప్రత్యేకత ఏమిటి?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) నగరం అంటే ఏమిటి? పల్లెకు - నగరానికి గల ప్రధాన వ్యత్యాసం తెలపండి.

ఆ) 'నగరజీవికి తీరిక దక్కదు కోరిక చిక్కద'నే పంక్తుల్లోని వాస్తవాన్ని వివరించండి.

ఇ) ఈ పాఠం ఆధారంగా నగరం ఎలా ఉంటే కవికి నచ్చుతుందో తెలపండి.

ఈ) నగరజీవితంలోని ప్రతికూల అంశాల్ని ఇంత కఠినంగా వర్ణించడంలో కవి ఆంతర్యం ఏమిటి?

ఉ) నగరంలో మనిషి జీవనవిధానాన్ని పాఠం ఆధారంగా వివరించండి.

ఊ) అందరూ నగరాల్లో జీవించాలని ఎందుకు అనుకుంటున్నారు?

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) 'నగరగీతం' సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఆ) నేడు నగరజీవనం ఎందుకు సంక్లిష్టంగా మారిందో విశ్లేషించండి.

ఇ) నగరాన్ని రసాయనశాలగా, పద్మవ్యూహంగా వర్ణించడంలోని నిజానిజాల గురించి చర్చించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) నగరగీతం కవితకు మరో పార్శ్వంగా నగర జీవనంలోని అనుకూల అంశాలపై ఒక వ్యాసం రాయండి.

ఆ) ప్రశాంతతకు, పచ్చదనానికి నిలయమైన పల్లెల గొప్పదనాన్ని వర్ణిస్తూ ఒక వచన కవితను రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు అర్థాలను 'పదవిజ్ఞానం'లో వెతికి ఆ అర్థంతో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా॥ ఏకాకి = ఒంటరి

అభిమన్యుడు పద్మవ్యూహంలో ఏకాకి అయినాడు.

అ) నగారా ఆ) హోరు ఇ) ఘోష ఈ) ఊపిరాడని ఉ) పఠనీయ గ్రంథం

**2. కింది పదాలకు పర్యాయపదాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా॥ పల్లె – గ్రామం, జనపదం

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని గ్రామస్వరాజ్యంకోసం గాంధీజీ కలలు కన్నారు. జనపదాన్ని బాగుపరచడమే దేశ సౌభాగ్యంగా తలచారు.

అ) నరుడు ఆ) అరణ్యం ఇ) రైతు ఈ) పువ్వు ఉ) మరణం

ఊ) వాంఛ ఎ) వృక్షం

## వ్యాకరణాంశాలు

**1. కింది కవితా భాగాల్లోని అలంకారాన్ని గుర్తించండి.**

అ) నగారా మోగిందా
నయాగరా దుమికిందా

ఆ) రంగదరాతిభంగ; ఖగరాజతురంగ; విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ; పరితోషితరంగ; దయాంతరంగ; స
త్సంగ; ధరాత్మజా హృదయ సారస భృంగ; నిశాచరాబ్జ మా
తంగ; శుభాంగ! ..............

ఇ) కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడు కాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు

* **శబ్దాలంకారాల్లో వృత్త్యనుప్రాస, అంత్యానుప్రాస లాంటివే మరికొన్ని ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.**

**1. ముక్తపదగ్రస్తం**

కింది పద్యాన్ని పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

కం. మన వేటికి నూతనమా!
తన మానినిఁ బ్రేమఁ దనకుఁ దక్కితిననుమా
నను మానక దయ దనరం
దనరంతులు మాని నరసధవు రమ్మనవే.

* పై పద్యంలోని ప్రత్యేకతను గమనించారు కదా!

ఒక పద్యపాదంగాని, వాక్యంగానీ ఏ పదంతో పూర్తవుతుందో అదే పదంతో తర్వాత పాదం / వాక్యం మొదలవుతున్నది. దీన్నే ముక్తపదగ్రస్త అలంకారం అంటారు.

## 2. యమకము

కింది వాక్యాలు పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

అ) లేమా! దనుజుల గెలువఁగలేమా

(లేమ = స్త్రీ; గెలువగలేమో = గెలువడానికి మేమిక్కడ లేమా (ఉన్నాం కదా!) )

ఆ) ఆ తోరణం శత్రువులతో రణానికి కారణమైంది.

(తోరణం = ద్వారానికి కట్టే అలంకారం; రణం = యుద్ధం)

* పై రెండు సందర్భాలల్లోనూ ఒకే పదం అర్థభేదంతో ప్రయోగించడం జరిగింది. దీనినే 'యమకాలంకారం' అంటారు.

## 3. లాటానుప్రాస

కింది కవితా భాగాలను / వాక్యాలను చదవండి. ప్రత్యేకతను గమనించండి.

అ) హరి భజియించు హస్తములు హస్తములు... (చేతులే, నిజమైనచేతులు)

ఆ) చిత్తశుద్ధితొ జేసెడి సేవ సేవ. (సేవయే నిజమైన సేవ)

* పై రెండు సందర్భాల్లోనూ ఒకే పదం అర్థంలో తేడా లేకున్నా భావంలో తేడా ఉండేటట్లు ప్రయోగించారు. ఈ విధంగా ఒకే పదాన్ని, అర్థం ఒకటే అయినా తాత్పర్యభేదంతో ప్రయోగించడాన్ని 'లాటానుప్రాసాలంకారం' అంటారు.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ భారతదేశంలోని ప్రధాననగరాల వివరాలు వాటి ప్రత్యేకతలు, జీవన విధానాల వైవిధ్యాన్ని సేకరించి ఒక పట్టికగా రూపొందించి 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' నిరూపించేలా ప్రదర్శించండి.

## సూక్తి

శాంతితుల్యం తపోన్నాస్తి, నసంతోషాద్వరం సుఖం
నతృష్ణాయాః పరోవ్యాధిః న చ ధర్మో దయాసమః

భావం : శాంతమువంటి తపస్సు, సంతోషం కంటే సుఖం, తృష్ణను మించిన వ్యాధి, దయను బోలిన ధర్మం లోకంలో లేవు.

– ఆర్యధర్మం

# 8

# యక్షుడి అప్ప

– విశ్వనాథ సత్యనారాయణ

**చదవండి – ఆలోచించి చెప్పండి.**

గిరి : ఏమిరా హరీ, నాకు నాటకాలు చూపిస్తానన్నావ్. బలేవాడవు. వీథి నాటకాలు చూపించావు : అవి యక్షగానాలన్నావు : అవే నాటకాలన్నావు.

హరి : తంజావూరులో అవ్వే నాటకాలనేవాళ్ళు.

గిరి : అదికాదోయ్ ఇప్పుడు సంస్కృతంలో కాళిదాసు, భవభూతి, మురారి నాటకాలు వ్రాశారు. అల్లాంటి నాటకాలు తెలుగులో లేవా?

హరి : ఎందుకు లేవు. ఉన్నవి.

గిరి : ఎక్కడ ఉన్నవి? అన్నీ ప్రబంధాలే. యక్షగానాలొకటి నాటకాలని చూపించావు.

హరి : ఇవ్వాళ నాటకోత్సవం జరుగుతున్నది. అన్ని నాటకాలూ ఒక్కరోజున చూసివేద్దువుగాని.

గిరి : అన్ని నాటకాలు ఒక్క రోజున ఎట్లా చూస్తాము?

హరి : ఎట్లా చూస్తాము? గొప్ప విందుకు పిలిచారనుకో. నాలుగు కూరలు పిండివంటలు చేశారు. తలాకాస్తా నంజుకోవడమే.

గిరి : సరేగాని. నువ్వీనాటకాలు ఎందుకు చూపిస్తున్నట్టు అబ్బాయ్!

హరి : నీవు నాటకాలు నాటకాలని గోలకెత్తుతున్నావుగదా. అదీకాక కృష్ణదేవరాయల నాటివరకూ పురాణాంధ్రీకరణ యుగం. రాయలనాడు ప్రబంధయుగం. తంజావూరు యక్షగానయుగం. తరువాత నాటకయుగం అంటాను.

**ప్రశ్నలు:**

1. నాటకాలు రాసిన వారి పేర్లు తెలపండి.
2. నాటకోత్సవాలు అంటే ఏంటి?
3. పురాణాంధ్రీకరణయుగం, ప్రబంధయుగం, యక్షగానయుగం, నాటకయుగం అంటే మీకేమర్థమైంది?
4. మీరెప్పుడైనా నాటకాలు చూశారా? వాటి గురించి మాట్లాడండి.

## పాఠ్యాంశ ఉద్దేశం

సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు ఉన్నాయి. వాటిలో 'నాటకం' ఒకటి. ఇది ఒక విశిష్టమైన ప్రక్రియ. అందుకే 'కావ్యేషునాటకం రమ్యం' అని కీర్తించారు. అందుకే నాటిక ప్రక్రియను పరిచయంచేస్తూ, కాల్పనికహాస్య నాటక ద్వారా భాషాభిరుచిని పెంపొందించడమే ప్రస్తుత పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం నాటిక ప్రక్రియకు చెందింది. కవిత్వం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం అన్న లలిత కళల సమాహార రూపం నాటకం. ప్రసిద్ధకథను తీసుకొని రాసిన నాటకాన్ని ప్రఖ్యాతమని, కల్పించి లేదా ఊహించి రాసే నాటకాన్ని ఉత్పాద్యం అని అంటారు. ప్రఖ్యాతం, ఉత్పాద్యం కలిసి ఉంటే మిశ్రమం. నాటకం దృశ్యశ్రవ్యకావ్యం. ప్రేక్షకులపై, పాఠకులపై బలమైన ముద్రవేస్తుంది. నాటకం, నాటిక రెండింటినీ సమానార్థకాలుగా వాడుతున్నప్పటికీ నిడివి దృష్ట్యా నాటిక చిన్నది. ప్రస్తుత పాఠాన్ని విశ్వనాథ సత్యనారాయణగారి "అసంకలిత సాహిత్యం-4 - రూపకాలు సంపాదకీయాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించారు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠానికి ముందు 'ప్రవేశిక' చదవండి. నాటిక ఎలా ఉంటుందో ఊహించి చెప్పండి.
- 'నాటిక'ను చదవండి. సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.
- 'నాటిక'ను నాటకీకరణ చేయండి.

## కవి పరిచయం



(1895 - 1976)

తెలుగులో జ్ఞానపీఠ అవార్డుపొందిన ప్రథమవ్యక్తి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. ఈయన కృష్ణాజిల్లా నందమూరు గ్రామంలో జన్మించాడు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రి ఈయనకు గురువు. సంస్కృతం, ఆంగ్ల భాషలపై పట్టుసాధించాడు. ఈయన నేషనల్, హిందూ, ఎ.సి.కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా, శాసనమండలి సభ్యులుగా పనిచేశాడు.. కావ్యం, గేయం, నవల, కథ, వ్యాసం, నాటకం, విమర్శ, శతకం వంటి విభిన్న ప్రక్రియల్లో రచనలు చేశాడు. పలుగ్రంథాలకు పీఠికలు రాశాడు. ఈయనను కేంద్రప్రభుత్వం "పద్మభూషణ్" బిరుదుతో సత్కరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదుతో, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం "గౌరవ డాక్టరేటు"తో సన్మానించింది. ఈయన రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి ఆంధ్రపౌరుషం, ఆంధ్రప్రశస్తి, శ్రీమద్రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు, విశ్వనాథ మధ్యాక్కరలు, మాస్వామి, కిన్నెరసానిపాటలు మొదలైనవి. వీటిలో శ్రీమద్రామాయణ కల్పవృక్షానికి జ్ఞానపీఠ పురస్కారం, విశ్వనాథమధ్యాక్కరలకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఈయనకు తెలుగుభాష అన్నా, తెలుగు తనం అన్నా వల్లమాలిన అభిమానం.

### ప్రవేశిక

*అప్పుఇచ్చేవాళ్ళు డబ్బు ఆశకు ఇస్తారు. తీసుకునేవాళ్ళు తమ అవసరాల కోసం తీసుకుంటారు. అప్పిచ్చినవాళ్ళు డబ్బు వసూలు చేయటానికి నానా ప్రయత్నాలు చేస్తూంటారు. అయినప్పటికీ కొంతమంది దగ్గర ఆ డబ్బును రాబట్టుకోలేక నానా యాతనలు పడుతూంటారు.*

*ఒక యక్షుడికి అప్పిచ్చి తిరిగి వసూలు చేసుకోలేక నానా అవస్థలకు గురైనవాడు రామగిరి. ఇంతకూ... ఆ యక్షుడెవరు? ఆ రామగిరి ఎవరు? యక్షుడి నుండి తన అప్పును రాబట్టుకోవడానికి రామగిరి పడిన పాట్లు ఏమిటి?... చివరకు ఏం జరిగింది? ఈ పాఠం చదివి తెలుసుకోండి.*

*పాత్రలు :- కేశవదాసు, రామగిరి, కనకారావు, రామం (కేశవదాసు కొడుకు), పూజారి.*

## I

1

రామం : నాన్న, ఎవరో నిన్ను చూడటానికి వచ్చారు.

దాసు : నన్ను చూస్తాడూ? కన్ను ముక్కు చెవులు అందరికి మల్లేనే ఉన్నాయి కదరా నాకూనూ. నన్ను చూసి ఏంచేస్తాడు? పెళ్లి సంబంధానికి వచ్చాడా? నేను మీ అమ్మని పెండ్లి చేసికొని చాలా రోజులయింది. వస్తే నిన్ను చూడటానికి రావాలి. ఎవడైనా ఒక పదివేలు కట్నం నీకిస్తే సంసారం గడుపుదామనుకొంటున్నాను. నీకు ఉద్యోగం లేదు. అన్నట్లు నువ్వు పాసయింది ఏమిటి?

రామం : అదేమిటి నాన్నా, అట్లా అంటావు.నేను బి.ఎ. పాసయినాను.

దాసు : బి.ఎ. అంటే ఏమిట్రా? బి.యస్.సి. అన్నా బి.కామ్. అన్నా ఏదో తెలుస్తుంది. బి.ఎ. అంటే ఏం తెలుస్తుంది.

రామం : ఎ అంటే ఆర్ట్స్.

దాసు : ఆర్ట్స్ అంటే చిత్రకళలేగా. నీకు ఏమి చిత్ర కళలు వచ్చు? కవిత్వం రాదు, సంగీతం రాదు, చిత్రలేఖనం రాదు. చేతి పనులు ఏవీ రావు, నీవు బి.ఎ. ఏమిటి?

రామం : అదేమిటి నాన్న, వాళ్లిచ్చారు నేను తీసుకున్నాను.

దాసు : ఒక హిస్టరి, లాజిక్, ఇలాటివే కదరా నీవు చదివింది. ఇవి ఏవీ ఆర్ట్స్ కావు.

రామం : సరే వాకిట్లో ఎవరో వచ్చి కూర్చున్నారు.

దాసు : వాకిట్లో కూర్చున్నాడు? అంటే వరండాలోనా, వీథి వాకిట్లోనా? నేను కదల్లేనురా బాబూ, ఆయన పేరడిగిరా.

రామం : ఆయన చెప్పనంటున్నాడు.

దాసు : అసలు పేరు వుండి చెప్పడం లేదా లేక నాకు చెప్పడం ఇష్టం లేదా. నీకు చెప్పని వాడు నాకెందుకు చెపుతాడు? నా గొప్ప ఏమిటి?

రామం : నాన్నా, వస్తావా, ఆయనని వెళ్లి పొమ్మంటావా?

దాసు : వెళ్లమంటె వెళ్లేటట్లున్నాడా? కొంపదీసి భోజనానికి వచ్చాడేమో? మనింట్లో చేట బియ్యం అప్పు తెచ్చాం. ఇంట్లో కూరాలేదు నారా లేదు. వాళ్ల దుంపలైగ. సరిగా భోజనం వేళకు వెధవ మొహాలు వేసుకొని తయారవుతారు. బోలెడు హోటల్స్ వున్నాయి. వాళ్లు హోటల్స్‌లో భోంచెయ్యరు.

రామం : నాన్న, ఆయన ఎవరో పెద్ద మనిషల్లే ఉన్నాడు.

దాసు : పెద్ద మనిషల్లే ఉన్నాడు. ఇపుడు పచ్చి తాటాకులు ఎక్కడదొరుకుతాయిరా? అది సరే, ఆకారం ఎట్లా ఉంటాడు.

రామం : కొంచెం లావుగా ఎత్తుగా వున్నాడు.

దాసు : నాకన్నా ఎత్తా?

రామం : ఆ కొంచెం.

దాసు : పద చూద్దాం.

## II

2

దాసు : అయ్యా నమస్కారం. కూర్చొండి. తమరిదేవూరు?

రామ : నేను, నా పేరు, మావూరు అంతా ఒకటె. రామగిరి.

దాసు : చాలా బాగుంది.

రామ : కరీంనగర్ దగ్గర వేములవాడ వెళ్లేదారిలో మధ్య కొండలున్నవి. అదే రామగిరి. అదే నేను.

దాసు : చచ్చామే. మీరు ఒక పర్వతం అన్నమాట. మనిషి ఎట్లా అయినారు?

రామ : అదేమిటండి. చదువుకున్నవారు మీరు అలాగే అంటారు! కాళిదాసు కుమార సంభవంలో మొదటి శ్లోకంలో ఏమన్నాడు. “దేవతాత్మ అయిన హిమగిరి ఉత్తర దిక్కునందున్నాడు” అన్నాడు. ఆయనకు కూతుళ్లు, పెళ్లాము. ఇహ ఎందుకు మనిషి కాడు. అట్లాగే నేనున్నూ.

దాసు : మేఘసందేశంలో తమరిని గురించి ఉన్నది. మీ ప్రాంతాలలోనే యక్షుడు నివాసం చేశాడట. ‘ఆయన జనక తనయా స్నానపుణ్యోదకములు కలవాడు’ అని కూడా అన్నాడు. ఆ యక్షుడు ఎంత పుణ్యాత్ముడో నేను అంత పుణ్యాత్ముని వలె వున్నాను.

రామ : ఆ యక్షుడేం పుణ్యాత్ముడు కాడు. అప్పులు ఎగగొట్టేవాడు. నా కొంప తీసాడు. మీరు మేఘసందేశం చదివారు కదా. ఆ యక్షుడి ఇల్లు చూడండి. ఎంత భోగము, రత్నాలు, మాణిక్యాలు, వాడి దిగుడు బావిమెట్లు మరకతాలు. ఎందరి డబ్బు ఎగకొట్టి అట్లా అయినాడో! కుబేరుడు వాణ్ణి శపించాడు. నా దగ్గర ఏడాది వున్నాడు. పన్నెండు లక్షలు అప్పిచ్చాను వాడికి. పెళ్ళానికి హుండీలు పంపించాడు. ఇంతమటుకు పైసా చెల్లించలేదు.

దాసు : అయిదు, ఆరు వందల ఏండ్లయిందనుకొంటాను.

రామ : అది మీ ఇంగ్లీషు వాళ్లలెక్క. కాళిదాసు విక్రమార్క చక్రవర్తి ఆస్థానకవి గదా. విక్రమార్క చక్రవర్తి క్రీస్తు పూర్వము వాడు. ఆయన వ్రాసిన కథ అంతకు పూర్వానిది కదూ.

దాసు : మరి ఎన్ని వేల ఏండ్లయింది మీ అప్పు తీసుకొని?

రామ : తక్కినదంతా తగలబెట్టండి. ఈ రెండు వేల ఏండ్లకైనా వడ్డీ ఇవ్వాలి కదా.

దాసు : కొంపదీసి ఆ వడ్డీ నన్నిమ్మంటా రేమిటి? ఉరుములు వురిమి మంగలం మీద పడ్డట్టు.

రామ : కాదు బాబు, మీరొక్క చిన్న సహాయం చేయాలి.

దాసు : నేనా? ఒట్టి మానవుణ్ణి. మీరొక పర్వతము.

రామ : అది కాదు బాబూ, నేను మిమ్మల్ని గురించి ఒక మాట విన్నాను. మీరు కవి గదా! మీరేదో పెద్ద గ్రంథము వ్రాసి శివుడికి అంకితమిచ్చారుట. మీరా శివుడికి ఒక సిఫార్సు చేస్తే ఆయన కుబేరుణ్ణి చీవాట్లు పెడతాడు. కుబేరుడు యక్షుణ్ణి ఇవ్వమంటాడు. వీడు దక్కిస్తు ఇస్తాడు.

దాసు : నేనా? శివుడికి సిఫార్సా? శివుడి మొహం కూడా ఎరుగనే నేను.

రామ : శివుడికి మొహముంటే కదా మీకు తెలియటానికి. అది వొట్టి శివలింగము. మీరు మీ వూళ్ళో శివలింగానికి సిఫార్స్ చేసినా చాలు.

దాసు : బాబో! ఎందుకు నా ప్రాణాలు తీస్తావు. ఈ దేశములో మేఘసందేశము తర్జుమాచేసిన వాళ్లు వేలకు వేలు ఉన్నారు. నేనా పని ఎప్పుడూ చేయలేదు. మీరు నాయందు దయవుంచి వాళ్లలో ఎవరి వద్దకైనా వెళ్లవలసింది.

రామ : ఛా, ఛా, మీకు దేవుడు ప్రత్యక్షము.

దాసు : ఆయన నాకెప్పుడూ కన్పించలేదే.

రామ : మీకు తెలియదు. వేములవాడలో చెప్పుకుంటున్నారు.

దాసు : అన్నట్లు వేములవాడలో శివలింగముంది కదూ. ఆయన చేత చెప్పించలేక పోయినారా?

రామ : ఆ మాత్రం యోగ్యత వుంటే మీ దగ్గిర కెందుకొస్తాను? ఆ వేములవాడలో శివుడికీ నాకూ పడదు.

దాసు : అయితే ఎక్కడ శివుడికి, మీకు పడదు.

రామ : కాదు బాబోయి. అక్కడా భేదములున్నాయి. మరి మీ వూరి శివుడు కైలాసము వెళ్లి చెపితే తిరుగులేదు.

దాసు : బాబో! నేను మా వూరు వెళ్లాలంటే, వ్యాధిగ్రస్తుణ్ణి, తీరా తప్పక వస్తే ఒక టాక్సి మీద వెళ్ళాలి.

రామ : నేను టాక్సి తీసికొస్తా గదా!

దాసు : అయ్యో బాబోయ్, మీరు అందులో ఎక్కరు గదా?

రామ : నేనెక్కన్లేవయ్యా! నేను ఎక్కితే ఆ టాక్సి ఏం నిలుస్తుంది. నా దారిన నేను వస్తాను.

దాసు : బాబూ ఈ మధ్యన వున్న వూళ్లన్ని ఏం కావాలి?

రామ : నేను అక్కడి నుండి ఇక్కడకొచ్చా గదా. వూళ్లన్ని ఏమయినాయి?

దాసు : టాక్సికి చాల డబ్బు అవుతుందండి.

రామ : నేను పెట్టుకొంటానంటున్నాను గదా!

దాసు : నాకు పది వేల అప్పు వున్నది. అది తీర్చిపెడతారా?

రామ : మీరు చాలా మందికి ఉపకారాలు చేసారట. నాకీ ఉపకారం చేసి పెట్టండి.

దాసు : చేసాను గనకనే అప్పులయినాయి. లేకపోతే వడ్డీకి ఇవ్వండి పదివేలు. క్రమంగా తీర్చుకొంటాను.

రామ : ఒక కవి ఎవడి గురించో వ్రాస్తే వాడి కప్పిస్తేనే తేలలేదే ఇంత వరకూ. ప్రత్యక్షంగా కవికే ఇవ్వమంటావా? ఇస్తే అది వస్తుందా? ఛస్తుందా?

దాసు : నేను అటువంటి వాణ్ణి కాదు. దమ్మిడితో సహా చెల్లిస్తాను.

రామ : ఏమి చెల్లిస్తావయ్యా? నా వడ్డీ నెలకు వందకు ఏడు రూపాయలు. ఏ నెల వడ్డీ ఆ నెల యిచ్చినా నీ జీతము సరిపోదు. పైగా ఒక సంవత్సరము వడ్డీ మినహాయించి గాని నీకు యివ్వను. ఆ వడ్డీ పోగా నీకు పది వేలు వస్తవి. అనగా తొమ్మిది వేల మూడు వందలే వస్తవి.

దాసు : బాబోయి! పదకొండు వేలియ్యి. నా చేతిలో పదివేలు పడాలి.

రామ : బాబో! నేను మీ వంటి వాళ్లకివ్వను. నాకు కవులంటే కొంత అభిమానముంది. ఆ యక్షుడి అప్పు నాకు ఇప్పించి పెట్టు. నీకు పది వేల రూపాయలు వూరికే ఇస్తాను.

దాసు : ఇంత కర్కోటకుడవు. అప్పుడు నీ మాట మీద నిలబడతావని నమ్మకం ఏమిటి?

రామ : కావలిస్తే శివుడి దగ్గర ఒప్పందం చేస్తాను.

దాసు : మా వూరు వెళ్లి చాలా రోజులైంది. మా చుట్టాలంతా అక్కడే వున్నారు. వారిని చూచినట్లవుతుంది. టాక్సి తీసికొని రా. ఇపుడే చెబుతున్నానబ్బాయి. నన్ను మళ్లీ తీసుకొని వచ్చి ఇక్కడ దింపి తీరాలి.

రామ : కాదయ్యా బాబు! అక్కడ అందరు చుట్టాలంటున్నావ్. మా యింట్లో వుండు, మా యింట్లో వుండమని మీ బంధువులంతా బలవంతం చేస్తే నీవు వుంటావు. ఈ కారు వాడికి నేను ఇచ్చుకోవాలి.

దాసు : పరవాలేదు. అక్కడ వున్న చుట్టాలంతా నా అంత డబ్బు గలవారు. బియ్యం, పప్పు, దొరకని రోజుల్లో వాళ్లు వుండమనరు. నీకా భయము అక్కర్లేదు.

రామ : మగవాళ్లు వుండమనరయ్యా. ఉండమనేది ఆడవాళ్లు. వాళ్లకు అది పట్టింది. ఈ పూట వుండిపో అక్కయ్యా నాలుగు మెతుకులు తినిపో అత్తయ్యా, ఎన్ని నాళ్లయిందిరా నువ్వు మాయింటికి వచ్చి. అన్నం తినకుండా వెళతావా అని చంపుతారు. మగవాడు సంపాదించలేక చస్తున్నాడు వాళ్ళకేం తెలుసు? మా యింట్లో నేనీ ఇబ్బంది పడుతూ వున్నాను.

దాసు : నీ భార్య వున్నదన్నమాట. ఓరి బాబోయ్ అక్కడ రెండు పర్వతాలున్నాయా?

రామ : చిన్న చిన్న పర్వతాలు ఇంకారెండున్నాయి. ఎట్లా! మా పిల్లలు.

దాసు : సరేగాని బాబూ తెలీక అడుగుతున్నాను. ఆ హిమవత్పర్వతము పెళ్ళాము మేనక. కూతుళ్ళు గంగా, పార్వతి; పెళ్ళాము, కూతుళ్ళు మా మనుష్యులవంటివారు అని పుస్తకాలవల్ల తెలుస్తుంది. మరి నీ భార్య రాయి. నీపిల్లలు రాళ్లే. ఇదేం కర్మము.

రామ : నీవు నన్ను గూర్చి ఒక పుస్తకం వ్రాయి. నా పెళ్లాం బిడ్డలు కూడా మనుష్యులల్లే వుంటారు.

దాసు : బాబూ! నీ పర్వతాలకి, నీ సంసారానికి, ఒక నమస్కారము.

రామ : టాక్సి తీసికొని రమ్మంటారా?

దాసు : తప్పకుండా తీసికొనిరా.

రామ : అక్కడ మీ బంధువుల యిండ్లలో వుండకూడదు.

దాసు : ఇదేమి అన్యాయమయ్యా!

రామ : నన్ను చూపించి నాతో అర్జంటుగాపని వున్నదని చెప్పు. నేనేదో నీకు డబ్బు ఇస్తానని చెప్పు. వాళ్లు వదిలిపెడతారు.

దాసు : నీవు ఇవ్వనన్నావు గదా డబ్బు.

రామ : యక్షుడు ఇస్తే ఇస్తానన్నాను గదా.

దాసు : గాలిలో దీపము పెట్టి దేవుడా నీ మహిమ.

## III

3

(శివాలయములో గంట మ్రోగును. హరహర మహదేవా అన్నమాట వినపడును.)

దాసు : ఇదుగోనయ్యా మాస్వామి. నేను పిలిస్తే పలుకుతాడంటివిగా. స్వామి! శివా! నేనుపిలుస్తున్నాను పలకండి. (కొంచెము ఆగి) ఏమయ్యా రామగిరి పలకడేం?

రామ : పలకడ మెందుకండి! మీరు ఏదైనా చెబితే వింటాడు.

దాసు : వింటున్నాడని నమ్మకమేమిటి?

రామ : మనకు పని జరగటమే.

పూజారి : నేను పూజారిని. రోజు అర్చన చేస్తున్నాను. నామాటే వినడు. మీ మాటేంవింటాడు?

దాసు : వింటున్నావు గదయ్యా రామగిరి.

రామ : ఏమయ్యా పూజారి! నీ కెంతమంది పిల్లలు?

పూజారి : నలుగురు. ఇద్దరు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళు.

రామ : ఈ గుడిమీద నీకెంత వస్తుంది?

పూజారి : ఆరుపుట్లు వస్తుంది.

రామ : అందరు కులాసాగా ఉన్నారా.

పూజారి : స్వామిదయవల్ల వున్నారు.

రామ : ఊరికే చేయిచూపించినందుకు నిన్ను నీ సంసారాన్ని రక్షిస్తూవుంటే పలకటం లేదంటావేం.

పూజారి : తమరెవరో కాని బాబూ! క్షమించండి. స్వామి పలుకుతున్నాడు.

రామ : అంటే వింటున్నాడన్నమాట. అయ్యా దాసుగారూ! చెప్పండి. స్వామి వింటారు.

దాసు : అయ్యా! రామగిరి! నీవేమో సామాన్యుడి వనుకొన్నాను. స్వామి! పరమశివా! ఈయన పేరు రామగిరి. మీ వేములవాడ ప్రాంతములో వున్నరామగిరి. 'రామగిర్యాశ్రమేషు' అని మేఘసందేశములో కాళిదాసు వ్రాశాడే, ఆ రామగిరి. ఆ యక్షుడు ఏడాది ఈయన దగ్గర వుండి పన్నెండు లక్షలు అప్పుతీసుకొన్నాడు. వేయి యేండ్లకు పైన అయింది గదా! వడ్డీ కూడా ఇవ్వలేదట. తమరు కుబేరుడితో చెపితే ఆయన యక్షుణ్ణి చీవాట్లు పెడుతాడు. ఆ యక్షుడి కేమైన రోగమా! ఆ కాళిదాసు ప్రకారము ఆ కొండ అంతా మణులు, రత్నాలు, మాణిక్యాలు. మీకు నన్ను సిఫార్సు చెయ్యమని రామగిరి నా ప్రాణాలు తీస్తున్నాడు. ఓ శివా! నామీద దయవుంచి ఈయన సంగతి ఆ కుబేరుడితో చెప్పవలసినది. ఏమయ్యా రామగిరి! నీపని అయిపోయిందా?

4

రామ : కేశవ దాసుగారూ! మీయింటికి వచ్చాము అంటే మళ్లీ కారు మీదనే తీసికొచ్చి మిమ్మల్ని మీ ఇంటివద్ద దించానన్నమాట.

దాసు : రక్షించారు. ఇంక వెళతారా!

రామ : నేనా! నేనెట్లా వెడతానండి. విషయం తేల్చుకోకుండా!

దాసు : అంటే నా కర్థం కావడం లేదు. స్వామితో చెప్పమన్నారు చెప్పాను. ఇంక తమ అదృష్టం.

రామ : ఎన్నాళ్ళండీ, స్వామివారు కుబేరుడితో చెపుతారు. కుబేరుడు యక్షుణ్ణి చివాట్లు పెడతాడు. అతడు నా డబ్బు తీసికొచ్చి నాకిస్తాడు. వ్యవహారం అంతారేపు ఎల్లుండిలో తేలిపోతుంది.

దాసు : తేలనీ, మునగనీ, లేకపోతే అధఃపాతాలానికి పోనీ, నీవు మీవూరు పోతావా పోవా?

రామ : ఈ రెండు రోజులు మీ యింట్లోనె వుంటాను.

దాసు : మా యింట్లో వుంటావా! నేనేమి లక్షాధికారిననుకుంటున్నావా? పర్వతానివి, నీకొక్కపూట కూడు పెట్టేటప్పటికి నేను దివాలా అయిపోతాను. నాలుగు పూటల్లో ఏమవుతాను.

రామ : ఏదో వాలా అవుతావు.

దాసు : ఆమాట అట్లావుంచి నేను పెట్టలేనయ్యా. నీవు పోయి హోటల్లో తింటే ఈ వూళ్లో వుండు. నా కభ్యంతరంలేదు. అక్కడ నీ యిష్టం వచ్చినంత తిను. మా యింట్లో పడుకోటానికి వీలు లేదు. మా యింట్లో వున్నవే మూడు మంచాలు. రెండు మంచాలు కూసాలు విరిగినయి. నులకకూడా కాదు. నవ్వారు. పట్టాలు లాగామా, లుంగపడిపోతుంది. మళ్లీపోయి శివుడితో చెప్పుకోవాలి. ఆ కుబేరుడు చెయ్యలేడు, శివుడూ చెయ్యలేడు.

రామ : యక్షుడు చేస్తాడు. ఎవరికోసం చేస్తాడు.

దాసు : ఓయి, బాబూ, వాడూ తక్కువ తినలేదు. వాడు వచ్చి నవ్వారు లుంగ తీసి కూసాలు బిగించి మళ్లీ వేసాడా, నీ పన్నెండు లక్షలలో ఒక లక్ష రామార్పణం. ఒక రూపాయి ఇస్తే ఎవరో చేసి పెట్టేదానికి లక్ష రూపాయలు పోగొట్టుకుంటావా?

**(కనకారావు ప్రవేశం)**

రామ : ఇంకెవరో వచ్చారే. మేము చాలక తమరెవరండి!

కనకారావు: నా పేరు కనకారావు. దాసుగారు నేను స్నేహితులము. వారిని చూద్దామని వచ్చాను. తమరెవరు?

రామ : నాపేరు దరిద్రరావు. పన్నెండు లక్షలు పోగొట్టుకొని వెయ్యి ఏండ్ల మీద వడ్డీ లేకుండా చస్తున్నాను. మీ దాసుగారిని ఆశ్రయించాను.

దాసు : ఓ రామగిరి! అతడు కనకం. వాడి నన్నా పట్టుకోక ఎందుకు పనికి రాని వాడ్ని నన్ను పట్టుకొన్నావేమిటి?

కనకారావు: ఏమిటి దాసు ఈ గోలంతా?

దాసు : చాల ఉంది బాబు. రామగిరి గారు! మావాడిని కొంచెం బయటకు తీసికెళ్లి మీ కథంతా అతనితో చెప్పండి. నేను ఈలోపుగా కొంపలోకిపోయి ఉప్పు, పప్పు, కూరానార వుందేమొ చూచుకొంటాను. అన్నట్లు తమరికి ఎన్ని గొట్టాల బియ్యం పొయ్యమంటారు?

| | | |
|---|---|---|
| రామ | : | కనకారావు గారు కూడా మనిటింకి భోజనానికి వస్తాడు. ఏమండి కనకారావుగారూ. |
| కనకారావు: | | పేరు మాత్రమే కనకారావు మహాప్రభో. ఒకపూట అన్నం దొరికిందా, ఒకపూట ఆయుర్దాయం పెరిగిందన్నమాట. |
| దాసు | : | బియ్యం మాటయ్యా. |
| రామ | : | నేను ఈయనతో అంతా మాట్లాడాలి. అయినా, ఈ దేశంలో అతిథి అనేవాణ్ణి ఇట్లా అనేవాణ్ణి మిమ్మల్నితప్ప మరెవ్వర్నీ చూడలేదు. |
| దాసు | : | నేను ఇంతటి అ భారతీయుడ్ని. ఇటువంటి దౌర్భాగ్యుడిమాట శివుడువింటాడూ! |
| రామ | : | వినడు. నీకు నా కన్నంపెట్టడం తప్పదు. |
| దాసు | : | ఇపుడు తెలిసింది. నీవు రామగిరి కాదు, శేషగిరి కాదు. ఏపూటెట్లా గడుస్తుందా అని ఏడిచే బాపతు. |

## IV

5

| | | |
|---|---|---|
| కనకా | : | నీవెవరవు? |
| పూజారి | : | కేశవదాసుగారు ధర్మకర్తగావున్న దేవాలయపూజారిని. |
| దాసు | : | ఓ యీ పూజారి మల్లయ్యా! వీరు మహారాజరాజశ్రీ పెద్దాపురం కనకారావు పంతులుగారు. వీరు బి.ఎ. నాలుగుసార్లు తప్పారు. |
| కనకా | : | దాసూ! నీ కంటెనయం కదయ్యా! నీవు ఇంటర్మీడియట్ కూడా ప్యాస్ కాలేదుగా. |
| దాసు | : | నాకు ఉద్యోగముంది. |
| కనకా | : | అంటే నేను నీమీద ఆధారపడి వున్నానంటావా? |
| దాసు | : | ఆధారమో గీధారమో నాకు తెలియదు అబ్బాయి! నీకు ఇల్లు వాకిలిలేదు. తల్లి, తండ్రి లేరు. ఆ స్నేహితుని ఇంట్లో ఈ స్నేహితుని ఇంట్లో తింటావు. పడుకుంటావు. నీకు ఒక్కపూట భోజనం పెట్టడమంటే... |
| కనకా | : | అంటే అని ఆగుతావేమిటి? |
| దాసు | : | వెనకటి కొకాయన పూట కూళ్ళింటికెళ్ళి నలుగురం భోజనానికి వస్తాము అన్నాడట. పూట కూళ్ళావిడ నలుగురికి వంట చేసింది. తీరా వీడొకడేవెళ్ళాడు. అదేమిటయ్యా! మీరు నలుగురు వస్తామన్నారుగా ఒక్కడివే వచ్చావేం అన్నది. వాడు తన పొట్టచూపించి నలుగురు ఇక్కడే వున్నారు అన్నాడట. |
| కనకా | : | నేను ఆ జాతివాణ్ణి అంటావు. |
| దాసు | : | నేను అనటంలేదు. మేము బియ్యం పోసుకొనే డబ్బా చెపుతోంది. |
| కనకా | : | ఒక పూట అన్నం పెట్టి సాధిస్తున్నావే! నా కన్నం పెట్టిన ఫలితం కూడా లేదునీకు. |
| దాసు | : | అదుగో రామగిరి. |
| రామ | : | అయ్యా దాసుగారు! మీచలువ వల్ల కొంత యోగించింది. |
| కనకా | : | కొంత డబ్బు చేతిలో పడ్డదా? |

రామ : ఓయి బాబో! దాసు కంటె మీ యందు ఎక్కువ కృతజ్ఞుడ్ని.

కనకా : ఎందు కేమిటి?

రామ : ఈ యక్షుడు ఈ కాగితాల డబ్బు నా మొగాన కుమ్మరించి...

దాసు : అంతా యిచ్చాడా?

రామ : కొంత యిచ్చాడండి. అదంతా వడ్డి కింద లెక్కకట్టు కోమన్నాడు.

కనకా : మా దాసు తన్నితే పోయి గారెల బుట్టలో పడ్డావు.

ఆసు : వడ్డిక్రింద ఎంతిచ్చాడు?

రామ : పన్నెండు లక్ష లిచ్చాడు.

పూజారి : ఓరి బాబోయ్! పన్నెండు లక్షలే.

కనకా : పన్నెండు లక్షలిచ్చాడూ? అసలట్లాగేవుంది. పేడతింటే బెల్లమవుతుంది.

దాసు : డబ్బు ఏది?

రామ : నేను ఒక తెలివి తక్కువ పని చేశాను. ఏకాఏకి మీ దగ్గరకు వస్తే సరిపోయేది. ఇంటి కెళ్ళి నా పెళ్ళాంతో చెపుదాం. సంతోషిస్తుంది అని వెళ్ళాను.

కనకా : ఆవిడ 'డబ్బంతా తీసి కొని దాచు' అనింది. అంతేనా?

రామ : మీరు మహా వివేకులు. మీకు తెలియనిది ఏముంది?

దాసు : నాకు పదివేలిస్తానన్నావుగా.

కనకా : నీకు అసలు వస్తే ఇస్తానన్నాడు. వడ్డీలో ఇవ్వవలసిన అవసరం లేదే!

దాసు : అసలు ఎప్పుడిస్తానన్నాడు?

పూజారి : ఇది తిరుపతి వేంకటేశ్వర స్వామి అప్పులా వుందే! తెలుగుదేశం అప్పు చెల్లిస్తూనే వుంటుంది. నెలకు 2 లక్షలు, 3 లక్షలు. ఆ స్వామి వారి ఋణం తీరదాయే.

కనకా : నీవేమో శివుడి పూజారివి. వేంకటేశ్వర స్వామి మీద ఎంత భక్తి.

పూజారి : దాసు గారూ! మీ అబ్బాయి వస్తున్నాడు.

రామం : నాన్న గారూ!

దాసు : (వెక్కిరింపుగా) ఏమి నాన్న గారూ!

రామం : ఇవాళ ఇంట్లో బియ్యం లేవు. పూజారి వచ్చాడు. కనకా రావు గారు వున్నాడు. కొండంత మనిషి ఈయన వున్నాడు. అమ్మ చెప్పమన్నది.

దాసు : ఒరే రామం! మనింట్లో పెద్ద తట్ట వుంది చూడు. వీళ్ళందర్ని ఆ తట్టలో కూర్చోమని ఆ తట్ట నానెత్తిన పెట్టు.

రామం : వీళ్ళందరూ కూర్చున్న ఆ తట్ట మొయ్య గలవా నాన్నా?

కనకా : అది కాదయ్యా! మేము కూర్చుంటాం. రామగిరిని పెట్టమను.

రామగిరి : స్వామి! మీ వల్ల వుపకారం పొంది నేనంత పని చెయ్యలేను. మీరు కూలిపోతారు.

దాసు : కూలికైనా పోలేను. కూలిపోతేనే మంచిది.

కనకా : ఏమయ్యా రామగిరి! మీ ఆవిడనడిగి ఒక పదివేలు కనీసం ఒక్క వెయ్యి రూపాయలు తీసికొచ్చి మా దాసు కివ్వలేవా?

రామ : ఓయి బాబోయి! మా యింట్లో చీపురు కట్టలు చాలా సమృద్ధిగా వున్నాయి.

కనకా : దాసూ! ఈ మహా ధనవంతులంతా ఇంతే. వీళ్ళందరి దగ్గర లక్షలు వుంటాయి. పెళ్ళాల దగ్గర బడి తొత్తులు.

రామం : ఆ గోలంతా దేనికయ్యా. మా అమ్మకు ఏమి చెప్పమంటావు?

రామగిరి : మీ నాన్నగారు పెద్ద వ్యవహారంలో వున్నారు. మేమెవ్వరం ఇక్కడ భోజనానికి వుండము. ఈ పూటకు ఎక్కడైనా చేట అప్పు తీసికొని రమ్మను.

రామం : ఇంట్లో చేట ఉంటే గదా! మా అమ్మ ఎవరైనా పొరుగింటి వారు బియ్యం ఇస్తే కొంగులో పోసుకొని వస్తుంది. ఆ కొంగు అంతా చిల్లులు సగం బియ్యం జారిపోతాయి.

రామగిరి : ఏమయ్యా పూజారి! నీవు వాళ్ళ ఈనాం తింటున్నావు. వీరి స్థితేమో ఇలా వుందీ?

పూజారి : నీవు ఆయన చేత పని చేయించుకొని పన్నెండు లక్షలు తెచ్చావు. ఆయనకు దమ్మిడి ఇవ్వలేవూ!

దాసు : నాకు ఎవరూ ఇవ్వనక్కరలేదు. శివుడే వున్నాడు.

(ఒక శ్లోకం చదువును)

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. నాటికలో హాస్యం కలిగించే సంఘటనలు ఏమేమి ఉన్నాయో చెప్పండి.**

**2. కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు?**

అ) నేను, నాపేరు, మావూరు అంతా ఒకటి. రామగిరి.

ఆ) ఓరి బాబాయ్ అక్కడ రెండు పర్వతాలున్నాయా?

ఇ) ఈ పదిగొట్టాల అన్నం ఏం చెయ్యమంటావయ్యా!

ఈ) అంటే నేను మీమీద ఆధారపడి వున్నానంటావా?

ఉ) ఆ గోలంతా దేనికయ్యా. మా అమ్మకు ఏమి చెప్పమంటావు?

3. **పాఠం ఆధారంగా పాత్రల స్వభావాన్ని కింది పట్టికలో రాయండి.**

| నాటికలోని పాత్రలు | స్వభావం |
|---|---|
| కేశవదాసు | |
| రామగిరి | |
| కనకారావు | |

4. **పాఠం ఆధారంగా తప్పొప్పులను గుర్తించండి.**

అ) దాసు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడు. (   )

ఆ) కనకారావు పరోపకారి. (   )

ఇ) రామగిరి తను ఇచ్చిన మాటకు కట్టుబడ్డాడు. (   )

ఈ) దాసు చేసిన సిఫారసు ఫలించలేదు. (   )

ఉ) ఇతరులకు సాయం చేసే దాసు అప్పులపాలైనాడు. (   )

5. **పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రామగిరి ఎవరు? ఆయన దాసుదగ్గరికి ఎందుకు వచ్చాడు?

ఆ) దాసు తన ఊరిలోని శివుడికి ఎవరి గురించి, ఏమని సిఫార్సు చేశాడు?

ఇ) రామగిరి దాసుకు పదివేలు ఎందుకు చెల్లించలేదు?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) "గాలిలో దీపముపెట్టి దేవుడా నీమహిమ" అనే సామెతను దాసు ఎందుకు అన్నాడు?

ఆ) దాసు, కనకారావుల స్నేహం ఎలాంటిది?

ఇ) "కూలికైనాపోలేను. కూలిపోతేనే మంచిది" అన్న మాటలను బట్టి దాసు గురించి మీకేమర్థమైంది?

2. **కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) కేశవదాసు పరోపకారియనీ, ఆత్మాభిమానం కలవాడనీ ఎలా చెప్పగలరు?

ఆ) ఈ పాఠం ఆధారంగా అప్పు ఇచ్చేవారి స్వభావం ఎలా ఉంటుందో విశ్లేషిస్తూ రాయండి.

3. **కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) 'యక్షుడి అప్పు' నాటికను కథారూపంలో రాయండి.

ఆ) రామగిరి ఇచ్చిన మాట ప్రకారం దాసుకు పదివేల రూపాయలు ఇచ్చేటట్లు హాస్యం కలిగించేలా నాటికను పొడిగించి రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది మాటలను వివరించి రాయండి.**

అ) 'మాట వినడం' అంటే ______________________

______________________

ఆ) 'ఆ మాట అట్లా ఉంచు' అంటే ______________________

______________________

ఇ) 'అన్నమాట' అంటే ______________________

______________________

**2. అన్నమాట, విన్నమాట, మాట తప్పడం, మాట మీద నిలబడడం... ఇలా 'మాట'ను రకరకాలుగా వాడుతుంటాం కదా! ఇంకా ఏ యే రకాలుగా వాడుతున్నామో రాయండి. ఉదా:- మాటల్లేవు.**

**3. కింది వాక్యాన్ని చదవండి. గీతగీసిన పదాలనుపయోగించి మరికొన్ని వాక్యాలు రాయండి.**

అతడు ఎంత తిండిపోతో అంతటి మహా తెలివిగలవాడు.

**4. కింది పదాలతో సొంత వాక్యాలు రాయండి.**

అ) సిఫార్సు ఆ) డబ్బు గుంజడం ఇ) చివాట్లు పెట్టడం ఈ) మాటమీద నిలబడడం

**5. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

అ) పెండ్లి ఆ) అన్నం ఇ) భోజనం

### వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాల్లో ఉన్న 'అనునాసిక', 'పడ్వాది' సంధుల పదాలను గుర్తించి విడదీయండి. సూత్రం రాయండి.**

అ) ఎక్కడ కూర్చున్నది మరచిపోయి తన్మయులమై చూసేవాళ్ళం.

ఆ) నీవు సందేహపడనవసరం లేదు.

ఇ) పురాణ వాఙ్మయం చూసి భయపడకు. చదివి ఆనందపడు.

ఈ) సన్నుతి చేయి.

ఉ) రాణ్మణి యుద్ధంలో భంగపడదు.

**2. కింది వాక్యాలను ప్రత్యక్ష, పరోక్ష కథనంలోకి మార్చండి.**

అ) నేను నేటి సినిమాలను చూడలేకపోతున్నాను అని అమ్మతో అన్నాను.

ఆ) నీకివ్వాల్సింది ఏమీలేదు అని నాతో అతడన్నాడు.

ఇ) సుందరకాండ చదవమని నాకు ఉపాధ్యాయుడు చెప్పాడు.

ఈ) వాళ్ళమ్మ చెప్పింది భానుప్రకాశ్ ఊరికెళ్ళాడని.

ఉ) ప్రజ్ఞ పద్యాలు బాగాపాడిందని అందరనుకుంటున్నారు.

**3. అర్థాలంకారాల్లోని మరొక అలంకారాన్ని తెలుసుకుందాం.**

ఉదా॥ i) మా చెల్లెలు తాటి చెట్టంత పొడవుంది.

ii) దేవాలయ గోపురాలు ఆకాశానికంటుతున్నాయి.

పై వాక్యాల్లో చెల్లె ఎత్తును, గోపురాల ఎత్తులను ఉన్న ఎత్తు కంటె ఎక్కువచేసి చెప్పడం జరిగింది కదా! అంటే అతిశయంగా చెప్పడం అన్నమాట. ఇలా చెప్పటాన్ని అతిశయోక్తి అంటారు.

- **లక్షణం : విషయాన్ని ఉన్నదానికంటె ఎక్కువచేసి చెప్పడం.**

**కింది లక్ష్యాలను పరిశీలించండి. అలంకారం గుర్తించండి.**

(కింది పద్యం సీత అశోకవనంలో హనుమంతుని విరాడ్రూపం చూసిన సందర్భంలోనిది.)

అ) కం. చుక్కలు తల పూవులుగా
అక్కజముగ మేనుపెంచి యంబర వీధిన్
వెక్కసమై చూపట్టిన
అక్కోమలి ముదము నొందె ఆత్మస్థితిలోన్

ఆ) మా పొలంలో బంగారం పండింది.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

**తెలుగు భాషలో గురజాడ అప్పారావు రాసిన 'కన్యాశుల్కం' నాటకం చాలా పేరుపొందింది. దాన్నిగానీ లేదా ఏదైనా ఇతర నాటకం / నాటికను సేకరించండి. చదవండి. దాంట్లోని విషయాన్ని తెలపండి.**

**సూక్తి**

అయమేవ పరో ధర్మః, ఇయమేవ విదగ్ధతా,
ఇద మేవ హి పాండిత్యం, యదాయాన్నాదికో వ్యయః
భావం: ఆదాయాన్ని మించి ఖర్చు చేయకూడదు. ఇదే పరమ ధర్మం, పాండిత్యం, జ్ఞానం కూడాను. దీన్ని పాటించినవాడు జీవితంలో దుఃఖాన్ని పొందదు.

చదవండి-తెలుసుకోండి

## పద్యనాటకాలు

తెలుగులో వచ్చిన నాటకాలను వస్తువు (అంశం) దృష్టితో పౌరాణిక, చారిత్రక, సాంఘికాలుగా విభజింపవచ్చు. రూపాన్ని బట్టి పద్యనాటకం, వచన నాటకంగా చెప్పవచ్చు. పద్యనాటకాలు ప్రేక్షకుల మనసును ఎక్కువగా దోచుకున్నాయి. పాత్రల సంభాషణలమధ్యలో సందర్భానుగుణంగా పద్యాలు కూడా ఉంటాయి. హార్మోనియం సహకారంతో రాగాలాపన సాగుతుంది. దీంతో నాటకం రసరమ్యంగా రూపుదిద్దుకుంటుంది. నాటకప్రదర్శన తెల్లవారేవరకు కొనసాగేది చాలా సందర్భాలలో. చుట్టుముట్టాళ్ళవారు కాలినడకన, బండ్లపై వచ్చేవారు. వినోద, విజ్ఞానాలందిస్తూ ప్రజాదరణ చూరగొన్న ప్రక్రియ పద్యనాటకం.



తిరుపతి వేంకటకవులు

పద్యనాటక రచయితలలో ప్రత్యేకస్థానాన్ని అందుకున్నవారు తిరుపతి వేంకటకవులు (దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రి). వీరు శతావధానులు. తమ అవధానాలతో ఆంధ్రదేశమంతా పర్యటించి సాహిత్య ప్రపంచంలో నూతనోత్తేజాన్ని కలిగించారు. వీరి అవధానాలతో స్ఫూర్తిపొందిన ఎందరో సాహిత్య రంగంలో అడుగిడి కృషిచేశారు. ఆధునికాంధ్ర సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులైన ఎందరో వీరి శిష్యులు. తిరుపతి వేంకటకవులు రచించిన పాండవోద్యోగ పాండవవిజయ నాటకాలకు లభించిన ప్రసిద్ధి ఇంతింతనరానిది. వంద సంవత్సరాలైనా వీటి వన్నెతరుగలేదు. పసులకాపరి నుండి పండితుని వరకు... అందరి నాల్కలపై నాట్యమాడుతున్నాయి ఈ పద్యాలు. వీటిలో కొన్ని పద్యాలను ఇప్పుడు చూద్దాం.

మ. అదిగో ద్వారక! యాలమంద లవిగో! నందందుఁగోరాడు న
 య్యదియే కోట! యదే యగడ్త! యవెరథ్యల్! వారలే యాదవుల్
 యదుసింహుండు వసించు మేడ యదిగో! నాలాన దంతావళా
 భ్యుదయంబై వరమందురాంతరతురంగోచ్చండమై పర్వెడున్.

ఉ. ఎక్కడ? నుండి రాకయిట? కెల్లరునున్ సుఖులేకదా? యశో
 భాక్కులు నీదునన్నలును భవ్యమనస్కులు నీదు తమ్ములున్
 జక్కగ నున్నవారె? భుజశాలి వృకోదరుఁ డగ్రజాజ్ఞకున్
 దక్కగ నిల్చి శాంతుగతిఁ దాను జరించునె తెల్పు మర్జునా?

శా. బావా! యెప్పుడు వచ్చితీవు? సుఖులే భ్రాతల్సుతుల్చుట్టముల్?
నీ వాల్లభ్యముపట్టు కర్ణుఁడును మన్నీలున్ సుఖోపేతులే?
మీ వంశోన్నతిగోరు భీష్ముఁడును మీ మేల్గోరు ద్రోణాది భూ
దేవుల్ సేమముమై యెసంగుదురె? నీ తేజంబు హెచ్చించుచున్.

ఉ. కౌరవ పాండవుల్ పెనఁగుకాలము చేరువ యయ్యె; మాకు న
వ్వారికిఁగూడ నెక్కుడగు బంధుసముద్రుఁడ వీవు గాన, నీ
చేరిక మాకు నిర్వురకు సేమము గూర్చెడిదౌట, సాయమున్
గోరఁగ నేగు దెంచితిమి గోపకులైక శిరోవిభూషణా!

ఉ. ముందుగ వచ్చితీవు మునుముందుగ నర్జును నేను జూచితిన్
బందుగులన్న యంశ మది పాయక నిల్చె సహాయ మిర్వురున్
జెందుట పాడి; మీకు నయి చేసెద సైన్యవిభాగ; మందు మీ
కుం దగుదానిఁగైకొనుడు, కోరుట బాలుని కొప్పు మున్నుగన్

ఉ. ఆయుధమున్ ధరింప నని కగ్గముగా నొకపట్ల నూరకే
సాయము సేయువాఁడ; బెలుచ న్ననుఁ బిమ్మట నెగ్గు లాడినన్
దోయిలి యొగ్గుదున్; నిజము తొల్త వచించితిఁ గోరికొమ్ము నీ
కేయది యిష్టమో; కడమ యీతని పాలగుఁ బాండునందనా!

ఉ. చెల్లియొ చెల్లకో తమకుఁ జేసిన యెగ్గులు సైచి రందఱుం
దొల్లి గతించె, నేఁడు నను దూతగఁ బంపిరి సంధిసేయ, నీ
పిల్లలు పాపలుం బ్రజలు పెంపు వహింపఁగఁ బొందు సేసెదో!
యెల్లి రణంబు గూర్చెదవొ! యేర్పడఁ జెప్పుము కౌరవేశ్వరా!

చ. అలుగుటయే యెఱుంగని మహామహితాత్ముఁ డజాతశత్రుఁడే
యలిగిననాఁడు సాగరము లన్నియు నేకము గాకపోవు, క
ర్ణులు పదివేవురైన నని నొత్తురు చత్తురు రాజరాజ! నా
పలుకులు విశ్వసింపుము విపన్నుల లోకులఁగావు మెల్లరన్.

శా. జెండాపై కపిరాజు ముందు సితవాజిశ్రేణియుం గూర్చి నే
దండంబుంగొని తోలుస్యందనముమీఁద న్నారి సారించుచుం
గాండీవమ్ము ధరించి ఫల్గునుఁడు మూఁకం జెండుచున్నప్పుడొ
క్కండు న్నీ మొఱ నాలకింపఁడు కురుక్ష్మానాథ సంధింపఁగన్.

# బసవేశ్వర పరిణయం

## ౧

– పాల్కురికి సోమనాథుడు

### చదవండి – ఆలోచించి చెప్పండి.

ఆ రామచంద్రులా కాళ్ళుకడిగే తాను కన్యధారాబోసెను
కాంతలా నలుగురినీ జనకూడు ధారాబోసీ యిచ్చెను
తెరచీరతీసితే శ్రీరాములా జూచి దేవి తానుప్పొంగెను
మంగళాసూత్రమ్ములూ రామచంద్రులూ వేడుకతో
నవ్వుచూ శ్రీరామచంద్రులూ తాను సీత మెడ గట్టెను
ఆణిముత్యపు తలంబ్రాలూ ఆరామచంద్రూలూ వేడుకతో
నవ్వుచూ శ్రీరామచంద్రూలూ తాను సీత శిరసున బోసెను
చిటికెన వ్రేలూ పట్టూకొని సీతతో శ్రీరాములూ
వైవాహికపు వేదికకు చనుదెంచి దేవితో గూర్చుండెను
సప్తపాదములప్పుడూ తొక్కించి అరుంధతిని చూపించిరి

– స్త్రీల రామాయణపు పాటలు (రాఘవ కల్యాణం)

### ప్రశ్నలు:

1. ఈ పాట దేన్ని గురించి తెలియజేస్తున్నది?
2. సీతారాముల కల్యాణం ఇప్పటికీ మనరాష్ట్రంలో వైభవంగా ఎక్కడ జరుగుతుంది?
3. 'కల్యాణం'లో పాటించే సంప్రదాయాల గురించి మీకు తెలిసిన సంగతులు చెప్పండి.
4. 'కల్యాణానికి' – పర్యాయ పదాలు చెప్పండి.

### పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

పరమశివుణ్ణి ఆరాధించేవాళ్ళంతా ఒకటే మతమని, కుల, జాతి, వర్గ, వర్ణ భేదాల కతీతమైన సమ సమాజ స్థాపనకు కృషిచేసిన మహాత్ముడు బసవేశ్వరుడు. 'కాయికవే(మే) కైలాస' (శ్రమ జీవనమే శ్రేష్ఠ) మని చాటిన చైతన్యమూర్తి. ఇతడు కర్ణాటకలోని హింగుళేశ్వర భాగవాటి అనే అగ్రహారంలో మాదాంబ, మాదిరాజు దంపతులకు 1160లో జన్మించాడు. మాదాంబ సోదరుడు బలదేవుడు కళ్యాణకటకరాజయిన బిజ్జలుడి దగ్గర కోశాధికారి. బలదేవుడు తన కూతురు గంగాంబను బసవేశ్వరుడికిచ్చి వివాహం జరిపించాడు. ఆనాటి వివాహ సంస్కృతిని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం ద్విపద ప్రక్రియకు చెందింది. కావ్యాన్ని ద్విపద ఛందస్సులో రాస్తే దాన్ని ద్విపద కావ్యం అంటారు. ఈ పాఠం 'బసవపురాణం' ప్రథమాశ్వాసంలోనిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకు కింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను 'పదవిజ్ఞానం' పట్టికలో గాని లేదా నిఘంటువులో చూసిగాని తెల్సుకోండి.

## కవి పరిచయం



(1160-1240)
(ఊహాచిత్రం)

దేశీయ సంప్రదాయంలో రచనలు చేసిన మొట్టమొదటి కవి పాల్కురికి సోమనాథుడు. బసవపురాణం రచించి బసవేశ్వరుని చరిత్రను పురాణంగా నిర్మించి, ద్విపదకు కావ్య గౌరవాన్ని కలిగించిన శైవ కవి, ఓరుగల్లు సమీపాన గల పాలకుర్తి (పాలకురికి /పాల్కురికి) సోమన జన్మస్థలం. తల్లి శ్రియాదేవి, తండ్రి విష్ణురామిదేవుడు. సోమన వీరమాహేశ్వరాచార్యవ్రతుడు.

బసవేశ్వరునిమీద అచంచల భక్తి విశ్వాసాలను పెంచుకొని, ఆ మహాత్ముని జీవితం, బోధనల ఆధారంగా అనేక రచనలు చేశాడు. బసవ పురాణము, అనుభవసారము, బసవోదాహరణము, వృషాధిప శతకము, చతుర్వేదసారము, చెన్నమల్లు సీసములు, పండితారాధ్య చరిత్రము మొదలైనవి సోమన కృతులు. రగడ, గద్య, పంచకం, అష్టకం, ద్విపద, శతకం, మొ॥ సాహిత్య ప్రక్రియలకు ఈయన ఆద్యుడు. సంస్కృతం, తమిళ, కన్నడ, మరాఠీ భాషా పదాలను యథేచ్ఛగా తన రచనలో ఉపయోగించిన బహుభాషా కోవిదుడు. తెలుగులో మణిప్రవాళశైలిని వాడిన తొలికవి.

## ప్రవేశిక

*భారతీయ సంప్రదాయంలో వివాహానికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. దీనికి కల్యాణం అని మరొకపేరు. అంటే శుభకరమైంది అని అర్థం. ఇది మతాలను, కాలాలను, పాలకులను అనుసరించి వివిధ రూపాలను సంతరించుకుంది. వివాహబంధం కేవలం ఇద్దరు మనుషులను కలిపేది మాత్రమే కాదు, రెండు వంశాలను ప్రభావితంచేస్తూ తరతరాలను తరింపజేసే సంప్రదాయం.*

*పదమూడో శతాబ్దంలో, వీరశైవ మతం విశేష ప్రచారంలో ఉన్నప్పుడు కల్యాణ శోభ ఎట్లా ఉండేదో ఈ పాఠం ద్వారా గ్రహిద్దాం.*

### I

మకర తోరణములు మణి తోరణములు
ముకుర తోరణములు మునుగట్టఁ బనిచి

"కలయంగ వీథులఁగస్తూరి యలుకుఁ
దెలమి ముక్తాఫలంబుల ముగ్గు లిడుఁడు

రండు భక్తులఁ బిలువుండు మీ రెదురు
వొండు! వేగమ తోడి తెండు తెండనుచు

నిటవచ్చునయ్యల కెదురు వచ్చుచును
నటవచ్చునయ్యల కర్థి మ్రొక్కుచును

యవిరళ నవ్య పుష్పాంజలు లిచ్చి
ప్రవిమల ధూప దీపంబులొనర్చి

యమ్మహాత్ములకు సాష్టాంగుడై యక్ష
ణమ్మ విభూతి వీడ్యమ్ము లర్పించి

కోలాటమును బాత్ర గొండ్లి పేరిణియుఁ
గేళిక జోకయు లీల నటింపఁ

బాయక "చాంగు! భళా" యను శబ్ద
మాయతి నాకసంబంది ఘూర్ణిల్ల

నలిరేగి వేణు వీణా వాద్య వితతు
లులియుచు లీలతో నొక్కట మ్రోయ

నానంద గీతంబు లగ్గించువారు;
పూని శంకరగీతములు వాడు వారు;

జతి గీతముల మీఁదc జప్పట లిడుచు
నతిశయ శివభక్తి నాడెడువారు;

నాది పురాతనాపాదిత స్తుతులు
వేదార్థములు గాcగ వివరించువారు;

నెఱి శివమరులున గుఱిలేని వేడ్క
నఱిముఱి మిన్నంది యాడెడువారు;

మ్రొక్కి శివానందమునc దమ్ము మఱచి
నిక్కపు సుఖమున నిద్రించు వారు

## ఆలోచించండి-చెప్పండి

- ఈ ద్విపదను చదివారు కదా! దీంట్లో వినసొంపుగా ఉన్న పదాలు ఏవి?
- "విభూతివీద్యమ్ములర్పించి" అని ఉందికదా! దీని భావం ఏమిటి?
- బసవేశ్వరుని పెండ్లికి ఏయే నృత్యాలు చేశారు? ఏయే సంగీత పరికరాలు ఉపయోగించారు? దీన్నిబట్టి నాటి వివాహాలలో సంగీత, నృత్యాలకు గల ప్రాధాన్యం మాట్లాడండి.



## II

నిఖిల మాహేశ్వర నికరంబునిట్లు
సుఖలీలఁ గొలువున్నచో బసవయ్య

యప్పాదజలముల నభిషిక్తుఁ డగుచు
నొప్పి దివ్యాంబర యుగ్మంబు సాతి

భసితంపు నెఱపూత పలుచగాఁ బూసి
నొసలఁ ద్రిపుండ్ర మొప్పెసఁగ ధరించి

మౌళిఁ బ్రసాద సుమంబులు దుఱిమి
పోలఁగ రుద్రాక్ష భూషలు దాల్చి

సారమై లింగపసాయితంబనెడు
పేరను గల్గు కఠారంబు గట్టి

యానంద బాష్పంబు లలుగులు వాఱ
మేను రోమాంచ సమ్మిళితమై తనర

భక్తి శృంగారమేర్పడఁ జాఱగొన్న
భక్తి కళార్ణవు బసవయ్యఁ జూచి

"యిట్టి ధన్యుఁడ నౌదునే యిప్పు" డనుచు
దట్టుఁడు బలదేవ దండనాయకుడు

తన కూఁతుఁ గామినీజనతిలకంబు
ననుపమ శృంగారవనధి గంగాంబఁ

దోడ్తెచ్చియట్ల భక్తులకు మ్రొక్కించి
యేడ్తేర శుభచేష్ట లెదురుకొనంగ

శివభక్త వనితలు సేసలు సల్ల
శివ బలంబగ్గలించిన ముహూర్తమున

వేదోక్త శివధర్మ విధి బసవనికి
గాదిలి సుతఁ బెండ్లి గావించె నంత...

### ఆలోచించండి-చెప్పండి

- *బసవేశ్వరుణ్ణి వివాహానికి ఎలా అలంకరించారు? ఇలా ఎందుకు చేసి ఉంటారు?*
- *అలంకరణలకు సంస్కృతికి గల సంబంధం ఏమిటి?*
- *బలదేవుడు బసవణ్ణి చూసి తన జీవితం ధన్యమైందని ఎందుకు భావించి ఉంటాడు?*
- *వివాహం చేయడానికి వధువు తల్లిదండ్రులు వరుడు ఎలా ఉండాలని కోరుకొంటారు? ఎందుకు?*



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

## సారాంశం

బసవేశ్వరుడు పెండ్లికి అంగీకరించగానే బలదేవ దండనాయకుడు పట్టణమంతా మకరతోరణాలు, మణితోరణాలు, మల్లెపూల తోరణాలు కట్టేందుకు ఆజ్ఞాపించాడు. "వీధులంతా కస్తూరితో అలికి ముగ్గులు పెట్టండి. భక్తులందరినీ పిలవండి. బసవేశ్వరుని తీసుకొని రండి" అని చెప్తూ, జంగమదేవరలందరినీ పుష్పాంజలులతో ధూపదీపాలతో ఆహ్వానించి, సాష్టాంగ నమస్కారాలు చేసి, విభూతి యుక్తమైన తాంబూలాలను సమర్పించాడు.

ఆ సందర్భంగా కోలాటం, బహురూపులు, గొండ్లి, పేరిణి, కేళిక మొదలైన నృత్యాలు చేస్తూ, 'ధాంగు భళా!' అనే శబ్దాలు ఆకాశాన్నంటే విధంగా మార్మోగుతుండగా, వేణువు, వీణావాద్యతంత్రులన్నీ మోగుతుండగా కొందరు ఆనంద గీతులు పాడారు; శంకరుని స్తుతించారు మరికొందరు; ఆ జతులకు గీతాలకు అనుగుణంగా చప్పట్లు కొడ్తూ అతిశయించిన శివభక్తితో ఇంకొందరు నర్తించారు; ప్రాచీనకాలం నుండీ పరమేశ్వరుడ్ని స్తుతించే విధానాన్ని కొందరు వివరించారు; అపారమైన శివభక్తి పారవశ్యంతో మరి కొందరు ఉత్సాహంతో గంతులేశారు; ఇంకా కొంతమంది శివానందంలో లీనమై సుఖనిద్రలో మునిగిపోయారు.

ఆ విధంగా జంగమయ్యలంతా సంతుష్టులైయుండగా వారి పాదజలంతో అభిషిక్తుడైన బసవేశ్వరుడు దివ్యమైన వస్త్రాలను ధరించి, భస్మాన్ని నిండుగా అలముకొని, నుదుట విభూతిరేఖలు ధరించి, వారి పూజాపుష్పాలను సిగలో తురుముకొని, రుద్రాక్షమాలలు వేసుకొని, లింగపసాయితమనే ఖడ్గాన్ని నడుముకు కట్టుకొని, ఆనందబాష్పాలురాలగా, రోమాంచితమైన శరీరంతో, భక్తి సౌందర్యం ఉట్టిపడుతుండగా వచ్చాడు.

బసవేశ్వరుని చూసి బలదేవుడు తన జీవితం ధన్యమైందని అనుకున్నాడు. సౌందర్యవతి, శ్రేష్ఠురాలైన తన కూతురు గంగాంబను పిలిపించాడు. భక్తులందరికీ మొక్కించి, శివ భక్తురాండ్రంతా అక్షతలు చల్లుతూండగా శివబలం అతిశయించిన ముహూర్తాన వేదోక్తంగా శివధర్మాన్ననుసరించి ప్రియమైన తన కూతురును బసవేశ్వరుని కిచ్చి పెండ్లి గావించాడు.

## చదవండి - తెలుసుకోండి

*1) విభూతి వీడ్యము* : *వీడ్యము అంటే విడియం లేదా తాంబూలం. వీరశైవాచారంలో విభూతితో కలిపి తాంబూలం ఇచ్చి జంగమదేవరలను, గురువులను, పీఠాధిపతులను ఆహ్వానించేటప్పుడు సమర్పించేది విభూతి వీడ్యం. తెల్లని వస్త్రంలో విభూతితోపాటు తమలపాకులు, వక్కలు, ఖర్జూరపండ్లు పెట్టి ఇస్తారు.*

*2) పేరిణి* : *యుద్ధ సన్నద్ధులను చేయడానికి, వీరభక్తిని ప్రకటించడానికి పురుషులు చేసే వీరనాట్యం.*

*3) గొండ్లి* : *ఇదీ కోలాటం వంటిదే. నర్తకులు వృత్తాకారంలో నిలబడి తాళ లయానుగుణంగా నృత్యం చేస్తారు.*

*4) పాత్ర* : *రకరకాల వేషాలు ధరించి ప్రదర్శించే ఆట.*

*5) కేళిక* : *ఇదీ ఒక నాట్య విశేషం.*

*6) జతి* : *సంగీత నృత్యాల్లో లయానుగుణమైన స్వర విన్యాసం.*

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

1. **పెళ్ళివేడుకలో పాటించే సంప్రదాయాలు ఏమేం ఉంటాయి? తెలపండి.**

2. **ఈ పాఠాన్ని రాగంతో, భావంతో చదవండి.**

3. **కింది పద్యాన్ని చదవండి. దాని కింద ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి...**

చ. సురవర పూజ్య! పూజ్యగుణశోభిత! శోభితరూప! రూపవి
స్ఫురతరశీల! శీలగుణపుంగవ! పుంగవసత్త్వ! సత్త్వ సం
హర పరవాద! వాదభయవర్జిత పాపవిచారచార! ఈ
శ్వరసమ నీవెదిక్కు - బసవా! బసవా! బసవా! వృషాధిపా!

ప్రశ్నలు :

అ) సోమనాథకవి రచించిన ఈ పద్యం 'మకుటా' న్ననుసరించి ఏ శతకంలోది తెల్పండి.

ఆ) ఈ పద్యం ఛందస్సును గమనించి, ఏ వృత్తమో గుర్తించండి.

ఇ) ఈ పద్యంలోని అలంకారమేది? ఎలా చెప్పగలరు?

ఈ) ఈ పద్యం ద్వారా కవి ఎవరిని స్తుతిస్తున్నాడు?

4. **కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

అ) సోమనాథుని గురించి రాయండి.

ఆ) "ఇట్టి ధన్యుడ నౌదునే యిప్పు"డని ఎవరు, ఎవరితో, ఏ సందర్భంలో అన్నారో వ్యాఖ్యానించండి.

ఇ) బసవేశ్వరుని పెండ్లి సందర్భంగా కవి పేర్కొన్న ఆటపాటలు ఏవి?

ఈ) పాఠం ఆధారంగా నాటి సంస్కృతి, సంప్రదాయాల గురించి ఏమేమి తెలుసుకొన్నారు?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) అలంకారం అట్లా ఉండటానికి కారణాలేవి?

ఆ) నేటి వివాహాల్లో వధూవరుల అలంకరణలెలా ఉంటాయో రాయండి.

ఇ) బసవేశ్వరుని గురించి రాయండి.

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) ఈ పాఠం సారాంశాన్ని మీ మాటల్లో రాయండి.

ఆ) ప్రాచీన కావ్యాలకు సంబంధించిన పాఠాలు చదవడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) ద్విపద రూపంలోని ఈ పాఠ్యభాగాన్ని గేయంగా గాని, వచన కవితగా గాని మలచండి.

ఆ) నాటితో పోలిస్తే, నేటి వివాహపువేడుకల్లో వచ్చిన మార్పులు ఏమిటి? వీటి గురించి విమర్శనాత్మకంగా మీ స్నేహితునికి ఒక లేఖ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది మాటలు సందర్భాన్ననుసరించి ఎలా ఉపయోగించారో గ్రహించి, ఇంకొక వాక్యం రాయండి.**

అ) తోడ్తెచ్చు : రాధ తన స్నేహితురాలికెదురేగి తోడ్తెచ్చింది.

ఆ) అలుగులువారు : సీత దూరమైనప్పుడు రాముడు కన్నీరు అలుగులు వారగా ఏడ్చాడు.

ఇ) రోమాంచితం : తానెంతగానో అభిమానించే గురువుగారు హఠాత్తుగా కనిపించగానే శివయ్య మేను ఆనందంతో రోమాంచితమైంది.

ఈ) ధర్మవిధి : ధర్మవిధిననుసరించి కార్యాలు నిర్వహించడం సంస్కృతిలో ఒక భాగం.

**2. నిఘంటువు సాయంతో కింది పదాలకు నానార్థాలు వెతికి రాయండి.**

అ) అర్థి : ________________ ________________

ఆ) ఘూర్ణిల్లు : ________________ ________________

ఇ) ముకురము : ________________ ________________

**3. కింది పదాలకు సమానార్థాలనిచ్చే మరి రెండు పదాలను తెలిపి, వాటితో ఒక్కొక్క వాక్యం రాయండి.**

అ) కఠారము : ________________ ________________

ఆ) నిక్కము : ________________ ________________

ఇ) వితతి : ________________ ________________

**4. కింది పదాలలో ప్రకృతులేవో, వికృతులేవో గుర్తించి, సంబంధిత పదాలను ఎదురెదురుగా రాయండి.**

| | | | |
|---|---|---|---|
| పుష్పము | బగితి | అయ్య | సింగారము |
| సుఖము | శృంగారము | ఆర్య | భక్తి |
| పువ్వు | సుకము | | |

## వ్యాకరణాంశాలు

**1. కింది ఖాళీలను పూరించండి.**

| విసంధి | | సంధిపదం | సంధిపేరు |
|---|---|---|---|
| అ) ఆ + మహాత్ములు | = | ____________ | ____________ |
| ఆ) ______ + ______ | = | పురాతనాపాదిత | ____________ |
| ఇ) వేద + ఉక్తము | = | ____________ | ____________ |
| ఈ) ____________ | = | పెండ్లిగావించె | ____________ |
| ఉ) ______ + ______ | = | పలుచగాఁజూసి | ____________ |

**2. మీ పాఠ్యాంశంలోని కింది సమాస పదాలను గుర్తించి విగ్రహవాక్యాలు రాయండి.**

అ) ద్వంద్వ సమాసం

ఆ) సంభావన పూర్వపద కర్మధారయ సమాసం

ఇ) సప్తమీ తత్పురుష సమాసం

**3. కింది వాక్యాల్లోని అలంకారాన్ని గుర్తించండి.**

అ) ఓ రాజా! నీ యశశ్చంద్రికలు దిగంతాలకు వ్యాపించాయి.

ఆ) అజ్ఞానాంధకారంలో కూర్చోకుండా విజ్ఞానవీథుల్లో విహరించాలి.

**4. కింది పాదాలను, వాటి గణ విభజనను పరిశీలించండి. ఏం గమనించారో చెప్పండి.**

| | | | |
|---|---|---|---|
| నల | ర | భ | హ |
| I I I I | U I U | U I I | U I |
| • అ విరళ | నవ్య పు | ష్పంజలు | లిచ్చి |
| నల | ర | భ | హ |
| I I I I | U I U | U I I | U I |
| ప్రవిమల | ధూప దీ | పంబు లొ | నర్చి |

| | | | |
|---|---|---|---|
| త | త | త | హ |
| U U I | U U I | U U I | U I |
| • నా నంద | గీతంబు | లగ్గించు | వారు |
| ర | సల | సల | హ |
| U I U | I I U I | I I U I | U I |
| • పూని శం | కర గీత | ములు వాడు | వారు |

ప్రతి పాదంలోను మొదట మూడు ఇంద్రగణాలు ఒక సూర్యగణం వచ్చాయి కదా!

ప్రతి పద్యంలో రెండు పాదాలున్నాయి కదా!

**ఇలా రెండు పాదాలున్న పద్యాన్నే ద్విపద అంటారు. ఇది జాతి పద్యం.**

5. ప్రస్తుత పాఠం ద్విపదరూపంలో ఉంది కదా! ఈ పాఠంలోని ఏవైనా రెండు పాదాలకు గణవిభజన చేయండి ద్విపద లక్షణాలతో పోల్చండి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- ద్విపద రూపంలో ఉన్న ఏవైనా రచనలు / పుస్తకంలోని కొంత భాగాన్ని సేకరించండి. దాన్ని రాసి చదివి వినిపించండి. (ఉదా॥ సుభద్రా కల్యాణం, రమాపరిణయం, పల్నాటి వీరచరిత్ర, రంగనాథ రామాయణం మొదలైనవి).

## చదవండి - తెలుసుకోండి

*ద్విపద లక్షణం :*

* *ద్విపద జాతిపద్యం*

- *ఇందులో ప్రతి పద్యంలో రెండు పాదాలుంటాయి.*
- *ప్రతిపాదంలో వరసగా మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి.*
- *మూడవ గణం మొదటి అక్షరం యతి. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది.*
- *ప్రాస నియమం ఉంటుంది.*

* *ప్రాసనియమం లేని ద్విపదను మంజరీద్విపద అంటారు.*

* *ద్విపద ప్రక్రియలో రచన చేసినవారు : పాల్కురికి సోమనాథుడు, గోనబుద్ధారెడ్డి, గౌరన, శ్రీనాథుడు, తాళ్ళపాక తిమ్మక్క, తాళ్ళపాక చిన్నన్న, తరిగొండ వెంగమాంబ మొదలైనవారు.*

## సూక్తి

శాంతితుల్య తపోనాస్తి, న సంతోషాత్పరం సుఖం
న తృష్ణాయాః పరోవ్యాధిః, న చ ధర్మో దయాసమః

\- ఆర్యధర్మ

శాంతం వంటి తపస్సు, సంతోషం కంటే సుఖం,
కోరికను మించిన వ్యాధి, దయను బోలిన ధర్మం
లోకంలో లేవు.

# 10 మా ప్రయత్నం

– ఓల్గా , వసంత కన్నబిరాన్, కల్పన కన్నబిరాన్

## చదవండి – ఆలోచించి చెప్పండి.

*ఈ శతాబ్ది నాదే అని సగర్వంగా ప్రకటించుకున్న మహాకవి శ్రీశ్రీ. వారి మహాప్రస్థానం ఆధునిక తెలుగుసాహిత్యంలో దీపస్తంభంగా నిలబడింది. అటువంటి ప్రసిద్ధ కవితాసంపుటికి ప్రఖ్యాతరచయిత చలం 'యోగ్యతాపత్రం' అనే పేరుతో గొప్ప ముందుమాట రాశాడు. ఆ పీఠికలోని ప్రతివాక్యం సాహితీ అభిమానుల నాలుకల మీద నాట్యం చేసింది. అందులోని కొన్ని వాక్యాలను చూడండి!*

*"తన కవిత్వానికి ముందుమాట రాయమని శ్రీశ్రీ అడిగితే, కవిత్వాన్ని తూచేరాళ్ళు తన దగ్గర లేవన్నాడు చలం."*

*"నెత్తురూ, కన్నీళ్ళూ కలిపి కొత్తటానిక్ తయారుచేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి"*

### ప్రశ్నలు:

1. పై పేరా ఏ విషయాన్ని గురించి తెలియజేస్తుంది?
2. శ్రీశ్రీ పుస్తకానికి ఎవరు 'ముందుమాట' రాశారు?
3. ముందుమాట ఎందుకు రాస్తారు?
4. 'చలం' శ్రీశ్రీ గురించి రాసిన వాక్యాలు చదివారు కదా! దీన్ని బట్టి శ్రీశ్రీ కవిత్వం ఎలా ఉంటుందని భావిస్తున్నారు?

## పాఠ్యాంశ ఉద్దేశం

*ఒక పుస్తకం తాత్వికతను, అంతస్సారాన్ని, ఆశయాల్ని, శ్రమను తెలియజేసేదే ముందుమాట. ముందుమాట వల్ల పుస్తకాన్ని చదవాలనే ఆసక్తి పెరుగుతుంది. మంచి పుస్తకాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలో తెలుస్తుంది. అలాంటి 'ముందుమాట'ను పరిచయం చేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.*



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

## పాఠ్యభాగ వివరాలు

*ఒక గ్రంథాన్ని, ఆ గ్రంథ నేపథ్యాన్నీ, లక్ష్యాలను పరిచయం చేస్తూ ఆ గ్రంథ రచయితగాని, వేరే రచయిత, విమర్శకుడుగాని రాసే పరిశీలనాత్మక పరిచయ వాక్యాలను పీఠిక అంటారు. దీనికి ముందుమాట, ప్రస్తావన, తొలిపలుకు, మున్నుడి, ఆముఖం మొదలైన పేర్లెన్నో ఉన్నాయి. 'మహిళావరణం' అనే పుస్తకంలోని ముందుమాట ప్రస్తుత పాఠ్యాంశం.*

## విద్యార్థులకు సూచనలు

- *పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలో విషయం ఏముంటుందో ఊహించండి.*
- *పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీతలు గీయండి.*
- *వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో వెతకండి. లేదా నిఘంటువు చూడండి.*

## పీఠిక రచయిత్రులు



1. **ఓల్గా :** *ప్రముఖ రచయిత్రి. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం నిర్వహించిన వీరు పలు పురస్కారాలను, అవార్డులను అందుకున్నారు. వీరి 'స్వేచ్ఛ' నవల ప్రసిద్ధిపొందింది.*



2. **వసంత కన్నబిరాన్ :** *వీరు మానవ హక్కులు, స్త్రీ సమానత్వం కోసం కృషి చేస్తున్నారు. నేషనల్ అలయెన్స్ ఆఫ్ ఉమెన్, ఇండియన్ నేషనల్ సోషల్ యాక్షన్ ఫోరంలో పనిచేస్తున్నారు.*



3. **కల్పన కన్నబిరాన్ :** *'సెంటర్‌ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్' (హైదరాబాద్) సంచాలకులుగా పనిచేస్తున్నారు. జెండర్ స్టడీస్, క్రిమినల్ లా లో విస్తృత అధ్యయనం పరిశోధనలు చేశారు.*

**ప్రవేశిక**

*"వాళ్ళ అనుభవాలు వింటుంటే ఉద్వేగం కలిగేది. చరిత్రను మా కళ్ళ ముందు పరిచిన వారి జీవితాలను వినటం ఈ పనిలో మాకు అన్నిటికంటే ఆనందాన్నిచ్చిన విషయం... సంస్కరణోద్యమ రథచక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు మా కళ్ళముందు మెదిలి కన్నీరు కార్చారు. స్త్రీలేమంటున్నారో వినకుండా, స్త్రీలేం కావాలనుకుంటున్నారో పట్టించుకోకుండా సాగిన ఎన్నో ఉద్యమాలు, వాటిలో ఘర్షణపడి నిగ్గుదేలి కొత్త చరిత్రను సృష్టించిన స్త్రీలూ–వీళ్ళందరి అనుభవాలతో చరిత్ర కొత్తగా పరిచయమయినట్లనిపించింది" ఈ వివరాల గురించి తెలుసుకోవడానికి పాఠం చదవండి.*

# I

కొత్త సహస్రాబ్దంలోకీ, శతాబ్దంలోకీ అడుగుపెడుతున్న సందర్భంలో గడిచిన కాలాన్ని పరామర్శించుకోవటం, ఆ అనుభవాలను స్మరించుకోవటం, భవిష్యత్తు మీద ఒక అంచనాతో ఆశను పెంచుకోవటం ఎవరైనా సామాన్యంగా చేయాలనుకునే పనే. ఆ పని చేస్తూ ఈ శతాబ్దపు సామాజికాభివృద్ధిలో, సామాజిక మార్పులలో స్త్రీల భాగస్వామ్యాన్ని గురించి ఆలోచించినప్పుడు ఎన్నో విషయాలు మా ముందుకు వచ్చాయి. గడిచిన శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా చెప్పవచ్చునిపించింది. గత శతాబ్దపు చరిత్ర నిర్మాతలుగా వారిది తిరుగులేని స్థానమనిపించింది. ఐతే దీనిని సాధికారంగా, సోదాహరణంగా నిరూపించటానికి ఎంతో అధ్యయనమూ, మరెంతో సమయమూ పడుతుంది. ఆ పని చేయాలనుకుంటూనే ముందుగా ఈ శతాబ్దంలో భిన్నరంగాలలో, కీలక స్థానాలలో, కీలక సమయాలలో పనిచేసి అక్కడ తమ ముద్రవేసిన వందమంది స్త్రీల ఫోటోలతో, వారి గురించిన ముఖ్య వివరాలతో ఒక పుస్తకం తీసుకు రావాలనుకున్నాం. కొత్త శతాబ్దంలో స్త్రీలందరం కలిసి చేసుకునే ఉత్సవంగా ఈ పుస్తకాన్ని తీసుకురావాలనుకున్నాం. ఫోటోలు ప్రచురించాలనే నిర్ణయం చాలా ఆలోచించే తీసుకున్నాం. వ్యక్తులను చూస్తూ, వారి గురించి తెలుసుకోవటానికీ, ముఖమైనా తెలియని వ్యక్తుల గురించి చదవటానికీ ఈ తరంవారు చూపే ఆసక్తిలో తేడా ఉంటుంది. ఈ తరం యువతకు గత చరిత్రను పరిచయం చేసేటప్పుడు వారి మనసులపై ముద్ర వేయటానికి ఫోటోలు అవసరమనిపించింది. ఆ రకంగా వాళ్ళ జ్ఞాపకాలు మనలో ఎక్కువ కాలం ఉంటాయని మా ఉద్దేశం. వంద సంవత్సరాలుగా స్త్రీలు చేసిన పోరాటాలను గుర్తుచేసుకుంటూ జరుపుకునే విజయోత్సవంగా ఈ పుస్తకం నిలబడుతుందనుకున్నాం.

గడిచిన శతాబ్దంలో స్త్రీలు చేసిన పోరాటాలూ, భాగమైన ఉద్యమాలూ, రాణించిన రంగాలూ ఎన్నో ఉన్నాయి. మొదటిసారి చదువుకున్న సామాన్య స్త్రీలు, మొదటిగా వితంతు వివాహం చేసుకునే సాహసం చేసిన స్త్రీలు, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన స్త్రీలూ, ఉద్యమాలలో చేరి జైలుకి వెళ్ళేందుకు తెగించిన స్త్రీలు, నాటకం, సినిమా, రేడియో వంటి రంగాలలోకి మొదటిసారి అడుగిడిన స్త్రీలూ – మొదటి తరపు డాక్టర్లు, శాస్త్రవేత్తలూ, సంగీతకారులూ నృత్యకళాకారిణులు, విద్యాధికులు – తలుచుకోగానే ఒళ్ళు పులకరించే సాహసమూర్తులెందరో. వాళ్ళందరినీ ఒకచోట పెట్టటమనే ఆలోచనే ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఒకరి తర్వాత ఒకరు ఏ ఒక్క పుస్తకంలోనూ ఇమడనంతమంది మాకు తలపుకొచ్చారు. దాంతో చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన మరొకసారి బలంగా కలిగి ఎంతో గర్వమనిపించింది.

సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరకదు. సంప్రదాయ చరిత్రకారులు స్త్రీలను చరిత్రలో అక్కడక్కడా పౌడర్ అద్దినట్లు అద్దుతుంటారు. దానిని స్త్రీల ఉద్యమం ప్రశ్నిస్తూనే ఉంది. దేశంకోసం, తమకోసం ఒక సమూహంగా స్త్రీలు చేసిన పోరాటాలకూ, పడిన సంఘర్షణలకూ, సాధించిన విజయాలకూ గుర్తింపు దొరకదు. చరిత్ర అనే జగన్నాథ రథచక్రాల కింద వాళ్ళ సామూహిక ఉనికి తునాతునకలైపోతుంది. దానితో కొన్ని విజయాలు సాధించిన స్త్రీలను ఒక్కొక్కరుగా తల్చుకుని వాళ్ళ శక్తికి ఆశ్చర్యపడతారు. అట్లాంటి శక్తిమంతులు అరుదుగా ఉంటారని, వారిని అసామాన్య ఉదాహరణలుగా మాత్రమే గుర్తుంచుకుంటారు. మొత్తం సామాజికాభివృద్ధి క్రమంలో విడదీయలేని భాగంగా వారిని చూడకుండా వారి జీవితకథలను విడిగా చదువుతారు. ఇలాంటి స్త్రీలు కూడా వేళ్ళమీద లెక్కబెట్ట గలిగినంతమంది కూడా మన చరిత్ర పుస్తకాలలో కనిపించరు. ఇప్పటికి ముప్పయ్ సంవత్సరాలనుంచీ స్త్రీలకు చరిత్రలో స్థానం లేదనీ, ఉన్న చరిత్ర స్త్రీల ప్రాతినిధ్యాన్ని ప్రతిబింబించే చరిత్ర కాదనే విమర్శ స్త్రీల ఉద్యమం పెడుతున్నా, దానిని మేము ఎంత అర్థం చేసుకున్నా, ఇంతమంది స్త్రీలను ఒక వరసలో చూడటం వల్ల మాకు కలిగిన కనువిప్పు గొప్పది. మన రాష్ట్ర చరిత్రంతా కొత్తగా తెలిసినట్లనిపించింది. ఒక చైతన్య సమూహ ప్రవాహంగా స్త్రీలను మేము చూడగలిగాం. ఇంతకు ముందు విడిగా ఏ ఒక ఉద్యమంలోనో, రంగంలోనో పనిచేసిన స్త్రీల గురించి చదివినప్పుడు కలిగిన అనుభూతికీ, పలురంగాలలో పనిచేసిన వందలమంది స్త్రీలను, వారు సాధించిన విజయాలతో సహా చూడటంవల్ల కలిగిన అనుభూతికీ పోలికే లేదు. స్త్రీల చైతన్య ప్రవాహపు వేగం, జీవం, ఆ ప్రవాహక్రమంలోని మార్పులూ అన్నీ ఒక కొత్త విషయాన్ని మాకు చెబుతున్నట్లనిపించింది. సామూహికమైన ఉనికి, చైతన్యం యివే చరిత్రను రూపుదిద్దుతాయనే విషయం స్పష్టమైంది. ఇంత మంచి సాంఘిక, రాజకీయ సాంస్కృతిక వారసత్వం మనకుందని పొంగిపోయాం. ఈ స్త్రీలందరూ ఈ చరిత్రను నిర్మించేందుకు ఎంత మూల్యం చెల్లించారో తలుచుకుంటే మా గుండెలు బరువెక్కాయి. వాస్తవ జీవిత ప్రతికూల పరిస్థితులతో తలపడుతూ వారు కొత్త కలలు కనటానికీ, కొత్త జీవిత విధానాలను కనుగొనటానికీ ఎన్ని కఠిన పరీక్షలకు గురయ్యారో తల్చుకుంటే ఆ సామాన్యుల సాహసం అసామాన్యమనిపించింది. సమాజంలో ప్రతిదాన్నీ మార్చటానికి సమాయత్తమైన స్త్రీల సమూహం మాకు గొప్ప ప్రేరణ నిచ్చింది.



ఆ ప్రేరణతో, ఉత్సాహంతో ఈ పని మొదలుపెట్టాం. ఊహలకూ, ఆలోచనలకూ లేని పరిమితులు పనిలో ఎన్నో ఉన్నాయి. ముందు స్థల కాలాలకూ సంఖ్యకూ ఎన్నో పరిధులూ, పరిమితులూ ఏర్పడి ఉన్నాయి. ఆంధ్రదేశానికి చెందిన స్త్రీలు అన్నప్పుడు ఆంధ్రదేశం గతంలో ఇప్పటి ఆంధ్రప్రదేశ్ వలె లేదు. భవిష్యత్తులో ఇట్లాగే ఉంటుందనీ లేదు. మద్రాసు ప్రెసిడెన్సి, నైజాం రాజ్యం, ప్రస్తుత కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సాలలో కొన్ని ప్రాంతాలు ఇవన్నీ ఆంధ్రుల సాంస్కృతిక రాజకీయ చరిత్రలో ఉన్నాయి. వాటిని కూడా మా పరిధిలోకి తీసుకున్నాం. తెలుగు అన్న పదాన్ని వాడకుండా ఆంధ్ర అన్న పదం వాడటానికి కారణం ఆంధ్రదేశం అన్న పదంతో ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీ లేకపోవటమే. అందువల్ల ఆంధ్రచరిత్ర, ఆంధ్రదేశ చరిత్ర అని అన్నప్పుడు పందొమ్మిదవ శతాబ్దంలో తెలుగు ప్రజల రాజకీయ సాంస్కృతిక జీవనానికి కేంద్రాలుగా ఉన్న ప్రాంతాలనూ, ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌నీ, రెండింటినీ దృష్టిలో పెట్టుకోవాలి.

### *ఆలోచించండి - చెప్పండి*

- *కాలాన్ని పరామర్శించడం అంటే ఏమిటి?*
- *గడిచిన శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా ఎలా చెప్పుకోవచ్చు?*
- *చరిత్ర ఎలా రూపుదిద్దుకుంటుంది?*
- *మూల్యం చెల్లించడమంటే అర్థం ఏమిటి?*
- *"సామాన్యుల సాహసం అసామాన్య మనిపించింది" అని రచయిత్రులు అనడానికి కారణాలు ఏమిటి?*

## II

ఇక కాలానికి సంబంధించి ఆలోచించినప్పుడు సామాజికంగా స్త్రీలు తెచ్చిన పెద్ద మార్పులు ఈ శతాబ్దంలో ప్రముఖంగా ఉన్నాయి గాబట్టి ఈ శతాబ్దాన్నంతా తీసుకోవాలనుకున్నాం. వీలైనంత వరకూ అన్ని రంగాలనూ దృష్టిలోకి తీసుకురావాలనుకున్నాం. ఇక సంఖ్య విషయానికి వస్తే ఏదో ఒక సంఖ్యకు కట్టుబడక తప్పదు. పుస్తక ప్రచురణలో ఉండే ఆర్థిక పరిమితుల దృష్ట్యా వందమందిని ఈ పుస్తకంలో ఉంచాలనుకున్నాం. కానీ ఆ సంఖ్యతో ఏమీ తృప్తిలేదు. ఆర్థికంగా ఎంత కష్టమనిపించినా మరి కొంతమందిని చేర్చక తప్పలేదు. ఎంపిక చాలా కష్టమనటంలో సందేహం లేదు. ప్రతి రంగంలో తమదంటూ ఒక ముద్ర వేసిన వారిని ఎంచుకోవాలి. అంటే ఆ రంగాలలో నిష్ణాతులైన ఇప్పటి వారిని సంప్రదించాలి. కాలధర్మం చెందిన వారి వివరాలు సేకరించాలి. వర్తమానంలో ఉన్న స్త్రీలను కలుసుకోవాలి, మాట్లాడాలి. వాళ్ళ గురించి ఎట్లా రాయాలనేదాన్ని గురించి ఎంతో ఆలోచించాం. ఇంటర్వ్యూలు చేసి వారు మాట్లాడినది రాయటమంటే, ఇప్పుడు లేని వారితో అది కుదరదు. అందరికీ ఒక పద్ధతి పాటించటమే బాగుంటుంది. పుస్తకంలో విపులమైన ఇంటర్వ్యూలకు చోటు చాలదు. ఇంటర్వ్యూలు తీసుకుని తుంచటమూ సరికాదు. అందువల్ల ఆ పద్ధతి ఒద్దనుకున్నాం. వారి జీవిత విశేషాలనూ, వాళ్ళు చేసిన పోరాటాలనూ, సాధించిన విజయాలనూ క్లుప్తంగా చెప్పటం తప్ప మరో మార్గం కనిపించలేదు. అది కొంత నిరాశ కల్గించినా ఒక సమూహంగా సాగివచ్చే స్త్రీ మూర్తులు మా ఉత్సాహాన్ని ఏమాత్రం నీరుకారనివ్వలేదు.

ఈ పనిలో ఎందరో స్త్రీలను కలిశాం. వాళ్ళతో మాట్లాడటమే పెద్ద ఉత్సాహంగా ఉండేది. వాళ్ళ అనుభవాలు వింటుంటే ఉద్వేగం కలిగేది. చరిత్రను మా కళ్ళముందు పరచిన వారి జీవితాలను వినటం ఈ పనిలో మాకు అన్నిటికంటే ఆనందాన్నిచ్చిన విషయం. సరిదె మాణిక్యాంబగారు "అప్పుడు మా కులం వారిని ఆడవద్దన్నారు. తర్వాత అన్ని కులాలవారినీ ఆడవచ్చన్నారు. మా వృత్తి, పొలాలు, జీవనం అన్నీ తీసేసుకున్నారు. ఇప్పుడు ఇదే జీవనోపాధిగా అన్ని కులాల వాళ్ళు బతుకుతున్నారు" అన్నప్పుడు సంస్కరణోద్యమ రథ చక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు మా కళ్ళముందు మెదిలి కన్నీరు కార్చారు. స్త్రీలేమంటున్నారో వినకుండా, స్త్రీలేం కావాలనుకుంటున్నారో పట్టించుకోకుండా సాగిన ఎన్నో ఉద్యమాలు, వాటిలో ఘర్షణపడి నిగ్గుదేలి కొత్త చరిత్రను సృష్టించిన స్త్రీలూ – వీళ్ళందరి అనుభవాలతో చరిత్ర కొత్తగా పరిచయమయినట్లనిపించింది.

ప్రతివాళ్ళూ ప్రశ్నించారు చరిత్ర సాగిన క్రమాన్ని.

ప్రతివాళ్ళూ ప్రయత్నించారు చరిత్రను మార్చటానికి.

అప్పటి కందుకూరి రాజ్యలక్ష్మి నుంచి మేకప్ రంగంలో ఆడవాళ్ళకు ఎందుకు స్థానం లేదని పోరాడిన శోభాలత వరకూ ప్రతి ఒక్కరూ కొత్త మార్పేదో తీసుకురావాలనీ, తమ జీవితాలలో సామాజిక జీవన రంగంలో కొత్త అర్థాలనూ, వెలుగులనూ సృష్టించాలనీ తాపత్రయ పడినవారే.

"నాటకరంగంలోకి కుటుంబ స్త్రీలు రావాలంటారు – మేమంతా కుటుంబ స్త్రీలం కామా – ఆ మాట ఎవరు మాట్లాడినా నాకు కోపం వస్తుంది. ఏ స్త్రీయైనా కుటుంబంలోంచి రాకుండా ఎక్కడ నుండి వస్తుంది" అని పావలా శ్యామలగారు కోపంగా అడిగిన ప్రశ్నలతో, ఈ పితృస్వామ్య సమాజం స్త్రీలను శాశ్వతంగా విడదీసి, మర్యాద – అమర్యాద పరిధులలో వాళ్ళను కదలకుండా బంధించి, తనకనుకూలంగా మాత్రమే వాళ్ళ కదలికలను నియంత్రించే విధానమంతా కళ్ళకు కట్టింది.

షావుకారు జానకిగారు ఒక ఇంటర్వ్యూలో అంటారు. "శాల్యూట్లన్నీ హీరోలకే, హీరోయిన్లు ఆ తర్వాతే... ఇదీ మన సమాజ విధానం. చివరకు మిగిలేది హీరో గొప్పతనమే" అని. చరిత్రలో కూడా అంతే. ఆ సమాజ విధానాన్ని మార్చటం తేలిక కాదు గానీ ప్రయత్నాలు ప్రారంభించటానికీ, స్త్రీలను చరిత్ర నిర్మాతలుగా అర్థం చేసుకుంటూ చరిత్రను తిరిగి రాయటానికీ ఇది అనువైన సమయమనిపిస్తోంది.

మేం ఈ పుస్తకంలో నూట పద్దెనిమిది మందిని మాత్రమే ఎంచుకున్నది మా పరిమితుల రీత్యానే. మరింత ఆర్థిక వెసులుబాటు ఉంటే ఇంతే ప్రాముఖ్యతగల మరో రెండు మూడు వందల మంది ఈ పుస్తకంలో ఉండేవారు. ఇది మొదటి పుస్తకమే. తరువాతి పుస్తకాలలో వాళ్ళూ ఒక క్రమంలో పరిచయమవుతారు. వీరినే ఎందుకు ఎంచుకున్నారనే దానికి అది మా ఎంపిక అనటం కంటే సమాధానం ఏముంటుంది? ఆయా రంగాలలో వాళ్ళు చేసిన కృషి, వాళ్ళు వేసిన ముద్ర, మొట్టమొదటిగా ఒక ప్రత్యేక రంగంలో అడుగుపెట్టినప్పుడు వాళ్ళెదుర్కొన్న సంక్లిష్ట సందర్భాలు, ప్రజలలో వారికున్న స్థానం, వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్నాం. ఈ స్త్రీలను ఏ వరుసలో ఉంచాలనే ప్రశ్నకు కాలక్రమమే సరైందనిపించింది. ఒకే సమయంలో పలు రంగాలలో పనిచేసిన స్త్రీలను ఒక వరసలో ఉంచటం వల్ల ఒక సమగ్రత వస్తుందనిపించింది. ఒకే కాలంలో భిన్న రంగాలలో అంటే మొత్తం సమాజంలో జరిగిన మార్పులకు స్త్రీలు చేసిందేమిటి, వారి భాగస్వామ్యం ఏమిటి అనేది చూడాలనుకున్నప్పుడు కాలక్రమం పాటించటమే సరైందనుకున్నాం. ముందుమాట గురించి ఒక నిర్ణయం తీసుకున్నాం. తెలుగులో ఇటువంటి ప్రయత్నం మొదటిది కనుకా, ఈ పుస్తకం ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినది గాబట్టీ తెలుగులో వివరమైన ముందుమాట ఉండాలనుకున్నాం. ఇంగ్లీషులో దానిని సంక్షిప్తం చేశాం.

### ఆలోచించండి – చెప్పండి

- *ముద్ర వేయడం అంటే ఏమిటి?*
- *సంస్కరణోద్యమ రథచక్రాల కింద నలగడమంటే ఏమిటి?*
- *"ప్రతివాళ్ళూ ప్రశ్నించారు చరిత్రను మార్చటానికి" అని స్త్రీల గురించి రచయిత్రులు ఎందుకన్నారు?*
- *కొత్త అర్థాలు, వెలుగుల సృష్టి ఎలా సాధ్యమవుతుంది?*

ఈ పుస్తకానికి స్త్రీలను ఎంపిక చేయటానికి మాకు ఎందరో సహకరించారు. ఎందరినో సంప్రదించాం. వారందరికీ మా కృతజ్ఞతలు. ఫోటోలు తీయటానికి భరత్‌భూషణ్‌ని ఎంచుకున్నాం. ఆయన ఈ పని గురించి ఎంతో ఉత్సాహం చూపించారు. అనారోగ్యాన్ని పక్కన పెట్టి ఈ పనిచేశారు. ఈ పనిలో ఆయన పొందిన సంతోషం కూడా మాకు తృప్తి నిచ్చింది. ఇప్పుడు జీవించిలేనివారి ఫోటోలు సేకరించటంలో ఎందరో సహాయపడ్డారు. వారందరికీ మా కృతజ్ఞతలు.

మేమీ ప్రయత్నం తలపెడ్తున్నామని చెప్పిన మరుక్షణం నుంచి దానిని గురించి మాకంటే సీరియస్‌గా ఆలోచించి, మమ్మల్ని ప్రతి సందర్భంలోనూ తరచి తరచి ప్రశ్నించి, మేము ఎంచుకున్న వారిని గురించి ఎందుకు ఎంచుకున్నారనీ, ఎంచుకోని వారిని ఎందుకు వదిలారనీ, ప్రశ్నించి ఎంతో విలువైన సలహాలిచ్చిన వ్యక్తులు ఇద్దరు. ఒకరు ఎస్.ఆర్.శంకరన్, రెండవవారు అక్కినేని కుటుంబరావు. ఈ పుస్తకానికి 'గ్లోసరీ' తయారుచేసే బాధ్యత తీసుకుని, చేసి మాకు సహాయపడింది నాగార్జున. ఈపుస్తకానికి సంబంధించిన భాషా విషయంలో తమ అమూల్యమైన సలహాలిచ్చింది చేకూరి రామారావుగారు. ఇక ఈ పుస్తకం ఎలా ఉండాలి, లోపలి విషయానికి తగినట్లుగా ఎంత అందంగా, హుందాగా, గంభీరంగా అదే సమయంలో ఆకర్షణీయంగా ఎట్లా పుస్తకాన్ని తీర్చిదిద్దాలని తపనపడి, ఇంత చక్కని రూపంలో మా చేతుల కందించిన వ్యక్తి రాజ్‌మోహన్ తేళ్ళ. డిజైన్‌లో, ఆర్ట్ వర్క్‌లో ఒక పరిపూర్ణత సాధించటానికి ఆయన చాలా శ్రమపడ్డారు. పుస్తకం అనుకున్న సమయంలో రావటానికి మాకంటే ఎక్కువ కష్టపడింది రాజ్‌మోహన్.

అస్మితలో ప్రధానంగా ఈ బాధ్యత తీసుకుని పని చేసింది నీనా జాదవ్, కంచ రమాదేవి. భరత్‌భూషణ్‌తో పాటు వెళ్ళటం జీవిత విశేషాలు సేకరించటం, అన్నింటినీ ఒక పద్ధతిలో భద్రపరచటం మొదలైన పనుల బాధ్యత వీరు తీసుకున్నారు. పద్మిని, సుజాత, సుబ్బలక్ష్మి ఇంగ్లీషులో పుస్తకాన్నంతా కంప్యూటర్ మీద కంపోజ్ చేశారు. సంవత్సరం పాటు జరిగిన ఈ పని చేయటానికి వీలుగా అస్మిత రోజువారీ పనుల నుండి మాకు సమయం కల్పించి, ఆ పనులు కూడా బీనా నిర్వహించటంవల్ల మా పని కొంత తేలికయింది. ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన వారందరికీ మా కృతజ్ఞతలు.

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. పాఠం ఆధారంగా కింది అంశాలపై మాట్లాడండి.**

అ) ఇరవయ్యో శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా గుర్తించవచ్చా? చర్చించండి.

ఆ) మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో కింది వాటిలో ఏ అంశంపై ఏమేం మాట్లాడతారు?

1) బాలికా విద్య - ఆవశ్యకత

2) నీకు నచ్చిన మహిళ - గుణగణాలు

3) మహిళల సాధికారత - స్వావలంబన

4) పురుషులతో దీటుగా మహిళల ప్రగతి నిజమేనా?

**2. కింది వాక్యాలు పాఠ్యాంశంలో ఎక్కడ వచ్చాయో గుర్తించి వాటి సందర్భాల్ని వివరించండి.**

అ) సంప్రదాయ చరిత్రకారులు స్త్రీలను చరిత్రలో అక్కడక్కడా పౌడర్ అద్దినట్లు అద్దుతుంటారు.

ఆ) ఊహలకూ, ఆలోచనలకూ లేని పరిమితులు పనిలో ఉన్నాయి.

ఇ) శాల్యూట్లన్నీ హీరోలకే, హీరోయిన్లు ఆ తర్వాతే... ఇదీ మన సమాజ విధానం.

**3. కింది గద్యం చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

50వ దశకపు రెండవభాగం నుంచీ డెబ్భైయవ దశాబ్దం వరకూ రచయిత్రులు ఒక వెల్లువలా తెలుగు సాహిత్యాన్ని ముంచెత్తారు. ఆచంట శారదాదేవి, ఇల్లిందల సరస్వతీదేవి, మాలతీ చందూర్, లత, శ్రీదేవి, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, ద్వివేదుల విశాలాక్షి, యద్దనపూడి సులోచనారాణి, ఆనందారామం, డి.కామేశ్వరి, బీనాదేవి మొదలైన రచయిత్రుల పేర్లు ఇంటింటా వినిపించే పేర్లయ్యాయి. రచయిత్రుల నవలలతో నవలా సాహిత్యానికి తెలుగులో విస్తృతమైన మార్కెట్ ఏర్పడింది. రచయితలు ఆడవారి పేర్లతో తమ రచనలను ప్రచురించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. 1980వ దశకం తెలుగు సాహిత్యంలో స్త్రీల దశాబ్దంగా చెప్పవచ్చు. నవలా సాహిత్యంలో అరవయ్యవ దశాబ్దంలో తిరుగులేని స్థానం సంపాదించుకున్న రచయిత్రులు 80వ దశాబ్దంలో కవిత్వంలో కథలలో తమ ముద్ర వేశారు. అంతవరకు కవిత్వం తమదనుకునే పురుషుల భ్రమలను బద్దలు కొట్టారు. కవిత్వం రాయడమేకాదు. అంతవరకు కవిత్వంలోకి రాని స్త్రీల అణచివేతలోని పలుకోణాలను తమ కవితావస్తువుగా స్వీకరించారు. ఈ శతాబ్దంలో వచ్చిన రెండవ ఉత్తమ కవితా సంకలనంగా 'నీలిమేఘాలు' స్త్రీవాద కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఓల్గా 'రాజకీయకథలు', 'స్వేచ్ఛ' నవల స్త్రీల శరీర రాజకీయాలనూ, కుటుంబ అణచివేతనూ కొత్త పద్ధతిలో పరిచయం చేశాయి. జయప్రభ, కొండేపూడి నిర్మల, పాటిబండ్ల రజని, పి.సత్యవతి, సి.సుజాత, మృణాళిని, కె.వరలక్ష్మి, కె.గీత, కుప్పిలి పద్మ, జానకీబాల, జయ వంటి స్త్రీవాద రచయిత్రులు తెలుగుసాహిత్యంలో స్త్రీవాదాన్ని స్థిరపరిచారు.

అ) తెలుగు సాహిత్యంలో రచయిత్రులు ఏ కాలంలో వెల్లువలా వచ్చారు?

______________________________

ఆ) 80వ దశకం స్త్రీల దశాబ్దమని ఎలా చెప్పగలవు?

______________________________

ఇ) స్త్రీవాద కవయిత్రులు సాధించిన విజయాలు ఏమిటి?

______________________________

ఈ) స్త్రీవాద సాహిత్యంలో ఏ వస్తువులు ప్రాధాన్యం వహించాయి?

______________________________

ఉ) పై పేరాకు అర్థవంతమైన శీర్షికను పెట్టండి.

______________________________

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

అ) సంపాదకులు మహిళావరణం పుస్తకాన్ని ఎందుకు తీసుకురావాలనుకున్నారు?

ఆ) మహిళావరణం రచయిత్రులు ఏ ఏ రంగాలకు చెందిన స్త్రీల వివరాలు సేకరించాలనుకున్నారు?

ఇ) మహోన్నతులైన స్త్రీల విశేషాలు సేకరిస్తున్న సందర్భంలో సంపాదకులు పొందిన అనుభూతులు ఏంటి?

ఈ) మహిళావరణం పుస్తకంలోకి ఎంతో మంది స్త్రీలను తీసుకోవాలని ఉన్నా కొద్దిమందిని మాత్రమే ఎంపిక చేసుకోవడానికి గల కారణాలు ఏమిటి?

ఉ) మహిళావరణం పుస్తక ప్రచురణలో సంపాదకులకు సహాయపడిన వారెవరు?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) "సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరకదు" దీంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?

ఆ) రచయిత్రులు సంకలనం చేసిన పుస్తకానికి "మహిళావరణం" అనే పేరు సరిపోయిందని భావిస్తున్నారా? ఎందుకు?

ఇ) "ప్రతివాళ్ళూ ప్రశ్నించారు చరిత్ర సాగినక్రమాన్నీ!" అని స్త్రీల గురించి రచయిత్రులు ఎందుకు పేర్కొన్నారు?

**2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన సంపాదకులకు కలగడానికి గల కారణాలను వివరించండి.

ఆ) "ఈ స్త్రీలందరు ఈ చరిత్రను నిర్మించేందుకు ఎంత మూల్యం చెల్లించారో తలచుకుంటే మా గుండెలు బరువెక్కాయి" అనడంలో పీఠికాకర్తల ఆంతర్యం ఏమిటి?

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) ఒక ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మీ పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వస్తున్నారు. వారిని మీరు ఏమి ప్రశ్నించదలచుకున్నారో ఆ ప్రశ్నల జాబితా రాయండి.

ఆ) మహిళల పట్ల చూపుతున్న వివక్షలను, వారి మీద జరుగుతున్న దాడులను ఖండిస్తూ, మహిళలందరూ ధైర్యంతో మెలగాలని తెలియజేసేలా ఒక కరపత్రం తయారుచేయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.**

అ) సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరకదు. (______, ______, ______)

ఆ) అందరికీ ఒక పద్ధతి పాటించడమే బాగుంటుంది. (______, ______, ______)

ఇ) ఎన్నో అనుభవాలు స్మరణలోకి తెచ్చుకున్నాను. (______, ______, ______)

**2. ఈ పాఠంలో శబ్దాలంకారం ఉన్న వాక్యాలను గుర్తించి రాయండి.**

ఉదా: "అప్పుడు మా కులం వారిని ఆడవద్దన్నారు.
తర్వాత అన్ని కులాలవారిని ఆడవచ్చున్నారు." } అంత్యానుప్రాస.

**3. పాఠం ఆధారంగా కింది జాతీయాలు ఏ సందర్భాలలో వాడతారో వివరించండి.**

అ) గుండెలు బరువెక్కడం ఆ) నీరుకారిపోవడం ఇ) కనువిప్పు

ఈ) కాలధర్మం చెందడం ఉ) తునాతునకలు

**4. కింది పదాలను గురించి వివరించండి.**

అ) సామాజిక మార్పు : ______________________

ఆ) విజయోత్సవం : ______________________

ఇ) సామాజికాభివృద్ధి : ______________________

ఈ) సాంస్కృతిక వారసత్వం : ______________________

ఉ) అగ్రతాంబూలం : ______________________

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాలు ఏరకమైన వాక్యాలో గుర్తించి రాయండి.**

ఉదా : మీరు రావద్దు – నిషేధార్థక వాక్యం.

అ) దయచేసి నన్ను కాపాడు.

ఆ) మీరు రావచ్చు.

ఇ) వారందరికి ఏమైంది?

ఈ) నేను తప్పక వస్తాను.

ఉ) ఆహా! ఎంత బాగుందీ!

ఊ) వారు వెళ్ళవచ్చా?

**2. కింద ఇచ్చిన సంధులు – పదాల మధ్య సంబంధాన్ని గుర్తించి వాటిని జతచేసి, సూత్రాలు రాయండి.**

ఇత్వసంధి, గుణసంధి, సవర్ణదీర్ఘసంధి, ఉత్వసంధి, విసర్గసంధి

సహస్రాబ్దం, నిరాశ, జీవనోపాధి, మేమంతా, ఆనందాన్నిచ్చిన

**3. కింద ఇచ్చిన సమాసాలు – పదాలు వేటికి ఏవి వర్తిస్తాయో గుర్తించి ఆయా పదాలకు సంబంధించిన సమాసాలను, విగ్రహవాక్యాలు రాయండి.**

| సమాసం పేరు | సమాస పదం |
|---|---|
| తృతీయా తత్పురుష సమాసం | వితంతు వివాహం |
| సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం | విద్యాధికులు |
| షష్ఠీ తత్పురుష సమాసం | గంగానది |
| ద్విగు సమాసం | ముప్పయిసంవత్సరాలు |
| ద్వంద్వ సమాసం | స్త్రీపురుషులు |
| | భారతదేశం |

**4. కింది ఉదాహరణలు ఏయే అలంకారాలకు చెందినవో గుర్తించండి. సమన్వయం రాయండి.**

అ) సుదతీ నూతన మదనా!
మదనాగతురంగ పూర్ణమణిమయసదనా!
సదనామయ గజ రదనా!
రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!

ఆ) మానవా! నీ ప్రయత్నం మానవా?

ఇ) తండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి.

**5. కింది సమాస పదాలను వాటి విగ్రహ వాక్యాలను పరిశీలించండి.**

| | | |
|---|---|---|
| అ) | ప్రతి దినము | దినము దినము |
| ఆ) | యథాశక్తి | శక్తి ఎంతో అంత (శక్తిననుసరించి) |
| ఇ) | ఆబాలగోపాలం | బాలుడి నుండి గోపాలుని వరకు |
| ఈ) | మధ్యాహ్నం | అహ్నం మధ్య భాగం |
| ఉ) | అనువర్షం | వర్షముననుసరించి |

వీటన్నింటిలోను పూర్వపదాలుగా అవ్యయాలు ఉన్నాయి కదూ! అంటే ఈ సమాసాల్లో పూర్వపద ప్రాధాన్యం ఉంటుంది. పూర్వపదాలు లింగ, వచన, విభక్తి శూన్యంగా ఉంటాయి. ఇలాంటి భావంతో ఉన్న, సమాసాన్ని 'అవ్యయీభావసమాసం' అని అంటాం.

**6. కింది ఉదాహరణలకు విగ్రహవాక్యాలు రాయండి.**

అ) అనుకూలం ఆ) యథామూలం ఇ) ప్రతిమాసం

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- వివిధ రంగాలలో ప్రసిద్ధులైన మహిళల ఫోటోలను, జీవిత విశేషాలను సేకరించి ఒక మోడల్ మహిళావరణం పుస్తకాన్ని తయారుచేయండి. ప్రదర్శించండి.

**సూక్తి**

పురుషుడు అనేక తరాలుగా ఏదోఒకవిధంగా స్త్రీపై ఆధిపత్యం వహిస్తున్నాడు. దానితో స్త్రీ ఆత్మన్యూనతాభావాన్ని పెంచుకున్నది. స్త్రీ పురుషుని యొక్క సహచరి. ఆమెకు కూడా అమోఘమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. పురుషులతో సమానమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సమానహక్కులు ఉన్నాయి.

– గాంధీజీ



# 11

# మాణిక్య వీణ

– విద్వాన్ విశ్వం

## చదవండి – ఆలోచించి చెప్పండి.

"సౌందర్యం ఆరాధించేవాడా!
కవితలో, శిల్పంలో
పురుగులో, పుష్పంలో
మెరుపులో, మేఘంలో
సౌందర్యం ఆరాధించేవాడా!
జీవించేవాడా!
సుఖించేవాడా! దుఃఖించేవాడా!
విహ్వలుడా! వీరుడా!
ప్రేమించేవాడా!
వియోగీ! యోగీ! భోగీ! త్యాగీ!
ఆలోచనలు పోయేవాడా!
అనునిత్యం అన్వేషించేవాడా!
చెట్టూ, చెరువూ, గట్టూ, పుట్టా
ఆకసంలో సముద్రంలో
అన్వేషించేవాడా!"

– శ్రీశ్రీ

### ప్రశ్నలు:

1. ఈ కవిత ఎవరిని గురించి తెలుపుతుంది?
2. కవితలో పేర్కొన్న మానవుని ప్రత్యేక లక్షణాలేవి?
3. మానవుణ్ణి ఎన్ని కోణాల్లో ఈ కవితలో దర్శించవచ్చు?
4. మానవునికి వివిధ లక్షణాలు ఎలా సంక్రమించి ఉండవచ్చు?
5. మీ దృష్టిలో మానవుడెలాంటివాడు?

## పాఠ్యాంశ నేపథ్యం / ఉద్దేశం

ఆంధ్రప్రభ వారపత్రికలో విద్వాన్ విశ్వం "మాణిక్యవీణ" శీర్షికన వ్యాసాలు, కవితలు రచించారు. మాణిక్యవీణలో వీరు స్వీకరించని అంశం లేదని చెప్పవచ్చు. మానవజీవన ప్రస్థానంతో కళ, కవిత్వం పెనవేసుకున్నాయని, మనిషి నిరంతర జ్ఞానాన్వేషి అని ఈ కవిత తెలుపుతుంది. మాణిక్యవీణను మీటి, మానవీయ రాగాల్ని పలికించిన ఈ కవిత చారిత్రక ఘట్టాల్ని తరచి చూపి మనిషి శాశ్వతత్వాన్ని తెలుపుతుంది.

సాంకేతికరంగంలోని అభివృద్ధిని మాత్రమే అభివృద్ధి అనుకుంటూ కళలను సాహిత్యాన్ని ఉపేక్షిస్తూంది. నేటితరం. మానవజీవితంతో ముడివేసుకున్న కళలు, సాహిత్యం అనాదిగా సంక్రమించిన ఆస్తి అని తెలుపుతూ, విజ్ఞానమార్గంలో ప్రయాణించి సంస్కృతిని గౌరవిస్తేనే మనిషి శాశ్వతుడవుతాడని తెలపడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం 'వచన కవిత' అనే సాహిత్య ప్రక్రియ, పద్య, గేయాల్లో ఉండే ఛందస్సుతో సంబంధం లేకుండా, వ్యావహారిక భాషలో రాసే కవితను వచన కవిత అంటున్నాం. చిన్న చిన్న పదాలు, వాక్యాలతో ధ్వని గర్భితంగా ఉండే కవిత వచన కవిత. ఈ పాఠం విద్వాన్ విశ్వం రచనా సంపుటిలోది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం చదవండి. అర్థంకాని పదాలు గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.
- పాఠం చిత్రం చూడండి. దీని ఆధారంగా కవిత సారాంశాన్ని ఊహించండి.

## కవి పరిచయం



(1915–1987)

ఇంత మంచి పెన్నతల్లి
ఎందుకిట్లు మారెనో?
ఇంత మంది కన్నతల్లి
ఎందుకెండి పోయెనో?

అని ఆవేదనతో 'పెన్నేటిపాట'ను సృజించిన మానవీయ కవి విద్వాన్ విశ్వం. సాహితీవేత్తగా, రాజకీయ నాయకునిగా, పత్రికా సంపాదకునిగా బహుముఖీన దర్శనమిచ్చిన విశ్వం అసలు పేరు మీసరగండ విశ్వరూపాచారి. అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో లక్ష్మమ్మ, రామయ్య దంపతులకు జన్మించిన విశ్వం, సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో పండితుడు. మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూనే సంస్కృత భాషలోని పలుగ్రంథాల్ని తెలుగులోకి అనువదించాడు. పత్రికా సంపాదకునిగా 'అవి – ఇవి', 'తెలుపు – నలుపు', 'మాణిక్యవీణ' వంటి శీర్షికలను భాష, సాహిత్యం, సమాజం, నైతిక విలువలు తదితర అంశాలపై సంపాదకీయాలు, 'ప్రేమించాను' అనే నవల, 'ఒకనాడు', 'పెన్నేటిపాట' అనే కావ్యాలు విద్వాన్ విశ్వం కలం నుండి జాలువారిన రచనలు. తన సాహిత్య సేవకు కళాప్రపూర్ణ, డి. లిట్. పట్టాలనందుకున్నాడు.

ప్రవేశిక

*ఆధునికయుగంలో వచన కవిత ఒక ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ. ఇది ఛందోబద్ధత లేని కవితా ప్రక్రియ.*

*సరళమైన పదాలతో, సహజమైన వాడుక భాషలో, సూటిగా భావాన్ని వ్యక్తంచేసే వచన కవిత ద్వారా ఎందరో కవులు లోతైన భావాలను తేలికగా అందించారు.*

*మానవ పరిణామంలోని సౌందర్యాన్ని, కృషిని, సాధనసంపత్తిని, తాత్త్వికతను విద్వాన్ విశ్వం ఎంత హృద్యంగా చెప్పారో... చూద్దామా!*

## I

మంత్రాలతో చింతకాయలు
రాలనప్పుడు పద్య
సంత్రాసంతో చింతలు
పారిపోతాయా?

యంత్రాలతో జబ్బులు
నయం కానప్పుడు
తంత్రాలతో సమాజరుగ్మతలు
దారికి వస్తాయా?

అంటే అనవచ్చు,
ఔనని కొందఱతో
అనిపించనూ వచ్చు.

పొట్టలోని పుట్టకురుపుతో సంఘం
కట్టెదుట కళవళపడి పోతుంటే
నిట్టనిలువున రోదసిలోనికి
కట్టలు కట్టుకొని దూసుకొనిపోయి
కట్టుకొని పోయేదేమిటని

అంటే అననూవచ్చు.
ఔనని కొందఱతో
అనిపించనూవచ్చు.

### ఆలోచించండి-చెప్పండి

- *ఈ కవితలో ప్రాస పదాలు ఏమున్నాయి?*
- *"అంటే అనవచ్చు, ఔనని కొందఱతో అనిపించనూవచ్చు" అనే వాక్యాల ద్వారా మీరేమిగ్రహించారు?*
- *సమాజ రుగ్మతలు అంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు చెప్పండి.*
- *"పొట్టలోని పుట్టకురుపుతో సంఘం కట్టెదుట కళవళపడిపోవడం" అంటే ఏమిటి?*

## II

మనిషి కనువిచ్చినప్పుడే
వాని అందచందాలు చవిగొన్నాడు.

ఆనాడే ప్రకృతిని
అధీనం చేసుకోవడానికీ
అందలి రంగులనూ రవళినీ
అనుకరించడానికీ కూడా ఆయత్తమయినాడు.


గుహలలో నివసించేవాడే
గోడలపై గుర్రాలూ, జింకలూ గీసుకున్నాడు...

కాదు వీడనప్పుడే
మోడులు చివురించేలా
పాడడం ఆరంభించినాడు
గులకఱాల ములుకుమీదే
గొబ్బున కాలికి గజ్జె కట్టినాడు.

దిక్కులు పిక్కటిల్లేలా
ఘీంకరించుటే కాదు
మొక్కలు నిక్కి చూచేలా
చక్కని నొక్కులతో
చిక్కని పదాలు పాడుకొన్నాడు.

చక్రం కనుక్కున్న రోజెంత
చరిత్రలో ప్రముఖ దినమో
చరచరా నాలుగు గీతలతో ఓ ఆకారం
విరచించిన రోజు అంతే ప్రముఖం
నిప్పును కనుక్కున్న నాడెంత శుభదినమో

తప్పటడుగులు మాని
తాండవం చేసిన నాడు అంతే శుభదినం.



### ఆలోచించండి - చెప్పండి

- *ప్రకృతికీ మనిషికి ఉండే సంబంధం ఏమిటి?*
- *ఈ కవితలో పదసౌందర్యంతో వినసొంపుగా ఉన్న పదాలు ఏవి?*
- *చక్రం కనుగొనడం, నిప్పును కనుగొనడం చరిత్రలో అతి ముఖ్యమైనవని ఎందుకంటారు?*
- *"తప్పటడుగులు మాని తాండవం చేసిననాడు శుభదినం" అంటే ఏమిటి?*

## III

కిలకిలలు మాని కలభాషలు నేర్చుకున్న రోజు
అలతి మాటలతో పదాలల్లుకున్న రోజు
కలమ ధాన్యం పండించుకున్న రోజు
కళలను పండించుకున్న రోజు
అన్నీ గొప్ప రోజులే
మానవ చరిత్రలో
అన్నీ అసాధారణ పర్వదినాలే

అలా అలా కలగలిపి
పెనవేసుకొని
కళలూ కవితలూ
విజ్ఞానం ప్రజ్ఞానం
తళతళలతో తన్ను నడిపింపగా

మిన్నులు పడ్డ చోటునుండి
తిన్నగా ఎదిగి మిన్నందుకుంటున్న

చిన్నవాడు మానవుడు
చిరంజీవి మానవుడు
చిరంతనుడు మానవుడు
అనాదిగా నడుస్తున్న ఈ
మహాప్రస్థానంలో
అతగానిని వదలని
జతలు కళా కవితా
జ్ఞానం విజ్ఞానం
వానితో నడిచేవీ
వానిని నడిపించేవీ అవే-
అవే కళా కవితా
జ్ఞానం విజ్ఞానం
ప్రజ్ఞానం.

### *ఆలోచించండి-చెప్పండి*

- *కవి వేటిని గొప్ప రోజులన్నాడు? ఎందుకు?*
- *మీ దృష్టిలో ఏవి గొప్ప రోజులు? ఎందుకు?*
- *"కళలూ, కవితలూ పెనవేసుకోవడం" అనే వాక్యాన్ని సమర్థిస్తూ మాట్లాడండి.*
- *"మిన్నందుకుంటున్న చిన్నవాడు" అని ఎందుకన్నాడు కవి?*
- *'కళా, కవితాజ్ఞానం, విజ్ఞానం' అంటే ఏమిటి?*

## సారాంశం

మంత్రాలతో చింతకాయలు రాలనట్టే పద్యంధాటికి చింతలు దూరంకావు. యంత్రాలతో జబ్బులు నయంకానట్టే మాయమాటలతో సామాజికసమస్యలు తొలగిపోవు. ఈ మాటను కొందరు ఆమోదిస్తారు. కొందరు ఆమోదించినట్టు నటిస్తారు. వాస్తవమైన కార్యాచరణ, నిబద్ధత, అంకితభావంతోనే సామాజిక సమస్యలు పరిష్కారమౌతాయి.

ఒకవైపు కడుపులోని భయంకరమైనవ్యాధి (వ్రణం)లా సామాజిక అసమానతలనే రోగాలు కళ్ళముందు కనిపిస్తూ కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతరిక్షప్రయాణాల్లో అభివృద్ధిని సాధించడంవల్ల ఒరిగిందేమని కొందరనవచ్చు. ఇంకొందరితో ఒప్పించనూవచ్చు. శాస్త్ర సాంకేతిక ప్రగతితో సమానంగా సామాజికజీవనశైలి ఎదగడంలేదని, సగటుజీవి జీవనం ఇంకా పాతాళంలోనే ఉందని కవిభావన.

మనిషి కళ్ళు తెరవగానే తనచుట్టూఉన్న ప్రకృతి అందాల్ని చూసి పరవశించాడు. అప్పటి నుండి ప్రకృతిని తన కనుసన్నల్లో ఉంచే ప్రయత్నం చేశాడు. ప్రకృతిలోని అన్ని రంగుల్నీ, రకరకాల ధ్వనుల్నీ అనుకరించే ప్రయత్నం చేశాడు. పూర్తిగా ప్రకృతితో తాదాత్మ్యం చెందాడు. గుహల్లో జీవించిన ఆదిమానవుడే గుర్రాల్నీ జింకల్నీ గీస్తూ చిత్రలేఖన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకున్నాడు. ఆటవికజీవన దశలోనే తన గానమాధుర్యంతో ఎండిన మోడుల్ని చిగురింపజేశాడు. పాటకు అనుగుణంగా కఠినమైన రాతినేలపై కాలికి గజ్జెకట్టి చిందులేశాడు. స్వరాల సుకుమారపు నొక్కులతో హత్తుకునే పాటలు పాడాడు మనిషి. కళ్ళు తెరిచిననాటి నుంచి ప్రకృతిని ఆరాధించడం నేర్చుకున్నాడు. ప్రకృతిని చూసి తనను తాను మైమరచి పాటలు పాడుతూ, నర్తిస్తూ, ఆనందడోలికల్లో తేలిపోయాడు. కళలను జీవితంలో అంతర్భాగం చేసుకున్నాడు. ప్రాక్తన మానవుడు ప్రకృతి ఒడిని పాఠశాలగా చేసుకుని కళాభిరుచిని పెంపొందించుకున్నాడు.

చక్రాన్ని కనుక్కొన్నరోజు చరిత్రలో ఎంత ప్రముఖమైనదో, చకచకా నాలుగు గీతలతో లిపిని కనుక్కొన్న రోజు అంత కంటే విశేషమైనది. చక్రం మానవచలనానికి దోహదపడితే, లిపి భావసంచలనానికి వేదికై సృజనాత్మక ప్రపంచంలోకి దారిచూపింది. నిప్పును కనుక్కొన్న రోజెంత గొప్పదో తప్పటడుగుల చిందుల నుంచి ఉన్నత నృత్యాలు చేసిన రోజూ అంతే గొప్పది. రాతియుగపు చీకటిని చీల్చుకుంటూ నవీన విజ్ఞానపు వెలుతురులోకి ప్రవేశించిన గొప్ప రోజులుగా వాటిని కవి భావించాడు.

అరుపుల నుంచి అర్థవంతమైన మాటలు నేర్చినరోజు, ఆ మాటలతో జానపదా లల్లిన రోజు, సారవంతమైన భూమి నుంచి భుక్తిని పండించుకున్నరోజు, మానసికోల్లాసం కలిగించే కళ ఆవిష్కరణ జరిగిన రోజు... ఇలా ఒకటేమిటి, అన్నీ గొప్పరోజులే! మానవ జీవన పరిణామ చరిత్రలో నిలిచిన అసాధారణ సంఘటనలు జరిగిన ప్రతిదినమూ శుభదినమే! ఇలా కవితలూ, కళలూ, విజ్ఞానం, ప్రజ్ఞానం కలగలిసిపోయి మానవజీవితంలో పెనవేసుకొన్నాయి. ఆదిమ దశ నుండి, ఆధునికదశ వరకూ మనిషి చేసిన ప్రయాణంలో ప్రతి అంశమూ ఎంత అపురూపమైనదోగదా! అని కవి ఆశ్చర్యపడ్డాడు. బతుకుతో ముడి వేసుకున్న కళల, శాస్త్రాల గొప్పదనాన్ని స్మరించుకున్నాడు.

కళలు, విజ్ఞాన కాంతులతో జీవనప్రయాణంలో నేలనుంచి నింగికెగిరిన చిన్న మానవుడే శాశ్వతుడయ్యాడు. అనంతమైన కాలం దారిలో అలుపెరుగక సాగుతున్న జీవనప్రస్థానంలో మానవుణ్ణి వదలనివి కళలు, కవితలు, జ్ఞానవిజ్ఞానాలు. తన జీవనయానంలో ఎదురయ్యే అలసటను, యాంత్రికతను దూరం చేయడానికి కళల్ని కవితల్ని ఆలంబనగా చేసుకున్నాడు. విజ్ఞానమార్గంలో ప్రయాణించాడు. వీటితోనే నడిచాడు. వీటితో నడిపించాడుకూడా. మనిషి కాలగర్భంలో కలిసినా అతని మేధలోంచి ఆవిష్కృతమైన కళ, కవిత్వం, విజ్ఞానం సకలమానవాళికీ దిశానిర్దేశం చేస్తాయి. మానవుణ్ణి శాశ్వతుణ్ణి చేస్తున్నాయి.

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. మాణిక్యవీణ శీర్షికన ఉన్న కవిత విన్నతర్వాత మీకు ఎలాంటి అనుభూతి కలిగిందో చెప్పండి.**

**2. 'మాణిక్యవీణ' వచన కవితను భావయుక్తంగా చదవండి. దీని భావాన్ని సొంతమాటల్లో చెప్పండి.**

**3. పొట్లపల్లి రామారావు రాసిన కింది కవితను చదివి ప్రశ్నలకు జవాబులివ్వండి.**

ఎన్ని దినములు నీవు
ఇల గడిపినను ఏమి?
ఎన్ని జన్మాలింక
ఎదిరి చూచిన ఏమి?
ఎన్నాళ్లకైన నీ
ఔన్నత్యమును నీవె
సాధించ వలెనోయి
శోధించ వలెనోయి!
నీలోన వెలుగొందు
నీస్వశక్తిని మరచి
పరుల పంచల జూడ
ఫలమేమి కలదోయి!

అ) పై కవితకు పేరు పెట్టండి.

ఆ) ఔన్నత్యం పొందడానికి కవి ఏం చేయాలని చెప్తున్నాడు?

ఇ) స్వశక్తికి, ఇతరులపై ఆధారపడడానికి గల తేడా ఏమిటి?

ఇ) "పరులపంచ" అనే పదంతో సొంతవాక్యాన్ని రాయండి.

**4. ఈ పాఠంలోని అంత్యప్రాసలున్న పదాలు వెతకండి. అలాంటివే మరికొన్ని పదాలను రాయండి.**

**5. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

అ) "మంత్రాలతో చింతకాయలు..." అని కవి వేటితో పోల్చాడు?

ఆ) కవి వేటిని శుభదినాలని వర్ణించాడు?

ఇ) మానవుణ్ణి శాశ్వతంగా నిల్పేవి ఏవి?

ఈ) విద్వాన్ విశ్వం గురించి, ఆయన కవితాశైలిని గురించి ఐదు వాక్యాలు రాయండి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) చరిత్రలో మైలురాళ్ళుగా నిల్చిన అంశాలేవి? ఇవి దేనికి ప్రతీకగా భావిస్తున్నావు?

ఆ) "మిన్నులు పడ్డ చోటి నుంచి... తిన్నగా ఎదిగి మిన్నందుకుంటున్న చిన్నవాడు మానవుడు" అని కవి వర్ణించాడు. ఈ వాక్యాలమీద నీ అభిప్రాయమేమిటి?

ఇ) మానవచరిత్రలో అన్నీ అసాధారణ పర్వదినాలే అనడంలో ఆంతర్యం ఏమై ఉంటుంది?

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) మానవ ప్రస్థానంలో కళ, కవిత, విజ్ఞానం తోడున్నాయని కవి వర్ణించాడు గదా! దీనినెలా సమర్థిస్తావు?

ఆ) మాణిక్యవీణ కవితా సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) నీ చుట్టూఉన్న పరిసరాల్లో, మానవ జీవితంలో కలిగిన మార్పులను, అభివృద్ధిని వర్ణిస్తూ పది పంక్తులకు తక్కువ కాకుండా ఒక కవితను రాయండి.

ఆ) విద్వాన్ విశ్వం కవితా శిల్పాన్ని ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాలు చదివి గీత గీసిన పదాలకు అర్థం రాయండి. పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

అ) <u>రోదసి</u>లోకి దూసుకెళ్ళిన మరో ఉపగ్రహం.

ఆ) విద్యార్థులంతా పరీక్షలకు <u>ఆయత్తమవుతు</u>న్నారు.

ఇ) <u>రుగ్మత</u> ఉన్న ఈ సమాజానికి మానవీయ విలువలతో చికిత్స అవసరం.

ఈ) <u>కళవళపడట</u> మెందుకు? నెమ్మదిగా జవాబు చెప్పు.

**2. పాఠం ఆధారంగా కింది వాక్యాలకు సమానమైన పదాల్ని వెతికి రాయండి.**

| | |
|---|---|
| ఒకరిని చూసి మరొకరు చేయడం | |
| పనిచేయడానికి సిద్ధమవడం | |
| అద్భుతంగా నాట్యమాడడం | |
| పనిని మొదలుపెట్టడం | |

**3. కింది జాతీయాలను ఏయే సందర్భాల్లో ప్రయోగిస్తారో తెలిపి సొంతవాక్యాల్లో ఉపయోగించండి.**

అ) మంత్రాలకు చింతకాయలు రాలడం ____________

ఆ) మిన్నందుకోవడం ____________

ఇ) గజ్జెకట్టడం ____________

**4. కింది పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలు రాయండి.**

అ) మిన్ను : ఆకాశం నింగి

ఆ) తాండవం : ____________ ____________

ఇ) రుగ్మత : ____________ ____________

ఈ) జ్ఞానం : ____________ ____________

**5. కింది వాక్యాల్లోని వికృతిపదాలను గుర్తించి పాఠం ఆధారంగా ప్రకృతి పదాలు చేర్చి తిరిగి వాక్యాలు రాయండి.**

అ) అమ్మ బాసలోనే నేను మాట్లాడతాను.

ఆ) మన కవులు రాసిన కైతలు భారతి మెడలో అలంకరించిన హారాలు.

ఇ) విన్నాణము పెంచుకోకపోతే భవిష్యత్తు అంధకారమవుతుంది.

ఈ) సింహాలు గొబల్లో నిద్రిస్తున్నాయి.

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాల్లో నుగాగమ సంధి పదాలను గుర్తించి విడదీసి సూత్రం రాయండి.**

నిట్టనిలువు, తెల్లందనము, పోయేదేమి, తళుకుంగజ్జెలు,

మహోపకారం, సరసపుఁదనము, రాజునాజ్ఞ

**2. కింది వాటిని జతపరచండి.**

| సమాసపదం | | విగ్రహవాక్యం | | సమాసం |
|---|---|---|---|---|
| 1. ప్రముఖదినం | ( ) | క) మానవుల యొక్క చరిత్ర | ( ) | గ) నఞ్ తత్పురుష సమాసం |
| 2. నాలుగుగీతలు | ( ) | చ) సాధారణం కానిది | ( ) | జ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం |
| 3. అసాధారణం | ( ) | ట) నాలుగు సంఖ్యగల గీతలు | ( ) | డ) షష్ఠీతత్పురుష సమాసం |
| 4. మానవచరిత్ర | ( ) | త) ప్రముఖమైన దినం | ( ) | ద) ద్విగు సమాసం |

**3. కింది వాక్యాలను పరిశీలించండి.**

అ) మిమ్ము మాధవుడు రక్షించుగాక!

అర్థం 1. మిమ్ము మాధవుడు (విష్ణువు) రక్షించుగాక!

2. మిమ్ము ఉమాధవుడు (శివుడు) రక్షించుగాక!

ఆ) మానవ జీవనం సుకుమారం.

అర్థం 1. మా నవ (ఆధునిక) జీవితం సుకుమారమైనది.

2. మానవ (మనిషి) జీవితం సుకుమారమైనది.

పై అర్థాలను గమనించారు కదా! ఒకే శబ్దం రెండు వేర్వేరు అర్థాలనందిస్తున్నది. అంటే విభిన్న అర్థాలు ఆశ్రయించి ఉన్నాయి. ఇలా ఉంటే వాటిని 'శ్లేషాలంకారం' అని అంటారు.

లక్షణం : నానార్థాలను కలిగిఉండే అలంకారం శ్లేష.

కింది లక్ష్యాలలో ఉన్న అలంకారాన్ని గుర్తించి సమన్వయం చేయండి.

1. రాజు కువలయానందకరుడు.
2. నీవేల వచ్చెదవు.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ దిన, వార పత్రికల ఆధారంగా మీకు నచ్చిన రెండు వచన కవితల్ని సేకరించి, అంశాల ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| క్ర.సం. | కవితాశీర్షిక | పత్రిక తేది | కవితలో మీరు గుర్తించిన ప్రత్యేక అంశాలు | కవితలో మీకు బాగా నచ్చిన పంక్తులు |
|---|---|---|---|---|
| | | | | |

### సూక్తి

విద్యాదదాతి వినయం
వినయాద్యాతి పాత్రతామ్
పాత్రాత్వార్ధవమాప్నోతి
ధనాద్ధర్మం తతఃసుఖమ్.

– హితోపదేశం

విద్య వల్ల వినయం, వినయం వల్ల యోగ్యత, యోగ్యతవల్ల ధనం, ధనం వల్ల దానం, దానం వల్ల సుఖం లభిస్తాయి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# 12

# గోరంత దీపాలు

- పులికంటి కృష్ణారెడ్డి

## చదవండి - ఆలోచించి చెప్పండి.

*బిడ్డ ఆకలి అమ్మకి తెలుస్తుంది. ఈ తల్లులకు తమ ఆకలేకాదు, అనాథల క్షుద్బాధా తెలుసు. ఇంత తెలిసిన వీరంతా గొప్ప స్థితిమంతులేం కాదు. అలాంటప్పుడు లేనివారికి గుప్పెడు మెతుకులు పంచేదెలా? ఆలోచించగా ఆలోచించగా దారి దొరికింది. రోజూ పిడికెడు గింజలు దాచాలన్న ఊహ కలిగింది. పిడికిలి బిగిస్తే ఉద్యమం అవుతుంది. ఆ ఊళ్లో జనం పిడికిలి తెరిచారు. తమ దగ్గరున్న గింజల నుంచి ప్రతిరోజూ పిడికెడు పంచడం నేర్చారు. ఇవ్వడం సాయం. పంచడం మానవత్వం. సాటి మనుషుల ఆకలి తీర్చడం దైవత్వం.*

### ప్రశ్నలు:

1. *ఈ పేరాద్వారా మీరేం తెలుసుకున్నారు?*
2. *మానవత్వంతో చేసే పనులు ఏవి?*
3. *సహాయపడే గుణం, మానవత్వం కలిగిన వారి వల్ల సమాజానికి కలిగే మేలు ఏమిటి?*
4. *మీరు ఇతరులకు ఎప్పుడైనా సాయం చేశారా? ఎప్పుడు? ఎందుకు?*

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

*సమాజంలో ఎంతోమంది అనాథ బాలలను మనం చూస్తూ ఉంటాం. ఇటువంటి పిల్లలు కనీస అవసరాలైన తిండి, బట్ట, చదువు మొదలైన వాటికి నోచుకోకుండా ఉంటారు. అనాథబాలలను చేరదీసి వారి ఆకలి తీర్చి విద్యాబుద్ధులు చెప్పిస్తే వీరు కూడా మట్టిలో మాణిక్యాల్లాగా వెలుగొందుతారు. సమాజానికి సేవచేసే గొప్ప మనసున్న వ్యక్తులు, తమ ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా అనాథలను చేరదీసి చదివించేవారు కూడా ఎంతో మంది ఉన్నారు. అటువంటి ఒక వ్యక్తి చేసిన పనే ఈ కథ.*

*రైలు ప్రయాణంలో తటస్థపడిన ఓ బాలుణ్ణి చేరదీసి విద్యాబుద్ధులు చెప్పిస్తే, ఎదిగిన ఆ వ్యక్తి చూపే కృతజ్ఞతాభావం, వాళ్ళ మధ్య ఉండే మానవసంబంధాలను తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.*

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్య భాగం కథాప్రక్రియకు చెందింది. ఇది మానవ సంబంధాలు, సామాజిక సేవ ఇతివృత్తంతో కళ్ళకు కట్టినట్లుగా మనోభావాలను పలికించేలా ఉంటుంది. ఈ పాఠం పులికంటివారి 'కథా వాహిని' లోనిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న ప్రవేశిక చదవండి, పాఠంలోని అంశాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను 'పదవిజ్ఞానం' పట్టికను లేదా నిఘంటువును చూసి తెలుసుకోండి.

## రచయిత పరిచయం



(1931-2007)

జనజీవనాన్ని కళ్ళకు కట్టినట్టు రచనలు చేసిన కథారచయిత, నటుడు, జానపద కళాకారుడు, కవి, నాటక రచయిత, బుర్రకథకుడు శ్రీపులికంటి కృష్ణారెడ్డి.

చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం జక్కదన్న గ్రామంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా కలిగిన ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. పులికంటి పాపమ్మ, గోవిందరెడ్డి ఈయన తల్లిదండ్రులు. బెల్లంకొండ రామదాసు రచించిన "పునర్జన్మ" నాటకంలో వృద్ధుని పాత్ర ధరించడంతో ఆయన నటజీవితం ప్రారంభమైంది. ఒక ప్రక్క నటునిగా ప్రశంసలందుకుంటూనే మరోపక్క రచనా వ్యాసంగం పట్ల మొగ్గుచూపి – ముఖ్యంగా కథా సాహిత్యంపై దృష్టి సారించాడు. 1960లో ఆంధ్రపత్రికలో ప్రచురితమైన "గూడుకోసం గువ్వలు' ఆయన మొదటి కథ. సుమారు 150 కథలు రాశాడు. 'నాలుగ్గాళ్ళ మండపం' అనేది ఈయన మరోరచన.

పులికంటి బుర్రకథకునిగా కుటుంబ సంక్షేమం, వాతావరణ కాలుష్యం – పొదుపు తదితర అంశాలమీద సుమారు వంద బుర్రకథలను రచించి తానే ప్రదర్శనలిచ్చాడు.

## ప్రవేశిక

*"ప్రయత్నించి ఫలితాన్ని సాధించడంలో కొందరికి ఆనందం. అసలు ప్రయత్నాల ప్రమేయమే లేకుండా జీవితాన్ని కొనసాగించాలన్నది కొందరి కోరిక. నా జీవితమంతా ఇలాంటి ప్రయత్నాలతోనే కొనసాగుతూఉంది. అందుకే ఆ కుర్రవాడి బతుకుమీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను. అంటూ కాసేపు ఆగారు. ఆ కుర్రవాణ్ణి పరీక్షించడానికి నా ప్రయత్నంగా నేను జారవిడిచిన కాగితమది. ఇంతకూ ఆ కుర్రవాడు ఎవరు? ఆయన ఎవరు? ఆయన చేసిన ప్రయత్నమేమిటి? "గోరంతదీపాలు" కథానిక పాఠం చదివి తెలుసుకోండి.*

## I

**వేపచెట్టు!**

తల్లి ప్రేమలాంటి చల్లని నీడనిచ్చే వేపచెట్టు!!–

దరిద్రుడి గుండెల్లోనుండి పుట్టిన అంతులేని ఆశల్లా ఆ చెట్టుబోదె నుండి పుట్టిన కొమ్మలు నాలుగు దిక్కులా వ్యాపించగలిగినంత మేర వ్యాపించాయి. కలిగిన వాడికి బాగా కండపట్టినట్లు ఆ కొమ్మలు పూతాపిందెల్తో నిండుగా ఉన్నాయి.

ఆ చెట్టు కొమ్మకు వేలాడదీసిన నాలుగు ఇనుప గొలుసులు... ఆ ఇనుప గొలుసులకు తగిలించిన ఓ పెద్ద పీట... అది ఉయ్యాల పీట!

ఆ పీటమీద అతడు కూర్చున్నాడు!

గతాన్ని నెమరేస్తూ వర్తమానాన్ని తలపోస్తూ భవిష్యత్తును ఊహిస్తున్నట్లున్న అతడు ఓ మహాయోగిలా కనిపిస్తున్నాడు.


అతనిముందు ఓ కుర్రవాడు నిలబడి ఉన్నాడు.

ఆ కుర్రవాడు నిలబడి ఉండడంలో వినయం ఉట్టిపడుతూ ఉంది. వేషంలో సంస్కారం ఉంది. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతూ ఉంది.

ఆయన నిమీలిత నేత్రుడై చేయెత్తి ఆశీర్వదిస్తున్నాడు. ఇద్దరి కనుకొలకుల్లో నిలిచిన నీళ్ళు సంజవెలుగులో ముత్యాల్లా మెరుస్తున్నాయి. అనిర్వచనీయమైన కృతజ్ఞతా భావం ఆ ఇద్దరి మొగాల్లో దోబూచులాడుతూ ఉంది. అనుభూతిలో తడుస్తూ వాళ్ళు మూగబోయారు.

ఆ మధుర సన్నివేశాన్ని మైలపరచడం నాకు ఇష్టంలేకపోయింది. అలాగని ఆ నాలుగు బారల దూరంలో అలానే ఆగిపోవడానికి మనస్కరించలేదు, ఈ తటస్థస్థితిలో అడుగు ముందుకు పడలేదు.

తనివిదీరనట్లు మళ్ళీ ఒకసారి ఆ కుర్రవాడు అతని పాదాల్ని ఒడిసి పట్టుకొన్నాడు. పాదాల మీద తలను ఆనించాడు. కన్నీటితోనే అతని పాదాల్ని కడుగుతున్నాడేమో మరి!–



ఆయన ఎటో చూస్తున్నాడు. ఆశీర్వదించడానికి ఎత్తిన చేయి ఎత్తినట్లుగానే ఉంది. చేరడేసి చెంపలమీద నుండి జాలువారుతున్న కన్నీళ్ళు ఆ కుర్రవాడి తలమీద పడుతున్నాయి ముత్యాల్లా!

కన్నీటి ముత్యాలతో ఆశీర్వాదం అందుకొంటున్న ఆ కుర్రవాడు ఎంత ధన్యుడో?!

ఎవరీ కుర్రవాడు?... ఏమిటో వీళ్ళిద్దరి మధ్య సంబంధం?... మహా మేరువులాంటి ఆ మనిషిని కదిలించిన ఆ కుర్రవాడెంతటి అదృష్టవంతుడు? అని ఆలోచిస్తూ నిలబడ్డాను.

దాదాపు రెండుమూడు చదరపు మైళ్ళ విస్తీర్ణం కలిగిన ఆ ఆవరణలో ఈ వేపచెట్టు కంటే పెద్దవైన రాగిచెట్లున్నాయి. మర్రి మానులున్నాయి. జువ్విచెట్లున్నాయి. రకరకాల పూల పాదులున్నాయి. కూరల తోటలున్నాయి. బంగారు కరిగించి పోసినట్లున్న ఆ సంజ వెలుగుతో తడిసిముద్దవుతున్నాయి అక్కడి చెట్లూ చేమలు! పోటీపడ్డట్టుగా వాళ్ళిద్దరూ అనుభూతితో తడిసి ముద్దవుతున్నారు. ఈ అనుభూతిని ఆకళింపు చేసుకొన్నట్లుగా చెట్లమీది పాలపిట్టలు పరవశంతో పాడుతున్నాయి.

కొన్ని నిముషాలు మాత్రమే కొనసాగిందీ పరిస్థితి!

ఆ కుర్రవాడు పైకి లేచాడు. కన్నీటితో నిండిన కండ్లను జేబురుమాలుతో వత్తుకున్నాడు. మళ్ళీ ఒకసారి రెండు చేతులు జోడించాడు. జోడించిన చేతులు జోడించినట్లే ఉంచుకొని అలానే నాలుగడుగులు వెనక్కు వేశాడు. అక్కడ నిలబడి మళ్ళీ ఒకసారి శిరస్సు వంచి నమస్కరించాడు. గిరక్కున వెనక్కుతిరిగి హుందాగా ముందుకు సాగి పోతున్నాడు.

ఆ ఉయ్యాలపీట మీద హుందాగా కూర్చున్న ఆ మహామనీషి కూర్చున్నట్లుగానే ఉండిపోయాడు – వెళ్ళిపోతున్న ఆ కుర్రవాడివైపు తదేకంగా చూస్తూ!

ఆ ఆవరణలో బాలబాలికలకు వసతి గృహాలున్నాయి. అతిథులకు ప్రత్యేక సదుపాయాలతో గదులున్నాయి. వయోవృద్ధులకు వసతులున్నాయి. చదువుకోవడానికి గ్రంథాలయం ఉంది. సాయంసమయాల్లో పూజకు ప్రార్థనాలయం ఉంది.

అది విద్యానగరం!

ఆ నగరంలో అతడు మకుటంలేని మహారాజు! ప్రతిరోజు అదే సమయానికి ఆయన

అక్కడికి వస్తారు. ఆ పీటమీద కూర్చుంటారు. ఆయన అక్కడ ఉన్నంతసేపు అసలే ప్రశాంతతకు మారుపేరయిన ఆ ప్రదేశం మరింత ప్రశాంతంగా ఉంటుంది. ఎవరి పనుల్లో వాళ్ళుంటారు. ముఖ్యంగా బాలబాలికలు చదువుకొంటూనో రాసుకొంటూనో తమతమ పనుల్లో తాము లీనమయి ఉంటారు. తమ పనుల్ని తాము నిర్వర్తించుకొంటున్న మనుషుల్ని... శ్రద్ధగా చదువుకొంటున్న పిల్లల్ని చూస్తూ... ఆ గోరంత దీపాల్లో కొండంత వెలుగుల్ని ఆశిస్తూ... ఆయన ఆనందానుభూతిలో తేలిపోతుంటారు!

రాత్రి ఏడుగంటల ప్రాంతంలో గంట కొడతారు. గంట శబ్దం చెవిని పడడంతో పిల్లలందరు బిలబిలా వచ్చి గుమిగూడుతారు. ఒక్కొక్కడి చేతిలో ఓ కంచం, మంచినీళ్ళకు లోటా ఉంటాయి. అందరు అక్కడ చేరేసరికి ఆయన ఉయ్యాలపీటమీద నుండి లేచి నిలబడతారు. ఆయన నిలబడ్డే పిల్లలందరు వరసగా నిలబడతారు. అందరు కలిసి గొంతెత్తి పాడుకొంటూ ముందుకు కదులుతారు. ఒక్కొక్కరుగా ముందుకు నడుస్తూంటే ఓ చోట కంచంలో అన్నం వేస్తారు. మరోచోట పులుసు పోస్తారు. ఇంకొక చోట మజ్జిగ అన్నం వడ్డిస్తారు. చెవుల కింపుగా పాడుకొంటూ ఆ పిల్లలందరు అన్నం వడ్డించుకొనే దృశ్యం – కనుల పండువుగా ఉంటుంది.

తెగిన గాలిపటాల్ని తాడు విడిచిన బొంగరాల్ని ఓ చోట చేర్చి గోరంత దీపాలకు కొండంత వెలుగు చేకూర్చాలని కృషి చేస్తున్న ఆ మహామనీషిని చూస్తే చేతులెత్తి నమస్కరించాలనిపిస్తుంది. అందుకే అప్పుడప్పుడు ఆయనతో కాలక్షేపం చేయడానికి అలవాటుపడ్డాను.

ఆయన మాట్లాడతాడు. అవి మాటలుగావు. జీవితానుభవం నుండి వెలువడిన అక్షరసత్యాలు.

ఆయన అప్పుడప్పుడు గతస్మృతులతో నవ్వుతాడు. అది నవ్వుగాదు. జీవితానుభవమనే వడదెబ్బకు నలిగిన పువ్వు! – అయినా వాడిపోలేదు.

ఆయన కష్టాల్ని భరించాడు. కాకుల అరుపుల్ని విని లోకమే కాకులనుకొన్నాడు. ఆయన ఓర్పు వహించాడు. తన ధ్యేయాన్ని అందుకోవడంలో నేర్పు చూపించాడు. ఆ ఫలితంగా ఎప్పుడో అటుబారెడు ఇటుబారెడు మించని గుడిసెలో బుడ్డీదీపం గుడ్డివెలుగులో ఓ కుర్రవాడు ఓనమాలు దిద్దుకున్నాడు.

బుడ్డీదీపం అందించే గోరంత వెలుగులో ఆ కుర్రవాడి భవిష్యజ్జీవితంలో కొండంత వెలుగుకోసం ఆయన ప్రయత్నించాడు.

ఇది ముప్పై ఏళ్ళనాటి మాట!

మరి ఇప్పుడు?

ఇప్పుడా? అలాంటి కుర్రవాళ్ళు ఒక్కరా? ఇద్దరా? వేలాదిమంది. ఈ వేలాది గోరంత దీపాలకు కొండంత వెలుగు ఇవ్వాలని అహరహం కృషిచేస్తున్న ఉపాధ్యాయులు వందలమంది. అందరు ఆయన చేతిచలువతో బతుకుతున్నవాళ్ళే!

ఎప్పుడయినా–

"ఏండీ! 'ఆయనేముంది? పరహితార్థంపేరుతో స్వార్థం పెంచుకొంటున్న మనిషి. నోరులేని పిల్లవాళ్ళను అర్ధకడుపులతో నోళ్ళు గొడుతున్న మనిషి' – అని రకరకాలుగా ఈ లోకం ఆడిపోసుకొనింది గదా? మరి అలాంటి మాటల్ని మీరెలా భరించగలిగారు?" అని అడిగితే –

"బాబూ! ఉప్పునో కారంపొడినో ఓ మనిషిమీద చల్లిచూడు. అతని ఒంటిమీద పుండ్లుంటేనే మంటబెడుతుంది. లేకుంటే రాలి పోతుంది. అంతే బాబూ! మనిషిలోకూడా తప్పులుంటేనే అనినమాట తగులుతుంది. లేకుంటే గాలిలో కలిసిపోతుంది. ఈ మాత్రం అవగాహన శక్తి లేకుండా ధ్యేయాన్ని వదిలిపెడితే అది పిచ్చితనం బాబూ! కాకుంటే చేత గానితనం!!" అని నవ్వేవారు.

జీవితాన్ని కాచి వడపోసిన పరమసత్యం!

అందుకే అప్పుడప్పుడు ఆయన వద్దకు వెళ్ళేవాడిని. ఆ ఉయ్యాల పీటమీద ఆయనకు ఎదురుగా కూర్చుంటే – ఇద్దరి బరువుతో ఆ చెట్టుకొమ్మ వంగుతూ లేస్తూ గాలివాటంగా కదులుతూ ఉంటే – అదొక చిత్రమైన అనుభూతి. ఆయన జీవితానుభవాల్ని వింటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆశించడంలో ఆనందం! ఆ ఉయ్యాల పీటమీద ఆయన ఎదురుగానే కాదు – ఆయన గుండెల్లో కూడా కాస్త చోటు సంపాదించుకొన్నాను. అందుకే ఆయన ఆప్యాయంగా దగ్గర చేర్చారు.

ఆ రోజు కూడా వెళ్ళాను. నేను కనిపించగానే ఆప్యాయంగా 'రా బాబూ! రా!' అని నవ్వుతూ ఆహ్వానించే మనిషి ఆ రోజు నా రాకను గమనించే స్థితిలో లేరు.

అతని ఎదురుగా నిలబడ్డాను!

ఆ ఆనందానుభూతి నుండి ఆయన తేరుకోలేదు. ఆ అనుభూతిని చెరిపేయడానికి నేను సాహసించలేదు. అలానే మరో నాలుగయిదు నిముషాలు దొర్లిపోయాయి. నాకు తెలియకనే నాలో ఓర్పు నశించిందనడానికి నిదర్శనంగా ఓ పొడిదగ్గు గొంతును మెల్లగా పరామర్శించింది.

ఆయన ఏకాగ్రతకు భంగం కలిగింది. అప్పుడు అరమోడ్పు కన్నులతో నన్ను చూస్తూ 'ఎప్పుడొచ్చావు బాబూ!' అని అడిగారు.

### ఆలోచించండి-చెప్పండి

- తల్లి ప్రేమ ఎలా ఉంటుంది? వివరించండి.
- వినయంతో నిలబడడం, వేషంలో సంస్కారం అంటే మీకేమర్థమైంది?
- అనిర్వచనీయమైన కృతజ్ఞతాభావాన్ని ఎవరిపట్ల, ఎందుకు ప్రదర్శిస్తారు?
- మీ బడి, మీ ఇల్లు ప్రశాంతతకు మారు పేరుగా ఉండాలంటే ఏం చేయాలి? ఏం చేయకూడదు?
- విద్యాలయంఆవరణం కనుల పండువుగా ఉందికదా? మీ కంటికి కనుల పండువుగా ఏమేమి గోచరిస్తాయి?
- పెద్దల మాటలు, జీవితానుభవాలు, అక్షరసత్యాలు ఎందుకో వివరించండి.

"ఆప్యాయత ఎలా ఉంటుంది?" అని అడిగితే అది ఆయన పిలుపులా ఉంటుందని చెప్పచ్చు.

"అదృష్టవంతుడికి కన్నీటితో అభిషేకం జరుగుతున్నప్పుడు!"

## II

నా మాట చెవిని పడడంతో ఆయన పెదవులు అందమయిన వంపుల్ని సంతరించుకొన్నాయి. ఆ వంపుల సందుల్లో చిరునవ్వు చిత్రంగా ఇరుక్కొనింది.

"అవును బాబూ! నిజంగా అతడు అదృష్టవంతుడే!"

అనుభూతికి పరాకాష్ఠ తృప్తి. ఆ మాటంటుంటే అతని మొగం తృప్తితో వెలిగిపోతూ ఉంది. కుతూహలంతో అతన్ని చూస్తూ నిలబడ్డాను.

"కూర్చో బాబూ! కూర్చో. ఆ అదృష్టవంతుడి కథ చెప్పాలని ఎన్నోసార్లు అనుకొన్నానే కానీ ఎందుకో ఎప్పటికప్పుడు వాయిదాపడుతూ వచ్చింది – దేనికయినా సమయం సందర్భం కలిసి రావాలి. వచ్చింది గదా? వినుబాబూ!"

గతాన్ని నెమరేస్తూ భవిష్యత్ సందర్శనంతో అనుభూతిని పొందుతూ ఓ మహామౌని పుంగవుడిలా ఓ భంగిమలో కూర్చున్న ఆయన మళ్ళీ మామూలు స్థితికి వచ్చాడు. కథ చెప్పడానికి తలపండిన తాతయ్యను తలపింపచేస్తున్నారు.

పడమటి కొండ కొనకొమ్ము మీద బంతిలా వెలిగిపోతున్నాడు సూర్యుడు. మరి కాసేపటిలో కాలపురుషుడి కాలితన్నుతో కొండకావల పడి లోకాన్ని నిండు చీకటితో నింపేవాడు – చావుతెలివి అన్నట్లుగా మబ్బుతునకలకు చుట్టూ జరీఅంచు చుట్టాడు. ముగ్ధమనోహరంగా ఉంది పడమటిదిశ. అప్పుడప్పుడే అక్కడి చెట్లమీద చేరుతున్న పక్షులు అరుస్తున్నాయి. ప్రార్థనాలయంలోనేమో తంబుర శ్రుతి సవరింపు సన్నగా వినిపిస్తూ ఉంది. ఆయన చెబుతున్నాడు. నేను వింటున్నాను.

"బాబూ! ఇరవైయేండ్ల కిందటిమాట. ఎక్కడి నుండి వస్తున్నానో అక్కడికి ఎందుకు వెళ్ళానో ఇప్పుడయితే మతికి రావటం లేదుకానీ ఇంటికి వస్తున్నాను రైల్లో. దాదాపు రెండు రోజుల ప్రయాణం. ఎన్ని వసతులుండినా రైల్లో రెండు రోజుల ప్రయాణమంటే పొద్దుపోవడం కాస్త కష్టమే! పక్కనున్న ప్రయాణికులు కలుపుగోలుతనం కలవాళ్ళయితే ఫరవాలేదు కానీ మూతిబిగించి కూర్చునే రకాలైతే మరీ ఇబ్బంది. ఇలాంటి ఇబ్బందుల్లో నుండి బయటపడాలంటే అలాంటి సమయాల్లో పుస్తకాలే మన నేస్తాలు. ఏమంటావ్?"

ఇందులో అనడానికేముంది? – ఆయన చెప్తున్నది అక్షరసత్యం. అందుకే అనడమెందుకని వినడానికే సిద్ధపడి బాగా సర్దుకొని కూర్చున్నాను.

ఆయన మతికేమి వచ్చిందో ఏమో తెలియదు. ఉన్నట్లుండి ఓ పిచ్చివాడిలా నవ్వుతున్నారు. నేను ఆశ్చర్యపడ్డాను అనడం కంటే అదిరిపడ్డాననడం సమంజసం. ఆ స్థితి నుండి నేను తేరుకొనకముందే ఆయన మళ్ళీ గంభీరంగా మారిపోయారు. ఈ మార్పుకు తీర్పుకుదరక నేను నివ్వెరపడి చూస్తూ ఉండిపోయాను.

"నాకు తెలుసుబాబూ? నువ్వు ఆశ్చర్యపడుతున్నావని. కారణం ఏమీలేదు. మన తెలుగువాళ్ళు మనసులో మెదిలారు. అంతే!"

తెలుగువాళ్ళు మనసులో మెదలడానికి ఆయన నవ్వుకు ముడిపెట్టుకోలేక నా కనుబొమ ముడిపడింది. ఆయన గ్రహించారు.

"తెలుగువాళ్ళకు తెలుగంటే బోలెడంత అభిమానం బాబూ!" అంటూ మళ్ళీ కాసేపు విరగబడి నవ్వారు.

ఆయన నవ్వు ఆపుకొనే వరకు నేను నోరు తెరవకుండా ఆయన్నే చూస్తూ ఉండిపోయాను. ఆయన నవ్వు ఆపగానే–

"ఎవరిభాషమీద వాళ్ళకు అభిమానం ఉంటుంది గదండీ! అందులో తప్పుకూడా లేదు".

"అదే బాబూ అదే? నేననేదీ అదే!!– ఆ తెలుగుమీది అభిమానం ఉంది చూశావూ? పక్కనున్నవాడి చేతిలో తెలుగు పుస్తకం కానీ లేదా ఓ వార్తాపత్రిక కానీ కంటపడితే చాలు!– దాని దుంపదెగ! – ఆ అభిమానం మరీ ఎక్కువైపోతుంది."

తెలుగువాడిని నిర్దాక్షిణ్యంగా కొట్టిన దెబ్బ నాకూ తగిలింది. దెబ్బ తగులుతున్నా ముక్కీమూలగరాని దెబ్బ అది. అందుకే ఆయనతో కలిసి నేనూ కాసేపు హాయిగా నవ్వుకొన్నాను – ఏడవలేక నవ్వినట్లు!

"నేను కూడ తెలుగువాడినే కదా బాబూ! పక్కనున్న ప్రయాణికుడి చేతిలో ఓ పత్రిక కంటపడేసరికి మొదట వంగి వంగి చూశాను – అది తెలుగు పత్రిక అవునో? కాదో? తెలుసుకొందామని! ఓ తెలుగు వారపత్రిక అని తెలిసేసరికి అతడు చదువుతున్న పేజీల్లోకి నిక్కినిక్కి చూశాను. నా అవస్థను గమనించిన ఆ పెద్దమనిషి అదోరకమయిన చూపును విసిరేసరికి పరధ్యానంగా ఎటో చూస్తున్నట్లు నటించాను. ఎంతసేపు? కాసేపు. అంతలోనే మళ్ళీ మొదటికే వచ్చింది పరిస్థితి. నాకు తెలియకనే నా చూపులు ఆ పత్రిక వైపు మళ్ళాయి. ఇదంతా గమనించిన ఆ పెద్దమనిషి – పాపం! మంచి మనిషిలా

ఉన్నాడు. ఆ వారపత్రికను నా చేతికందించి అంతకంటే మంచిపని అప్పటికి లేనట్లు తన పడకమీద ముసుగుతన్ని పడుకొన్నాడు. నేను ఆ పత్రికను ఆప్యాయంగా అందుకొన్నాను – ఎంతయినా తెలుగువాణ్ణి కదా బాబూ!" అని చెట్టుమీద చేరిన పిట్టలు ఎగిరిపోయేటంత గట్టిగా నవ్వు అందుకొన్నారు.

అంతలో ఓ నడివయస్సు మనిషి అక్కడికి రావడంతో కథాగమనం కుంటుపడింది. ఓ లావుపాటి పుస్తకాన్ని రెండు చేతులతో పొదివి పట్టుకొని నిలబడి ఉన్నాడతడు. బహుశా అదేదయినా ఓ చిట్టాపుస్తకం కావచ్చు. ఆ వ్యక్తిని చూస్తూనే – 'రావయ్యా! రా?' అంటూ పిలిచారాయన. అతడు చూపిన చోటంతా సంతకాలు పెడుతూ "పెట్టమన్న చోటంతా కండ్లు మూసుకొని సంతకాలు పెడుతున్నాను. అనాథలయిన పిల్లలు, వాళ్ళ అధోగతికి దారితీస్తే పుట్టగతులుండవు. ఇది మాత్రం మనసులో పెట్టుకోండి!" అని అంటూ పుస్తకాన్ని అతని చేతి కందించారు. ఆ చెవులకు ఈ మాటలకు బాగా పొంతనాలు కుదిరినట్లుంది. అతడు నోరు కదపలేదు కానీ వంగి నమస్కరించి వెళ్ళిపోయాడు.

"నా తెలుగుతనాన్ని గురించి చెబుతూ ఆగిపోయానుకద బాబూ! దేశంకాని దేశంలో వేళకానివేళ ఓ తెలుగు వారపత్రిక చేతికందడంతో గడిచిన ప్రయాణంకంటే గడవాల్సిన ప్రయాణం కాస్త హాయిగా ఉంటుందన్న నమ్మకం కుదిరింది. పేజీలు తిప్పుతూ ఓచోట ఆగిపోయాను!"

ఆ మాటంటూ ఆయన ఆగిపోయారు!

అలా చూసేసరికి నాలుగయిదు బారల దూరంలో నలుగురయిదుగురు పిల్లలు. గోళ్ళు గిల్లుకొంటూ నిలబడ్డారు. ఆయనవైపు దీనంగా చూస్తున్నారు. ఆయన దృష్టి వాళ్ళమీద పడేసరికి అప్రయత్నంగా వాళ్ళ తలలు వాలిపోతున్నాయి. ఆ పిల్లవాళ్ళ భావన అర్థమయిందన్నట్లుగా ఆయన లేచి వాళ్ళదగ్గరికి వెళ్ళారు. వాళ్ళేదో చెప్పారు. ఆయన కూడా వాళ్ళకేదో చెబుతూ ఒకడి భుజంతట్టి మరొకడి బుగ్గలు గిల్లి ఇంకొకడి తల నిమిరాడు. అంతే! పరుగో పరుగు. ఆ పిల్లలు ఆనందానికే కాళ్ళు వచ్చినట్లుగా పరుగందుకొన్నారు. అలా వెడుతున్న ఆ పిల్లల్ని అలానే చూస్తూ నిలబడ్డారు కాసేపు. ఆ తరువాత తనలో తాను నవ్వుకొంటూ వచ్చి ఉయ్యాలపీట మీద కూర్చున్నారు.

"బాబూ! ఒకప్పటితో పోల్చిచూస్తే తెలుగులో చాలా పత్రికలు వస్తున్నాయి. ఇప్పుడు చాలా చాలా కథల్ని కూడా ప్రచురిస్తున్నాయి. ప్రచురించిన ప్రతికథకు ఓ బొమ్మను కూడా వేయిస్తున్నారు. అయితే బొమ్మను చూసి కథను చదవాలన్న కోరిక కలిగే తీరులో బొమ్మలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయి. ఏమంటావ్?"

తీరని పనుల్లో తల మునకలవుతున్న ఆ మనిషికి ఇంత పరీక్షచేసే తీరిక ఎలా దొరికింది? – అని ఆశ్చర్యపడుతూ 'నిజమేనండీ!' అన్నాను.

### ఆలోచించండి-చెప్పండి

- *సమయం, సందర్భం కలిసిరావడమంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు తెలపండి.*
- *"తెలుగువారికి తెలుగంటే బోలెడంత అభిమానం" దీన్ని గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.*
- *పిల్లలు ఎందుకోసం వచ్చి ఉంటారు? ఆయన వారితో ఏం మాట్లాడి ఉంటారు? ఊహించండి.*
- *కథల పుస్తకాలు లేదా ఇతర పుస్తకాల్లో బొమ్మలు ఎందుకు వేస్తారు?*
- *వృద్ధుడిని ఆకట్టుకొన్న బొమ్మ ఏమిటి? ఆ బొమ్మను చూసి ఎలాంటి అనుభూతిని పొందాడు?*
- *వారపత్రికలోని వృద్ధుడు చదివిన కథ ఏమై ఉంటుంది?*

"ఇంతకు మునుపే అన్నాను గద బాబూ! ఆ వార్తపత్రిక పేజీలు తిప్పుతూ ఓచోట ఆగిపోయానని! ఆ పత్రికలో అలాంటి బొమ్మ కంటపడింది. అందుకే ఆగిపోయాను" ఆ బొమ్మ కలిగించిన అనుభూతి మరలా మనసులో మెదిలిందేమో? ఆయన కాసేపు అరమోడ్పు కన్నులతో అలానే ఉండిపోయారు.

"అది ఓ రైలుపెట్టె. ఆ పెట్టెలో ఓ కుర్రవాడు అడుక్కొంటూన్నాడు. వాడు చేయి చాపి నిలబడిన తీరు... వాడిచూపుల్లో కొట్టొచ్చినట్లున్న జోరు... నన్ను ఆకట్టుకొన్నాయి. అందుకే ఆ కథను ఆసక్తిగా చదివాను."

ఆయన చూపుల్ని ఆకట్టుకొన్న ఆ బొమ్మ... ఆ బొమ్మ వెనక కథను విందామన్న కుతూహలాన్ని ఆయన పసిగట్టాడు.

## III

"నువ్వు చూస్తూనే ఉంటావు బాబూ! రైళ్ళల్లో ప్రయాణం చేసేటప్పుడు పట్టుమని పదేండ్లు నిండని కుర్రవాళ్ళు. ఆ పెట్టెను ఈ కడనుండి ఆ కడదాకా తుడుస్తారు. ఆ తరువాత ఆ పెట్టెలోని ఒక్కొక్కరి ముందు నిలబడి చేయిచాస్తారు. తోచిన వాడు తోచినంత ఇస్తే దాంతో పూట గడుపుకొంటారు. ఆ పిల్లవాడు కూడా అలాంటి కోవకు చెందినవాడే!" ఆ మాటంటుంటే ఆయన గొంతు తడబడింది – బహుశా ఈ దేశంలో ఇలాంటి నికృష్ట జీవితాలకు ఎందరు బలి అవుతున్నారో అని.

"ఆ పదేండ్ల బుడతడు ఆపెట్టెను ఈ చివరి నుండి ఆ చివరిదాకా తుడుస్తాడు. ఆపై ఒక్కొక్కరి ముందు చేయి చాస్తూ... ఇచ్చినవాడికి ఓ నమస్కారం పడేస్తూ... లేదన్న వాళ్ళవైపు దీనంగా చూస్తూ... ఓ వ్యక్తి ముందు నిలబడతాడు. నిలబడి మామూలుగా చేయిచాస్తాడు. ఆ వ్యక్తి వాణ్ణి దగ్గరికి పిలుస్తాడు. ఆ పిలుపులోని ఆప్యాయత ఎంతో ఆశను రేకెత్తిస్తుంది. కుర్రవాడు ఆ వ్యక్తి దగ్గరికి వెళతాడు. 'నీ పేరేమిటి బాబూ!' అని ఆరంభిస్తాడు. పైసలిచ్చే ప్రయత్నం చేయకుండా! ఆ కుర్రవాడు ఏమనుకొన్నాడో ఏమో? ఓ నిర్లక్ష్యమైన చూపు విసిరేసి 'నాపేరు దొరైరాజ్!" అని అంటూ చేతిలోని పైసల్ని అలా ఎగరేసుకొంటూ దర్జాగా వెళ్ళిపోతాడు. అలా వెళ్ళిపోతున్న కుర్రవాడి ధోరణికి మొదట ఆశ్చర్యపడి ఆ తరువాత ఆలోచనలో పడతాడా వ్యక్తి! ఇదీ కథ!!" అని తాను చదివిన కథను క్లుప్తంగా చెప్పి–

"బాబూ! నేనూ కూడా ఆలోచనలో పడ్డాను. నిజమేగదా? ఎందరో వాడి ఈడు పిల్లలు జేబులు కొడుతున్నారు. ప్రయాణాల్లో ఏమరుపాటుగా ఉంటే చేతికందిన సామాన్లు పట్టుకొని ఉడాయిస్తున్నారు. మరికొంతమంది నికృష్టులు కలవాళ్ళ చేతుల్లో తోలుబొమ్మలవుతున్నారు. ఇంకొంతమంది ఇండ్లముందు నిలబడి కడుపుమంటల్ని కంటిచూపుల్లో నిలుపుతున్నారు. అలాంటప్పుడు అంతో ఇంతో పనిచేసి పొట్ట గడుపుకోవాలనుకోవడం గొప్ప సంగతేకద బాబూ?– నిజంగా వాడు దొరైరాజే!"

బాబూ! నా ఆలోచనల్లో నేనుంటే సరిగ్గా ఇలాంటి సంఘటనే నా కంటపడింది. ఆ రైలుపెట్టెలో!!

ఈ కథ మీద కథను వినాలన్న కుతూహలం పెరిగింది నాలో!

"బాబూ! గిజిగాడిగూడు ఉంటుంది చూశావు గదూ? దాన్ని పీచుగా పీకి తలమీద అతికించినట్లుంది – బూడిదరంగు తిరిగిన వెంట్రుకల్ని చూస్తుంటే! నల్లని నూనెలో తడిసీ తడవక ముందే పిండి తొడుక్కొన్నట్లున్నాయి – అందీ అందని నిక్కరు చొక్కా! అసలు ఒంటిరంగు మంచిదయినా దుమ్ము మరకలుకట్టి నలుపు తెలుపు కలిసిన బూడిదరంగు తేలింది ఒళ్ళంతా పొడలు పొడలుగా! అయినా కళ్ళల్లో ఆశ చావలేదు. చేస్తున్న పనిలో శ్రద్ధ తగ్గలేదు. పట్టుమని పదేళ్ళయినా నిండని

వాడివైపు చూశాను. ఆ తరువాత చూపు మరల్చుకొన్నాను. అయినా వాడు కళ్ళల్లోనే మెదులుతున్నాడు. చదివిన కథ మనస్సును తొలుస్తూ ఉంది. నాలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఆలోచనను ఆచరణలో పెట్టాలన్న తలంపుతో అలాగే పడుకొన్నాను పడక మీద! కళ్ళు మూసుకొన్నట్లున్నానే కానీ చూడగలుగుతున్నాను. విప్పిన పత్రిక ఎదమీద విస్తరించి పడుకొని గుండె చప్పుడు వింటూ ఉంది!"

అంతలో 'టప్' మన్న శబ్దం వినిపించింది. మా ఇద్దరి చూపు అటు మళ్ళింది. ఓ పిట్ట రెట్టవిడిచింది. అది ఆ ఉయ్యాల పీటమీద ఇద్దరి మధ్యగా పడింది. పక్కన పడి ఉన్న ఓ పాత కాగితాన్ని అందుకొని నేనా రెట్టను తుడుస్తుంటే – అదోరకంగా నవ్వారాయన.

"బాబూ! పిట్ట రెట్టవేసింది కదా? ఎందుకు వెయ్యాలి? అంటే ఏమని చెప్పగలం? అది దాని స్వభావం. అంతే! మనుషుల స్వభావాలు కూడ అలానే ఉంటాయి. ప్రయత్నించి ఫలితాన్ని సాధించడంలో కొందరికి ఆనందం. అసలు ప్రయత్నాల ప్రమేయమే లేకుండా జీవితాన్ని కొనసాగించాలన్నది కొందరి కోరిక. నా జీవితమంతా ఇలాంటి ప్రయత్నాలతోనే కొనసాగుతూ ఉంది. అందుకే ఆ కుర్రవాడి బతుకు మీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను" – అంటూ కాసేపు ఆగారు.

ఆ తరువాత –

"ఆఁ! రైలు పెట్టెలో కుర్రవాడిని గురించి చెప్తూ, వచ్చాను కదూ! అవును. మరో నాలుగయిదు నిముషాల్లో నేను పడుకొని ఉన్న చోటువరకు ఊడ్చుకొంటూ వచ్చాడు. అక్కడ కాసేపు ఆగాడు. ఆగి నిద్రపోతున్నట్లున్న నన్ను – ఆ కాగితాన్ని మార్చి మార్చి చూశాడు. ఆ తరువాత నన్ను లేపడానికి మెల్లగా తట్టాడు.

నేనేమో అప్పటికి మహానిద్రపోతున్నట్లుగా ఆవిలిస్తూ లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొన్నట్లుగా నటించి – ఆ తరువాత కండ్లు తెరచి చూశాను ఆ కుర్రవాణ్ణి. ఒదిగి నిలబడి వినయంగా వాడు నా చేతికందించాడా కాగితాన్ని! అది కాగితమే! కానీ – లోకం దృష్టిలో దాని విలువ అయిదు రూపాయలు!!

ఆ కుర్రవాణ్ణి పరీక్షించడానికి నా ప్రయత్నంగా నేను జార విడిచిన కాగితమది!

మారు మాట్లాడకుండా వాడి చేతిలో ఓ పావలా కాసు పెట్టాను. మాటల్లోకి దింపితే కథలో కుర్రవాడి మాదిరి మాట్లాడకుండా వెళ్లిపోతాడేమో? అని సందేహం. ఆ కుర్రవాడు పావలా డబ్బులందుకొని రెండు చేతులు జోడించి నమస్కరించాడు. ఆ తరువాత తన పనిలో తాను లీనమయ్యాడు.

"బాబూ!" అప్యాయంగా పిలిచాను.

మాట చెవిని పడడంతో ఆ కుర్రవాడు లేచి నా ఎదురుగా నిలబడ్డాడు.

"నువ్విప్పుడు చిన్న పిల్లవాడివి. ఈ పని చేసి బతగ్గలుగుతావు. బాగానే ఉంది. అయితే ఇంకొన్నాళ్ళకు పెద్దవాడివవుతావు. అప్పుడీ పని చేయలేవు. చేసినా అందరూ నిన్ను తప్పుపడతారు. అప్పుడెలా బతుకుతావు బాబూ?"

నా మాటలు వాడికి అయోమయంగా వినిపించినట్లుంది. అమాయకంగా చూస్తూ నిలబడ్డాడు.

"అందుకే బాబూ! ఈ వయసులో చదువుకొంటే – ఆ వయసులో సంపాదించుకోవచ్చు."

## ఆలోచించండి - చెప్పండి

- రైలు పెట్టెలో తుడుస్తున్న బాలుడిని చూసి, ఇలాంటి నికృష్ట జీవితాలకు ఎంతమంది బలి అవుతున్నారో అని వృద్ధుడు భావించడం సరైందేనా? ఎందుకు?
- "ప్రయత్నం చేసి ఫలితాలు సాధిస్తే ఆనందం కల్గుతుంది" దీంతో మీరు ఏకీభవిస్తారా?
- అందరు పిల్లలూ తప్పనిసరిగా బడికి వెళ్ళి చదువుకోవాలి కదా! మరి అలా ఎందుకు జరగడంలేదు?
- "గుండెల్లోని ఆనందం కరిగి ముత్యాల్లా కన్నీటి రూపంలో రావడం" అంటే మీకేమి అర్థమైంది? ఇది ఏ ఏ సందర్భాలలో జరుగుతుంది? మీ అనుభవాలు తెల్పండి.
- "ఒక వ్యక్తి బాధ్యతల్ని స్వీకరించే స్థితికి సమాజం ఎప్పుడు చేరుతుందో?" అనే ఆవేదన సరైందేనా? ఎందుకు?

"తటాలున రైలు పట్టాలు తప్పినా అంత ఆశ్చర్యపడేవాడు కాదేమో ఆ కుర్రవాడు, అంతకు మించిన ఆశ్చర్యాన్ని పులుముకొన్నాడు మొగంలో 'నన్నెవ్వరీలోకంలో చదివించే వాళ్ళన్నట్టుగా. అది గ్రహించాను. అందుకే."

"నాతో వచ్చేస్తావా బాబూ"

తల వంచాడు!

"ఆ కుర్రవాడే ఈ కుర్రవాడు బాబూ!"

అర్ధ గంటకు మునుపు ఆయన పాదాలకు నమస్కరించిన కుర్రవాడు కనుల ముందు కదిలి ఇద్దరిమధ్య సంబంధం మనస్సులోమెదిలి – అటూ ఇటూ కదలలేకుండా కూర్చున్నాను.

"ఏముంది బాబూ? పదిమందిలో వాడూ ఒక్కడయ్యాడు. అయితే పట్టుదలతో చదువుకొన్నాడు. కృషికి తగిన ఫలితం. మంచి ఉద్యోగమే వచ్చింది. ఆ తరువాత ఓ ఇంటివాడిని చేశాను. ఉద్యోగంతో ఊరువదిలిపోతూ "బాబయ్యా! నేనెప్పుడు పుట్టానో నాకు తెలియదు. ఎవరికి పుట్టానో కూడా ఎరగను. ఎందుకు పుట్టానో ఆలోచించవలసిన అవసరం లేకపోయింది. అయితే – నేను పుట్టిన రోజు మాత్రం ఈ విద్యానగరంలో అడుగుపెట్టిన రోజు. ఆ రోజు నేనీ జీవితంలో మరవలేను. అందుకే ఆ రోజున మీ రెక్కడున్నా నే నెక్కడున్నా తమ పాదాలకు ప్రణమిల్లే అవకాశాన్ని మహా అదృష్టంగా భావిస్తాను. ఈ జీవిత కాలమంతా అలాంటి అదృష్టం లభించే లాగున ఆశీర్వదించండి." అంటూ పాదాలమీద పడ్డాడు.

ఆయన గొంతు గాద్గదికమై పోయింది. మాటలు పూడుకపోతున్నాయి. గుండెల్లోని ఆనందం కళ్ళల్లో కరిగి ముత్యాలుగా మారి రాలుతున్నాయి!

"సరిగ్గా ఈ రోజేబాబూ! – బాబు విద్యానగరంలో అడుగుపెట్టిన రోజు. అదే బాబు పుట్టిన రోజు!"

ఆ కనుకొలకుల్లో కన్నీళ్ళు నిలిచాయి. ఎందుకని అడిగితే ఏమని చెప్పేది?

"బాబూ! ఇది వేపచెట్టు. సహజంగా 'వేపచెట్టు' అని చెవినిపడడంతో 'చేదు' అన్నభావన మనసులో మెదులుతుంది. అయితే ఆ వేప చెట్టును ఆశ్రయిస్తే – నీడనిస్తుంది. దినమూ ఓ కాయ నమిలి మింగగలిగితే దీర్ఘవ్యాధుల్నే నయం చేస్తుంది. పంటిపుల్లగా నోటిజబ్బుల్ని పోగొడుతుంది. అలాగే బాబూ! 'అడక్క తినేవాళ్ళు అని' పట్టించుకోకుంటే ఆ బతుక్కే అంకితమైపోయి. అనామకులైపోతారు. ఒక విధంగా చెప్పాలంటే వాళ్ళు కొడిగట్టిన దీపాలు. కాసంత సానుభూతి, ఓపికను రంగరించి, కొడినలా తట్టేసి తగినంత చమురుపోసి వత్తిని ఎగదోస్తే – అవి గోరంత దీపాలే కావచ్చు. ఏనాటికో ఒకనాటికి అవి కొండంత వెలుగునిస్తాయి!"

ఒకే ఒక వ్యక్తి ఆలోచన ఆచరణగా మారితే ఒక మహాసంస్థ ఎన్ని కొడిగట్టిన దీపాలకు ఆశ్రయమిచ్చింది? – ఒకవ్యక్తి బాధ్యతల్ని స్వీకరించే స్థితికి సమాజం ఎదిగేది ఎప్పుడో? సమాధానం దొరకని ప్రశ్న నన్ను సతమతం చేస్తుంటే – చేదు నిజాన్ని తియ్యగా పలికిస్తుంటే ఆ మహామనీషికి మనస్సుకు చేతులొస్తే నమస్కరించేది!

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

1. "గోరంత దీపాలు" అనే శీర్షిక ఈ పాఠానికి తగిన విధంగా ఉందా? ఎందుకు? సకారణంగా చర్చించండి.
2. పాఠం చదవండి. 'వేపచెట్టు' గురించి వివరించిన, వర్ణించిన వాక్యాలు ఏమేమి ఉన్నాయి? వాటిని గుర్తించి చదవండి.
3. పాఠంలోని కింది పేరాలు చదవండి. ఆ పేరాలలో వేటి గురించి వివరించారో తెల్పండి, ఆ పేరాల్లోని వివరణ / వర్ణనకు సంబంధించిన కీలక పదాలను రాయండి.

| పేరా | దేని గురించి వివరణ / వర్ణన ఉంది | వివరణ / వర్ణనకు చెందిన కీలక పదాలు |
|---|---|---|
| ఆయన నిమీలిత .................. ............... మూగబోయారు. | | |
| దాదాపు రెండు మూడు ................ పరవశంతో పాడుతున్నారు. | | |
| ఆ నగరంలో అతడు ................. తేలిపోతుంటారు. | | |
| రాత్రి ఏడు గంటల .................. కనుల పండువుగా ఉంటుంది. | | |
| పడమటి కొండ కోన కొమ్మ ................. ............... వింటున్నాను. | | |

4. కింది వాక్యాలు చదవండి. ఎవరు, ఎవరితో, ఏ సందర్భంలో అన్నారు?
   - అ) అవును బాబూ! నిజంగా అతడు అదృష్టవంతుడే!
   - ఆ) "పెట్టమన్నచోటంతా కండ్లు మూసుకొని సంతకాలు పెడుతున్నాను. అనాథలయిన పిల్లలు, వాళ్ళ అధోగతికి దారితీస్తే పుట్టగతులుండవు" ఇది మాత్రం మనసులో పెట్టుకోండి!"
   - ఇ) "అదృష్టవంతుడికి కన్నీటితో అభిషేకం జరుగుతున్నప్పుడు!"
   - ఈ) మీరెక్కడున్నా, నేనెక్కడున్నా తమ పాదాలకు ప్రణమిల్లే అవకాశాన్ని మహా అదృష్టంగా భావిస్తాను.
   - ఉ) అవి గోరంత దీపాలే కావచ్చు. ఏనాటికో ఒక నాటికి అవి కొండంత వెలుగునిస్తాయి.

**5. పేరా చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

బతకడానికి ఉద్యోగం వెతుక్కుంటారు కొందరు. జీవితానికి అర్థం వెతుక్కుంటారు మరికొందరు .... లక్ష్మీకాంతం రెండో కోవకు చెందుతారు. ఒక బిడ్డ కన్నీరు తుడవడమే భాగ్యం. ఒక బిడ్డకు తల్లి కావడం ఇంకా భాగ్యం. అలాంటిది లక్ష్మీకాంతం అరవై ఎనిమిది మంది అనాథలకు అమ్మలా మారారు. వాళ్ళకు కంటి పాప అయ్యారు. పైపైన చేస్తే ఉద్యోగం అవుతుంది. హృదయంలో నుంచి చేస్తే మానవత్వం అవుతుంది. లక్ష్మీకాంతం మానవీయ మూర్తి. వీథి బాలలుగా ముద్రపడిన అనాథలకు విశాఖ వాకిట నేడొక అమృతహస్తం దొరికింది. కన్నతల్లి ఒడి దక్కినట్టయింది. వీళ్ళ జీవితాలకు అండగా నేనుంటాననంటూ పోదూరి లక్ష్మీకాంతం ముందుకు వచ్చింది. మాటలు కాదు – గత పదేళ్ళుగా ఆప్యాయతానురాగాలను చేతల్లో చూపుతోంది. అరవై ఎనిమిది మంది వీథి బాలల (స్ట్రీట్ చిల్డ్రన్) కు అమ్మగా అవతరించింది. కన్నబిడ్డల కంటే వీథిబాలలనే ఎక్కువగా చూసుకుంది.

ప్రశ్నలు

అ) పై పేరా దేని గురించి తెలియజేస్తుంది?

ఆ) పై పేరాలోని కీలకపదాలను ఏరి రాయండి.

ఇ) 'అమృత హస్తం' అనే పదానికి అర్థమేమిటి?

**6. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రచయిత ఈ కథానిక ప్రారంభంలో వేటిని గురించి, ఏమని వర్ణించాడు?

ఆ) వృద్ధుడి వద్దకు వచ్చిన 'కుర్రాడు ప్రవర్తించిన తీరు ఎలా ఉంది? రచయిత అతడి ప్రవర్తనను ఏ ఏ వాక్యాలతో వివరించాడు?

ఇ) విద్యానగరం ఒక విద్యాలయం కదా! దాని ఆవరణ, వాతావరణం ఎలా ఉంది?

ఈ) వృద్ధుడు చేస్తున్న సేవాకార్యక్రమం గురించి లోకం ఏమనుకునేది? దానికి వృద్ధుడి ప్రతిస్పందన ఎలా ఉంది?

ఉ) వృద్ధుడు వారపత్రికలో చదివిన కథ ఏమిటి?

ఊ) రైలు పెట్టెలో ఊడుస్తున్న బాలుడి గురించి వృద్ధుడు ఏం చేశాడు?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) "గోరంత దీపం" కథానిక ద్వారా మీరు గ్రహించిన ముఖ్యమైన ఐదు విషయాలు రాయండి.

ఆ) "ఆ కుర్రవాడి బతుకుమీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను." అన్న వృద్ధుడు ఏం ప్రయత్నం చేశాడు? దాని ఫలితం ఎలా ఉంది?

ఇ) "బాబూ! ఈ వయస్సులో చదువుకొంటే, ఆ వయస్సులో సంపాదించుకోవచ్చు" ఈ వాక్యం గురించి మీ అభిప్రాయాల్ని రాయండి.

ఈ) ఒంటరిగా ఉన్నప్పుడు పుస్తకాలే మన నేస్తాలు" అనే వాక్యంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?

**2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) కథానికలోని వృద్ధుని పాత్ర స్వభావాన్ని, గొప్పదనాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) వృద్ధుడు, ప్రయోజకుడైన యువకుని మధ్య ఉన్న సంబంధం ఎలాంటిది? వారి మధ్య ఉన్న సంబంధాన్ని, అనురాగాన్ని మీ సొంత మాటల్లో వివరించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) 'విద్యాలయం' ఆవరణ ఎలా ఉందో పాఠంలో వర్ణించిన విధానం చదివారు కదా! దీని ఆధారంగా మీరు మీ పాఠశాల గురించి లేదా ఒక పర్యాటక క్షేత్రాన్ని గురించి వర్ణించి రాయండి.

ఆ) పాఠంలో 'దాదాపు రెండు మూడు ........... పరవశంతో పాడుతున్నారు' పేరా చదవండి. దీనికి సంబంధించిన చిత్రం గీయండి. రంగులు వేయండి. కవిత రాయండి.

ఆ) వృద్ధుడి రైలు ప్రయాణంలోని వారపత్రిక పఠనం విషయం ఆధారంగా వృద్ధుడు, పెద్దమనిషి మధ్య హాస్య సంభాషణ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. ఈ కింద ఇచ్చిన రెండేసి పదాలు కలిపి సొంత వాక్యాలు రాయండి.**

అ) వినయం – విధేయత

ఆ) రాజు – మకుటం

ఇ) ప్రదేశం – ప్రశాంతత

ఈ) గుడిసె – దీపం

ఉ) ప్రయాణం – సౌకర్యం

**2. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా॥ <u>సంజవెలుగు</u> లో తటాకంలోని నీరు కొత్తఅందం సంతరించుకుంది.

సంజవెలుగు = సంధ్యా సమయంలో వెలువడే కాంతి.

అ) నా పుట్టిన రోజున మా నాన్నగారి <u>ఆశీర్వాదం</u> తీసుకున్నాను.

ఆ) రాజు ప్రకృతి అందాల్ని <u>తదేకంగా</u> చూస్తూ నిలబడ్డాడు.

ఇ) శివ పుస్తకాలతో కాలక్షేపం చేస్తూ ఉంటాడు.

ఈ) రాణి ముఖం నిండా పసుపు పులుము కుంది.

ఉ) లత పాఠాన్ని చక్కగా ఆకళింపు చేసుకుంది.

**3. ఈ కింది వాటిని చదవండి. వాటికి సంబంధించిన పదాన్ని రాయండి.**

అ) హాస్య సంఘటన చూసినప్పుడు ______________ వస్తుంది.

ఆ) చదువు వల్ల ______________ వస్తుంది.

ఇ) బాధ వల్ల ______________ వస్తుంది.

ఈ) శ్రమ వల్ల ______________ వస్తుంది.

ఉ) వ్యాయామం వల్ల ______________ వస్తుంది.

**4. అనాథలను చేరదీసే సంస్థలను అనాథ శరణాలయాలు అంటారు కదా! ఇలాంటివే మరికొన్ని ఉన్నాయి. కింద ఇచ్చిన సమాచారం ఆధారంగా వాటిని రాయండి.**

అ) పక్షులను రక్షించే సంస్థ : ______________________________

ఆ) జంతువులను రక్షించే సంస్థ : ______________________________

ఇ) వృద్ధులను చేరదీసే సంస్థ : ______________________________

ఈ) మనోవైకల్యం గల వాళ్ళు చేయూతనిచ్చే సంస్థ : ______________________________

ఉ) కుష్ఠురోగుల పునరావాసకేంద్రం : ______________________________

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాల్లోని పుంప్వాదేశ సంధి, టుగాగమ సంధి, అత్వ సంధి, ద్విరుక్తటకార సంధుల పదాలను గుర్తించి విడదీసి సూత్రాలను రాయండి.**

సరసంపుమాట, కట్టెదుట, చింతాకు, తూగుటుయ్యేల, నట్టడవి,

ముద్దుటుంగరము, మధురంపుకావ్యం, పల్లెటూరు, రామయ్య

### శ్చుత్వసంధి

**2. కింది ఉదాహరణలను పరిశీలించండి.**

అ) నిస్ + చింత → నిశ్చింత

సత్ + ఛాత్రుడు → సచ్ఛాత్రుడు

శరత్ + చంద్రికలు → శరచ్చంద్రికలు

జగత్ + జనని → జగజ్జనని

శార్ఙ్గిన్ + జయః → శార్ఙ్గిఞ్జయః

| సకార<br>త వర్గం | శకార<br>చ వర్గం |
|---|---|
| స | శ |
| త | చ |
| థ | ఛ |
| ద | జ |
| ధ | ఝ |
| న | ఞ |

పై పదాల్లో 'స' కార 'త' వర్గలు పూర్వపదాంతంగా ఉన్నాయి. 'శ' కార, 'చ' వర్గ (చ ఛ జ ఝ ఞ) లు పరమైనాయి. అలా ఐనప్పుడు మళ్ళీ 'శ' కార 'చ' వర్గాలే వచ్చాయి.

అంటే – స్ + చి → శ్చి; త్ + చా → చ్చా; త్ + చ → చ్చ;

త్ + జ → జ్జ; న్ + జ → ఞ్జ

ఇలా 'స' కార 'త' వర్గ (త థ ద ధ న) లకు వరుసగా 'శ' కార, 'చ' వర్గ (చ ఛ జ ఝ ఞ)లు పరమైతే 'శ' కార 'చ' వర్గలే ఆదేశమౌతాయి.

| | | |
|---|---|---|
| స్ + చ → శ్చ | త్ + చ → చ్చ | ద్ + చ → చ్చ |
| స్ + జ → శ్జ | త్ + జ → జ్జ | ద్ + జ → జ్జ |
| | న్ + చ → ఞ్చ | |
| | న్ + జ → ఞ్జ | |

ఇలా పైన చెప్పిన ఏ అక్షరానికైనా ఆదేశం చెల్లుతుంది.

కింది సంధులు విడదీయండి. సూత్రంతో సరిచూడండి.

1. సజ్జనుడు
2. సచ్చరిత్రము

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ మీ పాఠశాల గ్రంథాలయంలోని ఏదైనా కథల పుస్తకం నుండి గాని లేదా ఏదైనా పత్రిక నుండి గాని సామాజిక సేవ, మానవసంబంధాలు, గురుశిష్యసంబంధం మొదలైన విషయాలకు సంబంధించిన మంచి కథను చదివి ఎంపిక చేయండి. దాన్ని రాసి ప్రదర్శించండి. అది మీకు ఎందుకు నచ్చిందో, దాంట్లోని గొప్పతనమేమిటో నివేదిక రాయండి.

### సూక్తి

అయం నిజఃపరోవేతి
వికల్పో లఘుచేతసామ్
ఉదార చరితానాతు
వసుధైక కుటుంబకమ్॥

– పంచతంత్ర

భావం : ఇతడు మనవాడు అతడు పరాయివాడు అనే విచక్షణ అల్ప మనస్కులకు కలుగుతుంది. ఉదార హృదయులు లోకమంతా ఒకే కుటుంబంగా భావిస్తారు.

13

# భిక్ష

- శ్రీనాథుడు

## చదవండి - ఆలోచించి చెప్పండి.

కం. తనకోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయచుట్టంబౌఁ
దనసంతోషమె స్వర్గము
తనదుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ.

**ప్రశ్నలు:**

1. ఈ పద్యంలో శత్రువుగా దేనిని పేర్కొన్నాడు? ఎందుకు?
2. శాంతి రక్షగా ఉంటుందనడంలో కవి ఉద్దేశమేమిటి?
3. సంతోషాన్ని స్వర్గంగా కవి ఎందుకు భావిస్తున్నాడు?
4. కోపంవల్ల కలిగే అనర్థాలను గురించిన సంఘటనలు మీకేమైనా తెలుసా? చెప్పండి.

## పాఠ్యాంశ నేపథ్యం

వేదవిభజన చేసి, పంచమవేదంగా పేరున్న మహాభారతాన్ని రచించి, అష్టాదశ(18) పురాణాలను రచించిన బ్రహ్మజ్ఞాని వేదవ్యాసుడు. పరమ పవిత్రం, పరమేశ్వరునికి ప్రీతిపాత్రం అయిన కాశిలో వ్యాసుడు తన పదివేలమంది శిష్యులతో కొంతకాలం నివసించాడు. బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచి, ప్రాతర్మాధ్యాహ్నిక విధులను పూర్తిగావించి శిష్యులతోకూడా కాశీనగరంలో భిక్షాటనం చేసేవాడు. శిష్యులు, తానూ వేరేవేరుగా తెచ్చిన భిక్షలో సగం అతిథి అభ్యాగతులకు సమర్పించి, మిగిలినది భుజించేవారు. ఒకరోజున కాశీ విశ్వనాథుడికి వ్యాసుణ్ణి పరీక్షించాలన్న సంకల్పం కలిగింది. ఆ సందర్భంగా జరిగిన సంఘటనే ఈ పాఠ్యాంశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యాంశం కావ్యప్రక్రియకు చెందింది. ఇది 'కాశీఖండము' సప్తమాశ్వాసం లోనిది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో వెతకండి. లేదా నిఘంటువు చూసి తెలుసుకోండి.

## కవి పరిచయం



(ఊహాచిత్రం)

(1380-1470)

ఆంధ్రవాఙ్మయంలో పేరెన్నికగన్న కవి శ్రీనాథుడు. ఈయన తల్లిదండ్రులు మారయ, భీమాంబ. కొండవీటిని పరిపాలించిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి. విజయనగర ప్రౌఢదేవరాయల ఆస్థానంలో 'గౌడడిండిమభట్టు'ను ఓడించి కనకాభిషేకాన్ని, కవిసార్వభౌమ బిరుదును పొందాడు.

మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్ర, శృంగారనైషధం, భీమఖండం, కాశీఖండం, హరవిలాసం, ధనంజయవిజయం, క్రీడాభిరామం, శివరాత్రిమాహాత్మ్యం, పల్నాటి వీరచరిత్ర, నందనందన చరిత్రలు శ్రీనాథుని రచనలు. శ్రీనాథుని చమత్కారానికి, లోకానుశీలనకు, రసజ్ఞతకు జీవితవిధానానికి అద్దంపట్టే చాటువులు చాలా ఉన్నాయి.

ఉద్దండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధం, సూక్తి వైచిత్రి తన కవితాలక్షణాలని చెప్పుకున్న శ్రీనాథుడు సీసపద్యాలకు ప్రసిద్ధి.

శ్రీనాథుని జీవితచరిత్రనే 15వ శతాబ్ది ఆంధ్రదేశ చరిత్రగా భావిస్తారు.

## ప్రవేశిక

*ఈనాడు 'భిక్షం' అనే మాట కేవలం 'అడుక్కుతినడం' అనే అల్పార్థానికి పరిమితమైంది కాని, ఒకప్పుడు 'భిక్ష' అనేది పరమపవిత్రమైన వ్రతం. శివుడు భిక్షేశ్వరుడుగా ప్రసిద్ధి. గురువులు శిష్యులకు 'జ్ఞానభిక్ష' పెట్టేవాళ్ళు. బుద్ధుడు భిక్షావృత్తితోనే జీవనం సాగించేవాడు; బౌద్ధులందరికీ అదే జీవనసూత్రంగా ఉండేది. గురుకులంలో చదువుకునే రాజకుమారులైనా భిక్షాటనంతో విద్యార్థిజీవనం గడిపేవారు. భిక్షపెట్టేవాళ్ళుకూడా అది మహాపుణ్యకార్యంగా భావించి, తమ ఇంటికి వచ్చిన వారిని 'అతిథిదేవోభవ!' అని నమస్కరించి, పూజించి, భిక్ష సమర్పించేవాళ్ళు. అటువంటి భిక్షావ్రతంతో జీవించిన వేదవ్యాసమహర్షి కాశీనగరంలో పొందిన ఒక అనుభవమేంటో ఈ పాఠం చదివి తెలుసుకోండి.*

### I

తే॥గీ॥ నెట్టుకొని కాయ బీఱెండ పట్టపగలు
తాను శిష్యులు నిల్లిల్లు దప్పకుండఁ
గాశికా విప్రగృహ వాటికల నొనర్చు
నఖిల విద్యాగురుండు భిక్షాటనంబు. 1

తే॥గీ॥ వండుచున్నారమను నొక్క వనజనేత్ర
తిరిగి రమ్మను నొక్క లేఁదీఁగె బోఁడి
దేవకార్యంబు నేఁడనుఁ దెఱవ యొర్తు
ద్వాః కవాటంబుఁ దెఱవదు వనిత యొకతె 2

సీ॥ ముంగిట గోమయంబున గోముఖము దీర్చి
కడలు నాల్గుగ ముగ్గుకఱ్ఱ వెట్టి,
యతిథి నచ్చోనిల్పి యర్ఘ్యపాద్యము లిచ్చి
పుష్పగంధంబులఁ బూజసేసి,
ప్రక్షాళితంబైన పసిఁడి చట్టువమున
నన్నంబుమీఁద నెయ్యభిఘరించి,
ఫలపాయసాపూప బహుపదార్థములతో
భక్తివిశ్వాస తాత్పర్యగరిమఁ

తే॥గీ॥ బెట్టుదురు మాధుకరభిక్ష భిక్షుకులకుఁ
గంకణంబులతో సూడిగములు రాయఁ
గమ్రకరముల బ్రాహ్మణాంగనలు కాశి
నన్నపూర్ణ భవాని కట్టనుఁగుఁ జెలులు 3

**ఆలోచించండి - చెప్పండి**

- *అతిథి దేవోభవ అంటే ఏమిటి?*
- *ప్రాచీనకాలంలో భిక్షాటనాన్ని పవిత్రకార్యంగా ఎందుకు భావించేవారు?*
- *భిక్ష సమర్పించేటప్పుడు నాటికి నేటికి ఉన్న తేడాలేమిటి?*

కం॥ ఆ పరమ పురంధ్రులయం
దే పుణ్యాంగనయు భిక్ష యిడదయ్యెఁ గటా!
రేపాడి మేలుకని యే
నే పాపాత్ముని ముఖంబు నీక్షించితినో? 4


తే॥గీ॥ ఉపవసింతుముగాక నేఁడుడిగి మడిఁగి
యస్తమించుచు నున్నవాఁ డహిమ భానుఁ
డెల్లి పారణకైన లేదెట్లు మనకు?
మాధుకరభిక్ష బ్రాహ్మణ మందిరముల 5

## II

వ॥ అని యారాత్రి గడపి మఱునాఁడు మధ్యాహ్నకాలంబున శిష్యులుం దాను
వేఱువేఱ వేదవ్యాసుండు విప్రభవన వాటికల భిక్షాటనంబొనర్పంబోయి,
తొలునాఁటియట్ల ముక్కంటిమాయ నే మచ్చెకంటియు వంటకంబు
పెట్టకున్నఁ గటకటంబడి భిక్షాపాత్రంబు నట్టనడువీథిం బగులవైచి కోపావేశంబున – 6

తే॥గీ॥ ధనములేకుండెదరు మూఁడు తరములందు
మూఁడు తరములఁ జెడుఁగాక మోక్షలక్ష్మి
విద్యయును మూఁడు తరముల వెడలవలయుఁ
బంచజనులకుఁ గాశికాపట్టణమున 7

వ॥ అని పారాశర్యుండు క్షుత్పిపాసా పరవశుండై శపియింపం దలంచు
నవసరంబున నొక్క విప్రభవనంబు వాఁకిటం బార్వతి ప్రాకృత వేషంబున 8



✿ఉ॥ వేదపురాణశాస్త్ర పదవీ నదవీయసియైన పెద్దము
త్తైదువ కాశికానగర హాటకపీఠ శిఖాధిరూఢ య
య్యాదిమ శక్తి, సంయమివరా! యిటు రమ్మనిపిల్చె హస్తసం
జ్ఞాదరలీల రత్నఖచితాభరణంబులు ఘల్లు ఘల్లనన్ 9

✿శా॥ ఆకంఠంబుగ నిప్డు మాధుకర భిక్షాన్నంబు భక్షింపఁగా
లేకున్నం గడు నంగలార్చెదవు మేలే? లెస్స! శాంతుండవే!
నీ కంటెన్ మతిహీనులే కటకటా! నీవార ముష్టింపచుల్
శాకాహారులుఁ గందభోజులు, శిలోంఛప్రక్రముల్ తాపసుల్! 10

✿తే॥గీ॥ ఓ మునీశ్వర! వినవయ్య యున్న యూరుఁ
గన్నతల్లియు నొక్క రూపన్న రీతి
యటు విశేషించి శివుని యర్ధాంగలక్ష్మి
కాశి; యివ్విటి మీఁద నాగ్రహము దగునె? 11

వ॥ ఇట్టి కాశికానగరంబుమీద భిక్షలేకుండుట కారణంబుగా నీయంత వాడు కటకటంబడి
శపియింపందలంచునే? విశేషించి యాఁకొన్న వాఁడవు గావున నీ యవసరంబున నిన్ను హెచ్చు
గుందాడుట మము బోఁటి గృహిణులకు మెచ్చుగాదు. మా యింటికిం గుడువ రమ్ము! కుడిచి
కూర్చున్న పిమ్మటం గొన్నిమాటలు నీతో నాడఁగలననిన నమ్మహాసాధ్వింగని,
పారాశర్యుండిట్లులనియె - 12

### *ఆలోచించండి-చెప్పండి*

- *భిక్ష దొరకని వ్యాసుడు కోపగించాడు కదా! దీనిపైన మీ అభిప్రాయమేమిటి?*
- *"కోపం మనిషిని విచక్షణ కోల్పోయేలా చేస్తుంది" దీన్ని గురించి మాట్లాడండి.*
- *ఉన్న ఊరును కన్నతల్లితో సమానమని ఎందుకు అంటారు?*



## III

తే॥గీ॥ అస్తమింపగఁ జేసినాఁ డహిమకరుడు
శిష్యులేఁగాక యయుతంబు చిగురుబోఁడి
వ్రతము తప్పి భుజింపంగ వలనుగాదు
నేఁడు నిన్నటి మఱునాఁడు నిక్కువంబు 13

✿చ॥ అనవుడు నల్లనవ్వి కమలానన యిట్లను, లెస్సగాక, యో
మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యన రమ్ము విశ్వనా
థునికృప పేర్మి నెందఱతిథుల్ చనుదెంచినఁ గామధేనువుం
బని గొనునట్లు పెట్టుదు నపారములైన యభీప్సితాన్నముల్ 14

వ॥ అనిన నట్లకాక మహాప్రసాదంబని వేదవ్యాసుండు
శిష్యులంగూర్చుకొని భాగీరథికిం జని యుపస్పర్శంబాచరించి
యేతెంచిన – 15

తే॥గీ॥ గొడుగు పాగల గిలకలు గులకరింప
నిందుబింబాస్య యెదురుగా నేగు దెంచి
ఛాత్ర సహితంబుగాఁ బరాశరతనూజు
బంతిసాగించె భుక్తిశాలాంతరమున 16

**ఆలోచించండి–చెప్పండి**

- *భోజనానికి ఆహ్వానించిన గృహిణితో వ్యాసుడు పలికిన మాటలను బట్టి మీకేమి అర్థమయింది?*
- *ఈ పాఠం ఆధారంగా నాటి గురుశిష్య సంబంధం గురించి వివరించండి.*

### భావాలు

1. విద్యాగురుడైన వ్యాసమహర్షి శిష్యులతో కూడి పట్టపగలు, మండుటెండలో కాశీనగరంలోని బ్రాహ్మణవీధిలో భిక్షకోసం ఇల్లిల్లూ తిరుగసాగాడు.
2. ఒక ఇల్లాలు 'వండుతున్నాం' అంటుంది; మరొక స్త్రీ 'మళ్ళీ రండి' అంటుంది; ఇంకొకావిడ ఈరోజు వ్రతం (దేవకార్యం) అని చెబుతుంది; వేరొకావిడైతే అసలు తలుపులే తెరవడం లేదు.
3. కాశీనగరంలోని గృహిణులు అన్నపూర్ణభవానికి ప్రియమైన చెలులుగా పేరుగాంచినవారు. వాళ్ళు భిక్షార్థమై వచ్చిన వాళ్ళను సాక్షాత్తు శివుడిగా భావించి, అపురూపంగా ఆదరిస్తారు. వాకిట్లో ఆవుపేడతో చక్కగా అలికి, నాలుగంచులూ కలిసేటట్లు ముగ్గుపెట్టి, వచ్చిన అతిథిని దాని మధ్యలో నిలబెట్టి, కాళ్ళకూ, చేతులకూ నీళ్ళిచ్చి, పూవులతో, గంధంతో వారిని అర్చించి, శుభ్రంగా కడిగిన బంగారుపళ్ళెంలో అన్నంపెట్టి, మీద నెయ్యి అభిఘరించి(వేసి), పండ్లు, పరమాన్నం, పిండివంటలు చేర్చి, భక్తి విశ్వాసాలు ఉట్టిపడుతుండగా భిక్ష సమర్పిస్తారు. ('అతిథిదేవోభవ!' అనే భారతీయ సంప్రదాయాన్ని ఈ పద్యంలో వర్ణించాడు కవి)
4. 'అటువంటి పుణ్యస్త్రీలున్న ఈనేలలో ఒక్కరైనా భిక్ష సమర్పించడం లేదంటే ఆశ్చర్యంగా ఉన్నది. ఈరోజు ఉదయమే లేచి, ఏ పాపిష్టివాని ముఖం చూశానో' అనుకున్నాడు వ్యాసుడు.
5. సరే, ఇక భిక్షాటనం మాని ఈ రోజుకు ఉపవాసమే చేద్దాం. సూర్యుడు అస్తమిస్తున్నాడు. రేపైనా మనకు ఈ బ్రాహ్మణ వాటికలో ఉపవాసాంత భోజనానికి సరిపడ భిక్ష దొరకక పోదు.

6. అని వ్యాసుడు శిష్యులతో ఆ రాత్రి మఠంలో గడిపి, మరునాడు యథావిధిగా మధ్యాహ్న సమయానికి శిష్యులు, తాను వేరువేరుగా విప్రవాటికల్లో భిక్షాటనం చేయసాగారు. కాని మొదటి రోజులాగానే విశ్వనాథుని మాయవల్ల ఏ ఇల్లాలూ భిక్ష పెట్టలేదు. దాంతో బాధపడి కోపంతో భిక్షాపాత్రను ముక్కలు ముక్కలయ్యేటట్లు నట్టనడి వీథిలో విసిరికొట్టి ఆవేశంతో–

7. 'ఈ కాశీ పట్టణంలో నివసించే మనుషులకు మూడు తరాల దాకా ధనం, విద్య, మోక్షం లేకుండుగాక!'

8. అని ఆకలిదప్పులచే బాధపడుతున్న వ్యాసుడు శపించబోయిన సమయంలో ఒక బ్రాహ్మణమందిరపు వాకిట పార్వతీదేవి సామాన్య స్త్రీ వేషంలో

9. వేదపురాణ శాస్త్రాలు నిర్దేశించే జ్ఞాన స్వరూపిణి ఆ ముత్తైదువ. కాశీనగరం అనే స్వర్ణపీఠ శిఖరాన్ని అధిరోహించి ఉన్న ఆమె – చేతికి ధరించిన రత్నకంకణాలు ఘల్లు ఘల్లుమనేట్లు చెయ్యి ఊపుతూ ఓ సంయమివరా! ఇటురా అని పిల్చింది. (ఒక్కరోజు ఆకలికే తట్టుకోలేని వాడికి నీకేం సంయమనం ఉందయ్యా! అని ఝంగ్యంతరంగా / వ్యంగ్యంగా అడగడానికే సంయమివరా! అని సంబోధించింది ఆ ముత్తైదువ).

10. గొంతుదాకా తినడానికి భిక్షదొరకలేదని ఇంతగా చిందులువేస్తున్నావు కదా! ఇది నీకు మంచిదా? బాగున్నది. నిజంగా నీవు శాంతస్వభావుడవా? పిడికెడు వరిగింజలతో కాలం వెళ్ళబుచ్చేవారు, శాకాహారంతో, దుంపలతో సరిపెట్టుకునేవాళ్ళు, దుంపలుతిని బతికేవాళ్ళు, రోళ్ళవద్ద చెదిరిపడ్డ బియ్యం ఏరుకొని జీవనం సాగించే మునులు నీకంటే తెలివితక్కువవాళ్ళా?

11. 'ఉన్నఊరు కన్నతల్లితో సమానం' అనే నీతి నీకు తెలియదా? అంతకంటె విశేషించి శివుని అర్ధాంగలక్ష్మియైన ఈ కాశీనగరిమీద నీవింత కోపం చూపించడం తగునా? అని మందలించింది పార్వతీదేవి.

12. కేవలం భిక్ష దొరకలేదనే నెపంతో బాధపడి నీలాంటి ఉత్తముడు విశిష్టమైన కాశీనగరాన్ని శపించాలనుకుంటాడా? చాలా ఆకలితోఉన్నావు. కాబట్టి ఈ సమయంలో నిన్ను ఎక్కువగా బాధపెట్టడం మావంటి గృహిణులకు మంచిదికాదు. మాయింటికి భోజనానికిరా! తిని కూర్చున్న తర్వాత నీతో కొన్ని మాటలు మాట్లాడుతాను' అన్న ఆ మహాసాధ్విని చూసి, వ్యాసుడిట్లా అన్నాడు –

13. తల్లీ! సూర్యుడస్తమిస్తున్నాడు. నేనే కాదు, నాతోపాటు శిష్యులూ ఉన్నారు. శిష్యులతో కలసి భుజించాలనే నా వ్రతం విడిచిపెట్టి మీ ఇంట నేనొక్కడినే భుజించలేను. ఈరోజు నిన్నటికి మరునాడేకదా! (అంటే నిన్నటిలాగే ఈరోజు కూడా ఉపవాసం తప్పదని అంతరార్థం)

14. అని వేదవ్యాసుడు పలుకగా కొంచెం నవ్వి పద్మముఖియైన ఆ ఇల్లాలు 'సరేలే! మునీంద్రా! విశ్వనాథుని దయవల్ల ఎంతమంది అతిథులు వచ్చినా కామధేనువువలె కోరిన పదార్థాలన్నీ అనంతంగా నేను ఏర్పాటు చేయగలను. నీ శిష్యగణాన్ని తీసుకొని వెంటనే రా!' అన్నది.

15. అనగా, 'సరే! మహాప్రసాదం' అని, వేదవ్యాసుడు శిష్యులను తీసుకొని గంగానదికి వెళ్ళి, స్నాన, ఆచమనాదులు పూర్తి గావించుకొని రాగా–

16. గొడుగు పావుకోళ్ళ (గొడుగు ఆకారంలోని బుడిపెలున్న పావుకోళ్ళు) గిలకలు మోగుతుండగా చంద్రముఖి అయిన ఆ ఇల్లాలు వాళ్ళకు ఎదురువెళ్ళి ఆహ్వానించింది. శిష్యులతో వ్యాసుడు భోజనశాలలో కూర్చున్నాడు. అప్పుడామె వడ్డన సాగించింది.

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది పద్యం చదవండి. శ్రీనాథుడు తన గురించి తాను ఏమని చెప్పుకొన్నాడో తెల్పండి.**

సీ॥ వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండ లీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్క మాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచిత బంధమున నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని దేవ
సూక్తివైచిత్ర నొక్కొక్కమాటు

తే॥గీ॥ నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాడవు మాకు నాశ్రితుడ వనఘ
ఇపుడు చెప్పదొడంగిన యీ ప్రబంధ
మంకితముసేయు వీరభద్రయ్యపేర (కాశీ 1-18)

**2. 'అన్ని దానాల్లోకీ అన్నదానం మిన్న' అనే అంశంపై తరగతిలో చర్చించండి.**

**3. శ్రీనాథకవి గురించి వివరించండి.**

**4. 'ఆకంఠంబుగ................శిలోంఛప్రక్రముల్ తాపసుల్!' పద్యానికి ప్రతిపదార్థం రాయండి.**

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) పాఠంలోని కథను సంక్షిప్తంగా రాయండి.

ఆ) కోపం కారణంగా వ్యాసుడు కాశీనగరాన్నే శపించాలనుకున్నాడు కదా! 'కోపం - మనిషి విచక్షణను నశింపజేస్తుంది.' అనే అంశం గురించి రాయండి.

2. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) వ్యాసుని పాత్ర స్వభావాన్ని వివరించండి.

ఆ) 'నేడు నిన్నటికి మఱునాఁడు నిక్కువంబు' ఈ మాటలు ఎవరు ఎవరితో ఏసందర్భంలో అన్నారు? వీటి అంతరార్థమేమిటి?

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.

అ) 'కోపం తగ్గించుకోవడం మంచిది!' అనే అంశాన్ని బోధిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

ఆ) భిక్ష, రక్ష, పరీక్ష, సమీక్ష, వివక్ష..... వంటి పదాలతో ఒక చక్కని భావాన్ని ప్రకటించే కవిత రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.

అ) ద్వాఃకవాటంబు దెఱవదు వనిత యొకతె.

ఆ) ప్రక్షాళితంబైన పసిఁడి చట్టువము.

ఇ) పారాశర్యుండు క్షుత్పిపాసా పరవశుండై శపియింపఁదలంచెను.

ఈ) ఇవ్వీటిమీద నాగ్రహము తగునె?

ఈ) అస్తమింపగ జేసినాడు అహిమకరుడు.

2. కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

అ) ద్వాఃకవాటము ఆ) వీక్షించు ఇ) అంగన

ఈ) మచ్చెకంటి ఉ) కుందాడుట ఊ) భుక్తిశాల

3. కింది వాక్యాలలోని నానార్థాలను గుర్తించి రాయండి.

అ) వీడు ఏ వీడువాడోగాని దుష్కార్యములను వీడుచున్నాడు.

ఆ) దేశభాషలందు తెలుగులెస్సయని రాయలు లెస్సగా బలికెను.

ఇ) గురుని మాటలు విన్న ఇంద్రుడు కర్ణుని గురుడైన సూర్యుని గలిసి గురుయోజన చేయసాగినాడు.

**4. కింది ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను ఎంపిక చేయండి.**

అ) విద్య ( )

క) విదియ చ) విజ్జ ట) విద్దె త) విధ్య

ఆ) భిక్షము ( )

క) బత్తెము చ) బచ్చ ట) బిచ్చ త) బిచ్చము

ఇ) యాత్ర ( )

క) యతర చ) జాతర ట) జైత్ర త) యతనము

ఈ) మత్స్యము ( )

క) మచ్ఛీ చ) మత్తియము ట) మచ్చెము త) మత్తము

ఉ) రత్నము ( )

క) రతనము చ) రచ్చ ట) రచ్చము త) రత్తము

ఊ) పంక్తి ( )

క) పంతులు చ) పత్తి ట) బంతి త) పంకు

## వ్యాకరణాంశాలు

**1. కింది పాదాల్లోని సంధులను గుర్తించి సంధి సూత్రాలను రాయండి.**

అ) పుణ్యాంగనయు భిక్ష యిడదయ్యెఁ గటా!

ఆ) కాశి; యివ్వీటి మీద నాగ్రహము దగునె.

ఇ) ఓ మునీశ్వర! వినవయ్య యున్నయూరు.

**2. కింది పద్యపాదాల్లో ఏయే ఛందాలున్నాయో గుర్తించి సమన్వయం చేయండి.**

అ) మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యనరమ్ము విశ్వనా

ఆ) ర్యాదిమ శక్తి : సంయమివరా! యిటురమ్మని పిల్చె హస్త సం

ఇ) వేదోక్త శివధర్మ విధి బసవనికి

**3. కింది వాక్యాలను చదవండి.**

అ) శివాజీ కళ్యాణి దుర్గాన్ని సాధించాడు.

వీరులకు సాధ్యము కానిది లేదు కదా!

ఆ) గొప్పవారితో ఉన్న సామాన్యులనూ గౌరవిస్తారు.

పూవులతోపాటు దారాన్ని గూడా సిగనెక్కిస్తారు.

ఈ రెండు వాక్యాల్లో ఒక విషయాన్ని మరో విషయంతో సమర్థిస్తున్నాం కదా!

మొదటి వాక్యంలో

శివాజీ కళ్యాణి దుర్గాన్ని సాధించడం – విశేష విషయం.

వీరులకు సాధ్యం కానిది లేదు కదా! – సామాన్య విషయం.

అంటే విశేష విషయాన్ని సామాన్య విషయంతో సమర్థించాం.

ఇక రెండవ వాక్యంలో

గొప్పవారితోఉన్న సామాన్యులను గౌరవించడం – సామాన్య విషయం.

పూవులతోపాటు దారం సిగనెక్కటం – విశేష విషయం.

అంటే దీంట్లో సామాన్య విషయాన్ని విశేష విషయంతో సమర్థించాం.

**లక్షణం: విశేష విషయాన్ని సామాన్య విషయంతోగాని, సామాన్య విషయాన్ని విశేష విషయంతోగాని సమర్థించి చెప్పడమే అర్థాంతరన్యాసాలంకారం.**

కింది లక్ష్యాలకు సమన్వయం రాయండి.

అ) హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు.
మహాత్ములకు సాధ్యం కానిది లేదు కదా!

ఆ) మేఘుడంబుధికి పోయి జలంబు తెచ్చి ఇస్తాడు.
లోకోపకర్తలకిది సహజగుణము.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- శ్రీనాథుడు సీసపద్యరచనకు ప్రసిద్ధి. శ్రీనాథుడు రచించిన ఏవైనా 5 పద్యాలు వేర్వేరు గ్రంథాల నుండి సేకరించండి. వాటిని రాయండి. తరగతిలో చదివి వినిపించండి. గోడ పత్రికలో ప్రదర్శించండి.

సూక్తి

మేధావి ఎన్నికష్టాలుపడ్డా, శుద్ధమైన నడవడిని, జీవనాన్ని వదలడు. దానివల్లనే అతడు ప్రతిష్ఠను, ఉత్తమ గతులనూ పొందుతాడు.

– మహాభారతం ఉద్యోగపర్వం

చదవండి-తెలుసుకోండి

## మాట్లాడడమూ ఒక కళే

మనసులోని భావాన్ని ఎదుటివారికి తెలియజేసే మాధ్యమం మాట. మాటకున్న శక్తి గొప్పది. అది అవతలివారిని మెప్పించగలదు, నొప్పించగలదు, ఆపదలనుండి తప్పించగలదు. మాట్లాడటం ఒక కళ. శబ్దశక్తి తెలిసిన వానికే ఈ కళ కరతలామలకమవుతుంది.

ఒకాయన మెట్లుదిగుతున్నాడు. అదే సమయంలో మరొకాయన మెట్లు ఎక్కుతున్నాడు. దారి ఇరుకుగా ఉంది. ఇద్దరూ మధ్యలో ఎదురుపడ్డారు. కింద నుండి వస్తున్న అతనికి కోపమెక్కువ. పైనుండి దిగుతున్న వానితో 'నేను మూర్ఖులకు దారివ్వను' అన్నాడు. వెంటనే ఎదుటివాడు ఏమాత్రం తడుముకోకుండా 'పరవాలేదు నేనిస్తాను' అన్నాడు. ఇప్పుడు ఎవడు మూర్ఖుడయ్యాడు?

ఒకావిడ ఇంకొకావిడతో పేచీ పెట్టుకున్నది. కోపంతో రెచ్చిపోయి 'ఛీ కుక్కా' అనేసింది. అవతలావిడ 'ఏమక్కా?' అన్నది. ఈ ముక్కతో మొదటావిడ తిక్కకుదిరింది.

తాంబూలం వేసుకోవడానికి వెళ్ళాడో పెద్దమనిషి. తమలపాకులు కట్టేవానితో 'ఏయ్, ఆకులోసున్నం తక్కువవేయి, దవడపగులుతుంది' అంటూ పక్కనేవున్న అరటిపండ్ల గెలకు చేయి ఆనించి నిలబడ్డాడు. అవకాశంకోసం ఎదురుచూస్తున్న తమలపాకులవాడు 'ఏమయ్యోయ్, చెయ్యితియ్యి, పండ్లురాలుతాయి' అన్నాడు. మాటకు మాట, దెబ్బకు దెబ్బ.

సాహిత్యాభిలాషియైన ఒకడు కవిని కలిశాడు. ఎంతోకాలం నుండి తన మనసులో దాచుకున్న ఆశను బయటపెట్టాడు. 'అయ్యా, నాకు ఏదైనా నాటికను రాసివ్వండి' అనడిగాడు. దానికి బదులిస్తూ ఆ కవి 'ఓ! దానికేముంది ఏనాటికైనా రాస్తాను' అని అభయమిచ్చాడు.

ఒక పెండ్లివేడుకలో కొందరు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఒక పెద్దాయనను 'మీవయసెంతండీ' అనడిగారు. దానికా పెద్దమనిషి 'ఏడేళ్ళు' అన్నాడు. అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఎంత పెద్దమనిషైతే మాత్రం ఇంతగా పరిహాసమాడుతారా అని నిలదీశారు. అతనన్నాడు 'నేను నిజమే చెప్పాను నాకు ఏడేళ్ళు ($7 \times 7 = 49$) అన్నాడు. అసలు విషయం తెలుసుకుని అందరూ గొల్లున నవ్వేశారు.

బజారులో వెళుతున్న ఒకతనికి మిత్రుడు తారసపడ్డాడు. చాలాకాలమైంది వాళ్ళు కలుసుకొని. మిత్రుడు చెప్పులు లేకుండా ఉండడంచూసి విషయమేమిటని ప్రశ్నించాడు. దానికి బదులిస్తూ 'చెప్పుకొనుటకేమున్నద'ని పెదవి విరిచాడామిత్రుడు.

తను తీయబోయే సినిమా విషయంలో నిర్మాత ఒక కవి దగ్గరకు వెళ్లాడు. 'నా సినిమాకొక పాట రాస్తారా?' అని అభ్యర్థించాడు. దానికి కవి 'రాస్తారా' అన్నాడు. ఎంత కవియైతే మాత్రం ఇంత అహంకారంగా తనను 'రా' అంటాడా అనుకున్నాడు నిర్మాత. అతని ఆంతర్యం గ్రహించిన కవి అయ్యా, నన్ను తప్పుగా అనుకుంటున్నట్లున్నారు నేనన్నది 'రాస్తా, రా' అని. హమ్మయ్య అనుకున్నాడు నిర్మాత.

ఇలా మాటలలో విరుపులు మెరుపులను సృష్టిస్తాయి. వ్యంగ్యం గిలిగింతలు పెడుతుంది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# 14 చిత్రగ్రీవం

– ధనగోపాల్ ముఖర్జీ

## చదవండి – ఆలోచించి చెప్పండి.

రక్తాలు ఓడుతోన్న మా రాస్సెల్‌దార్ గబగబా ఏదో రాసి ఆ కాగితాన్ని నా కాలికి కట్టారు. కట్టి నన్ను పంజరం లోంచి వదలిపెట్టారు. అతని కళ్లల్లో కనిపించిన ఆందోళనను బట్టి వాళ్ళంతా తీవ్రమైన ఆపదలో ఉన్నారనీ, ముఖ్యస్థావరం నుంచి సత్వరసహాయం ఆశిస్తున్నారనీ అర్థమయింది. వెంటనే కాలికి కట్టిన సమాచార పత్రంతో సహా గాలిలోకి ఎగిరాను. ఎలాగైనాసరే ఘోండ్ వేచిఉండే ప్రధాన స్థావరం దగ్గరకు చేరుకొని తీరాలన్న తపన. 'చేరాలి', 'చేరి తీరాలి'. అని మనసులో పదేపదే అనుకొన్నాను. పలికిన ప్రతీసారీ ఆ మాటలు దివ్యమంత్రాల్లా నామనసులో బాగా నాటుకొనిపోయి నాకు నూతన జవసత్త్వాలను అందించసాగాయి. అప్పటికే బాగాపైకి చేరుకొన్నాను కాబట్టి ఒక్కసారి నాలుగుదిక్కులా కలయజూసి పడమటదిశను గుర్తుపట్టి ఆ దిశగా ఎగర నారంభించాను. వంకర టింకర మార్గాల్లో పిచ్చిగా ఎగిరి చిట్టచివరకు గమ్యం చేరి ఘోండ్ చేతిమీద వాలాను. రస్సెల్‌దార్ అందించిన ఆ సమాచారాన్ని ఘోండ్ గబగబా చదివి సంతోషంతో దుక్కిటెద్దులా రంకె పెట్టారు. ప్రేమగా నా తల నిమిరారు.

### ప్రశ్నలు:

1. ఈ పేరాలోని మాటలు ఎవరు చెబుతున్నారు?
2. సమాచారాన్ని ఎవరి దగ్గరి నుంచి ఎవరికి చేర్చారు?
3. సమాచారాన్ని చేరవేయడానికి ఏ పక్షిని ఉపయోగించి ఉంటారు? ఎందుకు?
4. సమాచారాన్ని చేరవేసిన పక్షిలోని గొప్ప లక్షణాలు ఏవి?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

మన దేశంలో వృక్షసంపద, పక్షిసంపద అపారం. ఐతే వీటిని గురించి తెలియజేసే మంచి పుస్తకాలు అరుదుగా ఉన్నాయి. పూర్వకాలంలో సమాచారాన్ని చేరవేయడానికి పావురాలను ఉపయోగించేవారు. పావురాల పుట్టుక,వాటి జీవనవివరాలకు సంబంధించిన కథనాలతో కూడిన పుస్తకం చిత్రగ్రీవం. కలకత్తాలో ఓ పెంపుడు పావురం, దాన్ని పెంచే ఓ బాలుడూ, వాళ్ల కథను మనసుకు హత్తుకుపోయేలా చెప్పిన పుస్తకం చిత్రగ్రీవం. చిత్రగ్రీవం పిల్లలకోసం రాసిన పుస్తకమే ఐనా దీనికి ప్రకృతి పరిశీలకులను కూడా అలరించే శక్తి ఉంది. పావురాల జీవనానికి సంబంధించిన అతిసూక్ష్మవివరాలు తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కథా ప్రక్రియకు సంబంధించింది. ఇది అనువాద కథ. ప్రస్తుత పాఠ్యభాగాన్ని ధనగోపాల్ ముఖర్జీ రాసిన "చిత్రగ్రీవం – ఓ పావురం కథ" అనే పుస్తకంలో నుంచి స్వీకరించారు. దీన్ని తెలుగులోకి అనువదించినవారు దాసరి అమరేంద్ర. దీన్ని నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా సంస్థ ప్రచురించింది. 'చిత్రగ్రీవం' అనేది ఒక పెంపుడు పావురం పేరు. ఈ పాఠం పక్షులకు సంబంధించిన శాస్త్రీయ విజ్ఞానాన్ని అందిస్తుంది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠానికి ముందు ప్రవేశికలో ఉన్న అంశాన్ని చదవండి ఏం గ్రహించారో చెప్పండి.
- పాఠానికి సంబంధించిన చిత్రాలను చూడండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీతలు గీయండి.
- వాటి అర్థాలను పాఠ్యపుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికను లేదా నిఘంటువునుగాని చూసి తెలుసుకోండి.

## కవి పరిచయం



(1890–1936)

విశిష్ట రచయిత ధనగోపాల్ ముఖర్జీ పేరు అతి కొద్దిమంది భారతీయులే విని ఉంటారు. ఆయన రాసిన విలక్షణ పుస్తకం 'చిత్రగ్రీవం'. ఈ పుస్తకం 1928లో 'న్యూ బెరీ మెడల్'ను గెలుచుకుంది. బాలసాహిత్యంలో విశేషకృషి చేసినవారికి 'అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్' వారు ఇచ్చే విశిష్ట పురస్కారం "న్యూబెరీమెడల్". ఈ బహుమతి గెల్చుకొన్న ఒకేఒక భారతీయ రచయిత "ధనగోపాల్ ముఖర్జీ".

ముఖర్జీ కుటుంబం కోల్‌కతాకు దగ్గరలో ఉన్న ఓ మందిరంలో పూజారులుగా ఉండేది. భారతదేశంలో తన బాల్యం గడిపిన ధనగోపాల్ ముఖర్జీ పందొమ్మిదేళ్ల వయస్సులో అమెరికా వెళ్ళాడు. కాలిఫోర్నియా, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నాడు. తనజీవితమంతా అక్కడే గడిపాడు. రచనలు చేయడం, ఉపన్యాసాలు ఇవ్వడం ఇవే ఆయన ముఖ్య వ్యాపకాలు. జంతువులకు సంబంధించిన పిల్లల పుస్తకాలు తొమ్మిది రాశాడు. వీటిలో 1922లో రాసిన "కరి ది ఎలిఫెంట్", 1928లో రాసిన "గోండ్ ది హంటర్", 1924లో రాసిన "హరిశా ది జంగిల్ ల్యాడ్" పుస్తకాలు చాలా ప్రాచుర్యం పొందాయి.

విదేశంలో ఉన్నా ఏనాడూ ఆయన భారతదేశాన్నీ, భారతీయమూలాలను మరిచిపోలేదు. భారతదేశాన్ని గురించి, ఇక్కడి కథల గురించి కూడా రచనలు చేశాడు.

**ప్రవేశిక**

*పక్షి ప్రపంచంలో రెండు దృశ్యాలు అతిమనోహరమైనవి. గుడ్డుబద్దలు కొట్టి తల్లిపక్షి పిల్లపక్షిని ఈ ప్రపంచపు వెలుగు వెల్లువలోకి తీసుకొనిరావడం అందులో మొదటిది. అలా వచ్చిన పిల్లపక్షి నోటికి ఆహారం అందిస్తూ తల్లి పక్షి పెంపకం కొనసాగించడం రెండవది. చిత్రగ్రీవం పెంపకం ఎంతో అనురాగంతో సాగింది. ఇంతకూ 'చిత్రగ్రీవం' ఎవరు? దాని పెంపకం ఎలా సాగింది? అది ఎలా ఎగరడం నేర్చుకొంది? పాఠం చదివి తెలుసుకోండి.*

**I**



## పుట్టుక

పది లక్షల జనాభా ఉందని మనం చెప్పుకునే కోల్‌కతా మహానగరంలో కనీసం ఇరవై లక్షల పావురాలు ఉంటాయి. ప్రతీ మూడో కుర్రాడి దగ్గర కనీసం ఒక డజను వార్తలు మోసే పావురాలు, గిరికీల పావురాలూ, పిగిలి పిట్టలూ, బంతి పావురాలూ ఉండటం కద్దు. పావురాలను మచ్చిక చెయ్యడం అన్న కళ వేలాది సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతోంది. ఆ కళ పుణ్యమా అని పక్షులను ప్రేమించేవారిని అలరించే పిగిలిపిట్ట, బంతి పావురం అన్న రెండు విశిష్టమైన పావురాల జాతులను భారతదేశం ప్రపంచానికి అందించింది. ఎన్నో శతాబ్దాలనుంచీ రాజులూ, యువరాజులూ, రాణులూ, యువరాణులూ తమతమ చలువరాతి మందిరాలలోనూ సామాన్యులూ, నిరుపేదలూ తమ తమ ఇళ్ళు, పూరిళ్ళలోనూ-పావురాల మీద ప్రేమ, ఆప్యాయతలను కురిపిస్తూనే ఉన్నారు. శ్రద్ధాసక్తులను చూపిస్తూనే ఉన్నారు. గొప్పవాళ్ళ పూదోటలూ, ఫౌంటెన్లూ గానివ్వండి, సామాన్యుల పూలమడులూ, పళ్ళ చెట్లూ గానివ్వండి - అవన్నీ రకరకాల రంగు రంగుల పావురాలతోనూ, నీలికళ్ళతో కువకువలాడే గువ్వలతోనూ నిండి ఉండడం కద్దు.

ఈ నాటికీ విదేశీయులెవరైనా మన మహానగరాలకు వచ్చినట్టయితే వాళ్ళకు ఉల్లాసకరమైన చల్లనిగాలిలో గిరికీలు కొట్టే పావురాల బృందాలు కనిపిస్తాయి. ఆ పెంపుడు పావురాలకు తమ తమ డాబా ఇళ్ళమీద నిలబడి తెల్లజెండాలు ఊపుతూ సంకేతాలు అందించే అసంఖ్యాకమైన కుర్రాళ్ళు కనబడతారు. ఆ నీలాకాశంలో పావురాల గుంపులు పెను మేఘాలలాగా సాగిపోవడం కనిపిస్తుంది. మొదట అవి చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి తమ తమ యజమానుల ఇళ్ళ మీద ఓ ఇరవై నిమిషాలపాటు చెక్కర్లు కొడతాయి. ఆ తర్వాత అవి క్రమక్రమంగా పైపైకి సాగిపోతాయి. వివిధ ప్రాంతాల నుంచి వెలువడిన వేరు వేరు బృందాలన్నీ మెల్లగా కలగలిసిపోతాయి. ఒక బృహత్తర సమూహంగా రూపొందుతాయి. కనుచూపుకు అందనంత ఎత్తుకు ఎగిసిపోతాయి. అలా కలగలిసి, ఎగసి గంటల తరబడి ఎగిరాక తిరిగి అన్నీ విడివిడిగా తమ తమ యజమానుల ఇళ్ళకు చేరుకొంటాయి. నగరంలోని ఇళ్ళు గులాబీ, పసుపూ, తెలుపూ ఊదాల్లాంటి రకరకాల రంగులలో ఉన్నా, స్థూలంగా వాటి పైకప్పులు ఒకే పరిమాణంలో, ఒకే ఆకృతిలో ఉంటాయి. అయినా మరి ఆ వేలాది పావురాలు ఎన్నెన్నో దూరాలు కలిసిమెలిసి ఎగిరినాక, తిరిగి కచ్చితంగా తమ తమ ఇళ్ళకూ, గూళ్ళకూ ఎలా

చేరుకోగలుగుతున్నాయీ అన్నది ఆశ్చర్యం కలిగించే విషయమే. నిజానికి పావురాలకు అద్భుతమైన దిశాపరిజ్ఞానం ఉంది. ఏనుగులూ, పావురాలకన్నా తమ తమ యజమానులపట్ల ఎక్కువ విశ్వాసం ప్రదర్శించే ప్రాణులను నేనింతవరకూ చూడలేదు. ఈ రెండిటితోనూ నాకు సన్నిహిత పరిచయం ఉంది. వనసీమలోని గజరాజులుగానివ్వండి. నగర సీమలలోని పావురాలు గానివ్వండి, అవి తమ యజమానులంటే ప్రాణం పెడతాయి. రోజంతా ఎక్కడెక్కడ తిరిగినా, ఏ గగన సీమల్లో ఎగిరినా చివరకి అవి తమకున్న అద్భుతమైన అంతః ప్రేరణాబలంతో తమ మిత్రుడూ, సహచరుడూ అయిన మానవుడి పంచకు చేరుకుంటాయి.

**ఆలోచించండి - చెప్పండి**

- *కోల్‌కతా నగరంలోని పిల్లలు పక్షుల ప్రేమికులని ఎలా చెప్పగలరు?*
- *మీ ప్రాంతంలో ఏ ఏ పక్షులు ఎక్కువగా ఉంటాయి? వాటి కోసం మీరేం చేస్తున్నారు?*
- *పావురాల గురించి ఆశ్చర్యం కల్గించే విషయాన్ని తెలుసుకున్నారుకదా! అల్లే మిగతా పక్షుల్లో ఆశ్చర్యం కలిగించే విషయాలు ఏమున్నాయి?*
- *విశ్వాసం ప్రదర్శించడం అంటే ఏమిటి?*
- *అంతః ప్రేరణాబలం అంటే ఏమిటి? దీనివల్ల మనం ఏం చేయగలం?*

నా పెంపుడు ఏనుగు పేరు 'కరి', నాకో పెంపుడు పావురం కూడా ఉంది. దాని పేరు 'చిత్రగ్రీవం' 'చిత్ర' అంటే ఉల్లాసభరితమైన రంగులతో నిండిన - అని అర్థం. 'గ్రీవం' అంటే కంఠం. నా పావురం మెడ చిత్ర విచిత్ర వర్ణభరితం అన్న మాట. అప్పుడప్పుడు అందుకే మా పావురాన్ని 'హరివిల్లు మెడగాడు' అని ముద్దుగా పిలుస్తూ ఉంటాను.


నిజానికి చిత్రగ్రీవం పుట్టుకతోనే హరివిల్లు మెడతో ఉట్టిపడలేదు. గుడ్డు లోంచి బయటపడ్డప్పుడు ఏ రంగులూ లేవు. మెల్లగా రోజులూ, వారాలూ గడిచేకొద్దీ దానికి ఈకలు పెరిగాయి. అయినా మూడోనెల వచ్చేదాకా దాని వన్నెచిన్నెల గురించిన ఆచూకీయే మాకు తెలిసిరాలేదు. కానీ ఒకసారి నిండుగా ఈకలు పెరిగాక, ఆ ఈకలు అతిసుందరమైన రంగులతో నిండాక, - ఇహ అందంలో దానికి సాటిరాగల పావురం మా ఊళ్ళో లేదని స్పష్టమయింది. మా ఊళ్ళో దాదాపు నలభైవేల పెంపుడు పావురాలు ఉన్నాయన్న సంగతి మనం మరిచిపోకూడదు. అన్ని వేల పావురాలలోనూ అతి సుందరమైనదన్న మాట మా చిత్రగ్రీవం.

## II

చిత్రగ్రీవం కథను నేను మొట్టమొదట్నించీ మొదలెడతాను. ముందు దాని తల్లిదండ్రుల గురించి చెప్పుకొందాం. దాని తండ్రిపక్షి ఓ గిరికీల మొనగాడు. తల్లిపక్షి ఓ వార్తల పావురం. ఆ రోజుల్లో అది అతి సుందరమైన కులీన వంశానికి చెందిన పావురం. ఆ రెండు విశిష్టమైన పావురాలూ జతగట్టాయి. గుడ్లు పెట్టాయి. వాటికి పుట్టిన చిత్రగ్రీవం అందువల్లనే తర్వాతిరోజుల్లో యుద్ధరంగాల్లోనూ శాంతి సమయాల్లోనూ అమోఘంగా పనిచెయ్యగల వార్తాహారియైన పావురంగా రూపొందింది. తల్లిపక్షి నుండి తెలివితేటలు సంపాదించుకుంది. తండ్రిపక్షి నుండి వేగం, చురుకుదనం, సాహసం సంతరించుకుంది. అలా సమకూర్చుకున్న శక్తియుక్తుల పుణ్యమా అని అది ఎన్నోసార్లు శత్రువుల దాడి నుంచి ఆఖరిక్షణంలో - ఆ దాడి చేస్తున్న డేగల తలలమీద నుంచే గిరికీలు కొట్టి - తప్పించుకోగలిగింది. ఆ ముచ్చట్లు సమయమూ సందర్భమూ సరికూడినప్పుడు మరోసారి చెప్పుకొందాం.

ఇంకా గుడ్డులో ఉన్నప్పుడే చిత్రగ్రీవం ఓ ప్రమాదం లోంచి తృటిలో ఎలా తప్పించుకుందో ముందు చెపుతాను. ఆ రోజును నేను ఎప్పటికీ మరచిపోలేను. తల్లి పావురం పెట్టిన రెండుగుడ్లలో ఒకదాన్ని పొరపాటున జారవిడిచి పగలగొట్టిన రోజది. ఆ తెలివిమాలిన పనికి నేను ఈనాటికీ సిగ్గుపడుతూ ఉంటాను. బాధపడుతూ ఉంటాను. నేను పగలగొట్టిన ఆ రెండో గుడ్డులో ప్రపంచంలోకెల్లా అతి విశిష్టమైన పావురం ఉండేదేమో ఎవరికి తెలుసు! ఆ దుర్ఘటన ఇలా జరిగింది.

మాది నాలుగంతస్తుల మేడ. ఆ మేడ మీద పావురాల గూళ్ళు ఉండేవి. తల్లిపావురం గుడ్లను పొదుగుతోన్న గూటిని నేను ఓ రోజు శుభ్రం చేద్దామని వెళ్ళాను. తల్లిపిట్టను మృదువుగా లేపి తీసి ఓ పక్కన ఉంచాను. తర్వాత ఒక్కో గుడ్డునే జాగ్రత్తగా తీసి పక్కగూట్లో ఉంచాను.



ఆ ప్రక్క గూటిలో గట్టిపాటి చెక్క తప్ప అడుగున పీచూ ఆకు అలముల్లాంటి మెత్తటి పదార్థాలు లేవు. గుడ్లను పక్కగూటిలో ఉంచాక మొదటిగూటిలోని చెత్తా చెదారాన్ని తీసిపారేసే పనిలో పడ్డాను. ఆ పని ముగిసాక ఒక గుడ్డును తీసుకొచ్చి దాని యథాస్థానంలో ఉంచాను. రెండో గుడ్డు మీద మెల్లగా దృఢంగా నే చేతిని ఉంచిన క్షణంలో జరిగిందా ప్రమాదం. నేనా గుడ్ల మార్పిడిలో ఉన్నప్పుడు - ఇంటి పైకప్పును తుఫాను ఎగురగొట్టినట్టుగా నా మొహాన్ని ఏదో బలంగా తాకింది. తీరా చూస్తే అది తండ్రిపావురం. రెక్కలతో బలంగా నా మొహాన్ని మోదుతోంది. ఇంకా దారుణం ఏమంటే నా ముక్కు మీద తన గోళ్ళను కూడా దిగవేసిందది. ఆ నొప్పీ ఆ గగుర్పాటూ - వాటి పుణ్యమా అని రెండో గుడ్డును నాకు తెలియకుండానే ఎప్పుడు వదిలేసానో వదిలేశాను. అతికష్టం మీద ఆ తండ్రిపక్షిని దూరంగా తరిమేయగలిగాను. ఈ లోపల జరగవలసిన ప్రమాదం జరగనే జరిగింది. రెండో గుడ్డు పగిలి ఛిన్నాభిన్నమై నా కాళ్ళ దగ్గర పడి ఉంది. నా మీదా, ఆ దిక్కుమాలిన తండ్రిపక్షి మీదా నాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చింది. నా మీద నాకెందుకు కోపం వచ్చిందీ అంటారా - తండ్రి పావురం నుంచి అలాంటి దాడి జరగవచ్చని నేను ఊహించి ఉండాలిగదా... జాగ్రత్తపడి ఉండాలిగదా. నేనేదో గుడ్లని సంగ్రహించడానికి వచ్చాననుకొందా తండ్రిపక్షి. ఆ అజ్ఞానంతో అది ప్రాణాలకు తెగించి మరీ నా మీద దాడి చేసింది. గుడ్లను ఎత్తుకు పోకుండా ఆపుదామనుకొంది. పొదుగుల కాలంలో గూళ్ళను శుభ్రపరచేటప్పుడు అన్ని రకాల సంఘటనలకూ, దాడులకూ మనం సిద్ధపడి ఉండాలి.

సరే - మళ్ళా మన కథ దగ్గరకు వద్దాం. గుడ్డు పై పెంకును ముక్కుతో పొడిచి పిల్లపక్షిని ఈ ప్రపంచంలోకి ఎప్పుడు తీసుకురావాలో తల్లిపక్షికి కచ్చితంగా తెలుసు. తండ్రిపక్షి కూడా అడపాదడపా గుడ్లమీద కూర్చొని పొదిగేమాట నిజమేగాని పొదగటం అన్న పనిని మూడింట రెండువంతులు నిర్వహించేది తల్లిపక్షే. ఆ మిగిలిన

మూడోవంతు పొదిగేది తండ్రిపక్షే అయినా పిల్లపక్షుల్ని ప్రపంచంలోకి ఎప్పుడు తీసుకురావాలి అన్న విషయం దానికి తెలియదు. ఆ పరిజ్ఞానం తల్లిపక్షి సొత్తు. గుడ్డులోని పచ్చసొనా, తెల్లసొనా కలగలసి ప్రాణం పోసుకొని పిల్లపక్షిగా రూపొంది ప్రపంచంలోకి అడుగుపెట్టటానికి సంసిద్ధమయ్యే శుభముహూర్తం వచ్చిందని తల్లిపక్షికి అంత కచ్చితంగా ఎలా తెలుస్తుందీ అన్నది మన ఊహకందని విషయం. అలాగే పైపెంకు మీద ఏ చోటున ఎంత బలంతో ముక్కుతో తాకాలో కూడా తల్లిపక్షికి క్షుణ్ణంగా తెలుసు. పిల్లపక్షికి ఏ గాయమూ తగలకుండా సరైన ప్రదేశంలో సరైన సమయంలో ముక్కుతో గుడ్డును బద్దలుగొట్టడం, పిల్లపక్షిని ప్రపంచంలోకి ఆహ్వానించడం - ఇవన్నీ నాకు అద్భుత మనిపిస్తాయి.

చిత్రగ్రీవం పుట్టటం కూడా సరిగ్గా నేను పైన వివరించినట్టుగానే జరిగింది. గుడ్లను పొదగటం మొదలెట్టిన ఇరవయ్యో రోజున తల్లిపక్షి గుడ్డు మీద కూర్చోవడం మానేసి పక్క పక్కన తారాడటం గమనించాను. తండ్రిపక్షి మేడమీది పిట్టగోడమీంచి దిగివచ్చి గుడ్డును పొదగడానికి ప్రయత్నించిన ప్రతిసారీ తల్లిపక్షి ఆ తండ్రిపక్షిని ముక్కుతో పొడిచి దూరంగా తరిమేసేది. "నన్నెందుకిలా తరిమేస్తున్నావ్?" అన్నట్టుగా ఆ తండ్రిపక్షి కువకువలాడేది. "వెళ్ళవయ్యా వెళ్ళు. ఎంతో ముఖ్యమైన పనిలో ఉన్నాను. ఇబ్బంది పెట్టకుండా పక్కకు వెళ్ళు" అన్నట్టుగా తల్లిపక్షి తండ్రిపక్షిని మరికాస్త దూరంగా నెట్టేసేది. చివరికి తండ్రిపక్షికి అక్కడ్నుంచి వెళ్ళక తప్పలేదు.

అదంతా చూసి నాకు కంగారు మొదలయింది. గుడ్లు పొదగడం పూర్తవ్వాలనీ, పిల్ల పక్షి ప్రాణం పోసుకొని గుడ్డులోంచి బయటపడితే చూడాలనీ నాకు మహా ఆత్రంగా ఉంది. మరి తల్లిపక్షి ప్రవర్తన చూస్తే విచిత్రంగా ఉందాయే! ఆందోళనతో, ఆసక్తితో, ఆత్రంగా గూటికేసి చూడసాగాను. ఓ గంట గడిచింది. పరిస్థితిలో మార్పు లేదు. మరో ముప్పావుగంట గడిచాక తల్లిపక్షి మెడ అటూ ఇటూ తిప్పుతూ శ్రద్ధగా ఏదో వినసాగింది. బహుశా గుడ్డులోపల కదలికల శబ్దాలయి ఉండాలవి. మెల్లగా తల్లిపక్షి శరీరంలో స్పందన మొదలయింది. దాని శరీరమంతా ఏదో తీవ్ర ప్రకంపన పాకుతోందా అనిపించింది. తల్లిపక్షిలో ఏదో దివ్య సంకల్పం చోటుచేసుకున్నట్టు అనిపించింది. తల నిక్కించి గురిచూసింది. రెండే రెండు ముక్కుపోట్లతో గుడ్డును పగలగొట్టింది. పిల్లపక్షి బయటపడింది. ఒళ్లంతా ముక్కు.. చిన్న పాటి శరీరం. స్వల్పంగా కంపిస్తున్న శరీరం. 'ఇన్నాళ్ళూ తాను శ్రమపడిందీ, ఎదురుచూస్తున్నదీ ఇలాంటి బలహీనమైన నిస్సహాయమైన అర్భకమైన పిల్లపక్షి కోసమా?' అని తల్లిపక్షి ఆశ్చర్యపడినట్లు అనిపించింది. అయినా పిల్లపక్షి నిస్సహాయతను గమనించిన మరుక్షణం తల్లిపక్షి దానిని తన రొమ్ములోని నీలి ఈకలమాటున పొదవుకొంది.

**ఆలోచించండి-చెప్పండి**

- *మీరు ఎప్పటికీ మరచిపోలేని రోజు ఏది? ఎందుకు?*
- *తెలివిమాలిన పనులు అంటే ఏమిటి?*
- *మీమీద మీకే ఎప్పుడైనా కోపం వచ్చిందా? ఎందుకు?*
- *పావురం గూడు ఎలా ఉందో తెలుసుకొన్నారు కదా! మీకు తెలిసిన పక్షి గూళ్ళు ఎలా ఉంటాయో చెప్పండి. పక్షి గూళ్ళన్నీ ఒకేలా ఉంటాయా?*
- *దివ్య సంకల్పం చోటు చేసుకోవడం అంటే ఏమిటి?*

## III

## చిత్రగ్రీవం చదువు

పక్షి ప్రపంచంలో రెండు దృశ్యాలు అతి మనోహరమైనవి. గుడ్డు బద్దలుగొట్టి తల్లిపక్షి పిల్లపక్షిని ఈ ప్రపంచపు వెలుగులోకి తీసుకురావడం అందులో మొదటిది. అలా వచ్చిన పిల్లపక్షి నోటికి ఆహారం అందిస్తూ తల్లిపక్షి పెంపకం కొనసాగించడం రెండోది. చిత్రగ్రీవం పెంపకం ఎంతో అనురాగంతో సాగింది. మనం చిన్న పిల్లల్ని ఎత్తుకొని లాలిస్తే ఆ పిల్లలకు ఎలాంటి హాయీ సౌఖ్యమూ లభిస్తాయో చిత్రగ్రీవానికి తన తండ్రిపక్షి, తల్లిపక్షులనుంచి అలాంటి వెచ్చదనం లభించింది.

చంటిపక్షులు ఎదిగి వచ్చే సమయంలో వాటి గూళ్ళలో మరీ ఎక్కువగా మెత్తటి దూదీ, పీచు లాంటి పదార్థాలను ఉంచగూడదు. వాటిని తగు మోతాదులోనే ఉంచాలి. లేకపోతే గూడు మరీ వెచ్చనైపోతుంది. అరకొర జ్ఞానపు పావురాల పెంపకందారులు పిల్లపక్షులు ఎదిగే సమయంలో తమ శరీరంనుంచే చాలా మోతాదులో వెచ్చదనాన్ని విడుదల చేస్తాయన్న విషయం గ్రహించరు. ఈ సమయంలో పావురాల గూళ్ళను మరీ తరచుగా శుభ్రం చెయ్యటం కూడా మంచిదిగాదు. తల్లిపక్షి, తండ్రిపక్షి ఆచి తూచి గూటిలో ఉంచే ప్రతి వస్తువూ పిల్లపక్షి సుఖసౌకర్యాలకు దోహదం చేస్తాయి.

పుట్టిన రెండోనాటి నుంచే చిత్రగ్రీవం తన తల్లో తండ్రో గూటికి వచ్చిన ప్రతిసారీ తన ముక్కు తెరచి తన గులాబీరంగు ఒంటిని బంతిలా ఉబ్బించడం నాకు స్పష్టంగా గుర్తుంది. బార్లా తెరచిన పిల్లపక్షుల నోళ్ళల్లో పెద్ద పక్షులు తాము సంపాదించిన ధాన్యపుగింజల నుంచి ఉత్పత్తి చేసిన పాలను పోస్తాయి. అలా పోసిన ఆ పదార్థం ఎంతో మెత్తగా ఉంటుంది. పెద్దపక్షులు ముందస్తుగా తాము సంపాదించిన గింజల్నీ విత్తనాల్నీ తమ కంఠంలో కాసేపు నాననిచ్చి మెత్తబరుస్తాయి. ఆ తర్వాతే ఆ ఆహారాన్ని పిల్లలకు అందిస్తాయి. పిల్లపక్షులకు నెలరోజుల వయసు వచ్చినపుడు కూడా పెద్ద పక్షులు తిన్నగా గింజల్ని అందించవు. ముందు తమ కంఠంలో మెత్తబరిచాకే అందిస్తాయి.

మా చిత్రగ్రీవానికి ఆకలి ఎక్కువ. ఒక పెద్దపక్షి తన దగ్గరే ఉండి లాలిస్తూ తన బాగోగులు చూస్తూఉండగా, రెండో పక్షి తన కోసం ఆహారసేకరణలో నిమగ్నమై ఉండేలా చేసేది చిత్రగ్రీవం. తల్లితో సరిసమానంగా తండ్రి కూడా చిత్రగ్రీవం బాగోగులు సరిచూడడంలోనూ, ఆహారం అందించడంలోనూ పాలుపంచుకొందని నా అంచనా. తల్లిదండ్రుల శ్రమా, శ్రద్ధా పుణ్యమా అని చిత్రగ్రీవం మహా ఏపుగా ఎదిగింది. గులాబీరంగు మారి పసుపు కలిసిన తెలుపురంగు వచ్చింది. ఈకలు రానున్నాయనడానికి ఈ రంగు మార్పు మొదటి సూచన. తర్వాత చిన్న చిన్న బొడిపెల్లా ముళ్లపంది ముళ్లలాంటి ఈకలు వచ్చాయి. దాని కళ్ళ దగ్గరా, నోటి దగ్గరా అప్పటిదాకా వేలాడుతూ ఉన్న పసుపుపచ్చని చర్మాలు రాలిపోయాయి. పొడవాటి, గట్టి, సూదిలాంటి ముక్కు రూపు దిద్దుకుంది. ఎంతబలమైన ముక్కో... ఓ సంఘటన చెపుతాను.

చిత్రగ్రీవానికి మూడువారాల వయసప్పుడు దాని గూటిలోకి ఒక చీమ పాకింది. గూటి అంచున కూర్చొని ఉన్న చిత్రగ్రీవం ఎవరి ఉపదేశమూ లేకుండానే ఆ చీమను టక్కున తన ముక్కుతో పొడిచింది. అప్పటిదాకా ఏకఖండంగా సాగిన ఆ చీమ ఒక్క దెబ్బతో రెండు ముక్కలైపోయింది. తన ముక్కుతో ఆ చీమ తునకలను కదిపి చూసి తాను చేసిన ఘనకార్యం ఏమిటో అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది చిత్రగ్రీవం. అది ఏదో తినే వస్తువు అనుకొని తమ పావురాల జాతికి మిత్రుడైన ఆ అమాయికపు నల్లచీమను చిత్రగ్రీవం పొడిచి చంపిందనడంలో సందేహం లేదు. తాను చేసిన పని చూసి చిత్రగ్రీవం పశ్చాత్తాపపడిందనీ మనం అనుకోవచ్చు. ఏదేమైనా చిత్రగ్రీవం మళ్ళా ఎప్పుడూ తన జీవితంలో మరోసారి చీమను చంపలేదు.

పుట్టిన ఐదో వారానికల్లా చిత్రగ్రీవం తను పుట్టిన గూటినుంచి బైటకు గెంతి పావురాళ్ళ గూళ్ళ దగ్గర ఉంచిన మట్టి మూకుళ్ళలోంచి మంచినీళ్ళు తాగే స్థాయికి చేరుకుంది. రోజూ సొంతంగా ఆహారం సంపాదించుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చిత్రగ్రీవం స్థూలంగా తన ఆహారంకోసం తల్లిదండ్రుల మీదే ఆధారపడి ఉంది. నా ముంజేతి మీద కూర్చొని అరచేతిలో గింజల్ని ఒక్కొక్కటిగా పొడుచుకు తినేది. గారడీవాడు చమత్కారంగా బంతులను గాలిలోకి ఎగరేసి పట్టుకొనే విధంగా చిత్రగ్రీవం గింజలను తన గొంతులో పైకీ కిందకీ ఆడించి ఆ తర్వాత టక్కున మింగేది. అలా మింగిన ప్రతిసారీ నాకేసి చూసి 'భలే బాగా చేస్తున్నాను గదూ! మా అమ్మ నాన్న పైకప్పుమీద చలికాగుతున్నారు గదా... వాళ్ళు దిగివచ్చాక నేనెంత చురుకైన దాన్నో వాళ్ళకు చెపుతావుగదూ!' అన్నట్టుగా నాకేసి చూసేది. కానీ ఏమాటకామాట చెప్పుకొందాం. శక్తియుక్తులు పెంపొందించుకోవడంలో నా దగ్గర ఉన్న పావురాలు అన్నిట్లోకి చిత్రగ్రీవమే మందకొడి.

### *ఆలోచించండి-చెప్పండి*

- *పిల్లపక్షిని దానితల్లి ఎలా పెంచిందో తెలుసుకున్నారు కదా! మరి మిమ్మల్ని ఎవరు, ఎలా పెంచారో చెప్పండి.*
- *"ఘనకార్యం చేయడం" అనే వాక్యం నుండి మీరేం గ్రహించారు? ఇలా దీన్ని ఇంకా ఏ యే సందర్భాలలో వాడతారు?*
- *"ఏ మాటకామాటే అని ఏ యే సందర్భాలలో ఉపయోగిస్తారు?*
- *'పావురం' కంటిలోని ప్రత్యేకతను గుర్తించారుకదా! ఇంకా ఇతర జంతువుల / పక్షులకు సంబంధించిన ప్రత్యేకతలు ఏమున్నాయి?*

ఆ రోజుల్లోనే నేనో విషయం కనిపెట్టాను. గాలి దుమారాల్లో, కళ్ళు మూసుకుపోయే దుమ్మూ ఇసకల్లో పావురాలు నిరాటంకంగా ఎలా ఎగరగలుగుతాయో నాకు అప్పటిదాకా తెలియదు. రోజురోజుకీ పెరిగి పెద్దదవుతున్న చిత్రగ్రీవాన్ని దగ్గర నుండి గమనించే క్రమంలో ఓ రోజు దాని కళ్ళ మీదకు సన్నపాటి చర్మపు పొర సాగి రావడం గమనించాను. దాని కంటి చూపుగానీ పోవడంలేదుగదా అని భయపడి మరికాస్త పరీక్షగా చూడటంకోసం చిత్రగ్రీవాన్ని నా మొహం దగ్గరకు లాక్కున్నాను. అలా లాగగానే చిత్రగ్రీవం తన బంగారు రంగు కళ్ళు విప్పార్చి గూటిలో వెనక్కు వెనక్కు వెళ్ళిపోయింది. అయినా చెయ్యిజాచి పట్టుకొని మేడమీదకు తీసుకెళ్ళాను. ఆ మే నెల మండుటెండలో దాని కనురెప్పల్ని పరిశీలించాను. అప్పుడు కనిపించిందది: దాని కనురెప్పలకు అనుబంధంగా మరో పల్చని చర్మపుపొర ఉంది. నేను దాని మొహాన్ని సూర్యునికేసి తిప్పిన ప్రతిసారీ చిత్రగ్రీవం తన బంగారు కళ్ళమీదకు ఆ చర్మపు పొరను సాగలాగేది. అది కళ్ళకు రక్షణ కలిగించే చర్మపుపొర అనీ, దాని సాయంతో పావురాలు గాలిదుమారాల్లోగానీ, తిన్నగా సూర్యుని దిశగా గానీ ఏ ఇబ్బందీ లేకుండా ఎగరగలవనీ బోధపడింది.

మరో రెండు వారాలు గడిచేసరికల్లా చిత్రగ్రీవం ఎగరడం నేర్చుకుంది. పుట్టింది పక్షి పుట్టుకే అయినా ఆ ఎగరడం నేర్వడం అన్నది అంత సులభంగా జరగలేదు. మన పిల్లగాళ్ళకు నీళ్ళంటే ఇష్టమేగావచ్చు. కానీ ఈత నేర్చుకోవాలంటే మునిగి తేలడమూ నీళ్ళు మింగడమూ తప్పవు గదా... అలాగే పిల్ల పావురాలు కూడా ఎంతో కష్టపడితేగానీ ఎగరడం నేర్చుకోలేవు. చిత్రగ్రీవానికి తన రెక్కలు విప్పడం విషయంలో ఏదో సంకోచం ఉన్నట్టుంది. గంటల తరబడి మేడ మీద బాగా గాలి వచ్చేచోట కూర్చున్నా రెక్కలు విప్పి ఎగరడం విషయంలో మాత్రం దాని ధోరణి నిమ్మకు నీరెత్తినట్టు ఉండేది. ఈ సంగతి స్పష్టం అవడంకోసం మీకు మా మేడ ఎలా ఉంటుందో చెపుతాను. మాది నాలుగంతస్థుల ఇల్లు. మేడమీద చుట్టూ పద్నాలుగేళ్ళ పిల్లాడంత ఎత్తైన బలిష్ఠమైన కాంక్రీటు పిట్టగోడ. వేసవికాలంలో రాత్రిపూట మేమంతా మేడమీదే పడుకునేవాళ్ళం. అలాంటి సమయాల్లో ఎవరైనా పొరపాటున నిద్రలో నడుచుకుంటూ వెళ్ళినా మేడమీంచి వాళ్ళు అమాంతంగా పడిపోకుండా అడ్డుకొనేంత ఎత్తు ఉన్న పిట్టగోడ అది.

## IV

చిత్రగ్రీవాన్ని రోజు తీసుకెళ్ళి ఆ పిట్టగోడ మీద వదిలేవాడిని. అక్కడ ఆ గాలుల్లో అది అలా గంటల తరబడి కూర్చొని ఉండేది. అంతే తప్ప ఎగరడం గిగరడం అన్న పనులేవీ పెట్టుకొనేది గాదు. ఇలా కాదని ఒకరోజు పిట్టగోడ కింద కాసిని శెనగగింజలు పోసాను. కిందకి దిగివచ్చి ఆ గింజల్ని తిని పొమ్మని చిత్రగ్రీవాన్ని పిలిచాను. 'ఏవిటీ సంగతి?' అన్నట్టుగా కాసేపు చూసింది. నేను తీసుకువెళ్ళి తనకు ఆ గింజల్ని తినిపించబోవడం లేదని స్పష్టమయ్యాక అది పిట్టగోడమీదే అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టింది. అడపాదడపా మెడనిక్కించి నాలుగడుగులు కిందనున్న గింజల్ని చూడటం మాత్రం మానలేదు. అలా ఆ నిరాశాభరితమైన నాటకం ఓ పావుగంట దాకా కొనసాగింది. చిట్టచివరకు అది

సంకోచాన్ని అధిగమించి పిట్టగోడమీంచి కిందకు దూకనే దూకింది. దాని కాళ్ళు నేలను తాకే సమయంలో అప్పటిదాకా ఏనాడూ తెరచుకొని ఉండని దాని రెక్కలు – అది గింజలమీద వాలి బాలెన్సు చేసుకునే ప్రక్రియలో అప్రయత్నంగా హఠాత్తుగా చక్కగా విప్పుకున్నాయి. ఎంతటి ఘన విజయం!

ఆ రోజుల్లోనే దాని ఈకల రంగు మారడం గమనించాను. అంతగా ఆకట్టుకోలేని బూడిదరంగు కలిసిన నీలివర్ణపు ఈకలకు బదులుగా దాని ఒళ్లంతా సముద్రపు నీలిరంగు ఈకలతో ధగధగా మెరవసాగింది. దాని మెడప్రాంతం సూర్యకాంతిలో ఇంద్రధనుస్సు వర్ణాల పూసలగొలుసులా శోభిల్లసాగింది.

ఎగరడం అన్న మహత్తరమైన ఘట్టానికి చేరుకుంది చిత్రగ్రీవం. దాని తల్లీ, తండ్రీ, చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పిస్తాయని ఎదురుచూశాను. ఈ లోపల నాకు చేతనయిన రీతిలో నా వంతు ప్రయత్నం చేసాను. రోజూ చిత్రగ్రీవాన్ని మణికట్టు మీద ఉంచుకొని కొద్ది నిమిషాలపాటు చేతిని పైకీ కిందకీ పదే పదే కదిపేవాడిని. అలా కదిపినప్పుడు చిత్రగ్రీవం బాలెన్సు నిలదొక్కుకోవడం కోసం రెక్కలు విప్పడం ముడవడం చేసేది. అలా దానికి రెక్కలు ముడవడం విప్పడం అలవాటయింది. కానీ ఎగరడం అంటే ఇంకా చాలా తతంగం ఉంది కదా... ఆ మిగిలిన పాఠాలు నేర్పడం నా పరిధిలో లేదు గదా... అసలు ఎందుకీ ఆత్రం అని మీరు అనుకోవచ్చు. తోటి పావురాలతో పోలిస్తే చిత్రగ్రీవం ఎగరడం విషయంలో వెనకబడి ఉండటం దానికి ఒక కారణం. అదీ కాకుండా జూన్‌నెల వచ్చేసిందంటే వర్షాలు అందుకొంటాయి. వర్షాలు మొదలయ్యాయి అంటే పక్షులకు దూరాలు ఎగరడం అసాధ్యమవుతుంది. అంచేత వర్షాకాలం ముంచుకొచ్చేముందుగానే చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పేయాలి అనుకొన్నాను.

మే నెల ఇంకా కొద్ది రోజుల్లోనే ముగుస్తుంది అనగా తండ్రిపక్షి చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పే పని చేపట్టింది. ఆ రోజు అప్పటిదాకా బలంగా వీచి ఊరును చల్లబరచిన ఉత్తరపు గాలి సన్నగిల్లి మంద్రంగా సాగుతోంది. ఆకాశం కడిగిన నీలిముత్యంలా నిర్మలంగా ఉంది. దుమ్ము ధూళీ లేకుండా వాతావరణం స్వచ్ఛంగా ఉంది. ఊళ్ళోని ఇళ్ళ పైకప్పులూ, దూరాన ఉన్న పంటపొలాలూ – అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం మూడు గంటలవేళ. చిత్రగ్రీవం మేడ పిట్టగోడమీద కూర్చుని ఉంది. అప్పటిదాకా చుట్టుపక్కల గిరికీలు కొడుతున్న తండ్రి పక్షి వచ్చి ఎండకాగుతున్న చిత్రగ్రీవం పక్కన వాలింది. వాలి చిత్రగ్రీవం కేసి ఓ చూపు చూసింది. "ఏం వాయ్ బడుద్ధాయ్. మూడు నెలలు నిండాయి. ఇంకా ఎగిరే ప్రయత్నాలేం లేవా? భయమా? అసలు నువ్వు పావురానివా, వానపామువా?" అన్నట్టుగా చిత్రగ్రీవం కేసి చూసింది.



చిత్రగ్రీవం ఉలుకూ పలుకూ లేకుండా గంభీరంగా ఉండిపోయింది. తండ్రి పక్షికి చిర్రెత్తుకొచ్చింది గాబోలు – పావురాల ఫక్కీలో కువకువా కూస్తూ చిత్రగ్రీవాన్ని గద్దించ సాగింది. ఆ గద్దింపుల జడివాననుంచి తప్పించుకుందామని చిత్రగ్రీవం పక్కపక్కకు జరగసాగింది. తండ్రిపక్షి పట్టు విడవకుండా కూతలు పెడుతూ రెక్కలు టపటపలాడిస్తూ తనూ జరగసాగింది. చిత్రగ్రీవం ఇంకా ఇంకా జరిగింది. తండ్రిపక్షీ జరగటం కొనసాగించింది. చిట్టచివరికి చిత్రగ్రీవం

పిట్టగోడ అంచుకు చేరింది. ఇంకాస్త జరిగితే కిందపడే స్థితికి చేరుకుంది. ఉన్నట్టుండి తండ్రి పక్షి తన భారాన్నంతా చిత్రగ్రీవం మీద మోసేసింది. చిత్రగ్రీవం గోడమీద నుంచి జారనే జారింది. అలా ఒక అడుగు జారిందో లేదో స్వీయరక్షణకోసం అసంకల్పితంగా రెక్కలు విప్పార్చి గాలిలో తేలింది. మా సంతోషానికి అవధులు లేవు. అప్పటిదాకా కింద అంతస్తులోని నీళ్ళ కుండీలలో జలకాలాడుతున్న తల్లి పక్షి మెట్లమీదుగా మేడమీదికి చేరుకుని తనూ చిత్రగ్రీవానికి సాయంగా ఎగరసాగింది. అలా అవి రెండూ ఎంతలేదన్నా పది నిమిషాలపాటు ఎగిరాయి. ఆకాశంలో గిరికీలు కొట్టి వచ్చి కిందకు వాలాయి. అలా వాలేటప్పుడు తల్లిపక్షి రెక్కలు ముడిచి యథాలాపంగా తాను వాలదలచిన ప్రదేశంలో శుభ్రంగా వాలింది. చిత్రగ్రీవం మాత్రం నానా పాట్లు పడింది. ఒకటే కంగారు. ఒళ్ళంతా వణుకు. వాలే క్షణంలో దాని కాళ్ళు నేలను రాసుకుంటూ పోయాయి. అలా నేలను రాసుకుంటూ వెళు తూ, రెక్కల్ని కంగారు కంగారుగా టపటపలాడిస్తూ, తనను తాను బాలెన్సు చేసుకుంటూ బాగా ముందుకు సాగి ఆగింది. అలా ఆగినప్పుడు దాని రొమ్ము గోడను తాకింది. గబుక్కున రెక్కలు ముడిచేసింది. ఎలాగైతేనేం క్షేమంగా వాలి ఆగింది కదా – చిత్రగ్రీవం ఉత్తేజంతో రొప్పసాగింది. తల్లిపక్షి దానిపక్కకు చేరి ముక్కుతో నిమిరింది. దాని రొమ్ముకు తన రొమ్ము తాకించింది. చిన్న పిల్లాడిని లాలించినట్టుగా లాలించింది. తాను చేపట్టిన కార్యం విజయవంతంగా ముగియటం గమనించిన తండ్రిపక్షి జలకాలాడటం కోసం కింది అంతస్తులోని నీళ్ళకుండీల దగ్గరకు చక్కా ఎగిరిపోయింది.

### ఆలోచించండి - చెప్పండి

- *"నిమ్మకు నీరెత్తడం" అని ఏ ఏ సందర్భాలలో వాడతారు?*
- *'మహత్తర ఘట్టానికి చేరుకోవడం' అంటే ఏమిటి? దీనికి కొన్ని ఉదాహరణలు తెల్పండి.*
- *మే నెల చివరి రోజుల్లో వాతావరణం ఎలా ఉందో తెలుసుకొన్నారు కదా! చలికాలంలో వాతావరణం ఎలా ఉంటుందో మీ మాటల్లో వర్ణించండి.*
- *'చిత్రగ్రీవం ఎగరడానికి దాని తండ్రిపక్షి ఏం చేసింది? తల్లిపక్షి ఏం చేసింది? అట్లాగే చిన్న పిల్లలు నడక నేర్చుకోవడం ఎలా జరుగుతుందో చెప్పండి.*

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

1. "మనుషుల్లాగే పక్షులకు, జంతువులకు కూడా తమ పిల్లలను పెంచడం ఎలాగో తెలుసు" దీనిమీద మీ అభిప్రాయాన్ని తెలుపండి. కారణాలను వివరిస్తూ మాట్లాడండి.

2. పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| పేరా సంఖ్య | పేరాలో వివరించిన ముఖ్యమైన విషయాలు | పేరాకు తగిన శీర్షిక |
|---|---|---|
| 1వ పేరా | | |
| 2వ పేరా | | |
| 10వ పేరా | | |
| 15వ పేరా | | |
| 16వ పేరా | | |


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) చిత్రగ్రీవం ఏ వయస్సులో ఏమేం చేయగల్గిందో రాయండి.

ఆ) చిత్రగ్రీవానికి దాని తల్లిపక్షి, తండ్రిపక్షి నుండి ఏమేమి సంక్రమించాయి?

ఇ) చిత్రగ్రీవం గురించి వివరిస్తూ అది సుందరమైనదని, మందకొడిదని, ఏపుగా ఎదిగిందని రచయిత ఎందుకన్నాడు?

ఈ) చిత్రగ్రీవం గురించి మనకు వివరిస్తున్నది ఎవరు? తాను చేసిన పనికిమాలిన పని అని దేన్ని గురించి చెప్పాడు?

ఉ) పిల్లపక్షి నిస్సహాయంగా ఉన్నప్పుడు, గాభరాపడినప్పుడు తల్లిపక్షి ఏం చేసింది?

ఊ) ధనగోపాల్ ముఖర్జీ చేసిన సాహితీసేవ ఏమిటి?

**4. కింది పేరా చదవండి. సరైన వివరణతో ఖాళీలు పూరించండి.**

చాతకపక్షుల ముక్కులు చాలా చిన్నవి. తాము ఎగురుతూనే గాలిలోని కీటకాలను పట్టుకోగలవు. నోరు బార్లా తెరచి తమవైపుకు వచ్చే చాతకపక్షుల బారినుండి కీటకాలు తప్పించుకోవడం దాదాపు అసాధ్యం. చాతకపక్షులు పరిమాణంలో చాలా చిన్నవి. వాటికి బరువులెత్తే సామర్థ్యం కూడా తక్కువే! అందుకే అవి వాటి గూళ్ళ నిర్మాణంలో గడ్డిగాదం, పీచూపత్తి, సన్నపాటి చెట్టురెమ్మలు... వంటి తేలికపాటి వస్తువులనే వాడతాయి. వాటి కాళ్ళు పొట్టిగా ఉంటాయి. పొడవాటి కాళ్ళున్న పక్షుల్లో ఉండే చురుకుదనం వీటి కాళ్ళల్లో కనిపించదు. అందుకని ఇవి గెంతడం, దభీమని దూకడం వంటి పనులు చెయ్యలేవు. ఐతే వాటి కొక్కేల్లాంటి కాలివేళ్ళ పుణ్యమాఅని అవి తమ గోళ్ళతో ఎలాంటి జారుడు ప్రదేశాల్లోనైనా అతుక్కుపోయి ఉండిపోగలవు. కాబట్టి అవి అనితరసాధ్యమైన నైపుణ్యంతో, కుశలతతో పాలరాతి వంటి నున్నటి గోడల్ని, ప్రదేశాలను పట్టుకొని వెళ్ళగలవు. తమ గూళ్ళను నిర్మించుకోవడానికి ఇళ్ళ చూరుల దిగువన గోడల్లోని తొర్రలను ఎన్నుకొంటాయి. రాలిన ఆకుల్నీ, గాలిలో ఎగరాడే గడ్డిపోచల్ని ముక్కున కరచుకొని గూట్లోకి చేరుస్తాయి. వాటిని తమ లాలాజలాన్ని జిగురులా వాడి గూటి ఉపరితలం మీద అతికిస్తాయి. వాటి లాలాజలం ఓ అద్భుత పదార్థం. అది ఎండి గట్టిపడిందంటే మామూలుగా వాడే ఏ జిగురూ దానికి సాటిరాదు. ఇదీ చాతకపక్షుల వాస్తుకళానైపుణ్యం.

అ) చాతకపక్షులు తేలికపాటి వస్తువులతో గూళ్ళను నిర్మించుకుంటాయి. ఎందుకంటే ____________________

ఆ) చాతకపక్షులు దభీమని దూకడం, గెంతడం చెయ్యలేవు. ఎందుకంటే ____________________

ఇ) నున్నటి గోడలు, ప్రదేశాల్లో కూడా చాతకపక్షులు జారకుండా ఉండడానికి కారణం ____________________

ఈ) చాతకపక్షుల లాలాజలం వాటి గూటి నిర్మాణంలో ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే ____________________

ఉ) వాస్తుకళా నైపుణ్యం అంటే ____________________

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) చిత్రగ్రీవాన్ని గురించి మీకు ఆశ్చర్యం కలిగించిన విషయాలు ఏవి?

ఆ) మానవులను పావురాలకు మిత్రులూ, సహచరులని రచయిత ఎందుకు అన్నాడు?

ఇ) చిత్రగ్రీవం తండ్రిపక్షి గురించి రాయండి.

**2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) చిత్రగ్రీవాన్ని గురించి మీ సొంత మాటల్లో వర్ణించండి.

ఆ) శిశువుల పెంపకంలో పక్షులకు, మానవులకు మధ్య ఉన్న సామ్యాలను రాయండి.

**3. సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) 'చిత్రగ్రీవం' అనే పావురంపిల్ల ఎలా పుట్టిందీ ఎలా ఎగరడం నేర్చుకొన్నదీ తెలుసుకొన్నారు కదా! అట్లాగే మీకు తెలిసిన లేదా మీ పరిసరాల్లోని ఏదైనా పక్షి / జంతువు గురించి మీరు కూడా ఒక కథనాన్ని రాయండి. (ఈ పాఠంలాగా)

ఆ) ఈ మధ్యకాలంలో సెల్‌ఫోన్ టవర్ల నుండి వచ్చే వేడిమికి కొన్ని పక్షిజాతులు అంతరించి పోతున్నాయి. అలాగే ఎండాకాలంలో తీవ్రమైన వేడికి తాళలేక, తాగడానికి నీరు అందక మృత్యువాతపడుతున్నాయి. పక్షులు ఇందుకోసం తమను కాపాడడానికి తగిన చర్యలు చేపట్టమని తమ తోటకు వచ్చిన పిల్లలతో సంభాషించాయి అనుకోండి. ఆ పిల్లలకూ, పక్షులకూ మధ్య జరిగే సంభాషణను ఊహించి రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదబంధాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ) శ్రద్ధాసక్తులు ఆ) ప్రేమ ఆప్యాయతలు ఇ) వన్నెచిన్నెలు

ఈ) సమయసందర్భాలు ఉ) హాయిసౌఖ్యాలు

**2. కింది పదాలను వివరించి రాయండి.**

అ) విజయవంతం కావడం అంటే

______________________________

ఆ) ఉలుకూ పలుకూ లేకపోవడం అంటే

______________________________

**3. కింద తెలిపిన వాటిని గురించి పాఠంలో ఏ ఏ పదాలతో వర్ణించారు?**

అ) గద్దింపులు : ______________________________

ఆ) పావురాలు : ______________________________

ఇ) గువ్వలు : ______________________________

ఈ) పావురాల గుంపు : ______________________

ఉ) పావురం మెడ : ______________________

ఊ) పుట్టిన పిల్లపక్షి : ______________________

ఋ) చిత్రగ్రీవం ముక్కు : ______________________

ఎ) చిత్రగ్రీవం ఒళ్ళు : ______________________

ఏ) చిత్రగ్రీవం మెడ ప్రాంతం: ______________________

## వ్యాకరణాంశాలు

**1. కింది అలంకారాల లక్షణాలు రాయండి.**

అ) శ్లేష ఆ) అర్థాంతరన్యాసం

**2. కింది ఛందోరీతుల లక్షణాలు రాయండి.**

అ) సీసం ఆ) ఆటవెలది ఇ) తేటగీతి

**3. కింది వాక్యాల్లోని అలంకారాలను గుర్తించండి.**

అ) శ్రీమంత్ చొక్కా మల్లెపూవులా తెల్లగా ఉంది.

**4. కింది పద్యపాదాలు పరిశీలించండి.**

| భ | స | స |
|---|---|---|
| U I I | I I U | I I U |
| ఆ పర | మ పురం | ధ్రుల యం |

| గగ | భ | జ | స | స |
|---|---|---|---|---|
| U U | U I I | I U I | I I U | I I U |
| దే పు | ణ్యాంగన | యు భిక్ష | యిడద | య్యెc గటా! |

| గగ | జ | స |
|---|---|---|
| U U | I U I | I I U |
| రేపా | డి మేలు | కని యే |

| గగ | భ | జ | గగ | స |
|---|---|---|---|---|
| U U | U I I | I U I | U U | I I U |
| నే పా | పాత్ముని | ముఖంబు | నీక్షిం | చితినో? |

దీంట్లో గగ, భ, జ, స అనే గణాలు వాడారు కదూ!

ఒకటవ పాదం, మూడవ పాదంలో గణాల సంఖ్య రెండవ, నాల్గవ పాదాల్లోని గణాల సంఖ్య ఒకే రకంగా ఉంది కదూ!

ఆరవ గణం 'జ'గణం మాత్రమే ఉంది కదూ!

రెండు నాలుగు పాదాల్లోని చివరి అక్షరం గురువే కదా!

ఇలాంటి లక్షణాలు కలిగి ఉండే పద్యం ఏంటో తెలుసా? అదే కంద పద్యం.

i) గగ (గా), భ, జ, స, నల అనే గణాలుంటాయి.

ii) మొదటి పాదం లఘువుతో మొదలైతే అన్నీ పాదాల్లో మొదటి అక్షరం లఘువుగాను, గురువుతో మొదలైతే అన్ని పాదాల్లో మొదటి అక్షరం గురువుగాను ఉంటుంది.

iii) రెండవ, నాలుగవ పాదాల్లోని చివరి అక్షరం గురువుగానే ఉంటుంది.

iv) 1, 2 పాదాల్లో (3 + 5) 8 గణాలు, 3, 4 పాదాల్లో (3 + 5) 8 గణాలు ఉంటాయి. ఆరవ గణం "జ"గణం గాని, "నలం" గాని మాత్రమే ఉండాలి.

v) నాలుగవ గణం మొదటి అక్షరానికి ఏడవ గణం తొలి అక్షరానికి యతి చెల్లుతుంది.

vi) ప్రాస నియమం ఉంటుంది.

vii) 'జ'గణం బేసి గణం కారాదు.

'వినదగునెవ్వరుజెప్పిన .....................' అనే పద్యానికి లక్షణ సమన్వయం చేయండి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

1. "ధనగోపాల్ ముఖర్జీ" రాసిన "చిత్రగ్రీవం ఓ పావురం కథ" అనే పుస్తకాన్ని లేదా పక్షుల గురించి తెలిపే ఏదైనా ఒక పుస్తకాన్ని గ్రంథాలయం నుండి చదవండి. మీరు తెలుసుకొన్న వివారాలు రాసి ప్రదర్శించండి (లేదా) అంతర్జాలం ద్వారా ఏవైనా రెండు పక్షుల వివరాలు, వాటి చిత్రాలు సేకరించి రాసి ప్రదర్శించండి.

2. "చిత్రగ్రీవం" అనే పక్షి పేరు పంచతంత్ర కథల్లో కూడా ఉంది. పంచతంత్రం కథల పుస్తకం చదవండి. మీరు చదివిన కథ గురించి రాసి ప్రదర్శించండి.

## సూక్తి

సహసా విదధీత నక్రియా
మవివేకః పరమాప దాంపదం
నృణతేహివిమృశ్య కారిణం
గుణలుబ్ధాః స్వయ మేన సంపదః

– కిరాతార్జునీయం

భావం : ఏపనినీ తొందరపడి చేయకూడదు. తొందరపాటు, అవివేకమే అన్ని ఆపదలకు మూలం. సవిమర్శముగా మంచిచెడ్డలాలోచించి పనిచేసేవాణ్ణి గుణలుబ్ధయైలక్ష్మి స్వయముగనే కోరి వరించునుగదా!

పదవండి-తెలుసుకోండి

# విశ్వకవి "గీతాంజలి"

సాహిత్య సృజనలో అంతర్జాతీయ కీర్తినందుకొన్న మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్. కవిగా, రచయితగా, తత్త్వవేత్తగా, సంగీతజ్ఞుడిగా, చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. వీరిపేరు వినగానే చప్పున స్ఫురించేవి "జనగణమన" గీతం, "గీతాంజలి". "జనగణమన" గీతం భారత జాతీయ గీతంగా గుర్తింపబడింది. బంగ్లాదేశ్ జాతీయ గీతం కూడా వీరి లేఖిని నుండి వెలువడినదే. ఇలా రెండు జాతీయగీతాలనందించిన కవిగా అపూర్వ చరిత్రను సృష్టించారు. "శాంతినికేతన్" పేరున ఆదర్శవిద్యాలయాన్ని స్థాపించి "గురుదేవుడు"గా కీర్తింపబడ్డారు. ఈ సంస్థద్వారా సంస్కారయుక్తమైన విద్యనందించారు.

కవిగా వీరికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చిన రచన "గీతాంజలి". 1913లో దీనికి "నోబెల్ సాహిత్య పురస్కారం" దక్కింది. నోబెల్ బహుమతిని అందుకున్న తొలి భారతీయుడిగా ఠాగూర్ అరుదైన గౌరవాన్ని పొందారు. "గీతాంజలి" భారతీయ భాషల్లోకి మాత్రమేకాక విదేశీయ భాషలెన్నింటిలోకో అనువదింపబడింది. ఒక్క తెలుగు భాషలోనే దాదాపు 50 దాకా అనువాదాలొచ్చాయంటే దీని గొప్పదనమేమిటో ఊహించవచ్చు. తాత్త్విక, సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగిన ఈ రచన పాఠకుని హృదయాన్ని కదిలిస్తుంది.

"గీతాంజలి"లోని రెండు అనువాద కవితా ఖండికలను ఇప్పుడు చూద్దాం.

1. ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో
ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో
ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో
సంసారపు గోడలమధ్య ఎక్కడ భాగాల కింద ప్రపంచం విడిపోలేదో
ఎక్కడ సత్యాంతరాళంలోంచి పలుకులు బైలు వెడలతాయో
ఎక్కడ అలసటనెరగని శ్రమ తన బాహువుల్ని పరిపూర్ణతవైపు జాస్తుందో
ఎక్కడ నిర్జీవమైన ఆచారపటెడారిలో స్వచ్ఛమైన బుద్ధిప్రవాహం ఇంకిపోకుండా ఉంటుందో
ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాలలోకీ, కార్యాలలోకీ నీచే నడపబడుతుందో
ఆ స్వేచ్ఛా స్వర్గానికి, తండ్రీ, నా దేశాన్ని మేల్కొలుపు.

– చలం

2. నా హృదయంలోని పేదరికాన్ని సమూలంగా తొలగించు ప్రభూ – ఇదే నా ప్రార్థన.
నా సుఖదుఃఖాలను తేలికగా భరించ గలిగే శక్తిని నాకు ప్రసాదించు.
సేవలోనే నా ప్రేమను ఫలింపజేసుకొనే శక్తిని అందజేయి.
పేదలను కాదనకుండా, అధికారదర్పానికి దాసోహమనకుండా ఉండే శక్తిని ప్రసాదించు.
దైనందిన అల్పవిషయాలకు అతీతంగా బుద్ధిని నిలుపుకోగల శక్తిని ప్రసాదించు.
నీ అభీష్టానికి ప్రేమతో నా శక్తిని అర్పించుకోగలిగే శక్తి నివ్వు.

– డా॥ జె. భాగ్యలక్ష్మి

# ఉపవాచకం

## మన ఇతిహాసం

# రామాయణం

(వాల్మీకి రామాయణానికి సంక్షిప్త వచనరూపం)



## రామాయణాన్ని ఎందుకు చదవాలంటే...

*మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. మానవ హృదయాల నుండి ఎప్పటికీ చెరగని కథ. 'అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం - అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం - గురుభక్తి, శిష్యానురక్తి - స్నేహఫలం, ధర్మబలం - వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం -జీవకారుణ్యభావన, ప్రకృతిలాలన' - ఇలా జీవిత పార్శ్వాలనెన్నింటినో పట్టి చూపిస్తుంది రామాయణం. రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమే. రామాయణం పారాయణ గ్రంథంకాదు, ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నందిస్తుంది. "రామో విగ్రహవాన్‌ధర్మః సత్యధర్మ పరాక్రమః" అన్న మహితోక్తిని మారీచుని నోటినుండి మహర్షి పలికించాడు. రామునివంటి ఆదర్శమూర్తి, రామాయణం వంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి!' మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.*

*ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి దీనిని రచించి 'ఆదికవి'గా కీర్తిపొందాడు. 'రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్' అనే మూడు పేర్లు దీనికున్నాయి. ఆరు కాండల (విభాగం) తో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, సంస్కృత భాషలో సాగిన రచన ఇది. తరువాతి కాలంలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది. వారి వారి ప్రతిభననుసరించి వాల్మీకి కథకు జోడింపులు చేసిన కవులూ ఉన్నారు. అవే నిజం అన్నంతగా ప్రచారం పొందాయి కొన్ని సంఘటనలు.*

*వాల్మీకి రామాయణ కథను సంక్షిప్తంగా అందించే ప్రయత్నం ఇది. సమున్నత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందు తరాలవారికి స్ఫూర్తి కోసం చేసిన రచన ఇది.*



# బాలకాండం



శ్రీమన్నారాయణుని నిరంతరం స్మరించే నారదమహర్షి ఒకనాడు మునిశ్రేష్ఠుడైన వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు. నారదుడు తపస్వి, వాక్చతురుల్లో శ్రేష్ఠుడు. వాల్మీకి జిజ్ఞాసతో నారదుల వారినడిగాడు (జిజ్ఞాసే విజ్ఞానానికి మూలం). 'ఓ మహర్షీ! అన్నీ మంచి గుణాలు కలవాడు, ఎలాటి ఆపదలు చుట్టుముట్టినా తొణకనివాడు, ధర్మంతెలిసినవాడు, ఆశ్రయించినవారిని ఆదుకునేవాడు, మాటతప్పనివాడు, సకల ప్రాణులకు మేలుచేసేవాడు, వీరుడు, ధీరుడు, అసూయలేనివాడు, అందమున్నవాడు... ఇలాంటి శుభలక్షణాలు కలవాడు ఎవరైనా ఈ లోకంలో ఉన్నాడా?' అని ప్రశ్నించాడు. నారదుడు చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. 'మహామునీ! ఇన్ని లక్షణాలు ఒకే వ్యక్తిలో కుదురుకోవడం సాధారణంగా జరగదు. కానీ, నీవు తెలిపిన విశిష్ట గుణాలన్నీ మూర్తీభవించినవాడు శ్రీరాముడ'ని తెలిపాడు. రామాయణగాథను సంక్షిప్తంగా వాల్మీకికి వినిపించాడు నారదుడు. అక్కడి నుంచి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

రామకథ వాల్మీకి మనసులో నాటుకుపోయింది. నారదుని మాటలు ఇంకా చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నాయి. గంగానదీ సమీపానగల తమసానదికి స్నానం చేయడానికి బయల్దేరాడు. భరద్వాజాది శిష్యులు వెంట నడుస్తున్నారు. తమసానది మంచివాని మనసువలె స్వచ్ఛంగా ఉంది.

స్నానానికి నదిలోకి దిగిన వాల్మీకి చుట్టూవున్న ప్రకృతి అందాలకు పరవశిస్తున్నాడు. సమీపంలో ఒక కొమ్మపైన క్రౌంచ పక్షుల జంటను చూశాడు. వాటి అనురాగం ముచ్చటగొలుపుతున్నది. వాటి మధురధ్వనులు వీనులవిందు చేస్తున్నాయి. ఇంతలో ఒక వేటగాడు క్రూరబాణంతో మగపక్షిని నేలకూల్చాడు. అది నెత్తురోడుతూ విలవిలలాడుతూ ప్రాణాలను విడచింది. ఆ ఎడబాటును తట్టుకోలేని ఆడపక్షి తల్లడిల్లిపోయింది. హృదయ విదారకమైన ఈ దృశ్యాన్ని చూశాడు వాల్మీకి. కరుణరసం జాలువారింది. ధర్మావేశం కట్టలు తెంచుకుంది. వెంటనే నోటి వెంట అప్రయత్నంగా...

మానిషాద ప్రతిష్ఠాంత్వ
మగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునాదేకమ్
అవధీః కామమోహితమ్॥

(ఓ కిరాతుడా! క్రౌంచపక్షి జంటలో పరవశమైయున్న ఒక పక్షిని చంపిన నీవు శాశ్వతంగా అపకీర్తి పాలవుతావు) అన్న మాటలు వచ్చాయి.

అననైతే అన్నాడు కానీ తరవాత అతనికే ఆశ్చర్యంవేసింది. ఈ మాటలు సమానాక్షరాలుగల నాలుగు పాదాలతో లయబద్ధంగా వచ్చాయి. ఇది ఛందోబద్ధమైన శ్లోకమేనని నిర్ధారించుకున్నాడు. శోకం నుంచి శ్లోకం పుట్టింది. ఆశ్రమానికి తిరిగివచ్చారందరూ. కాని క్రౌంచపక్షి దారుణ దృశ్యం మాత్రం వాల్మీకి మనసునుంచి వెనుదిరగడం లేదు. అదే ఆలోచన. అదే ఆవేదన. ఇంతలో సృష్టికర్త అయిన బ్రహ్మ వాల్మీకిని చూడడానికి ఆశ్రమానికివచ్చాడు. అతనికి శాస్త్రోక్త ఉపచారాలన్నీ చేశాడు వాల్మీకి. బ్రహ్మ

వాల్మీకిని కూర్చోమన్నాడు. బ్రహ్మ ఆసనంకన్నా కొంచెం తక్కువ ఎత్తుగల ఆసనంపైన కూర్చున్నాడు వాల్మీకి. ఇది పెద్దలపట్ల ప్రవర్తించవలసిన తీరు. బ్రహ్మ ఎదురుగా ఉన్నా క్రౌంచపక్షి బాధ వాల్మీకిని వదలడం లేదు. మనసులో 'మానిషాద' శ్లోకమే మళ్ళీ ధ్వనించింది. అన్నీ తెలిసిన బ్రహ్మ చిరునవ్వును చిందిస్తూ 'ఓ ఋషీశ్వరా! నీవు పలికినది శ్లోకమే. అది నా సంకల్ప ప్రభావం. ఈ ఛందస్సు (అనుష్టుప్) లోనే శ్రీరామచరిత్రను రాయమని ఆదేశించాడు. నారదుడు స్పష్టంగా వివరింపని రామకథా రహస్యాలు కూడా స్ఫురిస్తాయని అనుగ్రహించాడు. ఈ భూమండలంలో పర్వతాలు, నదులు ఉన్నంతకాలం రామాయణగాథను జనులు కీర్తిస్తూనే ఉంటార'ని ఆశీర్వదించాడు. బ్రహ్మ ఆదేశానుసారం రామాయణరచనకు శ్రీకారం చుట్టాడు వాల్మీకి మహర్షి.

**అయోధ్యా నగరం :**

సరయూనదీతీరంలో 'కోసల' అనే సుప్రసిద్ధ దేశముంది. అందులోనిదే 'అయోధ్యా' అనే మహానగరం. 'అయోధ్యా' అంటే యోధులకు జయించడానికిశక్యంకానిది. మనువు దీన్ని నిర్మించాడు. కోసల దేశాన్ని దశరథమహారాజు పరిపాలిస్తున్నాడు. అతడు సూర్యవంశం వాడు. మహావీరుడు. దేవతల పక్షాన రాక్షసులతో ఎన్నోమార్లు యుద్ధం చేసినవాడు. ధర్మపరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేవాడు. వశిష్ఠ, వామదేవులు అతని ప్రధానపురోహితులు. సుమంత్రుడు మొదలుగాగల ఎనిమిది మంది మంత్రులు. ఇతని పాలనలో కోసల దేశం భోగభాగ్యాలతో విలసిల్లింది. ప్రజలు ధర్మవర్తనులై సుఖసంతోషాలతో ఉన్నారు. 'యథారాజా తథా ప్రజాః' – రాజు ఎలా ఉంటే ప్రజలూ అలాగే ఉంటారు.

ఎన్ని ఉన్నా సంతానం లేదన్న చింత దశరథుణ్ణి కుంగదీసింది. సంతానప్రాప్తి కోసం అశ్వమేధయాగం చేయాలన్న ఆలోచన కలిగింది. వెంటనే పురోహితులు, గురువులతో సమావేశమయ్యాడు. మనసులోని మాట చెప్పాడు. వారు తథాస్తు అన్నారు. సరయూనదికి ఉత్తర తీరంలో యజ్ఞవేదిక సిద్ధమైంది. మంత్రీ సారథీ అయిన సుమంత్రుడు ఈ యాగానికి ఋష్యశృంగ మహర్షిని ఆహ్వానిస్తే ఫలవంతమౌతుందని సూచించాడు. ఋష్యశృంగుడు విభాండక మహర్షి కుమారుడు. నిష్కాగరిష్ఠుడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడ వానలు బాగా కురుస్తాయి. దశరథుని ఆజ్ఞమేరకు ఋష్యశృంగుణ్ణి సగౌరవంగా తోడ్కొనివచ్చారు. మూడు రోజులపాటు అశ్వమేధయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

తరవాత దశరథుడు ఋష్యశృంగునితో పుత్రప్రాప్తికోసం చేయవలసిన క్రతువును గురించి అడిగాడు. ఆ భారాన్ని ఋష్యశృంగునిపైనే ఉంచాడు. దశరథుని అభ్యర్థనను మన్నించిన ఋష్యశృంగుడు 'పుత్రకామేష్టి' అనే యాగాన్ని ప్రారంభించాడు. హవిస్సులందుకోవడానికి బ్రహ్మాదిదేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు యజ్ఞశాలలో ప్రత్యక్షమయ్యారు.

అదే సమయంలో దేవతలందరూ బ్రహ్మను చేరి తమగోడు వెళ్ళబోసుకున్నారు. రావణాసురుడు బ్రహ్మ వరప్రభావంచేత విర్రవీగుతూ తమను చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు. ముల్లోకాలను బాధించడమేగాక ఇంద్రుణ్ణిసైతం రాజ్యభ్రష్టుణ్ణి చేయడానికి పూనుకొన్నాడని తెలిపారు. అతని దుండగాలకు అంతేలేదన్నారు. ఋషుల, యక్షగంధర్వుల మాట అటుంచి అతని భయంతో సూర్యుడు, సముద్రుడు, వాయువు కూడా తమ సహజస్థితిని ప్రకటించలేకపోతున్నారని వాపోయారు. అతని పీడ విరగడయ్యే ఆలోచనను బ్రహ్మనే చెప్పమని వేడుకున్నారు.

బ్రహ్మ దేవతలతో 'రావణుడు గంధర్వ, యక్ష, దేవ, దానవులచే మరణం లేకుండా నన్ను వరం కోరాడు. మానవుల పట్ల అతనికి చులకనభావం. అందుకే వారి గురించి ప్రస్తావించలేదు. కనుక మానవుని చేతిలోనే రావణునికి మరణం ఉంద'ని అన్నాడు.

ఇంతలో శ్రీమహావిష్ణువు శంఖచక్రగదాధారి అయి వచ్చాడు. దేవతలు ఆ దేవదేవుణ్ణి అనేక విధాలుగా స్తుతించారు. వరగర్వంచేత కన్నూమిన్నూగానక ప్రవర్తిస్తున్న రావణుణ్ణి సంహరించడానికి మానవుడిగా అవతరించమని అభ్యర్థించారు. దశరథ మహారాజుగారి ముగ్గురు భార్యలకు నాలుగు రూపాలలో పుత్రుడవు కమ్మని ప్రాధేయపడ్డారు. అభయమిచ్చాడు ఆశ్రితవత్సలుడు. అందరి పూజలందుకొని అంతర్ధానమయ్యాడు.

దశరథుడు పుత్రకామేష్టి చేసినప్పుడు యజ్ఞకుండంనుంచి గొప్ప తేజస్సుతో కూడిన ఒక దివ్యపురుషుడు ఆవిర్భవించాడు. అతడు బ్రహ్మపంపగా వచ్చినవాడు. చేతిలో బంగారుపాత్ర వెండిమూతతో. అందులో దివ్యపాయసముంది. దాన్ని దశరథునకందించాడు. 'ఈ పాయసం సంపదలనిస్తుంది ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. అన్నిటినీ మించి సంతానాన్ని ప్రసాదిస్తుంద'న్నాడు. పేదవానికి పెన్నిధి దొరికినట్లైంది దశరథునికి. అతని మనస్సు ఆనందతాండవం చేసింది.

దివ్యపాయసాన్ని తన భార్యలైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు పంచాడు. సంవత్సరకాలం గడిచింది. చైత్రశుద్ధనవమినాడు కౌసల్యకు శ్రీరాముడు జన్మించాడు. దశమినాడు కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు జన్మించారు. ఈ వార్త విన్న అయోధ్య ఆనందసంద్రమైంది.

రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు శుక్లపక్ష చంద్రునిలా పెరుగుతున్నారు. వేదశాస్త్రాలనభ్యసించారు. ధనుర్విద్యలో నైపుణ్యం సంపాదించారు. విజ్ఞానఖనులయ్యారు. సద్గుణాలకు ఆటపట్టైనారు. ఉత్తమ విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలివి. రాముడు ఎప్పుడూ తల్లిదండ్రుల సేవలో నిమగ్నమయ్యేవాడు. చిన్ననాటి నుంచీ అన్నసేవే మిన్నగా భావించేవాడు లక్ష్మణుడు. ఇతడు రాముడికి బహిఃప్రాణం. భరతశత్రుఘ్నులు అన్యోన్య ప్రేమాభిమానాలు కలవారు.

కాలచక్రం తిరుగుతున్నది. ఒకనాడు దశరథుడు తన మంత్రులు పురోహితులు మొదలైనవారితో సమావేశమయ్యాడు. తన కుమారుల వివాహ ప్రస్తావన చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడ అడుగుపెట్టాడు మహాతేజశ్శాలియైన విశ్వామిత్ర మహర్షి. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడతడు. దశరథుడు ఎదురేగి సాదరంగా స్వాగతించాడు. అతిథిదేవోభవ – అతిథి మనకు దేవుడితో సమానం. ఇది తెలిసిన దశరథుడు విశ్వామిత్రునకు సముచితరీతిన మర్యాదలు గావించాడు. వినయపూర్వకంగా చేతులు జోడించి విశ్వామిత్రుని రాకకు కారణాన్ని అడిగాడు. తనపైన కార్యభారం పెడితే నెరవేరుస్తానన్నాడు. దశరథుని వినయానికి మురిసిపోయాడు విశ్వామిత్రుడు. 'వశిష్ఠుని ఉపదేశాలను పొందినవాడివి. నీవు ఇలాగే ప్రవర్తిస్తావ'ని మెచ్చుకొన్నాడు.

విశ్వామిత్రుడు దశరథునితో తాను వచ్చిన పనిని తెలుపుతానన్నాడు. దానిని ఆచరించమన్నాడు. ఆడినమాట తప్పవద్దన్నాడు. అసలు విషయం చెప్పాడు. 'ఓ రాజా! నేనొక యజ్ఞాన్ని సంకల్పించాను. కాని మారీచ, సుబాహులనే రాక్షసులు ఆ యజ్ఞానికి విఘ్నాలు కలిగిస్తున్నారు. వారిని కోపించడానికి, శపించడానికి శక్తి ఉన్నా యజ్ఞదీక్షలో ఉన్నాను కాబట్టి అది నాకు తగనిపని ఉచితానుచితాలు గ్రహించకుండా శక్తిని దుర్వినియోగపరచగూడదు. అందుకు సత్యపరాక్రముడు, శూరుడు అయిన శ్రీరాముణ్ణి పదిదినాలపాటు నా వెంట పంపు. అతడే ఆ రాక్షసులను చంపగల సమర్థుడు. నా వెంట వచ్చి యాగసంరక్షణ చేయడంవల్ల శ్రీరాముడికి అనేక శ్రేయస్సులు కలుగుతాయి. శ్రీరాముడి పరాక్రమమెలాంటిదో నాకు బాగా తెలుసు. నాకే కాదు వశిష్ఠులవారికి, వామదేవాది మహర్షులకూ తెలుసు. వారంతా అంగీకరించిన తర్వాతే రాముణ్ణి నాతో పంపమ'ని అన్నాడు.

ఈ మాటలు వింటూంటే దశరథుని గుండెలో రాయిపడ్డది. చేతులు జోడించి 'మహర్షీ! నా రాముడు పదహారేండ్లు కూడా నిండనివాడు. ధనుర్విద్య ఇంకా పూర్తికాలేదు. యుద్ధవిషయాలతో తగిన పరిచయం లేనివాడు. కనుక దయచేసి నా రాముణ్ణి కోరకండి. అంతగా కావాలంటే ధనుర్బాణపాణినై నేను మీ వెంటవస్తాను. మీ యాగాన్ని సంరక్షించే బాధ్యత నాది. ఇవన్నీ ఎట్లా ఉన్నా రాముణ్ణి వదలి నేను ఒక్క క్షణమైనా బతకలేను. మా నోముల పంట రాముడు. ఇంతకూ ఆ రాక్షసులు ఎవరి అండతో ఈ దుండగానికి ఒడిగట్టార'ని అడిగాడు.

విశ్వామిత్రుడు సమాధానమిస్తూ 'పౌలస్త్యవంశజుడైన విశ్రవసుడనే ముని కుమారుడు రావణాసురుడు. అతడు కుబేరుని సోదరుడు. అనేక రాక్షస బలాలు కలవాడు. బ్రహ్మ ఇచ్చిన అసాధారణ వరాలవల్ల అతని గర్వం ఇబ్బడిముబ్బడైంది. ముల్లోకాలనూ అల్లకల్లోలం చేస్తున్నాడు. అటువంటివాడికి యజ్ఞం భగ్నంచేయడమనేది అల్పంగా తోస్తున్నది. అందుకే ఇటువంటి పనులలో

పాల్గొనడు. మారీచ, సుబాహులు ఇతనిచేత ప్రేరితులై యజ్ఞాలకు విఘ్నాలను కలిగిస్తున్నార'నగానే దశరథుడు మరింత భయపడ్డాడు. 'యుద్ధంలో యమునితో సమానులైన వారి నెదుర్కోవడానికి నా చిన్నిపాపణ్ణి పంపను. నేను కూడా యుద్ధ విషయంలో అశక్తుడ'నని పలికాడు.

దశరథుని మాటలకు విశ్వామిత్రుడు అగ్గిమీద గుగ్గిలమైనాడు. 'ఇచ్చినమాట తప్పటం మీ ఇంటా వంటా లేదు. నీవందుకు సిద్ధపడితే రిక్తహస్తాలతో తిరిగి వెళతాను. మీరు సుఖంగా ఉండండి' అన్నాడు విశ్వామిత్రుడు. పరిస్థితి తీవ్రతను గమనించాడు వశిష్ఠమహర్షి. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని దశరథునికి హితవు పలికాడు. మాట నిలబెట్టుకోని వానికి ధర్మకార్యాలనాచరించిన ఫలం నశిస్తుందని హెచ్చరించాడు. వివిధాస్త్ర ప్రయోగదక్షుడైన విశ్వామిత్రుడి వెంట రాముణ్ణి పంపడంలో సంశయానికి తావుండగూడదన్నాడు. రాముణ్ణి పంపితే మేలు జరుగుతుందని సుతిమెత్తగా సూచించాడు.

వశిష్ఠుని హితవచనాలకు దశరథుడు తలొగ్గాడు. రామలక్ష్మణులను పిలిపించాడు. కౌసల్యతో కలిసి ఆశీర్వదించాడు. ప్రశాంతమైన మనస్సుతో విశ్వామిత్రుడికి అప్పగించాడు.



విశ్వామిత్రుని వెంట ధనుర్ధారి అయి రాముడు నడుస్తున్నాడు. లక్ష్మణుడు అనుసరిస్తున్నాడు. సరయూనదీ తీరం వెంబడి చాలా దూరం ప్రయాణించారు ముగ్గురూ. తరవాత రామలక్ష్మణులకు 'బల' 'అతిబల' విద్యలనుపదేశించాడు విశ్వామిత్ర మహర్షి. వీటి ప్రభావంవల్ల అలసట, ఆకలిదప్పులుండవు. రూపకాంతులు తగ్గవు. నిద్రలో ఉన్నా, ఏమరుపాటుతో ఉన్నా రాక్షసులేమీ చేయలేరు. ముల్లోకాల్లో ఎదురొడ్డి నిలచేవారుండరు.

రాముడు గురుసేవలో నిమగ్నుడయ్యాడు. విశ్వామిత్రుని పాదాలొత్తాడు. సేవలు చేశాడు. గురుసేవ విశేష ఫలితాన్నిస్తుంది. సరయూనదీ తీరంలోనే వాళ్ళు ఆ రాత్రి నిద్రించారు.

తెల్లవారుతోంది. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు మేల్కొలుపు పలికాడు.

**కౌసల్యా సుప్రజారామ పూర్వాసంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.**

'కౌసల్యాదేవి సత్సంతానమైన ఓ రామా! తూర్పున ఉషఃకాంతులు ప్రసరిస్తున్నాయి. నిద్రలేచి నిత్యకర్మలను ఆచరించ'మన్నాడు. గురువాక్యం శిరసావహించాడు రాముడు, లక్ష్మణునితో కలసి. మళ్ళీ ప్రయాణం కొనసాగింది. సరయూ గంగానదుల సంగమ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడి విశేషాలను గురుముఖతః తెలుసుకున్నారు. జ్ఞానాన్ని పొందడంలో నిరంతరం అప్రమత్తులై ఉండడం ఉత్తమ విద్యార్థుల లక్షణం.

ప్రయాణం సాగుతున్నది. 'మలద', 'కరూశ' అనే జనపదాలకు చేరుకున్నారు. ఇంద్రుని అనుగ్రహ విశేషంచేత ఈ ప్రాంతాలు ధనధాన్యాలసమృద్ధిని కలిగి ఉండేవి. కాని 'తాటక' అనే యక్షిణి ఈ ప్రాంతాలకు వచ్చి విధ్వంసాన్ని సృష్టించింది. పుట్టుకతోనే వేయి ఏనుగుల బలం కలిగిన ఈమెను ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. 'అగ్నికి ఆజ్యంతోడైనట్లు' ఈమెతోబాటు ఈమె కుమారుడు 'మారీచుడు' విరుచుకపడుతూ ఈ జనపదాలను అతలాకుతలం చేస్తున్నాడు. దుష్టురాలైన తాటకను వధించమని రాముడితో

అన్నాడు విశ్వామిత్రుడు. ఒక్కక్షణం రాముడు మౌనముద్ర దాల్చాడు. రాముడి భావం గ్రహించాడు విశ్వామిత్రుడు. 'స్త్రీని ఎలా చంపాలనే సంశయం వద్దు. అధర్మపరాయణ అయిన తాటకను చంపితే దోషం రాద'ని కర్తవ్యముపదేశించాడు. వెంటనే రాముడు దృఢనిశ్చయుడై అంజలి ఘటించాడు. 'మీరు చెప్పినట్లుగా నడచుకొమ్మని మా నాన్నగారు నన్ను ఆదేశించారు. వారి ఆజ్ఞ నాకు శిరోధార్యమ'ని పితృవాక్య పరిపాలనాసక్తిని చాటాడు. అలాగే గురువు ఆజ్ఞను పాలించడం శిష్యునిగా తన కర్తవ్యమని భావించి తాటకవధకు ఉద్యుక్తుడైనాడు.

వికృతాకారంతో విరుచుకుపడుతున్న తాటక చేతులను తన నిశిత బాణాలతో ఖండించాడు రాముడు. అయినా ఆవేశంతో మీదికి వస్తున్న తాటక ముక్కు చెవులను కోసివేశాడు లక్ష్మణుడు. తాటక ఆవేశం రెండింతలైంది. తాను కనబడకుండా వాళ్ళపై రాళ్ళ వానకురిపిస్తున్నది. ఇదంతా గమనిస్తున్నాడు విశ్వామిత్రుడు. సంధ్యాకాలం సమీపిస్తున్నది. ఈలోపే తాటకను పరలోకానికి పంపమని పురమాయించాడు. అసురసంధ్యాకాలంలో రాక్షసులు మహాబలాన్ని పొందుతారు. ఎదుర్కోవడం కష్టం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాముడు శబ్దవేధి విద్యను ప్రదర్శిస్తూ బాణప్రయోగం చేశాడు. క్షణకాలంలో తాటక నేలపైబడి ప్రాణాలను వదిలింది. తాటక వధతో దుష్ట సంహారానికి పూనుకొన్నాడు రాముడు. ఇంద్రాది దేవతలు రాముణ్ణి స్తుతించారు. సంతుష్టుడైన విశ్వామిత్ర మహర్షి రామునకు ఎన్నో దివ్యాస్త్రాలను అనుగ్రహించాడు. గురువు అనుగ్రహిస్తే ఇవ్వలేనిదేమిటి? శిష్యుడు పొందలేనిదేమిటి?

రామలక్ష్మణ సహితుడయి విశ్వామిత్రుడు 'సిద్ధాశ్రమం' చేరుకున్నాడు. అదే అతని యజ్ఞభూమి. రామలక్ష్మణులు వినయంగా చేతులు జోడించి గురువుగారిని యజ్ఞదీక్షను స్వీకరించమని ప్రార్థించారు. మన్నించాడు మహర్షి. యజ్ఞదీక్షితుడయ్యాడు. మరునాడే యజ్ఞం ప్రారంభమైంది. ఆరు రోజులపాటు సాగే ఈ యజ్ఞ విషయంలో అత్యంత జాగరూకులై ఉండమని రామలక్ష్మణులకు సూచించారు మునులు. ఐదురోజులైంది. కంటిమీద కునుకులేకుండా యజ్ఞాన్ని కాపాడుతున్నారు రామలక్ష్మణులు. కర్తవ్యాన్ని నెరవేర్చడంలో ఇంత నిష్ఠ ఉండాలి. చివరిరోజు ఉన్నట్టుండి ఒక్కసారిగా యజ్ఞకుండంనుండి జ్వాలలు ఎగసిపడ్డాయి. ఇది రాక్షసుల రాకకు సూచన.

మారీచ, సుబాహులు అనుచరులతో వచ్చారు. యజ్ఞవేదిక పరిసరాలు రక్తవర్షంతో తడిసి ముద్దయ్యాయి. రాముడు 'శీతేషువు' అన్న మానవాస్త్రాన్ని మారీచుడిపైకి ప్రయోగించాడు. దాని దెబ్బకు మారీచుడు నూరు యోజనాల దూరం ఎగిరి సముద్రంలో పడిపోయాడు. స్పృహకోల్పోయి గిరగిరా తిరుగుతూ కొట్టుకుపోతున్నాడు. మరు నిముషంలో 'ఆగ్నేయాస్త్రం'తో సుబాహుని వక్షస్థలాన్ని వ్రక్కలు చేశాడు. 'వాయవ్యాస్త్రం'తో మిగతా రాక్షసుల భరతంపట్టాడు. రాక్షసబాధ తొలగింది. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. విశ్వామిత్రుడు సంతోషించాడు. సమర్థులైన శిష్యులను చూసి ఏ గురువు సంతోషించడు?

మరునాడు ఉదయాన్నే రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఎదుట వినయంతో నిలిచారు. ఇంకా ఏమి చేయాలో ఆజ్ఞాపించమన్నారు. విశ్వామిత్రుడు 'ఓ రామా! మిథిలానగర ప్రభువు, పరమధార్మికుడైన జనక మహారాజు ఒక యజ్ఞాన్ని చేయ సంకల్పించాడు. మనం అక్కడకి వెళదాం. అక్కడ అద్భుతమైన ఒక మహాధనుస్సుంది. నీవు చూడవచ్చునన్నాడు. సంసిద్ధులయ్యారు రామలక్ష్మణులు. మునిననుసరిస్తూ మిథిలవైపుగా ముందుకు సాగుతున్నారు.

అడుగులతోపాటు మాటలూ సాగుతున్నాయి. రాముని కోరిక మేరకు తమ వంశ పుట్టు పూర్వోత్తరాలను వివరించాడు విశ్వామిత్రుడు. ఆ రాత్రి శోణానదీ తీరంలో విశ్రమించారు. మరునాడు పవిత్ర గంగానదిని దర్శించారు. స్నానాలాచరించి విధ్యుక్త ధర్మాలను నెరవేర్చారు. గంగావృత్తాంతాన్ని వినగోరుతున్నానని వినయంగా అడిగాడు రాముడు. వినిపించాడు విశ్వామిత్రుడు. జిజ్ఞాసువులైన శిష్యులు, విజ్ఞాని అయిన గురువు - ఇక జ్ఞాన ప్రసారానికి అడ్డుంటుందా?

పాతాళంలో బూడిదకుప్పలై పడివున్న తన పితరులైన సగర పుత్రులకు ఉత్తమగతులు కల్పించడానికి సంకల్పించాడు భగీరథుడు. అందుకు ఒకటే మార్గం ఉంది. సురగంగను వారి బూడిదకుప్పలపై ప్రవహింపజేయడం. కాని ఆకాశంలోని గంగను పాతాళానికి దింపడం ఒక పట్టాన జరిగే పనేనా? అయినా దృఢసంకల్పానికి అసాధ్యమైనది లేదు. భగీరథుడు తీవ్రమైన

తపస్సుచేశాడు. బ్రహ్మను, శివుణ్ణి మెప్పించాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంకల్పం నుంచి పక్కకు తప్పుకోలేదు. గంగను పాతాళందాకా తీసుకువెళ్ళడంలో సఫల మనోరథుడయ్యాడు. అందుకే పట్టుదల విషయంలో 'భగీరథ ప్రయత్నం' అన్న జాతీయం ఏర్పడింది. భగీరథుని వంశంలోని వాడే రాముడు.

గంగావతరణాన్ని గురించి విశ్వామిత్రుడు రాముడికి చెప్పడంలో ఒక ఆంతర్యముంది. తన పూర్వీకులు ఎంతగొప్పవారో తెలుసుకుని దానికనుగుణంగా నడవడం. పితరులపట్ల ఎంత భక్తి ప్రపత్తులుండాలో తెలపడం. పట్టిన పని ఫలవంతమయ్యేవరకు పట్టుదల ఎలా వుండాలో చెప్పడం. అయితే ఇవన్నీ నేరుగా చెప్పలేదు విశ్వామిత్రుడు. అయినా ఆంతర్యాన్ని గ్రహించాడు రాముడు. ఇదే ఉత్తమ గురుశిష్యుల వ్యవహారం.

మిథిలానగర సమీపానికి చేరుకున్నారు విశ్వామిత్ర రామలక్ష్మణులు. అక్కడ ఒక ఆశ్రమాన్ని చూశాడు రాముడు. అది పాతదైనా అందంగా అగుపిస్తున్నది. కాని జనసంచారమే లేదు. 'ఏమిటీ చిత్ర'మని అడిగాడు రాముడు. అది గౌతమ మహర్షి ఆశ్రమమని, ఆ కథనంతా వివరించాడు విశ్వామిత్రుడు. 'మహాతపస్సంపన్నుడైన గౌతమ మహర్షి తన భార్య అయిన అహల్యతో ఈ ఆశ్రమంలో ఉండేవాడు. ఒకానొక సందర్భంలో అహల్య అపరాధం చేసిందని భావించి ఆగ్రహోదగ్రుడయ్యాడు గౌతముడు. వేల సంవత్సరాలు అన్నపానాదులు లేక వాయువునే ఆహారంగా తీసుకుంటూ ఈ ఆశ్రమంలోనే బూడిదలో పడి ఉండమని ఆమెను శపించాడు. ఎవ్వరికీ కనబడకుండా ఉంటావన్నాడు. రాముని రాకతో శాపవిముక్తి కలిగి నిజరూపాన్ని పొందుతా'వన్నాడు. 'రామా! గౌతమాశ్రమంలో కాలుమోపి అహల్యకు శాపవిముక్తి కలిగించు' అని విశ్వామిత్రుడు ఆజ్ఞాపించాడు.

చుట్టూ బూడిద ఆవరించి ఉండి కఠోరదీక్షలో ఉన్న అహల్య పొగకమ్ముకొన్న అగ్ని తేజస్సులా ఉంది. ఆ మహాత్మురాలిని రాముడు చూశాడు. రాముడి దర్శనంతో ఆమెకు శాపవిముక్తి కలిగింది. అహల్యా గౌతములు రాముణ్ణి యథావిధిగా గౌరవించారు. వారి సత్కారాలందుకొని రాముడు విశ్వామిత్రుని వెంట లక్ష్మణ సహితుడై మిథిలా నగరానికి బయలుదేరాడు.

మిథిలానగరంలో ప్రభువైన జనకమహారాజు వీరిని సముచితంగా సమాదరించాడు. మిథిలలో అహల్యా గౌతముల పెద్ద కుమారుడైన శతానందుడు రామదర్శనం చేసుకున్నాడు. తన తల్లినుద్ధరించినందులకు కృతజ్ఞతాంజలులు సమర్పించాడు. మహాతపశ్శాలియైన విశ్వామిత్రుని అనుగ్రహం పొందగలగడం చాలా విశేషమని రాముణ్ణి మెచ్చుకున్నాడు. విశ్వామిత్ర మహర్షి అసాధారణ శక్తిసామర్థ్యాలను వివరించాడు శతానందుడు.

మరునాడు ప్రాతఃకాలంలో జనకుడు విశ్వామిత్ర రామలక్ష్మణులను ఆహ్వానించాడు. కర్తవ్యోపదేశం చేయవలసిందిగా విశ్వామిత్రుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు ప్రత్యుత్తరమిస్తూ విశ్వామిత్రుడు 'వీరు దశరథమహారాజు కుమారులు. జగత్ప్రసిద్ధులైన వీరులు. మీ దగ్గర ఉన్న ధనుస్సును చూడాలనుకుంటున్నారు. దాన్ని చూపించండి. శుభం జరుగుతుంది. వాళ్ళ ముచ్చటా తీరుతుం'దన్నాడు. అప్పుడు జనకుడు తనదగ్గరున్న 'శివధనుస్సు' చరిత్రను వివరించాడు. యాగం కోసం భూమిని దున్నుతుండగా ఒక పాప దొరికిందని, నాగటిచాలున దొరికినందువల్ల ఈమెకు 'సీత' అనే పేరు వచ్చిందనీ చెపుతూ ఆమెను గొప్ప పరాక్రమవంతుడికివ్వాలన్న తన అభిమతాన్ని వెలిబుచ్చాడు. శివధనుస్సును ఎక్కుపెట్టగలవాడే సీతకు తగిన భర్త అన్నాడు. గతంలో ఎందరో రాజులు వచ్చి శివధనుస్సు ఎక్కుపెట్టడానికి విఫలప్రయత్నం చేశారని, ఎక్కుపెట్టడం మాట ఎలా ఉన్నా కనీసం కదలించలేకపోయారన్నాడు.



ఇదంతా విని శివధనుస్సును తెప్పించమన్నాడు విశ్వామిత్రుడు. సరేనన్నాడు జనకుడు. బలిష్ఠులు, దీర్ఘకాయులైన ఐదువేల మంది అతికష్టం మీద శివధనుస్సుతో కూడిన పేటికను తీసుకువచ్చారు.

విశ్వామిత్ర మహర్షి అనుమతితో ధనుస్సు మధ్యభాగాన్ని అవలీలగా పట్టుకున్నాడు రాముడు. ధనుర్విద్యయందు ఆరితేరిన రాముని చేయి సోకినంతనే ఆ ధనుస్సు వంగింది. వింటినారిని సంధించాడు. వేలకొలది సదస్యులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. అల్లెతాడును ఆకర్ణాంతంగా లాగాడు రాముడు. పిడుగుపాటులా భయంకరశబ్దాన్ని చేస్తూ విల్లు ఫెళ్ళున విరిగింది. విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులు తప్ప మిగతావారంతా మూర్ఛపోయారు.

ఇచ్చినమాట ప్రకారం జనకుడు సీతారాముల వివాహం జరపడానికి సంసిద్ధుడయ్యాడు. దశరథమహారాజుకు వర్తమానం పంపాడు. అయోధ్యనుంచి అందరూ తరలివచ్చారు. జనకుడు తన కుమార్తెలైన సీతను, ఊర్మిళలను రామలక్ష్మణులకు, తన తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలైన మాండవిని, శ్రుతకీర్తులను భరతశత్రుఘ్నులకు ఇచ్చి వివాహం జరిపించాడు. అంగరంగవైభవంగా జరిగాయి కల్యాణాలు.



మరునాడు విశ్వామిత్ర మహర్షి కొత్త దంపతులను ఆశీర్వదించి, దశరథ జనకమహారాజులను వీడ్కొని హిమాలయపర్వతానికి వెళ్ళాడు. తరవాత బంధుమిత్ర సమేతంగా దశరథుడు అయోధ్యకు బయలుదేరాడు.

దారిలో వీళ్ళకు పరశురాముడు ఎదురుగా వచ్చాడు. అతడు ప్రళయకాల రుద్రుడిలా ఉన్నాడు. గండ్రగొడ్డలిని, ధనుర్బాణాలను ధరించాడు. ప్రజ్వరిల్లే అగ్నిలా భయంకరంగా ఉన్నాడు. క్షత్రియులంటే ఇతనికి సరిపడదు. పూర్వం క్షత్రియుడైన కార్తవీర్యార్జునుడు ఇతని తండ్రి అయిన జమదగ్నిని చంపాడు. అప్పటి నుండి క్షత్రియ నిర్మూలనానికి కంకణం కట్టుకున్నాడు. ఇరవై ఒక్కసార్లు భూప్రదక్షిణం చేసి ఎంతోమంది క్షత్రియులను తన గండ్రగొడ్డలికి బలిచేశాడు.

పరశురాముడు శ్రీరామునితో తనదగ్గరున్న వైష్ణవ ధనుస్సునెక్కుపెట్టమని సవాలు విసిరాడు. సరేనని రాఘవుడు అవలీలగా ఎక్కుపెట్టాడు. ఓటమినంగీకరించిన పరశురాముడు తక్షణమే మహేంద్రపర్వతానికి వెళ్ళిపోయాడు

దశరథుడు సపరివారంగా అయోధ్యకు చేరుకున్నాడు. భరతుడు శత్రుఘ్నునితో మేనమామ వెంట తాతగారింటికి వెళ్ళాడు. రామలక్ష్మణులు తల్లిదండ్రుల సేవలో, గురువుల సేవలో తరిస్తూ అయోధ్యలోనే ఉండిపోయారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ



# అయోధ్యా కాండం



దశరథునికి పుత్రులమీద ఎంతో ప్రేమ. తన శరీరం నుండి పుట్టిన నాలుగు చేతులలాగ భావించాడు. ఈ నలుగురు కుమారులలో భరత, శత్రుఘ్నులు దేశాంతరంలో ఉండడంవల్ల బెంగపెట్టుకున్నాడు. వాళ్ళను మళ్ళీమళ్ళీ తలచుకుంటున్నాడు. దశరథునికి శ్రీరామునిమీద మక్కువ ఎక్కువ. దానికి కారణం శ్రీరాముడు సద్గుణరాశి కావడమే. రూపంలోనూ గుణంలోనూ శ్రేష్ఠుడు. మహావీరుడు. మృదువుగా మాట్లాడతాడు. శరణన్నవారిని కాపాడతాడు. కోపం, గర్వం లేనివాడు. సత్యం పలికేవాడు. పరుల సంపదను ఆశించనివాడు. దీనులను ఆదుకొనేవాడు. కాలాన్ని వృథాచేయకుండా జ్ఞానులతో, సజ్జనులతో వివిధ విషయాలను చర్చించేవాడు. వినయశీలి. తల్లిదండ్రులపట్లా, గురువులపట్లా నిశ్చలభక్తి కలవాడు. సోమరితనం, ఏమరుపాటు లేనివాడు, కళలలో ఆరితేరినవాడు, అసూయ, మాత్సర్యం లేనివాడు. ప్రజలపట్ల వాత్సల్యం కలవాడు... ఇన్ని మంచిగుణాలకు పాదైన శ్రీరాముడంటే తల్లిదండ్రులకే కాదు, ప్రజలందరికీ పరమ ప్రీతి.

సకల గుణాభిరాముడైన శ్రీరాముడు తమకు ప్రభువు కావాలని ప్రజల కోరిక – దీనికి తోడు 'నేను జీవించి ఉన్నప్పుడే శ్రీరాముడు రాజైతే ఎంత బాగుంటుంది? నేనెంతగా సంతోషిస్తానో?' అని ఉవ్విళ్ళూరుతున్నాడు దశరథుడు. మంత్రులతో ఆలోచించి శ్రీరాముణ్ణి యువరాజును చేయడానికి నిశ్చయించుకున్నాడు. రాజ్యంలోని ప్రముఖులను, జానపదులను, సామంతరాజులను, ప్రజలను పిలిపించాడు. శ్రీరాముడి యువరాజ పట్టాభిషేక విషయాన్ని వెల్లడించాడు. ఇది అందరకు నచ్చినట్లైతేనే అనుమతినివ్వమన్నాడు. దీనికన్నా ప్రజలకు మేలుకలిగించేది ఏదైనా ఉన్నా ఆలోచించి చెప్పమన్నాడు. ప్రజానురంజకపాలన అంటే ఇదే. సభలోనివారంతా శ్రీరామ పట్టాభిషేకాన్నే సమర్థిస్తూ హర్షధ్వానాలు చేశారు.

రాజాజ్ఞమేరకు వశిష్ఠుడు మంత్రులను, అధికారులను యౌవరాజ్యపట్టాభిషేకమహోత్సవానికి ఏర్పాట్లను చేయవలసిందని ఆదేశించాడు. దశరథుడు శ్రీరాముణ్ణి పిలిపించాడు. శ్రీరాముడు వచ్చి తండ్రికి పాదాభివందనం చేశాడు. దశరథుడు శ్రీరాముణ్ణి అక్కున జేర్చుకున్నాడు. బంగారు సింహాసనంమీద కూర్చోబెట్టాడు. చిరునవ్వులు చిందిస్తూ 'రామా! నీ సుగుణాలతో ప్రజలను మెప్పించావు. కనుక నీవు యువరాజ పట్టాభిషేకం చేసుకోవాలి. నీ బాధ్యత పెరుగుతున్నది. మరింత వినయవంతుడివి కావాలి. జితేంద్రియుడివి కావాలి...' అంటూ రాజధర్మాలను నూరిపోశాడు. తండ్రివద్ద సెలవుతీసుకొని తల్లి అయిన కౌసల్య దగ్గరికి వచ్చాడు శ్రీరాముడు. ఆమె ఆశీస్సులందుకున్నాడు. వశిష్ఠుని ఆదేశం మేరకు పట్టాభిషేకానికి అనువుగా సీతారాములు ఉపవాస దీక్షను గైకొన్నారు.

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంకోసం అయోధ్య తననుతాను అలంకరించుకుంది. నగరమంతా ఆనందశోభ తాండవిస్తున్నది. ఇది చూసిన మంథర కళ్ళలో నిప్పులు పోసుకున్నది. కైకేయి అత్తవారింటికి వచ్చినప్పుడు వెంటవచ్చిన అరణపుదాసి మంథర. పరుగు పరుగున కైకేయి దగ్గరకి వెళ్ళి పట్టాభిషేక విషయం చెప్పింది. కైకేయి చాలా ఆనందించి, వార్త చెప్పినందుకు మంథరకు విలువైన బహుమానాన్నందించింది. నిశ్చేష్టురాలైంది మంథర. దుఃఖించవలసిన సమయంలో ఎందుకు సంతోషిస్తున్నావని

నిలదీసింది కైకేయిని. 'నాకు రాముడు, భరతుడు ఇద్దరూ సమానమే. రాముడు పట్టాభిషిక్తుడు అవుతున్నాడంటే అంతకన్నా నాకు ఆనందమేముంటుం'దన్నది కైకేయి.

కైకేయి మాటలు విని ముక్కున వేలేసుకుంది మంథర. 'రాముడు రాజైతే కౌసల్య రాజమాత అవుతుంది. అప్పుడు మాతోపాటు నీవు కూడా ఆమెకు దాసివవుతావు. రామునికి నీ కొడుకు దాస్యం చేయాల్సివస్తుంది. రాముడి సంతానానికే తరువాతి కాలంలో రాజ్యాధికారం వస్తుంది. కాని భరతుని సంతానానికి రావడం శూన్యం. కనుక భరతునికి రాజ్యాధికారం దక్కేటట్లు, రాముడు అడవుల పాలయ్యేటట్లు చూడ'మని దుర్బోధ చేసింది. కైకేయి మనసు మారింది. చెప్పుడు మాటలు చేటుకు కారణం. తగిన ఉపాయాన్ని చెప్పమని మంథరను కోరింది కైకేయి. గతంలో దశరథుడు ఇచ్చిన రెండు వరాలను ఇప్పుడుపయోగించుకొమ్మని సూచించింది మంథర. ఈ సూచన మేరకు దశరథుని వలన వరాలు పొందడానికి కోపగృహంలోకి ప్రవేశించింది కైకేయి.

దశరథుడు శ్రీరామ పట్టాభిషేక వార్తను తెలపడానికి కైకేయివద్దకు వచ్చాడు. కటికనేలపై ఉన్నది కైకేయి. తీవ్రమైన అలకతో ఉన్నది. దశరథుడు ఓదార్చడానికి పూనుకున్నాడు. కాని అతని ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఏం చేయాలో పాలుపోలేదు. విషయమడిగాడు. అదే అదనుగా భావించింది కైకేయి. 'నాకొక కోరిక ఉంది. దాన్ని మీరే తీర్చాలి. అలా తీరుస్తానని మాట ఇవ్వా'లన్నది. ప్రాణానికి ప్రాణమైన శ్రీరాముడి మీద ఒట్టు పెట్టి సరేనన్నాడు దశరథుడు. ఇంకేం మనసులోని మాటను చెప్పేసింది. గతంలో మీరిచ్చిన రెండు వరాలను ఇప్పుడు కోరుకుంటున్నాను. శ్రీరాముడి కోసం ఏర్పాటుచేసిన సన్నాహాలతో భరతుడికి పట్టాభిషేకం చేయాలి. శ్రీరాముడు నారచీరెలు, జింకచర్మం ధరించి, జటాధారి అయి దండకారణ్యానికి వెళ్ళి తాపసవృత్తిలో పదునాల్గు సంవత్సరాలు ఉండాలి. శ్రీరాముడు ఇప్పుడే, నేను చూస్తుండగానే బయలుదేరాలి' అని కోరింది.

కైకేయి మాటలకు స్పృహకోల్పోయాడు దశరథుడు. కొంతసేపటికి తేరుకున్నాడు. తన్నుకొని వస్తున్న దుఃఖంతో 'కైకా! రాముడు నీకేం అపకారం చేశాడు? భరతుడికన్నా ఎక్కువగా నిన్ను సేవించాడు. అటువంటివాణ్ణి అడవుల పాల్జేయమని అడగడానికి నీకు నోరెలా వచ్చింది? నా రాముణ్ణి విడిచి నేను ఒక్క క్షణమైనా బతకలేను. చేతులు జోడిస్తున్నా. నీ పాదాలు పట్టుకొంటా... రాముణ్ణి మాత్రం నాకు దూరం చేయవద్ద'ని బతిమాలాడు. కఠినశిల కన్నీటికి కరుగుతుందా? కైకేయి మారలేదు.

శ్రీరాముణ్ణి తోడ్కొని రావలసిందిగా కైకేయి సుమంత్రుణ్ణి ఆజ్ఞాపించింది. రాజాజ్ఞ కావాలన్నాడు సుమంత్రుడు. 'శ్రీరాముణ్ణి చూడాలని ఉంది వెంటనే తీసుకురమ్మ'న్నాడు దశరథుడు. రాజాజ్ఞను పాటించాడు సుమంత్రుడు. శ్రీరాముడు వచ్చి, దశరథుడికి, కైకేయికి పాదాభివందనాలు చేశాడు. దశరథునికి మాట రావడం లేదు కన్నీళ్ళు తప్ప. తండ్రి బాధకు కారణమేమిటో తెలియక సతమతమవుతున్నాడు దాశరథి. కైకేయిని అడిగాడు. 'గతంలో నాకిచ్చిన రెండు వరాలను అడిగాను. నిన్ను దృష్టిలో ఉంచుకొని వాటిని ఉల్లంఘించేందుకు చూస్తున్నారు. వాటిని నువ్వు పాటిస్తానని ప్రమాణంచేస్తే చెపుతాను' అన్నది కైకేయి.

రాముడు క్షణం కూడా ఆలోచించలేదు 'నా తండ్రే నాకు గురువు, పాలకుడు, హితుడు. ఆయన ఆదేశించాలే కాని విషాన్ని తాగడానికైనా, సముద్రంలో దూకడానికైనా సిద్ధమే. తండ్రి గారి కోరిక ఏమిటో చెపితే తప్పక పాటిస్తాను. రాముడు ఆడినమాట తప్ప'డని పలికాడు. శ్రీరాముని పితృభక్తి, సత్యానురక్తి అలాంటిది.

కైకేయి రెండు వరాలను గురించి చెప్పింది. రాముడి ముఖంలో ఎలాంటి మార్పులేదు. సంతోషాలకు పొంగకపోవడం, బాధలకు కుంగకపోవడం స్థితప్రజ్ఞుని లక్షణం. 'అమ్మా! నీవు చెప్పినట్లే చేస్తా. భరతుడంటే నాకు ప్రాణం. అతని పట్టాభిషేకాన్ని గూర్చి నాన్నగారు నాకు చెపితే కాదంటానా? ఆయన మాటలను పాటించకుండా ఉండగలనా? నాకు రాజ్యకాంక్ష లేదు. తండ్రికి సేవచేయడం, ఆయన ఆజ్ఞలను పాటించడంకన్నా మించిన ధర్మాచరణం మానవులకు ఇంకొకటి లేనేలేదు. నాన్నగారు నన్ను స్వయంగా ఆదేశించకున్నా మీరు చెప్పారు కదా! అది చాలు. నేనిప్పుడే దండకారణ్యానికి బయలుదేరుతా'నన్నాడు శ్రీరాముడు.

శ్రీరాముని మాటలు విన్న దశరథుడు శోకభారంతో స్పృహకోల్పోయాడు. శ్రీరాముడు తండ్రి పాదాలకు ప్రణమిల్లాడు. కైకేయి పాదాలకు నమస్కరించాడు. అంతఃపురం నుండి బయటకు వచ్చాడు. లక్ష్మణునితో కలసి కౌసల్యామాతను దర్శించుకున్నాడు. తన అరణ్యవాస విషయం చెప్పాడు. ఆ మాటలు వింటూనే కౌసల్య గండ్రగొడ్డలిచేత నరికిన మద్దిచెట్టులా నేల మీద పడిపోయింది. అంతులేని ఆవేదనకు లోనైంది. వనవాసానికి వెళ్ళవద్దని కౌసల్యా లక్ష్మణులు పరిపరివిధాల శ్రీరాముడికి నచ్చజెప్పజూశారు. కాని శ్రీరాముడు తండ్రి మాటకే తలొగ్గాడు. వెళ్ళక తప్పదన్నాడు. కైకేయిపట్ల తనకు ఏమాత్రం అనాదరభావం లేదన్నాడు. తన పట్టాభిషేకం ఆగిపోవడానికి కైకేయి కారణం కాదని, విధి ప్రేరణచే ఆమె అట్లా మాట్లాడిందని సమర్థించాడు. తనకు రాజ్యమైనా వనవాసమైనా సమానమేనని ప్రకటించాడు.

పుత్ర వ్యామోహంతో కౌసల్య శ్రీరాముని వెంట వనవాసానికి సిద్ధపడింది. కాని భర్తను వదలిరావడం ధర్మంకాదన్నాడు శ్రీరాముడు. ఎలాగో మనసును స్తిమితపరచుకొని కౌసల్య శ్రీరాముణ్ణి దీవించింది. 'రామా! సత్పురుషుల బాటలో నడువు. నీ ధర్మమే నీకురక్ష. నువ్వు చేసిన తల్లిదండ్రుల సేవ, నీ సత్య బలం నీకు రక్షగా ఉంటాయి. నీకు ఎలాంటి బాధలు కలుగకుండుగాక' అని శుభాశీస్సులందించింది.

అక్కడి నుండి సీతామందిరానికి వెళ్ళాడు శ్రీరాముడు. తన వనవాస విషయం చెప్పాడు. అయోధ్యలో ఎలా మసలుకోవాలో సీతకు తెలిపాడు. కాని సీత రామునివెంటే వనవాసానికి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. ఆ మాటే శ్రీరామునితో చెప్పింది. 'మీరు లేకుండా స్వర్గసుఖాలు లభించినా ఇష్టపడను. పతిని అనుసరించడమే సతికి ధర్మం, సుఖప్రదం, శుభప్రద'మని తెలిపింది. శ్రీరాముడు అంగీకరించక తప్పలేదు. తనను కూడా వెంట తీసుకెళ్ళమని లక్ష్మణుడు శ్రీరాముణ్ణి ప్రాధేయపడ్డాడు. శ్రీరాముడి సేవాభాగ్యం ముందు త్రిలోకాధిపత్యం కూడా చిన్నదేనని, సకలోపచారాలు చేసే అవకాశం తనకిమ్మని అభ్యర్థించాడు. సరేనన్నాడు శ్రీరాముడు. తల్లి అయిన సుమిత్రకు, ఆత్మీయులకు ఈ విషయం తెలిపి వారి ఆమోదాన్ని పొందమన్నాడు.

సీతారామలక్ష్మణులు దశరథుని దర్శించడానికి బయలుదేరారు. కాలినడకన వస్తున్న శ్రీరాముణ్ణి చూసి ప్రజలు బావురుమన్నారు. లక్ష్మణునిలాగ తామందరూ రాముని వెంట వెళ్లాలనుకొన్నారు. రాముడు ఉంటే చాలు అది అడవియైనా తమ పాలిటి అయోధ్యేననుకున్నారు. సీతారామలక్ష్మణులు దశరథుని మందిరానికి చేరుకున్నారు. దశరథుడు రాణులందరినీ రప్పించాడు. అందరూ విలపిస్తున్నారు కైకేయి తప్ప. దశరథుని మందిరం కన్నీటిశాల అయింది.



కైకేయి స్వయంగా తెచ్చి ఇచ్చిన నార చీరలను సీతారామలక్ష్మణులు ధరించారు. తల్లిదండ్రులకు నమస్కరించారు. సుమిత్ర లక్ష్మణునితో 'నాయనా, శ్రీరాముణ్ణి నీ తండ్రి అయిన దశరథులవారిలాగా, సీతను నన్నుగా భావించు. అడవిని అయోధ్య అనుకో. సుఖంగా వెళ్ళి ర'మ్మని దీవించింది. సుమంత్రుడు రథాన్ని సిద్ధంచేశాడు. సీతారామలక్ష్మణులు రథాన్ని ఎక్కారు. రథం వేగంగా ముందుకు

సాగుతున్నది. శ్రీరాముణ్ణి విడవలేక కొందరు పౌరులు ఆ రథానికి రెండువైపులా, వెనుక భాగంలో వేలాడారు. మంగళ వాద్యఘోషతో మార్మోగవలసిన అయోధ్య ఆర్తనాదాలతో నిండిపోయింది. దశరథుడు తీవ్రమైన బాధతో కౌసల్యామందిరానికి వచ్చాడు. కౌసల్యాదేవి శోకమూర్తిలా ఉంది. సుమిత్రాదేవి ఆమెను ఓదార్చింది.

శ్రీరాముని రథాన్ని నీడలా అనుసరిస్తున్నారు ప్రజలు. అయోధ్యకు మళ్ళిపొండని వాళ్ళకు శ్రీరాముడు ఎంతగానో చెపుతున్నాడు. 'మీరే అయోధ్యకు రండి లేదా మేము మీ వెంట రావడానికి అనుమతించండి' అని వేడుకుంటున్నారు ప్రజలు. రథం తమసానదీ తీరానికి చేరింది. ఆ రాత్రి అందరూ అక్కడే విడిది చేశారు. తెల్లవారుతున్నది. అలసటచేత పౌరులందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఇంకా వాళ్ళను శ్రమపెట్టడం శ్రీరామునకు ఇష్టంలేదు. అందుకని వాళ్ళు నిద్రలేచేలోపే అక్కడి నుండి వెళ్ళాలని లక్ష్మణునితో అన్నాడు. సుమంత్రుని సారథ్యంలో సీతారామలక్ష్మణులు అక్కడినుంచి బయలుదేరారు. నిద్రలేచిన పౌరులు శ్రీరాముడు కనబడకపోవడంతో తికమకపడ్డారు. తమ మొద్దునిద్రను తామే నిందించుకున్నారు. చేసేదిలేక అయోధ్యకు తిరుగుముఖం పట్టారు.

రథం వేదశ్రుతి, గోమతీ, సనందికా నదులను దాటింది. కోసల దేశపు పొలిమేరలకు చేరుకుంది. అక్కడి నుండి అయోధ్యవైపుగా తిరిగి శ్రీరాముడు నమస్కరించాడు. ముందుకు సాగుతూ గంగాతీరానికి చేరుకున్నారు. ఆ తీరంలో శృంగిబేరపురమున్నది. 'గుహుడు' ఆ ప్రదేశానికి రాజు. అతడు శ్రీరామభక్తుడు. శ్రీరాముడు వచ్చాడన్న వార్త విని తనవారితో శ్రీరాముని దగ్గరకు బయల్దేరాడు. గుహుణ్ణి చూసి రాముడు లక్ష్మణుడితోపాటు ఎదురువెళ్ళి కలుసుకున్నాడు. ఆ రాత్రి గుహుడి ఆతిథ్యం తీసుకున్నాడు.

మరునాడు శ్రీరాముని ఆదేశం మేరకు గుహుడు నావను సిద్ధం చేశాడు. 'శ్రీరాముడు మర్రిపాలను తెప్పించాడు. వాటితో తనకు లక్ష్మణునకు జడలను సిద్ధపరచాడు. రామలక్ష్మణులు జటాధారులయ్యారు. సీతారామలక్ష్మణులు పడవ ఎక్కారు. అవతలి తీరానికి తీసుకువెళ్ళాలని నావికులకు సూచించాడు గుహుడు. శ్రీరాముడు సుమంత్రునికి, గుహునికి వెళ్ళడానికి అనుమతినిచ్చాడు. నావను ముందుకు సాగించవలసిందిగా నావికులను ఆదేశించాడు.

నది మధ్యలో నావ సాగుతున్నది. సీత గంగను ప్రార్థించింది. నావ దక్షిణ తీరానికి చేరింది. నావదిగిన శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై వనాలకు బయలుదేరాడు. శ్రీరాముని ఆదేశం మేరకు ముందు లక్ష్మణుడు వెనక సీత, ఆమె వెనక శ్రీరాముడు నడుస్తున్నారు. సాయంకాలానికల్లా భరద్వాజాశ్రమానికి చేరారు. ఇది గంగా యమున సంగమ ప్రదేశంలో ఉంది. ముని వాళ్ళకు అతిథిసత్కారాలు చేశాడు. వనవాసకాలాన్ని ఆ ప్రాంతంలోనే గడపమని కోరాడు. కాని రాముడు సుతిమెత్తగా తిరస్కరించాడు.

జనులకు అందుబాటులో ఉండని, ఆశ్రమవాసానికి అనువైన ప్రదేశమేదైనా సూచించమని శ్రీరాముడు కోరాడు. పది కోసుల దూరంలో 'చిత్రకూటం' అనే పవిత్రమైన పర్వత ప్రదేశం ఉందని, మహర్షుల నివాసస్థానమైన అదే తగిన చోటని భరద్వాజుడన్నాడు. మహర్షి సూచననను సరించి యమునానదిని దాటి చిత్రకూటం చేరుకున్నారు సీతారామలక్ష్మణులు. అన్న ఆదేశం ప్రకారం అక్కడ నేరేడు కర్రలతో కుటీరాన్ని నిర్మించాడు లక్ష్మణుడు. సశాస్త్రీయంగా అందులోకి ప్రవేశించారు.

ఈ విషయాన్నంతా గూఢచారుల ద్వారా గుహుడు తెలుసుకున్నాడు. గుహుని ద్వారా సుమంత్రుడు గ్రహించాడు. సుమంత్రుడు గుహుడి దగ్గర సెలవు తీసుకొని అయోధ్యకు వెళ్ళాడు. దశరథుడు సుమంత్రుడి ద్వారా రాముడి విషయాలను తెలుసుకున్నాడు. కౌసల్యాదశరథుల ఆవేదనకు అంతులేదు. దశరథుడు గతంలో తాను మునిబాలకుణ్ణి పొరబాటుగా చంపిన సంఘటనను, అతని తల్లిదండ్రులిచ్చిన శాపాన్ని గుర్తుచేసుకున్నాడు. అదే పుత్రవియోగానికి కారణమన్నాడు. శ్రీరాముని ఎడబాటుకు మనసు కకావికలమైంది, దశరథునికి. దుఃఖాగ్నికి తట్టుకోలేక గుండె చల్లబడింది. అర్ధరాత్రి తరువాత దశరథుడు ప్రాణాలు విడిచాడు. అందరూ బావురుమన్నారు.

దశరథుని దేహాన్ని ఒక తైలద్రోణిలో భద్రపరచారు. వసిష్ఠుడి ఆజ్ఞమేరకు దూతలు భరత శత్రుఘ్నులను తీసుకురావడానికి వెళ్ళారు. ఏడురోజులు ప్రయాణం చేసి ఎనిమిదవనాడు అయోధ్యకు చేరుకున్నారు భరత శత్రుఘ్నులు. తండ్రి మరణానికి తల్లడిల్లాడు భరతుడు. తండ్రి అంత్యక్రియలను భరతుడు నిర్వర్తించాడు.

శ్రీరామ వనవాస విషయంలో తల్లిని తప్పుబట్టాడు భరతుడు. మంథరను చంపడానికి ఉద్యుక్తుడైన శత్రుఘ్నుడు భరతుని మాట విని విరమించుకున్నాడు. మంత్రులు భరతుణ్ణి రాజ్యాధికారం చేపట్టమన్నారు. కాని భరతుడు అంగీకరించలేదు. 'పెద్దవాడైన శ్రీరాముడే రాజు కావాలి. ఆయనకు బదులు నేను పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తాను. చతురంగ బలాలను సిద్ధపరచండి. నేను వెళ్ళి శ్రీరాముణ్ణి అయోధ్యకు తీసుకువస్తాను' అని తెలిపాడు.

భరతుడు అయోధ్యావాసులతో కూడి బయలుదేరాడు. శృంగిబేరపురం చేరాడు. గుహుడు భరతుని ఆంతర్యం తెలియక యుద్ధసన్నద్ధుడయాడు. తీరా విషయం తెలిశాక ఎదురువెళ్ళి భరతుణ్ణి ఆహ్వానించాడు. గుహుని సహకారంతో భరద్వాజాశ్రమం చేరుకున్నాడు భరతుడు. మహర్షి సత్కారాలనంది చిత్రకూటం వైపు ప్రయాణించారందరు.

అడవిలో మృగాల అలజడి మొదలైంది. కారణమేమిటో చూడమన్నాడు లక్ష్మణునితో శ్రీరాముడు. వెంటనే లక్ష్మణుడు ఒక పెద్ద మద్ది చెట్టెక్కాడు. విషయం అర్థమైంది. చెట్టు దిగి శ్రీరాముని వద్దకు వచ్చాడు. 'భరతుడు దుర్బుద్ధితో ససైన్యంగా వస్తున్నాడు. మన ధనుర్బాణాలను సిద్ధంచేసుకుందా'మన్నాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుని ఆలోచనలో పొరపాటు ఉందని చెప్పాడు. భరతుడలాంటివాడు కాదన్నాడు. 'లక్ష్మణా! ఒకవేళ నీకు రాజ్యకాంక్ష ఉంటే చెప్పు భరతునికి చెప్పి ఆ రాజ్యాన్ని నీకే ఇప్పిస్తా'నన్నాడు. ఇంతలో భరతుడు పర్ణశాలకు చేరుకున్నాడు. శ్రీరాముణ్ణి చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. శత్రుఘ్నుడు శ్రీరాముడి పాదాల మీద బడ్డాడు. శ్రీరాముని కళ్ళ నుంచి అశ్రుధారలు కురిశాయి. కొంతసేపటికి తేరుకున్నాడు. భరతుణ్ణి కుశల ప్రశ్నలు వేశాడు. ప్రసంగవశాత్తు రాజనీతి ధర్మాలను బోధించాడు. శ్రీరాముడు తండ్రి మరణవార్త విని విలపించాడు. శ్రీరాముణ్ణి అయోధ్యకు రమ్మని, రాజువుకమ్మని సవినయంగా ప్రార్థించాడు భరతుడు. కాని తండ్రిమాటే శిరోధార్యమని శ్రీరాముడు అంగీకరించలేదు. శ్రీరాముని నాస్తికవాదంతో ఒప్పింపజూచాడు జాబాలి. ఇతడు దశరథుని పురోహితుడు. కాని జాబాలి వాదాన్ని శ్రీరాముడు ఖండించాడు.



భరతుని అభ్యర్థన మేరకు శ్రీరాముడు పాదుకలను అనుగ్రహించాడు. అప్పుడు భరతుడు 'అన్నా! ఈ పాదుకలమీదనే రాజ్యపాలనాభారాన్ని ఉంచుతాను. ఈ పదునాలుగు సంవత్సరాలు నేనుకూడా జటలను ధరించి, నారచీరలు కట్టి, వనవాస నియమాలతో, నగరం వెలుపల ఉంటాను. పదునాల్గవ సంవత్సరం కాగానే నీ దర్శనం కాకుంటే అగ్ని ప్రవేశం చేస్తా'నన్నాడు. సరేనన్నాడు శ్రీరాముడు. ఆదర్శ సోదరభావమంటే ఇది. భరతుడు నందిగ్రామం చేరుకొని, పాదుకలకు పట్టాభిషేకం చేశాడు.

శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా అత్రిమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అత్రి అనసూయలు వీరికి సముచిత మర్యాదలు చేశారు. మహాపతివ్రత అయిన అనసూయాదేవి సీతకు దివ్యవస్త్రాభరణాలనిచ్చింది. మునీశ్వరుల ఆశీస్సులు తీసుకొని సీతా రామ లక్ష్మణులు దండకారణ్యంలోకి ప్రవేశించారు.



# అరణ్య కాండం



దండకారణ్యం పవిత్ర ప్రదేశం. ప్రశాంత ప్రదేశం. అక్కడ మునుల ఆశ్రమాలు ఎన్నో ఉన్నాయి. పక్షులు, మృగాలు – సకల ప్రాణులకు సురక్షితమైన ప్రాంతం అది. అక్కడ లోకక్షేమం కోసం యజ్ఞయాగాలు జరుగుతున్నాయి. ఆశ్రమ సముదాయాన్ని చూడగానే అల్లెతాడును ధనుస్సునుండి వేరుచేశాడు శ్రీరాముడు. అక్కడ వినయానికి తప్ప వీరత్వానికి అవకాశం లేదు. ఎక్కడ ఎట్లా ప్రవర్తించాలో తెలుసుకోవడమే ఉచితజ్ఞత. ఇది శ్రీరామునిలో సంపూర్ణంగా ఉంది.

సీతా రామ లక్ష్మణులకు మహర్షులు సాదర స్వాగతం పలికారు. ఆ సముదాయంలోని ఒక పర్ణశాలలో విడిది ఏర్పాటుచేశారు. మరునాడు ఉదయం నిత్యోచిత కర్మలను ముగించుకొని మహర్షులకు వీడ్కోలు పలికి సీతారామలక్ష్మణులు ప్రయాణాన్ని కొనసాగించారు.

వనం మధ్యకు చేరుకున్నారు. ఇంతలో వికృతాకారంలో ఉన్న విరాధుడనే రాక్షసుడు అమాంతంగా సీతారామలక్ష్మణుల పైకి విరుచుకుపడ్డాడు. రామలక్ష్మణులను తన భుజాలపై వేసుకొని తీసుకుపోసాగాడు. సీత గగ్గోలు పెడుతున్నది. రామలక్ష్మణులు విరాధుని రెండు భుజాలను నరికివేశారు. నేలపై కుప్పకూలాడు విరాధుడు. ముష్టిఘాతాలతో, మోకాళ్ళతో దాడిచేశారు రామలక్ష్మణులు. ఎంతకూ చావని విరాధుణ్ణి గోతిలో పాతిపెట్టడానికి సంసిద్ధులయ్యారు. వెంటనే విరాధుడు తన పూర్వకథను వివరించాడు. తుంబురుడనే గంధర్వుడైన తాను కుబేరుని శాపంచే రాక్షసుడిగా మారిన విషయం తెలిపాడు. శ్రీరాముని వల్ల శాపవిముక్తి కలుగుతుందన్న కుబేరుని మాటలను జ్ఞాపకం చేసుకున్నాడు. దగ్గరలోనే ఉన్న శరభంగ మహర్షిని దర్శించుకొమ్మని, శుభం జరుగుతుందని శ్రీరామునికి చెప్పాడు. తనను గోతిలో పూడ్చమన్నాడు. అలాగే చేశారు రామలక్ష్మణులు.

విరాధుని మాట ప్రకారం శరభంగ మహర్షి దర్శనానికి బయల్దేరారు. శరభంగుడు మహాతపస్వి. దైవసాక్షాత్కారం పొందినవాడు. శ్రీరాముని చూసి శ్రీరామ దర్శనం కోసమే తాను వేచివున్నానన్నాడు. తన తపఃఫలాన్నంతా శ్రీరామునికి ధారవోసాడు. భవిష్యత్తులో శ్రీరాముడు చేయవలసిన రావణసంహారానికి ఇది కూడా తోడ్పడుతుంది. ఒక మహాకార్య సాధనలో ఎవరివంతు వారు సహకారమందించాల్సిందే. అక్కడికి చేరువలోనే ఉన్న 'సుతీక్ష్ణ' మహర్షిని దర్శించమని శ్రీరామునకు సూచించాడు శరభంగమహర్షి. సీతారామలక్ష్మణులు చూస్తుండగానే తన దేహాన్ని విడచి అగ్నితేజస్సుతో బ్రహ్మలోకం చేరాడు.

అక్కడి మునులందరూ శ్రీరాముని వద్దకు వచ్చి తమగోడును వెళ్ళబోసుకున్నారు. రాక్షసులు మునులపై చేసే అకృత్యాలను ఏకరువుపెట్టారు. రాక్షసుల చేతిలో బలైన మునుల కళేబరాలను చూపించారు. రాక్షసుల బారి నుండి రక్షించమని ప్రార్థించారు. వారితో శ్రీరాముడు 'మహాత్ములారా! మీరు నన్ను ప్రార్థించడం తగదు. ఆజ్ఞాపించాలి. మీ ఆజ్ఞలను నేను శిరసావహిస్తా'నన్నాడు. అహంకరించకుండా తన బాధ్యతను గుర్తించడంలోనే గొప్పదనముంది.

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం చేరుకున్నారు. శ్రీరామ దర్శనం కోసమే సుతీక్ష్ణ మహర్షి దేహం విడువకుండా ఉన్నాడు. తన తపశ్శక్తినంతా శ్రీరామునకు ధారాదత్తం చేశాడు. మరునాడు వారు మహర్షి అనుమతి తీసుకొని బయలుదేరారు.

దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలను సందర్శిస్తూపోతున్నారు సీతారామలక్ష్మణులు. అక్కడక్కడ కొంతకాలం ఉంటున్నారు. ఇలా పది సంవత్సరాలు గడిచింది. మళ్ళీ సుతీక్ష్ణ మహర్షి వద్దకు వచ్చారు. అతనితో అగస్త్య మహర్షిని దర్శించుకోవాలన్న తమ ఆకాంక్షను వెలిబుచ్చారు. సుతీక్ష్ణ మహర్షి మార్గాన్ని చెప్పాడు. తన ఆశ్రమానికి దక్షిణంగా నాల్గుయోజనాల దూరంలో అగస్త్య సోదరుని ఆశ్రమం, అక్కడికి యోజనదూరంలో అగస్త్యాశ్రమం ఉందని తెలిపాడు. మహర్షివద్ద సెలవు తీసుకొని బయలుదేరారు సీతారామలక్ష్మణులు.

సాయంకాలానికి అగస్త్యసోదరుని ఆశ్రమానికి చేరుకున్నారు. ఇక్కడో విషయం చెప్పుకోవాలి. అగస్త్యసోదరుని పేరేమో చెప్పబడలేదు. ఎక్కడ సందర్భం వచ్చినా అగస్త్యభ్రాత (సోదరుడు) అనే చెప్పారు. అందుకే పేరు తెలియని వారిని 'అగస్త్యభ్రాత' అంటుంటారు. ఈ పదబంధం జాతీయంగా స్థిరపడింది. అగస్త్యసోదరుని ఆతిథ్యంలో ఆరాత్రి గడిపారు సీతారామలక్ష్మణులు. ఉదయాన్నే అగస్త్యాశ్రమం వైపుగా అడుగులు వేశారు.

అగస్త్యుడు తపశ్శక్తి సంపన్నుడు. ఆకాశాన్ని తాకిన వింధ్య పర్వత గర్వాన్ని అణచినవాడు. 'అగమ్ స్తంభయతీతి అగస్త్యః' పర్వతాన్ని స్తంభింపజేసినవాడు కనుక అగస్త్యుడయ్యాడు.

శ్రీరాముడి రాకను గమనించి అగస్త్యుడు శిష్యసమేతంగా ఎదురువెళ్ళాడు. అతిథిని గౌరవించే సంప్రదాయమది. శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై మహర్షికి పాదాభివందనం చేశాడు. అగస్త్యుడు శ్రీరామునకు దివ్యధనుస్సు, అక్షయతూణీరాలు, అమోఘమైన ఖడ్గాన్ని బహూకరించాడు. జయం కలుగుతుందని ఆశీర్వదించాడు. కష్టాలతో కూడిన వనవాసానికి సీత కోరిరావడం సాహసమని అభినందించాడు. ఆమెకుగల భర్తృప్రేమను మెచ్చుకున్నాడు.

శ్రీరాముడు తాము నివసించడానికి అనువైన ప్రాంతాన్ని సూచించమని అగస్త్యుణ్ణి అభ్యర్థించాడు. ఒక్క క్షణం ధ్యానమగ్నుడైనాడు మహర్షి. తరువాత శ్రీరామునితో 'ఇక్కడికి రెండు యోజనాల దూరంలో 'పంచవటి' అనే ప్రదేశం ఉంది. అక్కడ ఫలాలకు, జలానికి కొదువలేదు గోదావరీనదీ తీరంలో ఉన్న ఆ ప్రాంతంలో జనసంచారం ఉండదు. ప్రశాంతంగా ఉంటుంద'ని తెలిపాడు. అగస్త్యుడి దగ్గర సెలవు తీసుకొని పంచవటికి ప్రయాణమయ్యారు సీతారామలక్ష్మణులు.

దారిలో బలిష్ఠమైన ఒక పెద్ద గద్దను చూశారు. పక్షిరూపంలో ఉండే రాక్షసుడేమోననుకున్నారు. 'నువ్వెవరి'వని అడిగారు. తనపేరు 'జటాయువు' అనీ దశరథుడి మిత్రుడిననీ చెప్పుకొన్నాడు. తన వంశచరిత్రనూ శక్తిసామర్థ్యాలను వివరించాడు జటాయువు. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువునకు సీతరక్షణ బాధ్యతను అప్పగించాడు శ్రీరాముడు. శ్రీరాముని ఆజ్ఞమేరకు పంచవటిలో పర్ణశాల నిర్మాణం చేశాడు లక్ష్మణుడు.

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణకథా ప్రసంగంలో ఉన్నాడు. ఇంతలో 'శూర్పణఖ' అనే రాక్షసి అక్కడికి వచ్చింది. ఈమె రావణాసురుడి చెల్లెలు. శ్రీరాముడి సౌందర్యానికి ముగ్ధురాలైంది. తనను చేపట్టమన్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపితింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళమన్నాడు. లక్ష్మణుడు తాను అన్నకు దాసుడనని తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సివస్తుందని, అందుకే శ్రీరాముణ్ణి చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరాముడివైపు తిరిగింది శూర్పణఖ. సీత ఉండడంవల్లే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడికిపోయింది. సీతాదేవి అడ్డు తొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

క్రూరులైన దుష్టులతో పరిహాసం పనికిరాదు. అది ఎంతో ప్రమాదకరం. ఆలస్యం చేయకుండా శూర్పణఖను విరూపినిచేయమన్నాడు శ్రీరాముడు. అన్న ఆజ్ఞే ఆలస్యం – శూర్పణఖ ముక్కు చెవులు తెగిపడ్డాయి లక్ష్మణుని కత్తిదెబ్బకు. లబోదిబోమని మొత్తుకొంటూ సోదరుడైన ఖరుడి దగ్గరికి వెళ్ళింది శూర్పణఖ. ఖరుడు పద్నాలుగుమంది యోధులను పంపాడు. వాళ్ళంతా శ్రీరాముని చేతిలో మట్టిగరచారు. ఇది చూసిన శూర్పణఖ ఖరుని వద్దకు వెళ్ళి చెప్పింది. ఖరదూషణులు పద్నాలుగువేల మంది రాక్షసులతో రాముడిమీదకు దండెత్తారు. మూడు గడియల్లో వాళ్ళందరినీ యమపురికి పంపించాడు శ్రీరాముడు.


ఈ వార్త అకంపనుడి ద్వారా వేగంగా లంకకుచేరింది. అకంపనుడు రావణాసురుడి గూఢచారుల్లో ఒకడు. ఈ విషయాన్ని సహించుకోలేని రావణుడు శ్రీరాముణ్ణి హతమారుస్తానని ఆవేశపడ్డాడు. అకంపనుడు, అసహాయశూరుడైన శ్రీరాముణ్ణి వధించడం దేవాసురులకు కూడా సాధ్యంకాదని తేల్చేశాడు. కాని అందుకు తగిన ఒక ఉపాయాన్ని చెప్పాడు. 'శ్రీరాముడి భార్య సీత అందాల రాశి. శ్రీరాముడికి ప్రాణం. ఎలాగైనా ఆమెను అపహరిస్తే చాలు – ఆ ఎడబాటును తట్టుకోలేక రాముడు జీవితాన్ని చాలిస్తాడు' అని. ఇది రావణునికి ఎంతగానో నచ్చింది.

మరునాడుదయమే రథంమీద ఆకాశంలో ప్రయాణిస్తూ మారీచుడి ఆశ్రమానికి చేరుకున్నాడు. సీత అపహరణ విషయం తెలిపాడు. ఈ పనిలో తనకు సహాయపడమన్నాడు. మారీచుడు మండిపడ్డాడు. 'ఓ రాక్షసేంద్రా! ఈ ఆలోచన నీకెవడు చెప్పాడు? నిజంగా అతడు నీకు మిత్రుడి రూపంలో ఉన్న శత్రువు. శ్రీరాముడు సింహంవంటివాడు. సింహందగ్గరికి వెళ్ళడం ఎంత ప్రమాదం? పైగా ఇతరులకు హాని చేయాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా ఉన్న రాముణ్ణి కవ్వించడం కొరివితో తల గోక్కోవడమే. శాంతించి, ఈ ఆలోచన విరమించి సుఖించ'మని సదుపదేశం చేశాడు. రావణుడి ఆవేశం తిరుగు ముఖం పట్టింది. రావణుడూ తిరుగుముఖం పట్టాడు, లంకకు.

ఖరదూషణ త్రిశరులు, పద్నాలుగు వేలమంది రాక్షసవీరులు రాముడిధాటికి నిలువలేక యముడి ఇంటికి పోవడాన్ని భరించలేకపోయింది శూర్పణఖ. లంకకు పరుగుదీసింది. మంత్రులతో కొలువుదీరిన రావణుని సభలోకి వెళ్ళింది. వికృతరూపంతో వచ్చిన చెల్లెలి దీనావస్థను చూసికూడా చలించలేదు రావణుడు. శూర్పణఖ ఆవేశం కట్టలు తెంచుకుంది. రావణుడి మూర్ఖత్వాన్ని తిట్టిపోసింది. శ్రీరాముడివల్ల లంకకు ముప్పువాటిల్లగలదని హెచ్చరించింది. 'సౌందర్యవతి అయిన సీతకు తగిన భర్తవు నీవే'నని రావణుడిలో కొత్త ఆశలను రేకెత్తించింది.

ఒకవైపు మారీచుడి మాటలు, మరొకవైపు శూర్పణఖ పలుకులు లంకేశుని మనసును కుదిపేస్తున్నాయి. అయోమయంలో పడ్డాడు. సీతాపహరణంలోని మంచిచెడులను ఆలోచించాడు. శ్రీరాముని బలంతో తన బలాన్ని పోల్చుకున్నాడు. చివరకు సీతను అపహరించడానికే నిశ్చయించుకున్నాడు.

రావణుడు మళ్లీ మారీచునివద్దకు వెళ్ళాడు. సీతాపహరణకు బంగారులేడిగా మారి సహకరించమన్నాడు. ఆ ఆలోచనను విరమించుకోమని లంకేశునికి పరిపరివిధాల నచ్చజెప్పజూశాడు మారీచుడు. విశ్వామిత్రుని యాగ సంరక్షణ సందర్భంలో రామబాణం రుచి ఏమిటో తాను తెలుసుకున్నానన్నాడు. మారీచుడి మాటలను పెడచెవిన పెట్టాడు రావణుడు. మూర్ఖులకు హితబోధలు చెవికెక్కవు.



'నేను చెప్పినట్లు చేయకుంటే నా చేతిలో నీకు చావు తప్ప'దని హెచ్చరించాడు రావణుడు. ఆశ్రమానికి వెళ్తే శ్రీరాముడు చంపుతాడు. వెళ్ళకుంటే రావణుడు చంపుతాడు. 'ముందు నుయ్యి వెనక గొయ్యి'లా ఉంది మారీచుని స్థితి. చివరకొక నిశ్చయానికి వచ్చాడు. రావణునితో 'నీ చేతిలో చావడం కన్నా శ్రీరాముడి చేతిలో చావడమే నయం. నా జన్మ తరిస్తుం'దని తేల్చిచెప్పాడు.

మారీచుడు బంగారులేడిగా మారి శ్రీరాముని ఆశ్రమ ప్రాంతంలో తిరుగుతున్నాడు. పూలు కోయడానికి వచ్చిన సీతాదేవి ఆ జింకను చూసి ఆశ్చర్యపడింది. రామలక్ష్మణులను పిలిచింది. వారు ఆ మృగాన్ని చూశారు. లక్ష్మణుడు అది మాయామృగమేనని నిస్సంశయంగా పలికాడు. మారీచుడే ఈ రూపంలో వచ్చి ఉంటాడన్నాడు. వేటకు వచ్చే రాజులను మాయామృగరూపంలో చంపడం మారీచుడికి కొత్తదేమీ

కానదన్నాడు. ఇలాంటి లేడి ప్రపంచంలో ఉండదని అనుమానాన్ని వెలిబుచ్చాడు. సీత మాత్రం పట్టు వదలలేదు. తనకు అదెంతో నచ్చిందని, తీసుకురావాలని కోరింది. తెస్తే ఆశ్రమంలో క్రీడా మృగంగా ఉంటుందని, అయోధ్యచేరాక అంతఃపురానికే అలంకారమౌతుందని ఆశించింది.

సీత ఇష్టాన్ని తోసివేయలేక ఆ మాయలేడిని చంపి అయినా సరే తేవడానికి సంసిద్ధుడయ్యాడు శ్రీరాముడు. సీతాదేవి రక్షణ విషయంలో జటాయువు సహాయంతో అప్రమత్తంగా ఉండమని లక్ష్మణుణ్ణి ఆదేశించాడు. మాయలేడిని పట్టుకోవడానికి బయల్దేరాడు.

మృగాన్ని ప్రాణంతో పట్టుకోవాలని శతవిధాల ప్రయత్నించాడు శ్రీరాముడు. అందినట్టే అంది అందకుండా పరుగుదీస్తున్నదా మృగం. ఇక లాభం లేదనుకొని బాణాన్ని సంధించాడు, ప్రయోగించాడు శ్రీరాముడు. బాణపు దెబ్బకు తాటి చెట్టంత ఎత్తు ఎగిరి భయంకరంగా అరుస్తూ పడిపోయాడు మారీచుడు నిజ స్వరూపంతో. రాముని కంఠధ్వనిని అనుకరిస్తూ 'అయ్యో సీతా! అయ్యో లక్ష్మణా!' అని బిగ్గరగా అరుస్తూ ప్రాణాలు విడిచాడు. ఈ మాటలకు సీతాలక్ష్మణులు ఎంత కలవరపడతారోనని భయపడినాడు శ్రీరాముడు.

మారీచుని కంఠధ్వనిని రామునిదిగా భావించి సీత ఆందోళనచెందింది. శ్రీరాముడు ఏదో ఆపదలో చిక్కుకున్నాడని తలచింది. ఆదుకోవడానికి వెంటనే వెళ్ళమని లక్ష్మణుణ్ణి పురమాయించింది. లక్ష్మణుడు చలించలేదు. ఇది శ్రీరాముని స్వరం కాదన్నాడు. మారీచుడి మాయాజాలమన్నాడు. 'అమ్మా! నీ రక్షణ భారం శ్రీరాముడు నాకప్పగించాడు. నిన్ను ఇలా ఒంటరిగా వదలివెళ్ళలే'నని స్పష్టం చేశాడు. సీత ఆవేశం రెండింతలైంది. మనసులో ఏదో దుష్టాలోచనతో ఇలా ప్రవర్తిస్తున్నావని నిష్ఠురోక్తులాడింది. చేసేదిలేక లక్ష్మణుడు బయలుదేరడానికి సంసిద్ధుడయ్యాడు. 'అమ్మా! నీకు భద్రమగుగాక. వనదేవతలు నిన్ను రక్షింతురుగాక. నాకు అపశకునాలు తోస్తున్నాయి. మళ్ళీ నువ్వు మా అన్నతో కలిసి ఉండగా చూసే భాగ్యం కలుగుతుందో, లేదో?' అని వాపోయాడు. సీత మౌనంగా ఉన్నది. అక్కడి నుంచి వెళ్ళడానికి ఏమాత్రం మనస్కరించకున్నా సీతకు నమస్కరించి శ్రీరాముడు వెళ్ళిన దిశగా నడిచాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు వెళ్ళడాన్ని గమనించాడు రావణుడు. అదే అదనుగా సన్న్యాసి వేషంలో సీత సమక్షానికి వచ్చాడు. యతి రూపంలో వచ్చిన రావణుణ్ణి ఆసనంమీద కూర్చుండబెట్టి సముచితంగా అతిథి మర్యాదలు చేసింది సీత. మధ్యమధ్యలో రామలక్ష్మణుల కోసం వాకిలివైపు చూస్తున్న సీతకు నిరాశే మిగులుతున్నది. రావణుడు సీతను గురించిన వివరాలు అడిగాడు. తెలిపింది. సన్న్యాసి వివరాలను కోరింది. తాను రాక్షసరాజు లంకేశ్వరుడనని ప్రకటించాడు. తనను పతిగా స్వీకరించమని అడిగాడు. అలా చేస్తే అంతులేని భోగభాగ్యాలతో విలసిల్లుతావని ఆశ చూపాడు. ఆ మాటలకు సీత మండిపడింది. రావణుణ్ణి తృణీకరించి మాట్లాడింది. శ్రీరాముడి పరాక్రమాన్ని ప్రస్తావించింది. 'నన్ను అపహరించి నీ చావును నీవే కొనితెచ్చుకోకు' అని హెచ్చరించింది.

రావణుడి కన్నులు నిప్పులు చెరుగుతున్నాయి. సన్న్యాసి వేషాన్ని వదిలి పదితలలతో భయంకరమైన నిజస్వరూపంతో సీత ఎదుట నిలిచాడు. బలవంతంగా సీతను తన రథంలో లంకకు తరలిస్తున్నాడు. సీత 'రామా! రామా!' అంటూ ఆర్తనాదాలను చేస్తున్నది. ఆమె వేదన అరణ్యరోదనయింది.

అప్పుడప్పుడే నిద్రకుపక్రమిస్తున్న జటాయువుకు సీతాదేవి ఆర్తనాదాలు వినబడ్డాయి. చూసే సరికల్లా సీతను అపహరించుకు పోతున్న రావణుడు కంటబడ్డాడు. జటాయువు రావణుణ్ణి ఎదిరించాడు. ఇద్దరి మధ్య పోరు హోరాహోరీగా సాగింది. చివరకు రావణుడు ఖడ్గంతో జటాయువు రెక్కలను, కాళ్ళను నరికివేసాడు. నేలపై కూలాడు జటాయువు. రక్తంతో తడసి ముద్దయిన అతణ్ణి చూసి ఆత్మబంధువును పోగొట్టుకున్నట్లు సీత ఆక్రందించింది.

రావణుడు సీతాదేవిని తీసుకొని ఆకాశమార్గం పట్టాడు. దీనురాలైన సీత హీనుడైన రావణుణ్ణి పరి పరి విధాల దూషించింది. ఇంతలో ఒక పర్వత శిఖరంమీద ఐదుగురు వానరముఖ్యులను సీత చూసింది. ఉత్తరీయపు కొంగులో తన ఆభరణాలను కొన్నింటిని మూటగట్టి వారి మధ్య పడేటట్లు వదలింది. ఒకవేళ అటువైపుగా శ్రీరాముడువస్తే తనను గురించి వానరులు అతనికి తెలియజేస్తారనే చిన్న ఆశ.

రావణుడు సీతతో లంకకు చేరాడు. తన అంతఃపురంలో సీతనుంచాడు. తన వైభవమంతా చూపించాడు. దాన్ని తృణప్రాయంగా భావించింది సీత. కనికరించమని కాళ్ళపైబడ్డాడు. నిరాకరించిందా మహాసాధ్వి. భరించలేకపోయాడు దశకంఠుడు. ఆవేశంతో, 'మైథిలీ! నీకు పన్నెండు నెలల గడువిస్తున్నాను. ఈలోపున నువ్వు దారికి రాకపోతే మరునాడే ప్రాతఃకాల భోజనానికి వంటవాళ్ళు నిన్ను సిద్ధంచేస్తా'రని బెదిరించాడు. అక్కడి రాక్షసులతో, 'ఈమెను అశోకవనానికి తీసుకుపొండి. వనం మధ్య ఒక రహస్య ప్రదేశంలో ఉంచి చుట్టూ కాపలాగా ఉండండి ఎలాగో ఒకలాగ ఈమెను ఒప్పించండి' అని ఆజ్ఞాపించి రుసరుసలాడుతూ వెళ్ళాడు. ఆడపులల మధ్య జింకలాగ రాక్షస స్త్రీల మధ్య సీత బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడుపుతున్నది.

మారీచుణ్ణి వధించి శ్రీరాముడు వెనుదిరిగాడు. లక్ష్మణుడు ఎదురయ్యేసరికి నిశ్చేష్టుడయ్యాడు. సీతను ఒంటరిగా వదలి ఎందుకు వచ్చావని నిలదీశాడు. జరిగిన విషయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు లక్ష్మణుడు. ఇద్దరూ ఆశ్రమానికి చేరుకున్నారు. సీతాదేవి జాడ కనిపించలేదు. వనమంతా వెతికారు. సీత జాడ కనిపించలేదు. సీత జాడ చెప్పమని ప్రకృతిని ప్రార్థించాడు శ్రీరాముడు. ఆమె ఎడబాటును తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఆవేదన ఆవేశంగా మారింది. లోకాలను ధ్వంసం చేయడానికి శ్రీరాముడు సిద్ధపడ్డాడు. లక్ష్మణుడు ఓదార్పు వాక్యాలతో అన్నను శాంతపరిచాడు.

అరణ్యంలో సీతను వెదుకుతూ వెళుతున్న రామలక్ష్మణులకు జటాయువు కనిపించాడు. రక్తంతో తడిసిన అతనిని గుర్తించలేదు శ్రీరాముడు. మీదు మిక్కిలి అతడు గద్దరూపంలో ఉన్న రాక్షసుడని సీతనతడే భక్షించి ఉంటాడనీ భ్రమపడ్డాడు. బాణంతో చంపడానికి పూనుకున్నాడు. ఇంతలో జటాయువు జరిగిన విషయం చెప్పాడు. రావణుడు సీతను అపహరించాడని, ఎదిరించిన తనకీగతి పట్టించాడని వివరించాడు. అపహరణకు గురైన సీత, అవసానదశలో ఉన్న ఆత్మీయుడు – రాముడి దుఃఖం రెండింతలైంది. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువు పట్ల పితృభక్తిని ప్రదర్శిస్తూ అతని శరీరాన్ని నిమిరాడు. జటాయువు కన్నుమూశాడు. శ్రీరాముడు జటాయువుకు దహన సంస్కారాలు చేశాడు. అతనికి ఉత్తమగతులు కలగాలని గోదావరిలో జలతర్పణాలు చేశాడు.

రామలక్ష్మణులు దండకారణ్యంనుంచి క్రౌంచారణ్యానికి చేరుకున్నారు. అక్కడి వనంలో భయంకరుడైన ఒక రాక్షసుణ్ణి చూశారు. అతని తల, మెడ కనబడడంలేదు. కడుపు భాగంలో ముఖముంది. రొమ్ముమీద ఒకే కన్ను ఉంది. యోజనం పొడవు వ్యాపించిన చేతులు. ఆ చేతులలో పక్షులను, మృగాలను పట్టితింటాడు. అతనిపేరు 'కబంధుడు'. తన సమీపంలోకి వచ్చిన రామలక్ష్మణులను అమాంతంగా రెండు చేతులతో పట్టుకున్నాడు. అతని చేతుల్లో చిక్కితే తప్పించుకోవడం ఎవరితరంకాదు. అందుకే 'కబంధ హస్తాలు' అన్న జాతీయం పుట్టుకువచ్చింది. కబంధుడు రామలక్ష్మణులను భక్షించడానికి నోరుతెరచాడు. అన్నదమ్ములిద్దరూ తమ ఖడ్గాలతో అనాయాసంగా వాడి భుజాలను నరకివేశారు. కబంధుడు కుప్పకూలాడు. రామలక్ష్మణుల గురించి తెలుసుకున్నాడు. తన గురించి చెప్పుకున్నాడు. శాపకారణంగా తనకీ వికృతరూపం ప్రాప్తించిందన్నాడు. శ్రీరాముడు కబంధునితో'. 'మాకు రావణుని పేరు మాత్రమే తెలిసింది. అతని రూపం, ఉండేచోటు, శక్తిసామర్థ్యాలు తెలియవు. వాటిని చెప్పవలసింద'ని అడిగాడు. సమాధానంగా కబంధుడు 'శ్రీరామా! నాకిప్పుడు దివ్యజ్ఞానంలేదు. నా శరీరాన్ని దహిస్తే నా నిజరూపం వస్తుంది. అప్పుడు చెప్పగల'నన్నాడు. కబంధుడి శరీరానికి అగ్నిసంస్కారంచేశారు రామలక్ష్మణులు. ఆ జ్వాలల నుంచి దివ్యదేహంతో బయటికి వచ్చాడు కబంధుడు. సీతాదేవి దొరికే ఉపాయాన్ని శ్రీరాముడికి చెప్పాడు. ఇందుకు సుగ్రీవుడి మైత్రి బాగా తోడ్పడుతుందన్నాడు. వాలిసుగ్రీవుల కథను వివరించాడు. సుగ్రీవుణ్ణి చేరే దారిని చెప్పాడు. శ్రీరాముడి అనుమతిని తీసుకొని కబంధుడు స్వర్గానికి వెళ్లాడు.

కబంధుడు సూచించిన మార్గంలో ప్రయాణిస్తూ పంపాసరస్సున్న ప్రాంతానికి చేరారు రామలక్ష్మణులు. ఆ తీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి వెళ్ళారు. శబరి తపస్సిద్ధురాలు, జ్ఞానవయోవృద్ధురాలు. శ్రీరామదర్శనంతో ఆమె తనువు పులకించింది. పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది. తన జన్మ ధన్యమైనట్లు భావించింది. శ్రీరాముడి అనుమతినిపొంది తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి అగ్నికాంతితో ఊర్ధ్వలోకాలకు వెళ్ళింది.

అక్కడినుంచి ఋష్యమూక పర్వతానికి ప్రయాణమయ్యారు రామలక్ష్మణులు. దారిలో పంపాసరోవరాన్ని దర్శించారు.



# కిష్కింధా కాండం



పంపాసరోవర ప్రాంతం పరమ రమణీయంగా ఉంది. ప్రకృతి తన అందాలను ప్రదర్శిస్తున్నట్లుగా ఉంది. కాని శ్రీరాముడి మనసును ఏమాత్రం సంతోషపెట్టలేకపోయింది. పైగా సీత ఎడబాటు ఆవేదన అనే అగ్నికి ఆజ్యం పోసినట్లుగా శ్రీరాముడి బాధను మరింతపెంచింది. లక్ష్మణుడు ఊరడించాడు. 'అన్నా ఈ దైన్యాన్ని వదులు. అదే మనకు మేలుచేస్తుంది. చేసిన ప్రయత్నం విఫలమైనప్పుడు, సంపదలను పోగొట్టుకున్నప్పుడు అధైర్యపడకుండా ప్రయత్నంచేస్తే మంచి ఫలితముంటుంది. ఉత్సాహమే బలం. ఉత్సాహమున్నవానికి అసాధ్యమనేదిలేదు. వాళ్ళు ఎటువంటి కష్టాలువచ్చినా వెనకడుగువేయరు. మన ప్రయత్నాన్ని కొనసాగిద్దాం. వదినెగారు తప్పకుండా లభిస్తుంది' అని ధైర్యం చెప్పాడు.

ఋష్యమూక పర్వతం నుంచి రామలక్ష్మణులను చూశాడు సుగ్రీవుడు. గుండెలో రాయిపడ్డట్టయింది. ఆ ఇద్దరు వీరులు తన అన్న అయిన వాలిపంపగా వచ్చారేమోనని భయంతో వణకిపోతున్నాడు. ధనుర్బాణాలు ధరించిన వాళ్ళెవరో మారువేషంలోవెళ్ళి కనుక్కోమని ఆంజనేయుణ్ణి ఆదేశించాడు.

సుగ్రీవుని ఆనతిమీద రామలక్ష్మణులున్న చోటికి ఒక్క గంతువేశాడు హనుమంతుడు. సన్యాసి రూపంలో వారి దగ్గరికి వెళ్ళాడు. వారి రూపాన్ని పొగిడాడు. వారి పరిచయం అడిగాడు. రామలక్ష్మణులు మౌనముద్రనుదాల్చారు. హనుమంతుడు వారితో వానరరాజు సుగ్రీవుడు ధర్మాత్ముడు, మహావీరుడు. అతణ్ణి ఆయన అన్న వాలి వంచించాడు. రక్షణకోసం జాగ్రత్తతో తిరుగుతున్నాడు. నేను సుగ్రీవుడి మంత్రిని. నన్ను 'హనుమంతు'డంటారు. నేను వాయుపుత్రుణ్ణి. ఎక్కడికైనా వెళ్ళిరాగల శక్తి గలవాణ్ణి. సుగ్రీవుడు పంపగా ఈ రూపంలో మీదగ్గరకి వచ్చాను. సుగ్రీవుడు మీతో స్నేహాన్ని కోరుతున్నాడు' అని చాకచక్యంగా మాట్లాడాడు. విషయాన్ని చెప్పేపద్ధతిలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు. హనుమంతుని మాటతీరు శ్రీరాముణ్ణి ఆకట్టుకుంది. లక్ష్మణుడితో 'ఇతడు వేదాలను, వ్యాకరణాన్ని క్షుణ్ణంగా చదివాడన్నది నిశ్చయం. లేకపోతే మాటల్లో ఇంత స్పష్టత ఉండదు. తడబాటు, తొందరపాటు లేకుండా, తప్పులు పలకకుండా, సరైన స్వరంతో చెప్పదలచుకున్న విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పాడు. ఈయన మాట్లాడే తీరుచూస్తే చంపడానికి కత్తి ఎత్తిన శత్రువుకు కూడా చేతులు రావు' అని మెచ్చుకున్నాడు. మాటకున్న శక్తి అటువంటిది.

హనుమంతుడితో లక్ష్మణుడినే మాట్లాడమన్నాడు శ్రీరాముడు. హనుమంతుడి అభిప్రాయాలకు సమ్మతి తెలుపుతూ. తమ వృత్తాంతాన్ని వివరించాడు లక్ష్మణుడు. తమకు సుగ్రీవుడి సహాయం ఎంతో తగినదన్నాడు. సన్యాసిరూపం వదలి రామలక్ష్మణులను భుజాలపై ఎక్కించుకొని ఋష్యమూక పర్వతానికి చేరుకున్నాడు హనుమ. అంతకు ముందే భయంతో మలయగిరికి చేరిన సుగ్రీవుణ్ణి రామలక్ష్మణుల వద్దకు తీసుకువచ్చాడు ఆంజనేయుడు.

శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా మిత్రులైనారు. సుగ్రీవుడు 'రామా! ఈనాడు నీవు నాకు ప్రాణమిత్రుడివైనావు. ఇప్పటి నుంచి సుఖదుఃఖాలలో మనం ఒక్కటిగానే ఉందాం. వాలి భయం నన్ను వదలడంలేదు. నీ అభయం కావాలి' అని ప్రార్థించాడు.

శ్రీరాముడు మందహాసాన్ని చిందిస్తూ' సుగ్రీవా! ఆపదలో ఆదుకునేవాడే గదా మిత్రుడు. నీ భార్యను అపహరించిన వాలిని తప్పక వధిస్తాన'ని మాటఇచ్చాడు. సుగ్రీవుడి మనసుకుదుటపడింది.

శ్రీరామసుగ్రీవులు స్నేహపూర్వకంగా మాట్లాడుకుంటున్నసమయంలోనే సీతాదేవికి, వాలికి, రావణాసురునికి ఎడమకన్ను ఒక్కసారిగా అదిరింది.

సుగ్రీవుడు గతంలో తాను నలుగురు మంత్రులతో కొండమీద ఉన్నప్పుడు ఒక రాక్షసుడు స్త్రీని బలవంతంగా తీసుకుపోవడం చూశామన్నాడు. ఆమె 'రామా!' 'లక్ష్మణా!' అని బిగ్గరగా అరవడం విన్నామన్నాడు. తమను చూసి ఒక నగల మూటను జారవిడచిందని చెప్పి, ఆ ఆభరణాలను తెచ్చి చూపించాడు. శ్రీరాముడు వాటిని చూసి కన్నీటి సంద్రమయ్యాడు. లక్ష్మణుడు 'అన్నా! ఈ కేయూరాలను, కుండలాలను నేను గుర్తుపట్టలేను. కాని కాలి అందెలు మాత్రం మా వదినెగారివే. ఆమెకు నిత్యం పాదాభివందనం చేయడంవల్ల నేను వీటిని గుర్తుపట్టాన'న్నాడు.

శ్రీరాముడి శోకాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాడు సుగ్రీవుడు. సీతాదేవిని తీసుకురావడంలో తాను తగిన ప్రయత్నం చేస్తానన్నాడు. సపరివారంగా రావణుణ్ణి హతమార్చేందుకు తన శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తానన్నాడు. దుఃఖం అనర్థదాయకం కనుక ఎప్పుడూ దుఃఖించవద్దన్నాడు. ఎల్లప్పుడూ దుఃఖించేవారికి సుఖముండదు. తేజస్సు క్షీణిస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రాణాలు నిలవడమే కష్టంగా ఉంటుంది. కనుక దుఃఖస్థితినుంచి బయట పడమని ధైర్యవచనాలను చెప్పాడు.

'ఓ రామా! నిజమైన మిత్రుడు తన స్నేహితుడికోసం సంపదలను, సుఖాలను, చివరకు తన ప్రాణాలను కూడా విడవడానికి సిద్ధపడతాడు. ప్రాణమిత్రులమైన మనం స్నేహధర్మాన్ని చక్కగా పాటిద్దా'మన్నాడు. శ్రీరాముడు అందుకు అంగీకరిస్తూ 'ఉపకారం జరగడమే మిత్రునివల్ల ఫలం – అపకారం చేయడం శత్రువు లక్షణం. నీ భార్యనపహరించిన వాలిని ఈరోజే చంపుతా'నన్నాడు. వాలితో వైరమెందుకు వచ్చిందో తెలపమన్నాడు సుగ్రీవుణ్ణి. గతకథను శ్రీరాముడి చెవిన వేశాడు సుగ్రీవుడు.

'మా అన్న వాలి మహాబలశాలి. పెద్దవాడు కనుక మా తండ్రి తరవాత కిష్కింధకు రాజైనాడు. మాయావి అనే వాడికి మా అన్నతో వైరం. ఒకనాటి అర్ధరాత్రి మాయావి కిష్కింధకు వచ్చి వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మేమెంతగా వారించినా వాలి వినకుండా వానితో పోరుకు సిద్ధమయ్యాడు. మమ్మలను చూడగానే మాయావి భయంతో వెనుదిరిగి పిక్కబలంచూపాడు. మేము వెంబడించాం. అతడు ఒక పెద్ద భూగృహంలోకి వెళ్ళాడు. వాలి ఆవేశంతో ఊగిపోతున్నాడు. నన్ను బిలద్వారం దగ్గరే ఉండమన్నాడు. మాయావిని చంపి వస్తానని వెళ్లాడు. సంవత్సరమైంది. అన్నజాడేలేదు. నా ఆశలు అడుగంటాయి. ఆందోళన ఎక్కువైంది. ఇంతలో నురుగుతోకూడిన రక్తం గుహలో నుంచి బయటకు వస్తున్నది. లోపల రాక్షసునివి, అన్నగారి అరుపులు వినిపిస్తున్నాయి. మాయావిచేతిలో మా అన్న చనిపోయాడనుకున్నాను. రాక్షసుడు బయటకు వస్తాడేమోనని కొండంత బండతో బిలద్వారాన్ని మూసేశాను. మౌనంగా కిష్కింధకు వచ్చాను. మంత్రులు నా ద్వారా సమాచారాన్ని రాబట్టారు. బలవంతంగా నన్ను రాజును చేశారు. కొంతకాలానికి వాలి వచ్చాడు. నన్ను రాజును చేయడం చూసి కనులెర్రజేశాడు, నా కుమారులను చెరసాలలో బంధించాడు. ఎంత బతిమాలినా క్షమించలేదు. సరికదా నన్ను రాజ్యభ్రష్టుణ్ణి చేయడమేకాదు. నా భార్య రుమను అపహరించాడు. ప్రాణభీతితో పరుగులుతీశాను. సమస్త భూమండలం తిరిగాను. చివరకు ఈ ఋష్యమూక పర్వతాన్ని చేరుకున్నాను. మతంగముని శాపం కారణంగా వాలి ఇక్కడకు రాలేడు. వాలి దుందుభి అనే రాక్షసుణ్ణి చంపి విసరివేసినప్పుడు ఆ రాక్షసుడి నోటినుండి రక్త బిందువులు మతంగాశ్రమం మీద పడ్డాయి. అందుకు కోపించిన ముని ఋష్యమూక పర్వతం మీద కాలుపెడితే వాలి మరణిస్తాడని శపించాడు' అంటూ సుగ్రీవుడు తన కథనంతా చెప్పాడు.

శ్రీరాముని బలమెలాంటిదో తెలుసుకోవాలనుకున్నాడు సుగ్రీవుడు. దానికి జవాబుగా శ్రీరాముడు కాలి బొటనవేలితో అక్కడ పడివున్న దుందుభి అస్థిపంజరాన్ని పదియోజనాల దూరం పడేటట్లు చిమ్మివేశాడు. ఒకే బాణంతో ఏడు మద్దిచెట్లను చీల్చాడు. సంతోషించాడు సుగ్రీవుడు.

వాలి వధకు ఇక ఏ మాత్రం ఆలస్యం వద్దని శ్రీరాముణ్ణి తొందరపెట్టాడు. అందరూ కిష్కింధకు వెళ్ళారు. సుగ్రీవుడు భయంకరంగా గర్జిస్తూ వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మహాబలశాలి అయిన వాలి క్షణాలలో అక్కడ వాలాడు. ఇద్దరి యుద్ధం అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టించింది. వాలిసుగ్రీవులు ఒకే పోలికతో ఉన్నారు. అందుకే శ్రీరాముడు వాలిని స్పష్టంగా గుర్తించలేకపోయాడు. వాలి విజృంభణకు తట్టుకోలేకపోయాడు సుగ్రీవుడు. శ్రీరాముడి కొరకు చూశాడు. కనిపించలేదు. గుండెగుభేలుమంది. ప్రాణభయంతో ఋష్యమూకానికి పరుగులుతీశాడు సుగ్రీవుడు. అక్కడకు వెళ్ళలేని వాలి సుగ్రీవుడితో 'బతికావు పో' అని మరలిపోయాడు.

లక్ష్మణ హనుమంతులతో కూడి శ్రీరాముడు సుగ్రీవుడి దగ్గరికి వచ్చాడు. సుగ్రీవుడు సిగ్గుతో తల దించుకున్నాడు. 'నీ సూచన పాటించినందుకు ఫలితమిదేనా?' అని ప్రశ్నించాడు. శ్రీరాముడు అసలు విషయం చెప్పాడు. సుగ్రీవుణ్ణి గుర్తించడానికి వీలుగా 'నాగకేసరపులత'ను మెడలో వేయమని లక్ష్మణుడికి చెప్పాడు. అన్న ఆజ్ఞను వెంటనే అమలుచేశాడు లక్ష్మణుడు. పూలతో నిండిన ఆ లతను ధరించి సుగ్రీవుడు తిరిగి యుద్ధానికి సన్నద్ధమయ్యాడు.

కిష్కింధకు ప్రయాణమయ్యారందరూ. సుగ్రీవుడు వాలిని మళ్ళీ యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి అడుగుముందుకు వేశాడు. కాని అతని భార్య తార అడ్డుపడింది. ఒకసారి ఓడిపోయి దెబ్బలు తిన్న సుగ్రీవుడు మళ్ళీ ఆహ్వానించడం వెనుక ఏదో ఆంతర్యం ఉందని అభిప్రాయపడింది. సుగ్రీవుడికి శ్రీరాముడు అండగా ఉన్నాడన్న విషయాన్ని ప్రస్తావించింది. యుద్ధానికి వెళ్ళడం క్షేమంకాదని వారించింది. తారమాటలను పెడచెవిన పెట్టాడు వాలి. యుద్ధదిశగా అడుగులు వేశాడు.

వాలిసుగ్రీవుల పోరు తీవ్రంగా సాగుతున్నది. రక్తం కారుతున్నా పట్టించుకునే స్థితిలో లేరు వాళ్ళిద్దరూ. మెల్లమెల్లగా సుగ్రీవుని శక్తి సన్నగిల్లుతున్నది. మాటిమాటికి దిక్కులు చూస్తున్నాడు. అతని ఆంతర్యం అర్థమైంది శ్రీరాముడికి. విషసర్పంతో సమానమైన బాణాన్ని అతడు వాలిమీదకు వదిలాడు. అది క్షణాలలో వాలి వక్షఃస్థలంలో నాటుకున్నది. వాలి నేలమీదికి వాలిపోయాడు. స్పృహకోల్పోయాడు. రక్తపుమడుగులో పడివున్న వాలి కొంతసేపటికి తేరుకున్నాడు. రామలక్ష్మణులను చూశాడు. శ్రీరామునితో 'ఉత్తముడని పేరుపొందిన నీవు ఇంత అధర్మంగా ఎందుకు ప్రవర్తించావు? నీకు నీ దేశానికి నేనెన్నడూ అపకారం చేయతలపెట్టలేదు. అలాంటప్పుడు నన్నెందుకు చంపవలసివచ్చింది. నిన్ను ఎదిరించి యుద్ధమే చేయలేదు. వేరొకరితో పోరుతున్నప్పుడు ఎందుకు దొంగదెబ్బ తీశా'వని నిలదీశాడు. సీతాదేవి కొరకు సుగ్రీవుణ్ణి ఆశ్రయించడంకన్నా తనను కోరివుంటే బాగుండేదన్నాడు. ఒక్కరోజులో సీతాదేవిని తెచ్చి అప్పజెప్పే వాడనని పలికాడు. రావణుణ్ణి యుద్ధంలో బంధించి తెచ్చి నీ ముందుంచే వాడినని తెలిపాడు.

శ్రీరాముడు వాలి అభిప్రాయాలను తోసేశాడు. తమ్ముడి భార్యను చెరబట్టడం వంటి అధర్మాలకు ఒడిగట్టినందువల్ల నేను నీకు మరణదండన విధించానన్నాడు శ్రీరాముడు. వానరుడివి కనుక చాటుగా ఉండి చంపడంలో తప్పులేదన్నాడు.

శ్రీరాముని మాటలు విన్న వాలి తన తప్పును తెలుసుకున్నాడు. మన్నించమని దోసిలొగ్గాడు. భర్త విషయం తెలుసుకున్న తార పరుగుపరుగున వచ్చింది. మరణవేదనతో కింద పడివున్న వాలి దీనస్థితిని చూసింది. గుండె చెరువయేటట్లు ఏడ్చింది. ప్రాయోపవేశానికి సిద్ధపడిన తారను హనుమంతుడు ఓదార్చాడు. తార, అంగదుల బాధ్యతను సుగ్రీవునకు వాలి అప్పజెప్పాడు. తనమెడలోని దివ్యమైన సువర్ణమాలను సుగ్రీవునకిచ్చి వెంటనే ధరించమన్నాడు. లేకుంటే వాలి చనిపోయిన మరుక్షణమే ఆ మాలకున్న శక్తి నశిస్తుంది. కొడుకైన అంగదుడికి జీవితంలో ఎలా నడచుకోవాలో ఉపదేశించాడు. బాణం వల్ల కలుగుతున్న బాధ అంతకంతకూ అధికమై ప్రాణాలను వదిలాడు. వాలి జీవితాధ్యాయం ముగిసింది.

సుగ్రీవ హనుమదాదులు శ్రీరాముడి దగ్గరికి వచ్చారు. హనుమంతుడు శ్రీరాముడితో సుగ్రీవుని పట్టాభిషేక విషయం ప్రస్తావించాడు. దీనికోసం కిష్కింధకు రమ్మని ప్రార్థించాడు. తండ్రి ఆజ్ఞమేరకు పద్నాలుగు సంవత్సరాల వరకు ఏ గ్రామంలోగాని నగరంలోగాని తాను అడుగుపెట్టనని చెప్పి పితృవాక్య పరిపాలనను మరోమారు చాటుకున్నాడు శ్రీరాముడు. సుగ్రీవుడికి శుభం పలికాడు. తాను ప్రసవణగిరి మీద ఉంటానన్నాడు. వర్షాకాలం పోయాక సీతాన్వేషణ ప్రయత్నం ప్రారంభించమని సుగ్రీవుణ్ణి ఆదేశించాడు. సరేనన్నాడు సుగ్రీవుడు.

కిష్కింధకు రాజుగా సుగ్రీవుడు, యువరాజుగా అంగదుడు పట్టాభిషిక్తులయారు. కాలం గడుస్తున్నది. శరత్కాలం వచ్చింది. సీతాన్వేషణ కార్యభారాన్ని సుగ్రీవుడికి గుర్తుచేశాడు హనుమంతుడు. తదనుగుణంగా సేనలను సమీకరించమని సేనాపతి అయిన 'నీలుణ్ణి' ఆజ్ఞాపించాడు సుగ్రీవుడు. ఇది శ్రీరాముడికి తెలియదు. లక్ష్మణుణ్ణి పిలిచి సుగ్రీవుడి దగ్గరికి వెళ్ళమన్నాడు.

లక్ష్మణుడు కిష్కింధకు పయనమయ్యాడు. సుగ్రీవుడు రాజభోగాలలో ఓలలాడుతున్నాడు. సీతాదేవి ఎడబాటువల్ల నిలువునా నీరవుతున్న అన్నగారు, నిర్లక్ష్యంతో సుగ్రీవుడు – లక్ష్మణునికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బుసలు కొడుతున్నాడు. అతని ముందుకు రావడానికి ఎవరికీ కాళ్ళాడడంలేదు. వానరులూ, మంత్రులేకాదు – సుగ్రీవుడి పరిస్థితీ అంతే. మందిర ద్వారం దగ్గరికి వచ్చిన లక్ష్మణుడితో మాట్లాడటానికి తార వెళ్ళింది. స్త్రీలపట్ల కోపం ప్రదర్శించగూడదని శాంతించాడు లక్ష్మణుడు. సుగ్రీవుడు సీతాన్వేషణకు శ్రీకారం చుట్టాడని తార లక్ష్మణుడికి తెలిపింది. అంతఃపురంలో ఉన్న సుగ్రీవుణ్ణి కలిశాడు లక్ష్మణుడు. శ్రీరాముడి దయవల్లనే తానీ స్థితిలో ఉన్నానని కృతజ్ఞత ప్రకటించాడు సుగ్రీవుడు. మహా పరాక్రమశాలి శ్రీరాముడికి తన సహాయం నిమిత్తమాత్రమేనన్నాడు. తనవైపునుంచి ఏదైనా తప్పు జరిగితే మన్నించమన్నాడు. లక్ష్మణుడు శాంతించాడు. తన అన్నగారి దగ్గరికి సుగ్రీవుణ్ణి రమ్మన్నాడు.

సుగ్రీవుడు వివిధ ప్రాంతాలలోగల వానర వీరులను రావలసిందిగా చెప్పమని హనుమంతుణ్ణి ఆజ్ఞాపించాడు. పదిరోజుల్లోగా రాకపోతే వాళ్ళకు మరణదండన తప్పదని హెచ్చరించాడు. హనుమంతుడు ఈ వార్తను అన్ని దిక్కులకూ వేగంగా పంపాడు. ఫలితంగా కోట్లమంది వానరయోధులు కిష్కింధకు చేరుకుంటున్నారు. సుగ్రీవుడిని ఆజ్ఞ అటువంటిది. దానికి తిరుగులేదు. అందుకే 'సుగ్రీవాజ్ఞ' అనేది జాతీయంగా స్థిరపడ్డది.

శ్రీరాముడితో సుగ్రీవుడు సమావేశమయ్యాడు. వానరుల రాకను గురించి తెలిపాడు. సీతజాడను తెలుసుకోవడం, రావణుడి నివాసాన్ని పసిగట్టడమే ప్రధానకర్తవ్యమన్నాడు శ్రీరాముడు. శ్రీరాముని సూచన మేరకు సీతాన్వేషణకోసం వానర వీరులను నలుదిక్కులకు పంపాడు తూర్పు దిక్కునకు 'వినతుని' నాయకత్వంలో సేనను పంపాడు. దక్షిణ దిక్కుకు అంగదుని నాయకత్వంలో



హనుమంతుడు, జాంబవంతుడు మొదలైన ప్రముఖులతో కూడిన సేనను పంపాడు. మేనమామ అయిన సుషేణుని నాయకత్వంలో పడమరకు, శతబలి నాయకత్వంలో ఉత్తర దిశకు సేనను పంపాడు. ఒక్కొక్క దిక్కున ఏయే ప్రదేశాలగుండా వెళ్లాలో, అక్కడ ఏమేమి ఉంటాయో వివరంగా చెప్పాడు సుగ్రీవుడు. ఆ ప్రదేశాలకు సంబంధించిన అతని జ్ఞానం చూస్తే ముక్కున వేలేసుకుంటాం. నెలరోజుల్లో సమాచారం తెమ్మని సుగ్రీవాజ్ఞ. సీతాన్వేషణను సఫలం చేయగల సమర్థుడు హనుమంతుడేనని సుగ్రీవుడి నమ్మకం. హనుమంతుడూ అంతే విశ్వాసంతో ఉన్నాడు. శ్రీరాముడి భావనకూడా అదే. అందుకే తనపేరు చెక్కబడిన ఉంగరాన్ని

హనుమంతుడికి ఇచ్చాడు శ్రీరాముడు. సీత దీన్ని చూస్తే హనుమను రామదూతగా నమ్ముతుందన్నాడు. హనుమంతుడు నమస్కరించి రామముద్రికను గ్రహించాడు. శ్రీరాముని పాదాలకు ప్రణమిల్లి ప్రయాణమయ్యాడు.

సీతాన్వేషణకు బయలుదేరి నెలరోజులు కావస్తున్నది. తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు వెళ్ళినవాళ్ళు తీవ్రంగా వెదికి వెదికి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. గడువు ముగిసేనాటికి ప్రసవణగిరిలో శ్రీరామునితో ఉన్న సుగ్రీవుడి దగ్గరికి చేరుకున్నారు. సీతజాడ కోసం చేసిన కృషి ఫలించలేదని విన్నవించుకున్నారు. హనుమంతుడు ఈ విషయంలో కృతకృత్యుడౌతాడని ధీమా వ్యక్తంచేశారు. ఎందుకంటే రావణుడు సీతను తీసుకెళ్ళింది దక్షిణంవైపే గదా.

అంగదుని నాయకత్వంలో దక్షిణం వైపుకు బయలుదేరిన హనుమంతుడు మొదలైనవాళ్ళు అణువణువునా గాలిస్తున్నారు. సుగ్రీవుడిచ్చిన గడువు పూర్తయింది. ఏం చేయాలో తోచడం లేదు. తమ వాళ్ళు నిరాశ పడకుండా జాగ్రత్తపడ్డాడు అంగదుడు. విరక్తి పొందకుండా ధైర్యోత్సాహాలతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని ప్రేరేపించాడు. అందరూ రెట్టించిన ఉత్సాహంతో ముందుకు కదిలారు.

హనుమదాదులు ఒక పెద్ద గుహదగ్గరికి చేరుకున్నారు. అది 'ఋక్షబిలము'. ఒక రాక్షసుని అధీనంలో ఉంది. బాగా అలసిపోయిన వానరులను ఆకలిదప్పులు పట్టి పీడిస్తున్నాయి. గుహలోకి వెళ్ళారు. అంతా అయోమయంగా ఉంది. చివరకు స్వయంప్రభ అనే యోగిని అనుగ్రహంతో ఆకలిదప్పులను తీర్చుకున్నారు. ఆమెను ప్రార్థించి ఆమె తపః ప్రభావం వల్ల క్షణాలలో ఒక పెద్దసముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. ఆ సముద్రాన్ని 'మహోదధి' అంటారు. ఉవ్వెత్తున లేచే అలల అలజడి భయాన్ని కలిగిస్తున్నది.

సముద్రతీరంలో వానరులంతా సమావేశమయ్యారు. ఏం చెయ్యాలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. సీత జాడ కనిపెట్టకుండా సుగ్రీవుని చేరరాదనుకున్నారు.

వీళ్ళ మాటల్లో 'జటాయువు' ప్రస్తావన వచ్చింది. అది విన్నాడు 'సంపాతి'. ఇతడు పక్షిరాజు, జటాయువుకు అన్న. రెక్కలులేక పడి ఉన్నాడు. సంపాతి తన సోదరుడి మరణానికి ఎంతో విలపించాడు. లంకలో సీత ఉన్న పరిస్థితులను దివ్యదృష్టితో చూసి కళ్ళకుకట్టినట్లు వివరించాడు. లంకకు ఎలా వెళ్లాలో చెప్పాడు. ఇంతలో ఆశ్చర్యకరంగా సంపాతికి రెక్కలు మొలిచాయి. పరోపకారపుణ్యం ఊరికేపోతుందా? అందరూ ఆనందించారు. తన రెక్కల బలాన్ని తెలుసుకోవడానికి రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు సంపాతి.

వానర వీరులు బలపరాక్రమాలను ప్రదర్శించడం ద్వారానే సీతాన్వేషణ సఫలమౌతుందన్న నిశ్చయానికి వచ్చారు. కాని వంద యోజనాలు వెళ్ళి రాగలవారెవ్వరని తర్కించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్యహాని కలగకుండా కాపాడగలవాడు హనుమంతుడొక్కడేనని నిగ్గుదేల్చాడు జాంబవంతుడు. ఆ సమయంలో హనుమంతుడు ఒకచోట ఏకాంతంగా కూర్చుని ఉన్నాడు.

జాంబవంతుడు హనుమంతుణ్ణి చేరాడు. అతని శక్తియుక్తులెంతటివో తెలుపుతూ ప్రేరేపించాడు. దీనికి వానరుల ప్రశంసలు తోడైనాయి. ఇంకేముంది? హనుమంతుడు రెట్టించిన ఉత్సాహంతో బలాన్ని పుంజుకున్నాడు. అద్భుతమైన తేజస్సుతో వెలుగుతున్నాడు. వానరులతో 'నేను మేరుపర్వతాన్ని అనాయాసంగా వేలమార్లు చుట్టగలిగాను భూమండలాన్ని సముద్రంలో ముంచగలను, గ్రహ నక్షత్రాలను అధిగమించగలను, పర్వతాలను నుగ్గు నుగ్గు చేయగలను. మహాసముద్రాలను అవలీలగా దాటగలన'ని ఆత్మశక్తిని ప్రకటించాడు. ప్రతివారిలో ఏదో ఒక శక్తి ఉంటుంది. సరైన ప్రేరణ దొరికితే అది వెలికి వస్తుంది.

హనుమంతుడి మాటలకు జాంబవంతుడు ఆనందించాడు. 'నాయనా! నీ ధైర్యోత్సాహాలకు తగినట్లు మాట్లాడావు. నీ మాటలు వానరుల మనసులో గూడుకట్టుకున్న దుఃఖాన్ని దూరం చేశాయి. అందరం నీ శుభాన్ని కోరుతున్నాం. ఋషులు, వృద్ధవానరులు, గురువుల అనుగ్రహంతో ఈ సముద్రాన్ని లంఘించు. నీ రాకకోసం ఎదురుచూస్తుంటాం. మన వానరుల ప్రాణాలన్నీ నీపైనే ఆధారపడివున్నా'యని తెలిపాడు. తాను లంఘించే సమయంలో తన బలాన్ని భూమి భరించలేదని, మహేంద్రపర్వత శిఖరాలు అందుకు తగినవని హనుమంతుడు పలికి మహేంద్రగిరికి చేరాడు.



# సుందర కాండం



మహాబలుడైన మారుతి సూర్యునికి, మహేంద్రునికి, వాయువుకు, బ్రహ్మకు, ఇతరదేవతలకు నమస్కరించాడు. తన శరీరాన్ని పెంచాడు. ఒళ్ళువిరిచాడు. ప్రళయకాల మేఘగర్జనలా మహానాదంచేశాడు. చేతులను నడుముమీద ఉంచాడు. పాదాలను దట్టించాడు. చెవులను రిక్కించాడు. తోకను విదల్చాడు. అంగదాది మహావీరులతో, 'వాయువేగంతో సాగిపోయే రామబాణంలాగ లంకకు వెళతాను. అక్కడ సీతామాతను చూడలేకుంటే అదే వేగంతో స్వర్గానికి వెళ్ళటం. అక్కడ కూడా సీతామాత దర్శనం కాకుంటే రావణుని బంధించి తీసుకువస్తా. ఏది ఏమైనా కార్యసఫలతతో తిరిగివస్తా'నని పలికాడు. ఒక్క ఉదుటున అంతరిక్షంలోకి ఎగిరాడు. శ్రీరామకార్యమునకు వెళుతున్న హనుమంతునికి సూర్యుడు తాపాన్ని కలిగించలేదు. వాయువు చల్లగా ప్రసరించాడు. దేవతలు, గంధర్వులు, మహర్షులు కీర్తించారు.

సముద్రముపై సాగిపోతున్న హనుమంతుణ్ణి చూసి సాగరుడు సహాయపడదలచాడు. తానింతవాడు కావడానికి ఇక్ష్వాకు ప్రభువైన సగరుడేకారణమని సాగరుని అభిప్రాయం. ఆ ఇక్ష్వాకు కులతిలకుడైన శ్రీరాముని కార్యంకోసం వెళుతున్న హనుమంతునికి శ్రమ కలగకూడదనుకున్నాడు. సముద్రంలో ఉన్న మైనాకుణ్ణి బయటకు రమన్నాడు. అతని బంగారు గిరిశిఖరాలమీద హనుమంతుడు ఒకింతసేపు విశ్రాంతి తీసుకోగలడని భావించాడు. మైనాకుడు సరేనన్నాడు. ఒక్కసారిగా సముద్రంమధ్యనుంచి పైకి లేచాడు. అకస్మాత్తుగా పైకి లేచిన మైనాకుణ్ణి తనకు ఆటంకంగా తలచాడు మారుతి. తన ఎదతో నెట్టివేశాడు. మైనాకుడు అబ్బురపడ్డాడు. మానవరూపంలో గిరిశిఖరం మీద నిలచాడు. సముద్రుని కోరికను తెలిపాడు. హనుమంతుడు మైనాకునితో 'నీ ఆదరపూర్వకమైన మాటలకు తృప్తిపడ్డాను. ఆతిథ్యం అందుకున్నట్లే భావించు. సమయంలేదు. ఆగడానికి వీలులేదు' అని చెప్పి చేతితో అతణ్ణి తాకాడు. ఆతిథ్యం గ్రహించినట్లుగా తెలిపి ముందుకుసాగాడు.

హనుమంతుణ్ణి పరీక్షించడానికి వచ్చిన 'సురస' అనే నాగమాత అతని సూక్ష్మబుద్ధిని, సమయస్ఫూర్తిని చూసి ఆనందించి ఆశీర్వదించింది. 'సింహిక' అనే రాక్షసి హనుమంతుని మింగాలని చూసింది. కాని హనుమంతుడే తన వాడి అయిన గోళ్ళతో సింహికను చీల్చేశాడు.

త్రికూట పర్వతంమీదున్న లంకకు చేరాడు హనుమంతుడు. నూరు యోజనాలు ప్రయాణించినా అణుమాత్రమైనా అలసిపోలేదు. శత్రుదుర్భేద్యమైన లంకను చూశాడు. అందులో ప్రవేశించడానికి రాత్రి సమయమే అనుకూలమనుకున్నాడు. అంతవరకు వేచి ఉన్నాడు. రాత్రికాగానే పిల్లి ప్రమాణంలోకి తన శరీరాన్ని కుదించుకుని లంకలోకి ప్రవేశించాడు. ఇంతలో లంకాధిదేవత (లంకిణి) అతన్ని చూసింది. 'నీవెవరు? ఎందుకొచ్చావ'ని నిలదీసింది. యథార్థం చెప్పమని గద్దించింది. తనను కాదని లంకలో ప్రవేశించడం సాధ్యంకాదన్నది. తన చేతిలో చావు తప్పదని హనుమంతుణ్ణి బెదిరించింది. హనుమంతుడు 'లంకానగరం అందంగా ఉంటుందని విన్నాను. ఒకసారి చూసిపోవాలని వచ్చాను. చూశాక వచ్చిన దారినే వెళతా'నని చెప్పాడు. లంకిణి భయంకరంగా అరుస్తూ తన అరచేతితో హనుమంతుని బలంగా కొట్టింది. హనుమంతుడు మహానాదం చేస్తూ ఎడమచేతితో లంకిణిపై

ఒక్కదెబ్బవేశాడు. స్త్రీ అని గట్టిగా కొట్టలేదు. కాని ఆమాత్రం దెబ్బకే కూలబడిపోయింది లంకిణి. బ్రహ్మవరం జ్ఞాపకం చేసుకుంది. ఒక వానరుడు వచ్చి లంకిణిని జయించినప్పుడు రాక్షసులకు కీడుమూడుతుందని బ్రహ్మ చెప్పాడు. ఆ సమయం ఆసన్నమైందని హనుమంతునితో పలికింది. లంకలోకి వెళ్ళమని చెప్పింది.

హనుమంతుడు ముఖద్వారం గుండా లంకలోకి వెళ్ళలేదు. ప్రాకారంపై నుండి దూకి వెళ్ళాడు. అది కూడా ఎడమ పాదం ముందుబెట్టి. శత్రువుల వద్దకు వెళ్ళే సంప్రదాయం ఇది. లంకలో ప్రవేశించిన మారుతి చిత్రవిచిత్రాలైన ఇండ్లను చూశాడు. సంగీత మాధుర్యాన్ని చవిచూశాడు. వేదఘోషను విన్నాడు. రకరకాల వాళ్ళను చూశాడు. సర్వాంగ సుందరమైన రావణుని భవనాన్ని చూశాడు. ఎక్కడా సీత జాడ కనిపించలేదు. మహాపార్శ్వ, కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వాదుల భవనాలన్నీ వెతికాడు.

రావణాంతఃపురంలోకి వెళ్ళాడు. ఎందరో స్త్రీలు చెల్లా చెదరుగా పడుకొని నిద్రపోవడం చూశాడు. ప్రత్యేక శయ్యపై పవళించిన ఒక స్త్రీని చూశాడు. మహా సౌందర్యంతో వెలిగిపోతున్న ఆమె రావణుని భార్య మండోదరి. కాని హనుమంతుడు సీత అని భ్రమించాడు. సీతను చూశాననుకొని గంతులు వేశాడు. కొద్దిసేపటికే తన ఆలోచన తప్పని గ్రహించాడు. శ్రీరాముని ఎడబాసి సీత ఇలా ఉండగలుగుతుందా? అని అనుకున్నాడు. ఆమె సీతకానేకాదని నిశ్చయించుకున్నాడు.

ఎక్కడా సీత జాడ తెలియకపోయేసరికి సీత మరణించిదేమోనని సందేహించాడు హనుమంతుడు. సీత జాడను కనిపెట్టలేకపోయిన తాను ఏ ముఖం పెట్టుకుని తిరిగివెళ్ళాలని బాధపడ్డాడు. అయినా నిరుత్సాహపడగూడదని నిర్ణయించుకున్నాడు. ఇంత వరకు వెతకని ప్రాంతాలకు వెళ్ళాలని తీర్మానించుకున్నాడు. ఎక్కడకు వెళ్ళినా నిరాశే కలుగుతున్నది. సీత కనబడలేదని చెపితే శ్రీరాముడు జీవించడు. అతడు లేక లక్ష్మణుడుండడు. వీరి మరణ వార్త విని భరత శత్రుఘ్నులుండరు. పుత్రుల మరణానికి తట్టుకోలేక కౌసల్యా సుమిత్ర కైకేయీ తనువులు చాలిస్తారు. ప్రియమిత్రుణ్ణి వీడి సుగ్రీవుడు బతకడు. దానితో రుమ, తార, అంగదులు మిగలరు. ఇది చూసి వానరజాతి ఈ లోకాన్ని వీడుతుంది. ఇందరి మరణానికి కారణం కావడంకన్నా ప్రాయోపవేశంతో ప్రాణాలు వదలడమే మంచిదనిపించింది మారుతికి. కాని తర్కించి చూస్తే ఆత్మహత్యకన్నా బతికుండడమే ఎన్నో విధాల ఉత్తమమనిపించింది. చచ్చి సాధించేదేమిటి? బతికితే సుఖాలను, శుభాలను పొందవచ్చు. బతికి ఉన్నవాళ్ళు ఎన్నడైనా కలుసుకోవచ్చు. అందుకే ప్రాణాలను నిలుపుకోవాలని నిర్ణయించుకున్నాడు.

అప్పటివరకు వెతకని అశోకవనంలోకి వెళ్ళాలనుకున్నాడు హనుమంతుడు. సీతారామలక్ష్మణులకు, రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకు సూర్యచంద్ర మరుద్గణాలకు నమస్కరించాడు. అశోకవనంలోకి అడుగుపెట్టాడు. ఇంద్రుని నందనవనం లాగా ఉంది అశోకవనం.

అణువణువునా వెదికాడు హనుమంతుడు. ఎత్తైన శింశుపావృక్షాన్ని ఎక్కాడు. దానికింద మలిన వస్త్రాలను కట్టుకొని ఉన్న ఒక స్త్రీని చూశాడు. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలున్నారు. ఆమె కృశించి ఉంది. దీనావస్థలో ఉంది. ఆమె సీతే అనిపించింది హనుమంతునికి. ఆమె ధరించిన ఆభరణాలను చూశాడు. రాముడు చెప్పిన వాటితో సరిపోలాయి. ఋష్యమూక పర్వతంమీద పడిన ఆభరణాలు ఆమె శరీరంపై కనిపించడంలేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఆమె సీతే అని ధృవపరచుకున్నాడు. ఆ వృక్షంపైనే ఉండిపోయాడు.

సీతాదేవిని చూడగానే హనుమంతుని కన్నుల నుండి ఆనందాశ్రులు జారాయి. శ్రీరాముని స్మరించుకొని నమస్కరించాడు.

వేకువజామయింది. వేదఘోషలు వినబడుతున్నాయి. నిద్రలేచిన రావణుడు అశోకవనంవైపు అడుగులు వేస్తున్నాడు. సుగంధతైలాలతో తడిసి ఉన్న కాగడాలను ధరించిన స్త్రీలు ముందు నడుస్తున్నారు. రావణుని తేజస్సు చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు హనుమంతుడు. సీత దగ్గరికి వచ్చి రావణుడు నయానా భయాన సీత మనసుమార్చే ప్రయత్నం చేశాడు. కాని ఎలాంటి ప్రలోభాలకు తాను లొంగనని సీత తేల్చిచెప్పింది. శ్రీరాముడి నుంచి తప్పించుకోవడం సాధ్యంకాదని హెచ్చరించింది. రావణునిలో

ఆవేశం పెల్లుబికింది. రెండు నెలల గడువు విధించాడు. ఎలాగైనా సీతను తన దారికి తెమ్మని రాక్షస స్త్రీలను ఆదేశించి తన భవనానికి చేరుకున్నాడు.

రాక్షస స్త్రీలు ఎన్నో రకాలుగా సీతకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె నిరాకరించింది. చివరకు సీతను చంపుతామని భయపెట్టారు. ఈ దుఃస్థితికి సీత ఎంతో విలపించింది. శ్రీరాముడికి దూరమై బతకడంకన్నా శరీరాన్ని విడవడమే మేలన్నది.

ఈ మాటలను విని కొందరు రాక్షస స్త్రీలు రావణుడికీ ఈ విషయం చెప్పడానికి వెళ్ళారు. ఇంకొందరు తక్షణమే సీతను బంధించగలమన్నారు. అంతవరకు నిదురించిన త్రిజట అప్పుడే మేల్కొంది. త్రిజట విభీషణుని కూతురు. రాక్షస స్త్రీలను అదలించింది. తనకు వచ్చిన కలను చెప్పింది. 'వేయి హంసలతో కూడిన పల్లకిమీద లక్ష్మణుడితో శ్రీరాముడు కూర్చునట్లు చూశాను. సముద్రం మధ్య ఒక తెల్లని పర్వతంమీద సీత కూర్చోవడం చూశాను. నూనెపూసిన శరీరంతో రావణుడు నేలమీద పడిఉండడం చూశాను. ఒక నల్లని స్త్రీ శరీరమంతా బురద పూసుకొని ఎర్రని వస్త్రములు కట్టి, రావణుని మెడకు తాడుకట్టి దక్షిణంవైపుగా ఈడ్చుకువెళ్ళడం చూశాను. వరాహం మీద రావణుడు, మొసలిమీద ఇంద్రజిత్తూ, ఒంటెమీద కుంభకర్ణుడు దక్షిణదిశగా వెళ్ళడం చూశాను. లంక ఛిన్నభిన్నం కావడం చూశాను' అన్నది. స్వప్నంలో విమానదర్శనం కావడాన్ని బట్టి సీత కోరిక సిద్ధిస్తుందని, రావణునికి వినాశం తప్పదని, శ్రీరాముడికి జయం కలుగుతుందనీ చెప్పింది.

ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ సీతకు శుభశకునాలు తోచాయి. చెట్టుపైన ఉన్న హనుమంతుడు సీతాదేవిని ఎలా కాపాడుకోవాలో అని మథనపడ్డాడు. రామకథాగానమే సరైన మార్గమని ఎంచుకున్నాడు. సీతాదేవికి వినపడేటట్లు రామకథను వర్ణించాడు. సీతాదేవి అన్నివైపులా చూసింది. చెట్టుమీదున్న హనుమంతుణ్ణి చూసి ఆశ్చర్యానికి లోనైంది. హనుమంతుడు చెట్టుదిగి నమస్కరించాడు. 'అమ్మా నీవెవరు? ఒకవేళ సీతాదేవివే అయితే శుభమగుగాక. దయతో విషయాలు చెప్పు'మని ప్రార్థించాడు. తనను 'సీత' అంటారని తెలిపిందా సాధ్వి – తన వృత్తాంతమంతా వివరించింది.



హనుమంతుడు తాను శ్రీరామ దూతనని చెప్పుకొన్నాడు. దగ్గరగా వస్తున్న మారుతిని చూసి రావణునిగా అనుమానించింది సీత. నిజంగా రామదూతవే అయితే రాముణ్ణి గురించి వినిపించమంది. సీత కోరికపైన హనుమంతుడు శ్రీరాముడి రూపగుణాలను వివరించాడు. శ్రీరాముడి ముద్రికను సమర్పించాడు. దాన్ని చూసి పరమానందభరితురాలైంది సీత. తనదైన్యాన్ని వివరించి శ్రీరాముణ్ణి త్వరగా లంకకు తీసుకువచ్చి రాక్షసుల చెరనుండి తనను విడిపించమని చెప్పమని మారుతికి చెప్పింది. అంతదాకా ఎందుకు? తన వీపుమీద కూర్చుంటే తక్షణమే శ్రీరాముడి సన్నిధికి చేరుస్తానన్నాడు హనుమంతుడు. ఇంత చిన్నవాడివి ఎలా తీసుకెళ్ళగలవని ప్రశ్నించింది సీత. హనుమంతుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. సంతోషించింది సీత. అయినా హనుమతో వెళ్ళడానికి నిరాకరించింది. పరపురుషుని తాకనన్నది. శ్రీరాముడు రావణుణ్ణి సంహరించి తనను తీసుకుపోవడమే ఆయన స్థాయికి తగినదన్నది.

'అమ్మా! నా వెంట రావడం నీకు అంగీకారయోగ్యం కాకుంటే శ్రీరాముడు గుర్తించగల ఏదైనా ఆనవాలు ఇ'మ్మని అడిగాడు హనుమంతుడు. తమ అనుబంధానికి గుర్తుగా కాకాసురుని కథ చెప్పింది. కొంగుముడి విప్పి అందులోని దివ్యచూడామణిని హనుమంతునికిచ్చింది.

సీతాదేవి దర్శనంతో ప్రధాన కార్యం ముగిసింది హనుమంతునికి. రావణుడు, అతని సైన్యపు శక్తిసామర్థ్యాలను కూడా తెలుసుకోవాలనిపించింది. అందుకు అశోకవనాన్ని ధ్వంసం చేయడమే మార్గంగా భావించాడు. అనుకున్నంతా చేశాడు ఆ కపివీరుడు. రాక్షస స్త్రీలు పరుగుపరుగున వెళ్ళి లంకేశునికీవిషయం చెప్పారు. రావణుడు ఎనభైవేల మంది రాక్షసులను పంపాడు. హనుమంతుడు వాళ్ళను మట్టుపెట్టాడు. తనపైకి వచ్చిన జంబుమాలిని, మంత్రిపుత్రులేడుగురిని రావణుడి సేనాపతులైదుగురిని, అక్షకుమారుణ్ణి అంతమొందించాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి హనుమంతుణ్ణి బంధించాడు. బ్రహ్మవరంచేత అది హనుమంతునిమీద క్షణకాలమే పనిచేస్తుంది. అయినా తాను దానికి కట్టుబడి ఉన్నట్లు నటించాడు హనుమంతుడు. రావణుని ముందు ప్రవేశపెట్టారతన్ని. రావణుడడుగగా తాను రామదూతనని చెప్పాడు. శ్రీరాముని పరాక్రమమెలాంటిదో సభాముఖంగా చాటాడు. సహించలేని రావణుడు హనుమంతుణ్ణి చంపమని ఆజ్ఞ ఇచ్చాడు. దూతను చంపడం భావ్యం కాదన్నాడు విభీషణుడు. ఇతర పద్ధతుల్లో దూతను దండించవచ్చునన్నాడు.

హనుమంతుని తోకకు నిప్పంటించి లంకంతా కలయ దిప్పమన్నాడు రావణుడు. బట్టలతో హనుమంతుని తోకను చుట్టారు. నూనెతో తడిపారు. తోకకు నిప్పుపెట్టి ఊరంతా ఊరేగిస్తున్నారు. హనుమంతుడు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాడు. విభీషణుని భవనం తప్ప లంకకంతా నిప్పుపెట్టాడు. అందుకే '(సీతను) చూసిరమ్మంటే (లంకను) కాల్చివచ్చాడని' సామెత పుట్టింది. లంకలో హాహాకారాలు మిన్నుముట్టాయి.

లంకను కాల్చాక హనుమంతుడు సముద్రంలో తోకను చల్లార్చుకున్నాడు. తోకతోపాటు ఆయన కోపంకూడా చల్లారింది. తాను తప్పు చేశాననుకున్నాడు. కోపం ఎంతో అనర్థదాయకమనుకున్నాడు. లంకంతా కాలి సీతామాత కూడా కాలిపోయి ఉంటుందని బాధపడ్డాడు. వచ్చిన పనిని చేజేతులా పాడుచేసుకొన్నందుకు తనను తాను నిందించుకున్నాడు. కాని ఎక్కడో చిన్న ఆశ. తన తోకనే కాల్చని అగ్నిదేవుడు పరమ పూజ్యురాలైన సీతను దహిస్తాడా? అని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇంతలో సీత క్షేమంగా ఉందని చారణుల ద్వారా తెలుసుకొని చాలా సంతోషించాడు. సీతమ్మ దగ్గరికి చేరి పాదాభివందనం చేశాడు. ఆమె అనుమతితో తిరుగు ప్రయాణమయ్యాడు.

'అరిష్టం' అనే పర్వతాన్ని ఎక్కాడు. అక్కడి నుంచి ఆకాశంలోకి ఎగిరాడు. మధ్యలో ఆత్మీయపూర్వకంగా మైనాకుడిని తాకి వేగంగా ప్రయాణం కొనసాగించాడు. మహేంద్రగిరికి చేరుకోబోతుండగా మహానాదం చేశాడు. జాంబవంతుడు దానిని విని పొంగిపోయాడు. హనుమంతుడు విజయుడై తిరిగివస్తున్నాడని వానరులకు తెలిపాడు.

హనుమంతుడు మహేంద్రగిరి శిఖరంమీద అడుగుపెట్టాడు. వానరులంతా చుట్టూచేరారు. పెద్దలకు నమస్కరించాడు హనుమంతుడు. 'చూశాను సీతమ్మ'ను అని ప్రకటించాడు. అందరూ ఆనందించారు. లంకా ప్రయాణ విశేషాలను వారికి వివరించాడు మారుతి. అంగదుడు 'ఓ వీరులారా! సీతాదేవి జాడ తెలిసిన తరవాత కూడా ఆమె లేకుండా శ్రీరాముడి దగ్గరికి వెళ్ళడం సబబుకాదు. లంకకు వెళ్ళి రావణుని చంపి సీతను తీసుకొని శ్రీరాముని వద్దకు వెళదా'మని అన్నాడు. జాంబవంతుడు అంగదుడి మాటలను ఖండించాడు. శ్రీరామసుగ్రీవులు సీతను చూసిరమ్మన్నారేకాని తీసుకురమ్మనలేదు. పైగా రావణుణ్ణి సంహరిస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. దానికి భంగం కలగనీయగూడదన్నాడు. అందరూ వెళ్ళి జరిగిన విషయాలను నివేదిద్దామన్నాడు.

దారిలో అందరూ మధువనంలోకి వెళ్ళారు. తేనెలు తాగారు. మధువనాన్ని ధ్వంసంచేశారు. మధువనం సుగ్రీవుని రక్షణలో ఉన్నది. అతని మేనమామ దధిముఖుడు దాన్ని కాపాడుతున్నాడు. వానరుల ధాటికి దధిముఖుడు గాయాల పాలయ్యాడు. వెంటనే వెళ్ళి సుగ్రీవునికీ విషయం చెప్పాడు. ఇదంతా శుభసూచకంగా భావించాడు సుగ్రీవుడు.

అంగద హనుమదాదులు శ్రీరాముడు సుగ్రీవుడున్న చోటుకు చేరారు. హనుమంతుడు శ్రీరామునకు సాష్టాంగ నమస్కారం చేశాడు. 'చూశాను సీతమ్మను' అని చెప్పాడు. రామలక్ష్మణుల ఆనందానికి అంతులేదు. సీత ఇచ్చిన చూడామణిని శ్రీరాముడికి సమర్పించాడు హనుమంతుడు. శ్రీరాముడు కోరగా సీతాన్వేషణ వృత్తాంతాన్ని చెప్పాడు.



# యుద్ధ కాండం



శ్రీరాముడు హనుమంతుడి సాహసాన్ని ప్రశంసించాడు. గరుత్మంతుడికి, వాయుదేవుడికి, హనుమంతుడికి తప్ప ఈ మహాసముద్రాన్ని లంఘించడానికి ఇతరులకు సాధ్యం కాదన్నాడు. ఇచ్చిన పనిని సాధించడమేగాక, దానికి భంగం కల్గకుండా దానికనుబంధమైన ఇతర కార్యాలను సాధించేవాడు ఉత్తముడైన సేవకుడు. కేవలం ఇచ్చిన పనినే నెరవేర్చేవాడు మధ్యముడు. తనకు సామర్థ్యం ఉన్నా ఇచ్చిన పనిని పూర్తిచేయనివాడు అధముడు. సీతాదేవి కుశల వార్త చెప్పి మహోపకారం చేసిన హనుమంతునకు ఏమియ్యగలనంటూ దగ్గరకు తీసుకొని గట్టిగా గుండెకు హత్తుకున్నాడు శ్రీరాముడు. ఇదే తానియ్యగల సర్వస్వమన్నాడు. ఆదరాభిమానాలకు మించిన ఆస్తి ఉండదు కదా!

శ్రీరాముడి మనసులో మళ్ళీ దుఃఖం పొంగిపొర్లింది. సుగ్రీవుడు ఊరడించాడు. నిరుత్సాహం ప్రయోజనాలను నాశనం చేస్తుందన్నాడు. దుఃఖం శౌర్య పరాక్రమాలను దిగజారుస్తుందన్నాడు. శత్రువు విషయంలో ఇప్పుడు దుఃఖం కాదు, క్రోధం చూపవలసిన సమయమని సూచించాడు. మహాసముద్రంమీద సేతువును కట్టకుండా లంకను జయించడం ఇంద్రాది దేవతలకు కూడా సాధ్యం కానిపని అన్నాడు. శ్రీరాముడు అడిగినమీదట హనుమంతుడు లంకానగరంలోని రక్షణ వ్యవస్థను గురించి వివరంగా చెప్పాడు.

మధ్యాహ్నమైంది. ఈ విజయ ముహూర్తమే లంకా ప్రయాణానికి తగినదని శ్రీరాముడు సుగ్రీవునితో అన్నాడు. శ్రీరాముడు వానరులతో, 'నీలుడు సైన్యానికి మార్గం చూపుతూ ముందునడవాలి. లక్షలాది వానరులు అతణ్ణి అనుసరించాలి. బాలురు వృద్ధులు, బలహీనులు కిష్కింధలోనే ఉండాలి. సుగ్రీవా! నేను హనుమంతుడి భుజంమీదా, లక్ష్మణుడు అంగదుడి భుజంమీదా కూర్చొని ముందుకు సాగుతాం. నువ్వు పల్లకినెక్కి మాతోపాటు రావాలి. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి సైన్యం వెనుకభాగంలో ఉండి రక్షణ బాధ్యతను చూడాలి. వెళ్ళేమార్గంలో నగరాలు, గ్రామాలు ఉంటే వాటిలోకి వెళ్ళగూడదు. జల, ఫల, సహితమైన మార్గం వెంట మనం ప్రయాణించాలి' అని రాముడు సూచించాడు. ఉత్సాహం ఉరకలు వేస్తుంటే అందరూ సముద్రతీరాన్ని చేరుకున్నారు.

లంకలో రావణుడు మంత్రులతో సమావేశమయ్యాడు. వానరులను ఎదుర్కొని లంకను కాపాడుకోవడానికి ఏం చేయాలో నిర్ణయించమన్నాడు. సభలోని వారు రావణ, ఇంద్రజిత్తుల పరాక్రమాన్ని పొగిడారు. నరవానరులను లెక్కచేయాల్సిన అవసరం లేదని పెదవి విరిచారు. 'రాముణ్ణి హతమార్చగల'వని లంకేశునికి ఆత్మస్థైర్యాన్ని కలిగించారు. ప్రహస్తుడు మొదలైనవారు శత్రుసేనలను తామే తుదముట్టించగలమని డంబాలు పలికారు.


ఇవన్నీ విన్నాడు రావణుని సోదరుడు విభీషణుడు. రాక్షసులతో 'శత్రువుల శక్తిసామర్థ్యాలను తెలుసుకోకుండా వారిని చులకనగా భావించకూడదు. శ్రీరాముడు మనకేం అపకారం చేశాడు? మన రాజే సీతను అపహరించుకు వచ్చాడు. దీనివల్ల పాపం వస్తుంది. కీర్తిప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఆయుష్షు తగ్గుతుంది. సంపదలన్నీ నశిస్తాయి. కనుక సీతను శ్రీరామునికి

అప్పగించడమే అన్ని విధాలా మంచిది. అనవసరంగా కలహం తెచ్చుకోవడం దేనికి? పైగా శ్రీరాముని వంటి మహావీరునితో యుద్ధం తగదు' అంటూ రావణునివైపు తిరిగాడు. 'అన్నా! అనవసరంగా కోపించడం మంచిదికాదు. అది ధర్మానికి ఆటంకమౌతుంది. సుఖాలను దూరంచేస్తుంద'ని హితవు పలికాడు. విభీషణుని ఈ హితబోధ 'చెవిటివాని ముందు శంఖమూది'నట్లయింది. రావణుని భవనానికి వచ్చిన కుంభకర్ణుడు కూడా రావణుణ్ణి తప్పుపట్టాడు. సీతాపహరణ సమయంలో తనను సంప్రదించి ఉంటే బాగుండేదన్నాడు. ఇప్పుడు ఆలోచించి ప్రయోజనం లేదన్నాడు. ఇదంతా 'గతజలసేతుబంధనమే' (నీళ్ళుపోయిన తరువాత అడ్డుకట్టవేయడం)నని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పాడు. 'నువ్వు శత్రువు పట్ల వ్యవహరించిన తీరు సరైనది కాదు, శ్రీరాముడు నిన్ను ఇంకా చంపకుండా ఉండడం నీ అదృష్టం' అన్నాడు. ఇవన్నీ ఎలా ఉన్నా శ్రీరాముణ్ణి తుదముట్టించే భారం తనదేనని ప్రకటించుకున్నాడు కుంభకర్ణుడు.

రావణుడు విభీషణుని మాటలకు క్రోధావేశాలకు లోనయ్యాడు. తీవ్రస్థాయిలో నిందించాడు. అన్న తండ్రితో సమానుడని అతని నిందలను సహించాడు విభీషణుడు. కాని రావణుని అధర్మమార్గాన్ని మాత్రం సమర్థించలేదు. ధర్మం వీడిన రావణుని వీడడానికే విభీషణుడు నిర్ణయించుకున్నాడు. రెండు గడియల్లో రామలక్ష్మణులున్నచోటికి నలుగురు అనుచరులతో చేరాడు.

ఆకాశంలోనే నిలిచి శ్రీరాముణ్ణి శరణుకోరాడు విభీషణుడు. అనుగ్రహించాడు దాశరథి. విభీషణుడు శ్రీరాముడి పాదాలపై వాలాడు. రావణుని విషయాలన్నీ సంక్షిప్తంగా చెప్పాడు. శ్రీరాముడు విభీషణునితో 'నేను రావణుని బంధుమిత్ర సమేతంగా హతమార్చి నిన్ను రాజును చేస్తా'నని తమ్ములమీద ఒట్టేసి చెప్పాడు. ఈ పనిలో తాను యథాశక్తి సహాయపడగలనని విభీషణుడు మాట ఇచ్చాడు. రాముడు విభీషణుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. లక్ష్మణుడితో వెంటనే సముద్రజలం తెచ్చి లంకారాజుగా విభీషణుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయమన్నాడు. శ్రీరాముడి ఆజ్ఞ వెంటనే ఆచరణ రూపం దాల్చింది. అందరూ ఆనందాన్ని ప్రకటించారు.

సముద్రాన్ని దాటే ఉపాయమేమిటని సుగ్రీవుణ్ణి ప్రశ్నించాడు శ్రీరాముడు. సముద్రుణ్ణి ప్రార్థించడంవల్ల ఇది సాధ్యపడుతుందన్నాడు విభీషణుడు. శ్రీరాముడు సముద్రతీరంలో దర్భాసనంమీద కూర్చుని సముద్రుణ్ణి ఉపాసించాడు. మూడు రాత్రులు గడిచాయి. సముద్రుడు ఎదట నిలువలేదు. శ్రీరాముడి కన్నులు ఎర్రబారాయి. సముద్రుడి అహంకారాన్ని అణగదొక్కాలనుకున్నాడు. నీటినంతా ఇంకిపోయేటట్టు చేయాలనుకున్నాడు. బ్రహ్మాస్త్రాన్ని స్మరించాడు. ప్రకృతంతా అల్లకల్లోలమౌతున్నది. సముద్రుడు భయపడి పారిపోతున్నాడు. పరుగెత్తే వానిపై బాణం ప్రయోగించరాదని ఆగాడు శ్రీరాముడు. సముద్రుడు దారికి వచ్చాడు. లంకకు వెళ్ళడానికి దారినిస్తానన్నాడు. ఎక్కుపెట్టిన బాణం వృథాకారాదు. ఎక్కడ ప్రయోగించాలో చెప్పమన్నాడు శ్రీరాముడు. పాపాత్ములు దోపిడిదారులు ఉండే 'ద్రుమకుల్యం'పైన ప్రయోగించమన్నాడు సముద్రుడు. అది జరిగిపోయింది.



విశ్వకర్మ కుమారుడైన 'నలుడు' శిల్పకళానిపుణుడు. ఉత్సాహం, శక్తి ఉన్నవాడు. సేతువు (వంతెన) ను నిర్మించడానికి అతడే యోగ్యుడని సముద్రుడు తెలిపాడు. ఆ సేతువును తాను భరిస్తానని మాట ఇచ్చాడు. సేతువు నిర్మాణానికి వానర నాయకులకు ఆజ్ఞ ఇచ్చాడు శ్రీరాముడు. అందరూ మహారణ్యం దారి పట్టారు. పెద్దపెద్ద చెట్లను బండరాళ్ళను మోసుకువస్తున్నారు. సముద్రంలో పడేస్తున్నారు. వాటి దెబ్బకు

సముద్రంలోని నీరు ఆకాశానికి ఎగిసిపడుతున్నది. నలుని సూచనలననుసరించి కొలతల ప్రకారం సేతువు నిర్మాణం జరుగుతూంది. వందయోజనాల పొడవు, పది యోజనాల వెడల్పుగల సేతువును కట్టడం ఐదు రోజుల్లో పూర్తయింది.

శ్రీరామలక్ష్మణులు సుగ్రీవునితో కలసి ముందు నడుస్తున్నారు. సైన్యం వారిని అనుసరిస్తున్నది. సైన్యంలో కొందరు వెనక నడుస్తున్నారు. కొందరు సేతువు మధ్యభాగంలో, మరి కొందరు రెండు పక్కలా నడుస్తున్నారు. కొందరు సముద్రంలో దూకి ఈదుతూ వస్తూంటే మరికొందరు ఆకాశంలో ఎగిరి వస్తున్నారు. వారు చేసే కోలాహలానికి సముద్రమే మౌనం దాల్చింది. అందరూ అవతలి తీరం చేరారు.

శ్రీరాముడు యుద్ధనీతిని అనుసరించి సైన్యాన్ని వివిధ విభాగాలుగా విభజించాడు. ఎవరి బాధ్యతలను వాళ్ళకు అప్పగించాడు. రావణుడి మంత్రులైన శుకసారణులు శ్రీరాముని బలం తెలుసుకోవాలని వానర రూపాలుదాల్చి వానరులలో చేరారు. విభీషణుడు వాళ్ళను గుర్తించి శ్రీరాముని ఎదుట నిలిపాడు. క్షమించాడు శ్రీరాముడు. తమను గురించి ఇంకా ఏమన్నా తెలుసుకోవాలంటే అడ్డులేదని వాళ్ళకు చెప్పాడు. సీతను వెంటనే అప్పగించకపోతే తన చేతిలో చావు తప్పదని రావణుడికి చెప్పవలసిందిగా సూచిస్తూ శుకసారణులను పంపించివేశాడు. వారు వెళ్ళి ఇక్కడి విషయాలన్నీ పొల్లుబోకుండా రావణునికి తెలిపారు.

రావణుడు సీత విషయంలో మరొక ఎత్తుగడ వేశాడు. అశోకవనం వెళ్ళి రాముడు తనచేతిలో హతుడైనాడని సీతతో పలికాడు. ఆమె నమ్మలేదు. మాయావియైన విద్యుజ్జిహ్వుణ్ణి పిలిచాడు. అతడు శ్రీరామునిదే అనిపించే మాయాశిరస్సును, ధనుర్బాణాలను తీసుకొనివచ్చి చూపించాడు సీతకు. ఇప్పటికైనా తన్నాశ్రయించమని సీతను కోరాడు రావణుడు. సీత కుమిలిపోయింది. రావణుడు తన భవనానికి వెళ్ళిపోయాడు. విభీషణుని భార్య 'సరమ' సీతను ఊరడించింది. ఇదంతా రాక్షస మాయ అని చెప్పింది. శ్రీరాముడు క్షేమమేనని తెలిపింది.

శ్రీరామచంద్రాదులు వానరసైన్యంతో సువేల పర్వతానికి చేరుకున్నారు. ఆరాత్రి అక్కడే గడిపారు. ఎత్తైన ఆ పర్వత శిఖరం నుండి లంకానగర శోభను చూశారు. లంకలో మేడపైభాగంలో ఠీవిగా కూర్చున్న రావణుణ్ణి శ్రీరాముడు చూశాడు. వానర ప్రముఖులూ చూశారు. సుగ్రీవుడు ఒక్క ఉదుటునలేచి కోపంతో ఊగిపోతున్నాడు. క్షణాలలో సువేల పర్వతంనుంచి రావణ భవనంపైన వాలాడు. తాను శ్రీరాముడి మిత్రుడనని, తన దగ్గర తప్పించుకోవడం నీతరంకాదని లంకేశుణ్ణి హెచ్చరించాడు. రావణుడిపైకి దూకి అతని కిరీటాన్ని తీసి నేలకు కొట్టాడు. రావణుడు రెచ్చిపోయాడు. 'సుగ్రీవా! ఇంత వరకు నీవు నా కంటబడలేదు. లేకుంటే ఎప్పుడో హీనగ్రీవుడవు (తల తెగినవాడవు) అయ్యేవాడివి' అంటూ గర్జించాడు. ఇద్దరి మధ్యా బాహాబాహి యుద్ధం జరిగింది. సుగ్రీవుడు రావణుణ్ణి ముప్పతిప్పలు పెట్టి క్షణాలలో రివ్వున ఎగిరి సువేల పర్వతంమీద వాలాడు. శ్రీరాముడు సుగ్రీవుణ్ణి సున్నితంగా మందలించాడు. తొందరపడి ఇలాంటి సాహసాలు చేయవద్దని సలహా ఇచ్చాడు.

రావణుడి దగ్గరికి అంగదుణ్ణి రాయబారిగా పంపాడు శ్రీరాముడు. సీతను అప్పగించకపోతే శ్రీరాముడి చేతిలో మరణం తథ్యమని, లంకకు విభీషణుడు రాజుకాగలడని శ్రీరాముని వాక్యంగా రావణునికి వినిపించాడు అంగదుడు. సభ అట్టుడికిపోయింది. నలుగురు రాక్షసులు అంగదుడిమీద విరుచుకుపడ్డారు. అంగదుడు వారిని తన చంకలో ఇరికించుకొని ప్రాసాదంపైకి ఎగిరాడు. అక్కడి నుండి వారిని బలంగా నేలపైకి విసిరాడు. సింహనాదం చేసి ఆకాశమార్గంలో శ్రీరాముణ్ణి చేరాడు. రావణుని భావాన్ని గ్రహించాడు శ్రీరాముడు. ధనుస్సుకు పని చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని భావించాడు.

లంకమీదికి దండయాత్ర మొదలైంది. లంకను నాలుగువైపుల నుండీ సైన్యంతో ముట్టడించాడు శ్రీరాముడు. లంకేశుడు తన భవనం మీది నుంచే పరిస్థితిని గమనించాడు. దీర్ఘాలోచనలో పడ్డాడు. యుద్ధం మొదలైంది. రెండు సైన్యాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. ఆంజనేయుడి చేతిలో జంబుమాలి, సుషేణుని చేతిలో విద్యున్మాలి మరణించారు. చీకటిలో ఎవరు ఎవరో (రాక్షసుడా? వానరుడా?) అడిగి తెలుసుకుని మరీ కొట్టుకుంటున్నారు.

అంగదుని చేతిలో రావణకుమారుడు ఇంద్రజిత్తు ఓడిపోయాడు. దీనికి తట్టుకోలేకపోయాడు. కపట యుద్ధానికి దిగాడు. రామలక్ష్మణులను మూర్ఛపోయేట్టుచేసి నాగాస్త్రంతో బంధించాడు. వారు మరణించారని భ్రాంతిపడి రావణుడి దగ్గరికి వెళ్ళి విషయాన్ని తెలిపాడు. రావణుడు అభినందించాడు. రావణుడి ఆదేశం మేరకు త్రిజట మొదలైనవారు సీతను పుష్పక విమానంపై యుద్ధ భూమికి తీసుకువెళ్ళారు. నేలమీద పడిఉన్న రామలక్ష్మణులను సీత చూసింది. మరణించారని భావించి కన్నీరు కాల్వలు గట్టేలా ఏడ్చింది. పక్కనే ఉన్న త్రిజట ఓదార్పుతో కూడిన ధైర్యాన్నిచ్చింది. రామలక్ష్మణులు బతికే ఉన్నారని ఆధారాలు చూపించింది. వానరసైన్యం ప్రసన్నంగా ఉండడం ఒక కారణమని, అన్నింటికీ మించి 'భర్త మరణించిన స్త్రీని పుష్పక విమానం తీసుకొనిరాదు' అని చెప్పడంతో సీత మనసు కుదుటపడింది. గరుత్మంతుని రాకతో రామలక్ష్మణులు నాగాస్త్ర ప్రభావం నుంచి విముక్తులైనారు. వానరులు 'జయజయ' ధ్వానాలు చేశారు. అవి రావణుని గుండెలో 'అప' శబ్దాన్ని జోడించుకొని ప్రతిధ్వనిస్తున్నాయి. హనుమంతుని చేతిలో ధూమ్రాక్షుడు, అకంపనుడు, అంగదుడి బారినపడి వజ్రదంష్ట్రుడు, నీలుడికి చిక్కి ప్రహస్తుడు యమపురిబాట పట్టారు.

రావణుని బాణశక్తికి సుగ్రీవుడు మూర్ఛపోయాడు. శ్రీరాముడు విల్లందుకున్నాడు. అన్నను వారించి లక్ష్మణుడు రావణుణ్ణి ఎదిరించడానికి పూనుకున్నాడు. వానరసేనమీద శరవర్షధారకురిపిస్తున్నాడు రావణుడు. ఆంజనేయుడు రావణుడి ధాటికి అడ్డుకట్ట వేశాడు. అరచేతితో హనుమంతుని బలంగా చరచాడు రావణుడు. మారుతి చలించిపోయాడు. అయినా క్షణంలో తేరుకున్నాడు. అరచేతితో రావణుణ్ణి ఒక్క దెబ్బ వేశాడు. దశగ్రీవుడు కంపించిపోయాడు. తేరుకుని 'వానరా! భళా, నాకు శత్రువువే అయినా నీ శక్తిని మెచ్చుకుంటున్నా'నని యుద్ధ స్ఫూర్తిని చాటాడు రావణుడు.

రావణుడు ప్రయోగించిన 'శక్తి' అనే ఆయుధం లక్ష్మణుని ఎదలో నాటుకుంది. స్పృహదప్పాడు లక్ష్మణుడు. అతన్ని ఎత్తుకొని వెళ్ళాలని శతవిధాలా ప్రయత్నించి విఫలుడైనాడు రావణుడు. అంతలో ఆంజనేయుడు రావణుడిమీద దాడిచేశాడు. వక్షఃస్థలంమీద ముష్టిఘాతంతో రావణుణ్ణి కూలబడేటట్లు చేశాడు. లక్ష్మణుణ్ణి శ్రీరాముని వద్దకు చేర్చాడు. హనుమంతుని కోరిక మేరకు అతని భుజాలపై కూర్చుని రావణునితో పోరుచేశాడు శ్రీరాముడు. శ్రీరాముని పరాక్రమం ముందు రావణుని ధనుస్సు, కిరీటం దాసోహమయ్యాయి. శ్రీరాముడు దయతలచాడు. రావణునితో' నీవు యుద్ధంలో అలసిపోయావు. సేదతీర్చుకొనిరా. అప్పుడు నా బలమేమిటో తెలుస్తుంద'ని సుతిమెత్తగా చెప్పాడు.



అంతఃపురానికి తిరిగివెళ్ళినా అవమానభారం రావణుణ్ణి ఒక చోట కూర్చోనీయడం లేదు. కుంభకర్ణుని నిద్రలేపమన్నాడు రావణుడు. అతికష్టంమీద ఆ పని సాధ్యమయింది రాక్షసులకు. కుంభకర్ణునికి ఆరు నెలలు నిద్ర ఒకరోజు భోజనం. అందుకే 'కుంభకర్ణనిద్ర' అనేది ఒక జాతీయంగా భాషలోకి వచ్చింది. కుంభకర్ణుడు రావణుణ్ణి సమీపించాడు. జరిగిందంతా చెప్పాడు రావణుడు. తెలివిగలవారు జరిగిన దానిని గూర్చి ఆలోచించరన్నాడు కుంభకర్ణుడు. తనకు సహాయపడమని కుంభకర్ణుని కోరాడు రావణుడు. 'ఆపదల పాలైన వానిని ఆదుకొనేవాడే నిజమైన మిత్రుడు. తప్పుదారి పట్టి కష్టాల్లో పడ్డవారికి చేయూతనిచ్చి ఆదుకొనేవాడే ఆప్తు'డని రావణుడన్నాడు. కుంభకర్ణుడు యుద్ధసన్నద్ధుడయ్యాడు.

కుంభకర్ణుడు యుద్ధంలో వానరులను చావుదెబ్బ తీస్తున్నాడు. వానరులు తట్టుకోలేక తలోదారి పట్టారు. శ్రీరాముణ్ణి ఆశ్రయించారు. 'ఐంద్రాస్త్రం'తో కుంభకర్ణుని శిరస్సును ఖండించి శాశ్వత నిద్రలోకి

పంపాడు శ్రీరాముడు. శ్రీరాముని బాణధాటికి కుంభకర్ణుని తల లంకలో పడిపోయింది. ఆ తల తగలడం వల్ల రాజవీథులలోని ఇంటికప్పులు, ఎత్తైన ప్రాకారాలు కూలిపోయాయి. కుంభకర్ణుణ్ణి మరణవార్త రావణుణ్ణి క్రుంగదీసింది.

రావణ కుమారుడైన అతికాయుడు లక్ష్మణుని బ్రహ్మాస్త్రానికి బలైనాడు. తమ్ముణ్ణి, కొడుకును పోగొట్టుకొని తల్లడిల్లుతున్న రావణుణ్ణి ఇంద్రజిత్తు ఓదార్చాడు. భారం తనపై వేసుకొని. యుద్ధరంగానికి వచ్చాడు. రామలక్ష్మణులమీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. రాముని సూచనమేరకు రామునితోపాటు లక్ష్మణుడు స్పృహకోల్పోయినట్లు పడివున్నాడు. వాళ్ళు మరణించారనుకున్నాడు ఇంద్రజిత్తు. తండ్రికీ వార్తను తెలిపాడు.

వానరసైన్య శిబిరంలో అలజడి మొదలైంది. విభీషణుడు ధైర్యం చెప్పాడు. రామలక్ష్మణులకు ఏమీకాలేదన్నాడు. బ్రహ్మమీది గౌరవంతో అస్త్రబాధను అనుభవించారని తెలిపాడు. బ్రహ్మాస్త్ర ప్రభావంతో అరవైఏడు కోట్ల మంది హతులయ్యారు. చాలామంది దెబ్బతిన్నారు. హనుమంతుడు, విభీషణుడు, జాంబవంతుడి కోసం వెతుకుతున్నారు. జాంబవంతుడు కనిపించాడు. సరిగ్గా చూడలేకపోతున్నానన్నాడు. ధ్వనిని బట్టి విభీషణుని గుర్తించానన్నాడు. 'హనుమంతుడు క్షేమమేనా' అని అడిగాడు. ఆంతర్యం అంతుచిక్కలేదు విభీషణునికి. 'హనుమంతుడు జీవిస్తే వానరసైన్యం చచ్చినా బతికినట్లే లేదా హనుమ మరణిస్తే అందరం బతికిఉన్నా చచ్చినవాళ్ళతో సమానమేనన్నాడు' జాంబవంతుడు. జాంబవంతుని ఆదేశంపై హిమాలయాలకు వెళ్ళి అక్కడ ఉన్న సర్వౌషధి మహాపర్వతాన్ని పెల్లగించి తీసుకువచ్చాడు హనుమంతుడు. ఓషధుల వాసనకే రామలక్ష్మణుల గాయాలన్నీ మటుమాయమయ్యాయి. చనిపోయిన వానరులు మళ్ళీ లేచికూర్చున్నారు. సుగ్రీవాజ్ఞతో వానరులు లంకకు నిప్పుపెట్టారు.

శత్రుపక్షాన్ని మానసికంగా దెబ్బతీయదలచాడు ఇంద్రజిత్తు. హనుమదాది వానరవీరులు చూస్తుండగా మాయాసీతను సంహరించాడు. అందరూ నిజమేననుకున్నారు. ఈ వార్త తెలిసి శ్రీరాముడు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇదంతా ఇంద్రజిత్తు మాయేనని విభీషణుడు తెలపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

శత్రుసంహారానికి ఇంద్రజిత్తు నికుంభిలా అభిచారహోమాన్ని తలపెట్టాడు. దాన్ని భంగంచేయడానికి రామానుజ్ఞతో లక్ష్మణుడు వెళ్ళాడు. ఇంద్రజిత్తు లక్షణుల మధ్య ఘోర యుద్ధం జరిగింది. 'ఐంద్రాస్త్రము'ను ప్రయోగించి ఇంద్రజిత్తు తలను నేలరాల్చాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుణ్ణి మెచ్చుకున్నాడు.

రావణుడు యుద్ధభూమిలో ప్రళయకాల రుద్రుడిలా విజృంభిస్తున్నాడు. వానర వీరులు తట్టుకోలేక యుద్ధరంగం నుండి కాలికి బుద్ధి చెపుతున్నారు. మరొకవైపు సుగ్రీవుని చేతిలో విరూపాక్షుడు, మహోదరుడు మట్టిగరచారు.

యుద్ధం చివరి అంకానికి చేరుతున్నది. రామలక్ష్మణులతో రావణునిపోరు తీవ్రతరమవుతున్నది. రావణుడు విభీషణుణ్ణి చంపడానికి బల్లెమెత్తాడు. అది మహాశక్తిమంతమైనది. విభీషణునికి ప్రాణాపాయ స్థితిని గమనించిన లక్ష్మణుడు రావణునిపై బాణాలను కుమ్మరించాడు. ఎటూ తోచక విభీషణుని చంపే ప్రయత్నాన్ని విరమించుకున్న రావణుడు లక్ష్మణునిపై ఆగ్రహించి 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. అది గమనించిన శ్రీరాముడు 'శక్తి'ని వేడుకున్నాడు. 'నీలోని చంపేశక్తి నశించుగాక' అని. అంతే – అది ప్రాణశక్తిని కోల్పోయింది. లక్ష్మణుడి రొమ్ముమీద బలంగా నాటుకుంది. లక్ష్మణుడు నేలమీద పడిపోయాడు. వానరులు ఆ ఆయుధాన్ని ఎంత ప్రయత్నించినా లక్ష్మణుడి రొమ్ము నుంచి తీయలేకపోయారు. రాముడు తన రెండు చేతులతో బయటికి లాగి విరచివేశాడు. ఇక ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు శ్రీరాముడు. ఈ లోకంలో ఇక రావణుడో? రాముడో? మిగిలి ఉండడం తథ్యం' అన్నాడు. శ్రీరాముడి విలువిద్యాపాండిత్యానికి ఎదురునిలువలేక రావణుడు భయంతో పరుగులు తీశాడు.

పడిపోయిన లక్ష్మణుణ్ణి చూసి విలవిలలాడిపోయాడు శ్రీరాముడు. 'ఏదేశంలోనైనా భార్య దొరకవచ్చు. బంధువులు దొరకవచ్చు. కాని లక్ష్మణుని వంటి తమ్ముడు దొరకడని కన్నీరుకార్చాడు. సుషేణుడు లక్ష్మణుని పరీక్షించి చనిపోలేదని నిర్ధరించాడు.

సుషేణుని సూచనమేరకు హనుమంతుడు ఓషధులు తేవడానికి వేగంగా వెళ్ళాడు. ఓషధీపర్వతాన్నే తెచ్చాడు. ఓషధీ ప్రభావంతో లక్ష్మణుడు లేచికూర్చున్నాడు. పట్టరాని ఆనందంతో శ్రీరాముడు 'లక్ష్మణా నీవు మరణించి ఉంటే నా విజయానికి అర్థమే లేదు. అప్పుడు సీతతోగాని నా ప్రాణాలతోకాని ఏం ప్రయోజనం' అన్నాడు.

ఇంద్రుడు పంపగా మాతలి దివ్యరథంతో సహా శ్రీరాముడి దగ్గరికి వచ్చాడు. ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించి శ్రీరాముడు రథాన్ని అధిరోహించాడు. యుద్ధభూమికి సాగిందారథం. మిగతా దినాల కన్నా భిన్నంగా ఉందీనాటి యుద్ధం. కొంతసేపు ఎవరికెవరూ తీసిపోని విధంగా విజృంభించారు. రానురాను రాముడిదే పైచేయి అవుతున్నది. రావణుని సారథి గమనించాడు. రథాన్ని పక్కకు మళ్ళించాడు. అలా చేయడం అవమానంగా భావించిన రావణుడు సారథిపై నిప్పులు చెరిగాడు. రథం మళ్ళీ రాముడి ముందు నిలిచింది. యుద్ధం చూడడానికి అగస్త్యుడు దేవతలతో కూడి అక్కడకు వచ్చాడు. శ్రీరాముడికి 'ఆదిత్య హృదయం' ఉపదేశించాడు. శ్రీరాముడి బాణాలతాకిడికి రావణుడి తలలు నేలరాలుతున్నాయి. కాని వెంటనే చిత్రంగా మళ్ళీ మొలుస్తున్నాయి.



ఆకాశానికి ఆకాశం, సముద్రునికి సముద్రమే సమానమైనట్లు రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సమానమన్నట్లు సాగుతున్నది. బ్రహ్మాస్త్ర ప్రయోగం చేయవలసిందిగా 'మాతలి' శ్రీరాముడికి సూచించాడు. శ్రీరాముడు బ్రహ్మాస్త్ర ప్రయోగంతో రావణాసురుణ్ణి అంతమొందించాడు.

అన్నఐన రావణుని మరణానికి విభీషణుడు బాధపడ్డాడు. దహన సంస్కారాలకు అనుమతినివ్వమని శ్రీరాముని ప్రార్థించాడు. 'వ్యక్తులు జీవించివున్నంతవరకే వైరముండాలి. తరవాత దానిని వదలివేయాలి. మన కార్యం నెరవేరింది. కావలసిన సంస్కారాలను చేయ'మని అన్నాడు శ్రీరాముడు. 'ఇప్పుడు రావణుడు నీకెట్లాగో నాకూ అట్లాగే గౌరవాస్పదుడు' అని తన విశాల హృదయాన్ని చాటుకున్నాడు శ్రీరాముడు. రావణుని భార్య మండోదరి భర్త మరణానికి పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయింది. విభీషణుడు రావణునికి ఉత్తరక్రియలను నిర్వర్తించాడు.

శ్రీరాముడి ఆదేశం మేరకు లక్ష్మణుడు విభీషణుణ్ణి లంకారాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. సీతతో తన విజయవార్తను తెలపమని హనుమంతుణ్ణి ఆదేశించాడు శ్రీరాముడు. హనుమంతుడు వెంటనే వెళ్ళి ఈ శుభవార్తను సీతమ్మకు చెప్పాడు. వేశాడు. ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలం చుట్టూచేరి బాధించిన రాక్షస స్త్రీలను చంపడానికి అనుమతినిమ్మన్నాడు హనుమ. తగని పని, వద్దని వారించింది సీత.

విభీషణుడు పల్లకిలో సీతాదేవిని శ్రీరాముడి దగ్గరికి చేర్చాడు. సంతోషంతో భర్తను చేరింది సీత. ఆమెను స్వీకరించడానికి రాముడు నిరాకరించాడు. 'నా వంశప్రతిష్ఠ నిలుపుకోవడానికి దుష్ట రావణుని చెరనుండి నిన్ను విడిపించాను. ఇంతకాలం పరుడి పంచన ఉన్నందువల్ల నీ ప్రవర్తన గురించి నాకు సందేహముంది. కనుక నువ్వు నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు'నని శ్రీరాముడు అన్నాడు. శ్రీరాముని మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి సీతకు. స్థాయికి దగినట్లుగా మాట్లాడలేదని రామునితో అన్నది. శ్రీరామునకు విశ్వాసం కలిగించడానికి 'అగ్ని ప్రవేశం' ఒక్కటే శరణ్యమని భావించింది. శ్రీరాముని మనసెరిగి లక్ష్మణుడు చితిని సిద్ధపరచాడు. సీత అగ్నిలోకి ప్రవేశించింది. అక్కడివారంతా ఆందోళనచెందారు. అగ్నిదేవుడు స్వయంగా సీతాదేవిని తీసుకువచ్చి ఆమె గొప్పదనాన్ని వెల్లడించాడు. ఆమెను స్వీకరించాల్సిందిగా శ్రీరాముణ్ణి కోరాడు.

సీత గురించి తనకంతా తెలుసన్నాడు శ్రీరాముడు. ఆమె శీలం యొక్క గొప్పదనాన్ని ముల్లోకాలకు చాటడానికే అగ్నిప్రవేశం చేస్తున్నా ఊరుకున్నానన్నాడు. సీతను దగ్గరకు తీసుకున్నాడు.

పరమశివుడు శ్రీరాముణ్ణి ప్రశంసించాడు. దుష్టసంహారంచేసిన శ్రీరాముణ్ణి ప్రజానురంజకంగా పరిపాలన చేయమన్నాడు. శ్రీరాముడి కోరిక మేరకు ఇంద్రుడు మృతులైపడివున్న వానరులను మళ్లీ బతికించాడు. విభీషణుడు లంకలో కొంతకాలం ఉండవలసిందని శ్రీరాముణ్ణి అభ్యర్థించాడు. భరతుని కొరకు తాను త్వరగా ప్రయాణం కావలసిందేనన్నాడు శ్రీరాముడు. వానరులను వాళ్ళ స్వస్థానాలకు వెళ్ళమనిచెప్పి, విభీషణుడి వీడ్కోలు అందుకున్నాడు. పుష్పకవిమానంలో అయోధ్యకు బయలుదేరాడు దారిలో



ఆయా ప్రదేశాలన్నీ సీతకు చూపుతున్నాడు. భరద్వాజాశ్రమాన్ని సందర్శించారు. శ్రీరామాజ్ఞతో హనుమంతుడు శ్రీరాముడు వస్తున్న విషయాన్ని భరతునికి, గుహునికి ముందుగా వెళ్ళి తెలియజేశాడు. వాళ్ళెంతో ఆనందించారు.

పుష్పక విమానంలో నందిగ్రామం చేరుకున్న సీతారామలక్ష్మణులకు భరతుడు, ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. సీతారామలక్ష్మణులు కౌసల్య, సుమిత్ర, కైకేయి, వశిష్ఠుల పాదాలకు ప్రణామాలు అర్పించారు. భరతుడు శ్రీరాముని చరణాలకు పాదుకలను తొడిగాడు. భరతుణ్ణి ప్రేమతో అక్కున జేర్చుకున్నాడు శ్రీరాముడు.

అంగరంగవైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం జరిగింది. యువరాజుగా ఉండాల్సిందిగా శ్రీరాముడు లక్ష్మణుణ్ణి కోరాడు కాని అతడు ఎంత మాత్రం ఒప్పుకోలేదు. అప్పుడు భరతుణ్ణి యువరాజుగా చేశాడు. యజ్ఞయాగాది క్రతువులను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు శ్రీరాముడు. ప్రజలను కన్నబిడ్డలా చూసుకుంటున్నాడు. ఎలాంటి ఈతిబాధలూ లేవు. అందరూ ధర్మబద్ధంగా నడచుకొంటున్నారు. ఇలా పదకొండువేల సంవత్సరాలకాలం ప్రజానురంజకంగా పరిపాలించాడు శ్రీరాముడు. అందుకే 'రామరాజ్యం' అన్న మాట నేటికీ ఆదర్శమై నిలచింది.

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ – మహనీయ గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ – సార్వభౌమాయ మంగళమ్॥

పదవండి-తెలుసుకోండి

# రామాయణ విశ్వరూపం

*మానవ జీవన మూల్యాలను దర్శింపజేసే అక్షరమణి దర్పణం రామాయణం. కనుకనే కొండలు, సముద్రాలు ఉన్నంత వరకు రామాయణ ముంటుందని బ్రహ్మ సెలవిచ్చాడు. ఇలా శాశ్వతత్త్వాన్ని సముపార్జించుకున్న రామాయణాన్ని రచించినవారు వాల్మీకి మహర్షి. వీరి తదనంతర కాలంలో దేశవిదేశాలలో వివిధ ప్రక్రియల్లో ఎన్నో రామాయణాలు వచ్చాయి. అయితే వీటన్నింటికీ మాతృక వాల్మీకి రామాయణమే. ఆయా కవులు వారి వారి ప్రతిభననుసరించి రామాయణకథను లోకానికందించారు. ఇందులో మూలాన్ని అనుసరించినవారు కొందరైతే, స్వతంత్రపోకడలు పోయినవారు మరికొందరు. ఇలా వచ్చిన రామాయణాల్లో కొన్నింటిని తెలుసుకుందాం.*

*సంస్కృత సాహిత్యాన్ని పరిశీలిస్తే పురాణాలలో రామకథ కనిపిస్తుంది. ఆయా సందర్భాలనుబట్టి వివిధ పురాణాల్లో ఇది పేర్కొనబడింది. 'ఆధ్యాత్మరామాయణం' తత్త్వ ప్రధానంగా సాగిన రచన. కాళిదాసు 'రఘువంశం' రామచరిత్రనేగాక అతని పూర్వుల చరిత్రనూ రమణీయంగా ఆవిష్కరించిన కావ్యం. భోజుడు చంపూరామాయణాన్ని (గద్య పద్యాలతో కూడినది) రచించాడు. భట్టి 'రావణవధ' పేరున రాశాడు. వ్యాకరణసూత్రాలకు, అలంకారాలకు లక్ష్యంగా ఇది రాయబడడం విశేషం. రామకథను 'ప్రతిమానాటకం' పేరున భాసుడు, 'ఉత్తర రామచరితం'గా భవభూతి నాటకీకరణ చేశారు. రామాయణ, భారత కథలను కలిపి 'రాఘవ పాండవీయం' అనేద్వ్యర్థి (రెండర్థాల) కావ్యాన్ని ధనంజయుడు  వెలియించాడు.*

*కాశ్మీరీభాషలో దివాకర ప్రకాశభట్టు 'రామావలోకచరిత', 'లవకువ యుద్ధచరిత'ను రాశాడు. మరాఠీలో సమర్థరామదాసు రచించిన రామాయణం, మోరోపంత్ 'లవకుశాఖ్యానమ్', 'మంత్రరామాయణమ్' ప్రసిద్ధిపొందాయి. వంగభాషలో కృత్తివాస ఓఝూ రామాయణానికి మంచి పేరుంది. తమిళ మహాకవి 'కంబ' 'రామాయణం' పేరుతో సాగిన రచన 'కంబరామాయణం'గా ప్రజలచే కీర్తింపబడుతున్నది. ఇందులో సర్వమానవ సౌభ్రాత్రం వర్ణించాడు. మళయాళంలో ఎళుత్తచ్చన్ 'ఆధ్యాత్మరామాయణం' భక్తికి పెద్దపీట వేసింది. కన్నడలో నాగచంద్రుని 'రామచంద్ర చరిత పురాణం' చంపూమార్గంలో సాగింది. ఒరియాలో సిద్ధేంద్రయోగి చేతిలో 'విచిత్ర రామాయణం' రూపుదిద్దుకంది.*

*హిందీకి ఉపభాషమైన అవధీలో గోస్వామి తులసీదాస్ కలం నుండి జాలువారిన 'రామచరితమానస్' ఉత్తర భారతదేశంలో విలక్షణ ముద్రను వేసింది. పంజాబీలో రామలీల నాటకం సుప్రసిద్ధం.*

*తెలుగు భాషలో విభిన్న ప్రక్రియల్లో రామాయణాలు వచ్చాయి. గోనబుద్ధారెడ్డి రచించిన 'రంగనాథరామాయణం' తెలుగులో తొలి రామాయణం. ఇది ద్విపద కావ్యం. వాల్మీకంలో లేని ఎన్నో కల్పనలను చేశాడు. ఇంద్రుడు కోడై కూయడం, లక్ష్మణరేఖ, ఉడుతభక్తి వంటి ఘట్టాలు ప్రజల్లో బాగా నాటుకుపోయాయి. తాళ్ళపాక అన్నమాచార్యుల 'ద్విపద రామాయణం', కట్టా వరదరాజు రామాయణం, ఏకోజీ రామాయణం ద్విపదలో సాగాయి.*

*తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం' తెలుగుజాతిపై తనదైనముద్రవేసింది. హుళక్కిభాస్కరుడు ప్రధానంగా, అతని కుమారుడు మల్లికార్జునభట్టు, శిష్యుడు రుద్రదేవుడు, మిత్రుడు అయ్యలార్యుల సహకారంతో 'భాస్కర రామాయణం' ప్రకాశించింది. గౌతముడు అహల్యను 'శిల' కమ్మని శపించడం, మంథర దుర్బోధకు కారణం వంటివి ఇందులో పేర్కొన్న కొన్ని కొత్త అంశాలు. రామాయణాన్ని సంక్షిప్త సుందరంగా తీర్చిదిద్దిన కవయిత్రి మొల్ల. ఈమె రచన 'మొల్లరామాయణం'గా ప్రసిద్ధిచెందింది.*

అయ్యలరాజు రామభద్రుని 'రామాభ్యుదయం' విశిష్ట ప్రబంధంగా రూపుదిద్దుకొంది. శ్రీరాముడు సీతమెడలో మంగళసూత్రం కట్టినట్లు వర్ణించాడు. ఇది ఆంధ్రదేశ ఆచార ప్రభావంతో చోటుచేసుకుంది. తంజావూరును పరిపాలించిన రఘునాథనాయకుడు 'రఘునాథ రామాయణం' వాల్మీకి ననుసరించింది. కూచిమంచి తిమ్మకవి 'అచ్చతెలుగు రామాయణాన్ని' ఆవిష్కరించాడు. గోపీనాథ వేంకటకవి 'గోపీనాథరామాయణం', కంకంటి పాపరాజు 'ఉత్తర రామాయణం' సాహితీ జిజ్ఞాసువులను అలరించాయి.

కాణాదం పెద్దన 'ఆధ్యాత్మరామాయణం' రచించాడు. గద్వాల ప్రభువులు 'యథాశ్లోక తాత్పర్యరామాయణం' పేర ఆరుగురు కవులచే వాల్మీకి రామాయణానికి తెలుగు రూపమిప్పించారు. వావికొలను సుబ్బారావు 'ఆంధ్రవాల్మీకి రామాయణం' శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి 'శ్రీకృష్ణరామాయణం' ప్రసిద్ధి పొందిన రచనలు. విశ్వనాథ సత్యనారాయణ 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందింది.

పింగళి సూరన 'రాఘవ పాండవీయం' పేర ద్వ్యర్థికావ్యం రచిస్తే, ఎలకూచి బాలసరస్వతి, నెల్లూరి రాఘవకవి 'యాదవ రాఘవ పాండవీయం' పేర త్ర్యర్థి కావ్యాలను రచించారు. నంబెరుమాళ్ళు పురుషకారి కేశవయ్య 'దాశరథిచరిత్ర' పేరున నిరోష్ఠ్యంగా (పద్యాలు చదివితే పెదవికి పెదవి తాకకుండా) సంతరించారు.

త్యాగరాజస్వామివారు, అన్నమయ్య, కంచెర్ల గోపన్న (రామదాసు) శ్రీరామ సంబంధంగా ఎన్నో కీర్తనలను అందించారు. యక్షగాన రూపంలో రామాయణకథను ఎందరో అక్షరబద్ధం చేశారు. వెల్లూరి వేంకటకవి 'రామలీలా యక్షగానం', శేషాచలకవి 'ధర్మపురి రామాయణం'. ముద్దుబాలంభట్టు 'మంథెన రామాయణం', కందుకూరి రుద్రకవి 'సుగ్రీవవిజయం' మోక్షగుండం సుబ్బకవి 'సీతాకల్యాణం' వంటివి ఎన్నో ఉన్నాయి.

నాటక విభాగానికివస్తే కోలాచలం శ్రీనివాసరావు 'సంపూర్ణరామాయణం', బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'ఉత్తర రాఘవం', ధర్మవరం గోపాలాచార్యుల 'రామదాసు', పానుగంటి లక్ష్మీనరసింహారావు 'కల్యాణరాఘవం', సెట్టిలక్ష్మీనరసింహకవి 'అహల్య' (వచన నాటకం) రచించారు.

తాళ్ళూరి నారాయణకవి 'మోక్షగుండ రామాయణం' పేర హరికథగా మలిస్తే, నదీరా బుఱ్ఱకథగాఁ సంపూర్ణ రామాయణాన్ని తీర్చిదిద్దాడు. కంచెర్ల గోపన్న 'దాశరథీశతకా'నికున్న ప్రచారం ఇంతంతనరానిది.

జానపదంలో 'కుశలవకుచ్చాలచరిత్రము', రామకథా సుధార్ణవము, శారద రామాయణం, లంకాయాగం, చిరుతలరామాయణం, శ్రీరామజావిలి, సంక్షేపరామాయణం, చిట్టిరామాయణం వంటివి పేరొందిన రచనలు. శాంతగోవిందనామాలు, ఊర్మిళాదేవినిద్ర, లక్ష్మణదేవరనవ్వు వంటి స్త్రీల రామాయణపు పాటలు కోకొల్లలు.

వచన రచన విభాగంలో గోపీనాథ కవి 'విచిత్రరామాయణం' (అనువాదం), పైడిపాటి పాపయ్య 'రంగనాథరామాయణం' వావిళ్ళరామస్వామిశాస్త్రి, శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, ఉషఃశ్రీ, దాశరథి రంగాచార్యులవంటి ప్రతిభావంతుల రచనలు పాఠకుల మనసును పరవశింపజేశాయి.

చైనా, కాంబోడియా, జావా, సుమిత్రా, లావోస్, వియత్నాం, మలేషియా వంటి దేశాలలో కూడా రామాయణ రసామృతం ప్రవహించింది. ఇంత వైవిధ్యంగా, విస్తృతంగా ప్రజల హృదయాల్లోకి ప్రసరించిన కావ్యం ప్రపంచసాహిత్యంలో మరొకటి లేదంటే అత్యుక్తి కాదు. అందుకే రామాయణం ఆదికావ్యమే కాదు, అద్వితీయకావ్యం కూడా.

# పదవిజ్ఞానం

## అర్థాలు

### అ

అంకురించు (క్రి) = మొలకెత్తు, పుట్టు
అఖిలం = అశేషం, అంతం
అంగలార్చు (క్రి) = దుఃఖించు
అగ్గించు (క్రి) = పొగడు, స్తుతించు
అంభోధి = సముద్రం, కడలి
అణా = రూపాయిలో పదహారోవంతు విలువగల నాణెం
అతిథి = తిథి, వార, నక్షత్రాలు చూసుకోకుండా ఇంటికి వచ్చేవాడు
అధిగమించు (క్రి) = (తెలియు, పొందు) దాటు, మించు
అనంతరం = తర్వాత, పిమ్మట
అనయం = అత్యంతం, అవశ్యం, సతతం, మరిమరి, ఎప్పుడూ
అనవుడు = అనగా, అన్నప్పుడు
అన్పృతం = అసత్యం
అపభ్రంశం = అపశబ్దం
అపూపం = పిండివంట, అప్పం
అభిఘరించు (క్రి) = చల్లు, చిలకరించు
అభిరమ్యం = చాలా అందమైన
అభీప్సితం = కోరింది, అభీష్టం
అమాంతం = అకస్మాత్తు
అయుతం = పదివేలు
అర్థి = వేడుకొను, కోరేవాడు
అర్థం = ధనం
అర్ఘ్యపాద్యములు = చేతులు, కాళ్ళు కడుక్కోవడానికి ఇచ్చే నీళ్ళు
అర్ధాంగలక్ష్మి = శరీరంలో సగభాగమైన లక్ష్మి సమానురాలు (భార్య)
అల్పము = సూక్ష్మం, కొంచెం
అవసరం = సమయం, వేళ
అవిరళం = విరళంకానిది, దట్టమైన
అస్తధ్యస్తులై = ఉనికి కోల్పోయినవారై (సర్వం చెదరగొట్టుకొన్నవారై)
అస్మచ్చమూధవులు = మా సైన్యాధిపతులు
అహరహం = ప్రతిదినం
అటీముటీ = సంభ్రమం, కలత

### ఆ

ఆకంఠం = గొంతుదాకా
ఆగ్రహం = కోపం
ఆచూకీ = జాడ
ఆతిథేయులు = ఆతిథ్యం ఇచ్చేవారు
ఆప్యాయత = ఆదరణ, ఇష్టం
ఆయతి = ప్రభావం
ఆయత్తం = సిద్ధం
ఆయువు = జీవితకాలం
ఆర్ష సంస్కృతి = ఋషిసంబంధమైనది, సనాతనమైంది
ఆవరణ = ఆచ్ఛాదనం, మూత
ఆవేశపరులు = తొందరపాటుతో మాట్లాడేవాళ్ళు
ఆస్పందదోష్ఠం = అదిరేపెదవి

### ఇ

ఇందుబింబాస్య = చంద్రబింబంవంటి ముఖం కలది, చంద్రముఖి
ఇనాం = బహుమతి, మాన్యం
ఇనుడు = సూర్యుడు

### ఈ

ఈప్సితం = కోరిక

### ఉ

ఉదరం = పొట్ట
ఉద్యమం = ప్రయత్నం
ఉద్వృత్తి = ఉద్ధతి, గర్వం
ఉపద్రవం = ఆపద
ఉపస్పర్శ = స్నాన, ఆచమనాదికాలు

ఉపార్జితం = సంపాదించినది
ఉలియు (క్రి) = చలించు, కదులు
ఉల్లాసం = సంతోషం, ప్రకాశం

ఋ

ఋక్కు = ఒక వేదం, వేదమంత్రం

ఎ

ఎలమి = వికాసం, సంతోషం
ఎల్లి = రేపు
ఎఱకలు = రెక్కలు

ఏ

ఏమరుపాటు = అజాగ్రత్త

ఓ

ఓర్పు = సహనం
ఓష్ఠం = పెదవి

ఔ

ఔద్ధత్యం = ఉద్ధతత్వం

క

కంకణములు = వర్తులాకారభరణాలు
కటకట = అయ్యయ్యో
కటకటపడు (క్రి) = బాధపడు
కఠారం = ఖడ్గం
కడ = చివర
కందభోజులు = దుంపలు తినేవారు
కన్నుగవ = కన్నులజంట
కబళం = ముద్ద
కమ్రకరములు = ఇంపైన చేతులు
కరంబులు = చేతులు
కరవటంబు = భరిణె, గిన్నె
కలభాష = మధురభాష
కలమధాన్యం = వరిపంట
కలహకంఠి = గొడవలు పెట్టుకొనే స్త్రీ, గయ్యాళి
కళవళం = తొట్రుపాటు
కల్పనము = ఊహ
కాడు = అడవి
కాణాచి = చిరకాల వాసస్థానం

కుందాడు (క్రి) = బాధపెట్టినట్లు మాట్లాడడం
కుంభి = ఏనుగు
కుడుస్తున్న (క్రి) = తాగుతున్న, భుజిస్తున్న
కుముదిని = తెల్లకలువ
కురిడీ = కొబ్బరికాయలో ఎండిన కొబ్బరి
కులిశం = వజ్రాయుధం
కుసుమస్తబకం = పూలగుత్తి, పూలగుచ్ఛం
కూడలి = నాలుగుదారులు కలిసే చోటు
కూర్మం = తాబేలు
కృశించు (క్రి) = బక్కచిక్కు, సన్నగిల్లు
కేళిక = ఒక విధమైన నృత్యం
కేసరములు = పూవులోని పుప్పొడిగల భాగాలు
కైరవం = తెల్లకలువ
కైరవషండం = తెల్లకలువల సమూహం
కైలుచేయు (క్రి) = ధాన్యాన్ని తూర్పారబట్టి యజమానికి అప్పగించడానికి సిద్ధం చేయడం
కొడిగట్టిన దీపాలు = ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న దీపాలు.
కొండాడు = పొగడు, స్తుతించు

ఖ

ఖలుడు = దుర్జనుడు, దుష్టుడు, చెడ్డవాడు
ఖిన్నుడు = దుఃఖితుడు
ఖేదం = శోకం

గ

గగుర్పాటు = భయహర్షాదులచేత ఒంటిమీది వెంట్రుకలు నిక్కబొడవడం
గరిమ = శ్రేష్ఠమైన, గొప్ప
గ్రక్కున = వెంటనే
గాదిలిసుత = ప్రియమైన కూతురు
గుద్దలి = వేర్లు మొదలైనవి పెళ్ళగించే సాధనం
గురి = లక్ష్యం
గొండ్లి = కుండలాకార నృత్యం, గుండ్రంగా తిరుగుతూ ఆడే ఆట
గొడుగు పాగలు = గొడుగులు గల పాముకోళ్ళు, కర్రచెప్పులు
గోమయం = ఆవుపేడ
గోముఖం = అలుకుట (ఆవుపేడతో అలుకుట)
గోరంతదీపం = చిన్నగా వెలిగేదీపం

ఘ

ఘన వనజాతలోచన = విశాలమైన తామరల వంటి కన్నులు గలది
ఘాతం = దెబ్బ
ఘూర్ణిల్లు (క్రి) = తిరుగుడుపడు, మోగు
ఘోష = ఉరుము, పెద్దశబ్దం

చ

చందనం = గంధం
చట్టువం = గరిటె
చదలు = ఆకాశం
చప్పటలు = చప్పట్లు
చమత్కారం = నేర్పు
చయం = సమూహం, గుంపు
చయ్యన = వెంటనే, త్వరగా
చరణద్వంద్వం = పాదములజంట
చాడ్పు = విధం
చిగురుబోడి = చిగురుటాకువంటి శరీరం గల స్త్రీ
చిరంతనుడు = శాశ్వతుడు
చెక్కర్లు = అదేపనిగా చుట్టుతిరగడం
చౌకబారు = తక్కువ విలువ గలిగిన

ఛ

ఛాత్రులు = శిష్యులు, విద్యార్థులు
ఛిన్నభిన్నం = ముక్కలు ముక్కలు, చెల్లాచెదురు, తునాతునకలు

జ

జానపదులు = మనుష్యులు, పల్లెటూళ్ళవాళ్ళు
జేవురు = ఎఱ్ఱనిది, ఎరుపు
జోక = యుక్తం, ఉత్సాహం, బాగు
జోటీ = దుప్పటి
జ్వలనం = మంట

ఝ

ఝరి = ప్రవాహం, సెలయేరు

త

తడయు = ఆలస్యంచేయు
తడవ = మారు, సారి (ఒకటోమారు, ఒకటోసారి..)
తంత్రం = ఉపాయం
తన్మయులు = తత్స్వరూపమైనవారు, తమను తాము మరచిన వారు
తమం = చీకటి
తర్కం = ఊహ, కారణం, కోరిక, ఒకశాస్త్రం
తాండవం = ఉద్ధతనృత్యం
తాపసులు = తపస్సుచేసుకునేవారు
తారక = చుక్క
తారాడడం = తిరుగులాడడం, జీరాడడం
తాల్మి = క్షమ, ఓర్పు
తిమిరం = చీకటి
తీరుబడి = తీరిక
తుచ్ఛం = దుఃఖం, శూన్యం, నీచం
తుల్యం = సమము, సరి
తేట = నిర్మలం, ప్రసన్నం, విశదం
తొంటి = తొల్లి
తొఱగు (క్రి) = విడుచుట, తప్పించుకోవటం
తోయధి = సముద్రం

ద

దమం = దండోపాయం, క్లేశం, ఇంద్రియం
దమ్మిడీ = ఐదుకాసులనాణెం, (రెండు పైసల నాణెం)
దిక్పతి = దిక్పాలుడు
దివసం = రోజు, పగలు
దివసేంద్రుడు = సూర్యుడు
దివి = ఆకాశం
దీధితి = కిరణం, వెలుగు, కాంతి
దీపితం = ప్రకాశితమైన
దుశ్చరితాలోచన = చెడుతలపు (చెడ్డఆలోచన)
దేవుళ్ళాట = వెదుకులాట
ద్వారికవాటం = ద్వారబంధం, తలుపు

న

నగారా = పెద్దఢంకా, పెద్దగా చప్పుడువచ్చే వాద్యపరికరం
నలిరేగి = విజృంభించి
నిక్కం = నిజం, వాస్తవం
నిఖిల = సమస్త, అన్ని
నిచయం = సమూహం
నిదాఘం = వేసవి ఎండాకాలం

| | | |
|---|---|---|
| నిదానం | = | మూలకారణం, నెమ్మది |
| నిమిత్తం | = | కారణం |
| నిర్జనం | = | జనంలేనిది |
| నిశ | = | రాత్రి |
| నిష్ణాతుడు | = | నేర్పరి |
| నిస్తంద్రుడు | = | కునికిపాటు లేనివాడు |
| నీవార ముష్టింపచుల్ | = | సహజంగా పండే వడ్లను పిడికెడు తీసుకొని కడుపునింపుకొనేవాళ్ళు |
| నుతి | = | పొగడ్త, స్తుతి |
| నెట్టుకొను (క్రి) | = | పెరుగుతున్న |
| నెఱపూత (క్రి) | = | నిండుగా పూసినది |
| నెఱి | = | పూర్తి |
| నొక్కి | = | అదిమిపట్టి |
| నొసలు | = | నుదురు |

**ప**

| | | |
|---|---|---|
| పంచజనుడు | = | పాంచభౌతిక శరీరం కలవాడు (మనిషి) |
| పగిది | = | విధం |
| పనిచి | = | నియమించి, పంపి |
| పరహితార్థం | = | ఇతరుల మేలుకోసం |
| పరాభవం | = | అవమానం |
| పరామర్శ | = | చక్కగా విచారించు |
| పరివారం | = | పరిజనం |
| పరివ్రాజకుడు | = | సన్న్యాసి |
| పాత్ర | = | గిన్నె, కథలో / నాటకంలో వచ్చే ఒక వ్యక్తి |
| పారాశర్యుడు | = | పరాశరుని కుమారుడు (వ్యాసుడు) |
| పుట్టకురుపు | = | క్యాన్సర్ వ్రణం, రాచపుండు |
| పుయిలోడు (క్రి) | = | వెనుదీయు, సంకోచించు, జంకు |
| పురంధ్రి | = | కుటుంబస్త్రీ |
| పులస్త్యబ్రహ్మ | = | బ్రహ్మమానస పుత్రుడు |
| పూరం | = | జలప్రవాహం |
| పెక్కండ్రు | = | పలువురు |
| పేరిణి | = | వీరనాట్యం |
| పేర్మిన్ | = | ప్రీతితో |
| పొదలు (క్రి) | = | వృద్ధిచెందు, పెరుగు, వర్ధిల్లు |
| పౌరాణికాలు | = | పురాణ సంబంధమైనవి |
| ప్రణమిల్లు (క్రి) | = | నమస్కరించు |
| ప్రవిమల | = | చాలా స్వచ్ఛమైన |
| ప్రజ్ఞానం | = | విశేషప్రతిభతో కూడిన జ్ఞానం |
| ప్రక్షాళితంబు | = | కడిగినది |

**బ**

| | | |
|---|---|---|
| బంతి | = | వరుస, పంక్తి, సామూహిక భోజనానికి కూర్చున్నవాళ్ళ వరుస |
| బస్తీజనం | = | పట్టణవాసులు |
| బుధులు | = | పండితులు, విద్వాంసులు |
| బుద్బుదం | = | నీటిబుడగ |
| బృహత్తర | = | గొప్పదైన |

**భ**

| | | |
|---|---|---|
| భత్యాలు | = | నెలజీతంతోపాటు చెల్లించే అదనపు పైకం |
| భసితం | = | భస్మం, బూడిద |
| భక్షణం | = | తిండి |
| భక్షించు (క్రి) | = | తిను |
| భాసిల్లు (క్రి) | = | ప్రకాశించు |
| భుక్తిశాల | = | భోజనశాల |
| భూరుహం | = | భూమినుంచి పుట్టినది (చెట్టు) |
| భృంగం | = | తుమ్మెద |
| బీఱు + ఎండ | = | అధికమైన ఎండ |

**మ**

| | | |
|---|---|---|
| మందకొడి | = | సోమరి, జడుడు, చురుకుగా సాగకపోవడం |
| మందుడు | = | చొరవలేనివాడు, అల్పుడు, నిర్భాగ్యుడు, మూర్ఖుడు |
| మంద్రం | = | గంభీరధ్వని |
| మచ్చకంటి | = | మీనాక్షి, చేపలవంటి కన్నులు గల స్త్రీ |
| మతిహీనులు | = | తెలివిలేనివాళ్ళు |
| మదీయ | = | నాయొక్క |
| మననం | = | చింతన, గమనం |
| మనోహరం | = | ఇంపైన, బంగారం |
| మహాప్రస్థానం | = | దీర్ఘప్రయాణం, లోకాంతరయాత్ర, మరణం |
| మాధుకరభిక్ష | = | ఇల్లిల్లు తిరిగి అన్నం సేకరించుకోవడం |
| మిక్కుటం | = | ఎక్కువ |
| మీలనము | = | కళ్ళు మూయుట |
| ముక్కంటి | = | మూడు కనులు కలవాడు (శివుడు) |
| ముప్పిరిగొను (క్రి) | = | బలపడటం (మూడుతాళ్ళు పెనవేసుకున్నట్లు) |

| | | |
|---|---|---|
| ములుగఱ్ఱ | = | ఎడ్లను తోలడానికి వాడే ములుకోలు |
| ములుకు | = | మొనదేలిన భాగం |
| మూర్ధం | = | నడితల |
| మెండు | = | అధికం |
| మోడు | = | ఆకురాలిన వృక్షం |
| మోహం | = | అజ్ఞానం |
| మోక్షలక్ష్మి | = | మోక్షమనే లక్ష్మి (ముక్తి) |
| మౌళి | = | సిగ |

**య**

| | | |
|---|---|---|
| యాతన | = | తీవ్రమైన వేదన, బాధ, కష్టం |

**ర**

| | | |
|---|---|---|
| రక్తం | = | నెత్తురు, ఎరుపు |
| రజని | = | రాత్రి |
| రవళి | = | ధ్వని, చప్పుడు |
| రుగ్మత | = | జబ్బు |
| రుచిరం | = | కాంతి |
| రేగి | = | ఎగసి, విజృంభించి |
| రోదసి | = | భూమ్యాకాశాలు, భూమి, ఆకాశం |

**ల**

| | | |
|---|---|---|
| లలామ | = | శ్రేష్ఠురాలు |
| లసత్ | = | అతిశయం |
| లాతి | = | అన్యుడు |
| లోచనం | = | కన్ను |

**వ**

| | | |
|---|---|---|
| వక్త్రం | = | ముఖం, నోరు |
| వర్ణభరితం | = | రంగులమయం |
| వసించు | = | నివసించు |
| వాటిక | = | వీధి |
| వార్తాహరి | = | వృత్తాంతం తెలిసికొనిపోయి చెప్పేది |
| వాచస్పతి | = | బృహస్పతి |
| వాసము | = | ఇల్లు |
| వ్యాసంగం | = | కృషి |
| విచ్ఛిత్తి | = | విభజించడం, వేరుచేయడం |
| విభూతివీద్యం | = | విభూతితోసహాఇచ్చే విడియం (ఆకులు, వక్కలు) |
| విప్రులు | = | బ్రాహ్మణులు |
| వీడు | = | పట్టణం |
| వెఱపు | = | భయం |
| వెల్లి | = | ప్రవాహం |
| వేదోక్తం | = | వేదంలో చెప్పిన |
| వ్రేక | = | అతిశయం, భారం |
| వ్యోమం | = | ఆకాశం |

**శ**

| | | |
|---|---|---|
| శతాబ్దం | = | నూరు సంవత్సరాల కాలం |
| శాంతుడు | = | శాంతిగలవాడు |
| శిలోంఛప్రక్రములు | = | శిలప్రకములు (పొలాల్లో రాలిన కంకుల (గింజల)ను ఏరుకొని బ్రతికేవాళ్ళు) ఉంఛప్రక్రములు (రోళ్ళ దగ్గర చెదిరిపడ్డ బియ్యపు గింజలు ఏరుకొని జీవనం సాగించేవాళ్ళు) |

**ష**

| | | |
|---|---|---|
| షండం | = | సమూహం |

**స**

| | | |
|---|---|---|
| సంచయం | = | సమూహం, కూడిక |
| సంత్రాసం | = | మిక్కిలి భయం |
| సంక్షిప్తం | = | కుదించినది |
| సద్దు | = | శబ్దం, చప్పుడు |
| సరభసోత్సాహం | = | అధికమైన ఉత్సాహం |
| సర్వం | = | మొత్తం |
| సత్త్వం | = | దేహబలం |
| సత్కృతి | = | సత్కారం, సన్మానం |
| సరిత్తు | = | నది |
| సహస్రాబ్దం | = | వేయి సంవత్సరాల కాలం |
| సాంధ్య | = | సంధ్యా సమయ సంబంధమైన |
| సాతి | = | దుకూలం, వస్త్రం |
| సాధ్వి | = | పతివ్రత, శీలవతి |
| సాన్నిధ్యం | = | సమీపం, దగ్గర, సన్నిధి |
| సారం | = | చేవ, బలం, శ్రేష్ఠం, ధనం, సమక్షం |
| సుంత | = | ఇంచుక, ఇసుమంత, కొంచెం |
| సుధాకరుడు | = | చంద్రుడు |
| సూడిగములు | = | గాజులు |
| సేచనం | = | అభిషేకం |

సేసలు = తలంబ్రాలు, అక్షతలు
సైరించుట = క్షమించుట, ఓర్చుట
సౌజన్యం = మంచితనం, దయ
సౌదామిని = మెరుపు
సౌరభం = సువాసన
స్మరణ = తలపు
స్మితం = చిరునవ్వు, హాసం
స్నిగ్ధం = స్నేహముగలది, నునుపుగలది
స్వరం = అచ్చు, సరిగమ మొ॥ సంగీతధ్వని

హ

హంగులు = డాబు, దర్పం, అట్టహాసం
హితైషులు = మేలుకోరేవాళ్ళు
హోరు = తీవ్రమైన ధ్వనికి అనుకరణం (గాలివీచడం, వానకురువడం)

క్ష

క్షుత్పిపాసలు = క్షుత్తు (ఆకలి), పిపాస (దప్పిక), ఆకలిదప్పులు

## నానార్థాలు

అనృతం = అసత్యం, సేద్యం, వాణిజ్యం
అర్థి = వేడేవాడు, ధనవంతుడు, వాది, సేవకుడు
కంకణం = తోరం, నీటిబిందువు, స్త్రీలు చేతికి ధరించే ఆభరణ:
కదురు = కండె, సన్ననికమ్మ, అతిశయించు
కళ = చదువు, అవ్యక్తమధురధ్వని, శిల్పం, చంద్రునిలో పదహారో వంతు
కాలం = సమయం, నలుపు, చావు
కుండలి = పాము, నెమలి, వరుణుడు
కులం = వంశం, జాతి, ఇల్లు
గడ = స్తంభం, సమూహం, పొడుగాటి వెదురుకట్టె
గుణం = స్వభావం, వింటినారి
గుడి = దేవాలయం, గుండ్రని గీత, డేరా, గుణింతంలో గుడి
గురువు = ఉపాధ్యాయుడు, తండ్రి, పురోహితుడు, బృహస్పతి
గ్రహణం = బుద్ధి, నేత్రం, ఆవరించుట
ఘూర్ణిల్లు = మ్రోగు, తిరుగుడుబడు
ఘోష = ఉరుము, ఆవులమంద, కంచు
తుచ్ఛం = దుఃఖం, శూన్యం
నిట్టవొడుచు = ఉప్పొంగు, విజృంభించు, రోమాంచితమగు
ఫలం = పండు, ప్రయోజనం, సుఖం
మిత్రుడు = స్నేహితుడు, సూర్యుడు
ముద్ర = గుర్తు, అచ్చువేయడం
లెస్స = శ్రేష్ఠం, యుక్తం
వనం = తోట, అడవి, జలం
వాసం = ఇల్లు, వస్త్రం
వెల్లి = ప్రవాహం, పరంపర

# పర్యాయపదాలు

అంభోధి = సముద్రం, కడలి, సాగరం
అగ్గించు = అతిశయించు, అధికమగు, ఎక్కువగు
అనలం = అగ్ని, మంట, నిప్పు, జ్వలనం
అరణ్యం = విపినం, అడవి, అటవి, వనం
అనృతం = అసత్యం, అబద్ధం, బొంకు
అన్నం = బువ్వ, కూడు, బోనం
అర్ధాంగి = భార్య, పత్ని, ఇల్లాలు
అహిమకరుడు = సూర్యుడు, భానుడు, రవి, భాస్కరుడు
ఆగ్రహం = కోపం, క్రోధం, అలుక
ఆజ్ఞ = ఆదేశం, ఆన, ఉత్తరువు, నిర్దేశం
ఆస్యం = ముఖం, ఆననం, మోము
ఎలుక = మూషికం, ఖనకం, ఎలిక
కఠారం = ఖడ్గం, కత్తి, అసి
కన్ను = అక్షి, చక్షువు, నేత్రం, నయనం
కప్ప = భేకం, దర్దురం, మండూకం
కైరవం = కలువ, కల్హారం, కుముదం, ఇందీవరం
కొండాడి = పొగడి, స్తుతించి, నుతించి
కోరిక = వాంఛ, తృష్ణ, ఈప్సితం
కౌముది = వెన్నెల, చంద్రిక, జ్యోత్స్న
గృహం = ఇల్లు, గేహం, నికేతం
చంద్రుడు = ఇందుడు, శశాంకుడు, నిశాకరుడు
చాడ్పు = విధం, భంగి, రీతి, తీరు
తమస్సు / తమం = చీకటి, ఆంధ్యం, అంధకారం, ఇరులు
తాండవం = ఉద్ధతనృత్యం, నాట్యవిశేషం
దయ = కృప, కనికరం, కరుణ
దేహం = శరీరం, తనువు, కాయం
నరుడు = మానవుడు, మనిషి, మర్త్యుడు
నలిరేగు = విజృంభించు, మసలు
నిక్కం = నిజం, సత్యం
పల్లె = ఊరు, గ్రామం
పసిడి = బంగారం, కాంచనం, పుత్తడి
పారాశర్యుడు = వ్యాసుడు, బాదరాయణుడు
పూవు = కుసుమం, పుష్పం, విరి
పెండ్లి = వివాహం, పరిణయం, కల్యాణం, పాణిగ్రహణం
బ్రాహ్మణులు = ద్విజులు, విప్రులు, భూసురులు
భాగీరథి = గంగానది, జాహ్నవి, పావని
భోజనం = తిండి, ఆహారం, భోగం
మరణం = మృత్యువు, నిర్యాణం, చావు
మిన్ను = ఆకాశం, గగనం, నింగి
మైత్రి = స్నేహం, నెయ్యం, సాంగత్యం
మౌళి = సిగ, శిఖ, కొప్పు
రాత్రి = నిశ, రజని, యామిని
రుగ్మత = జబ్బు, వ్యాధి, రోగం
వనిత = మహిళ, స్త్రీ, పడతి
వస్త్రం = వలువ, పుట్టము, చేలం, గుడ్డ
వితతి = సమూహం, గుంపు, బృందం
వివరం = రంధ్రం, బిలం, కలుగు
వృక్షము = తరువు, చెట్టు, భూరుహం
వెల్లి = ప్రవాహం, సరిత, నది, ఏరు
శివుడు = శంకరుడు, రుద్రుడు, భవుడు
సంఘం = సమూహం, బృందం, గుంపు
సరిత్తు = నది, వాహిని
సాతి = వస్త్రం, దుకూలం, అంబరం
సుంత = ఇంచుక, ఇసుమంత, కొంచెం
స్మరణ = తలపు, జ్ఞప్తి, యాది

# వ్యుత్పత్త్యర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| అమృతం | = | మరణం పొందింపనిది (సుధ) | భవాని | = | భవుని (శివుని) భార్య (పార్వతి) |
| ఈశ్వరుడు | = | స్వభావం చేతనే ఐశ్వర్యం కలవాడు (శివుడు) | మిత్రుడు | = | సర్వభూతములయందు స్నేహయుక్తుడు (సూర్యుడు) |
| గురువు | = | అజ్ఞానమనెడి అంధకారమును పోగొట్టువాడు (ఉపాధ్యాయుడు) | ముని | = | మౌనముదాల్చి యుండువాడు (ఋషి) |
| చిత్రగ్రీవం | = | చిత్రమైన (వివిధ) వర్ణాలతో కూడిన కంఠం గలది (పావురం) | మూషకం | = | అన్నాదులను దొంగిలించునది (ఎలుక, పందికొక్కు) |
| తాపసుడు | = | తపము చేయువాడు (ముని) | మోక్షం | = | జీవుడిని పాశము నుండి విడిపించునది (ముక్తి) |
| దేహుడు | = | దేహమును ధరించినవాడు (మనిషి) | వనజం | = | వనము (నీరు) నందు పుట్టినది (పద్మము) |
| పతివ్రత | = | పతిని సేవించుటయె వ్రతంగాకలిగినది (సాధ్వి) | విశ్వనాథుడు | = | ప్రపంచానికి నాథుడు (శివుడు) |
| పార్వతి | = | హిమవంతుడను పర్వతరాజు కూతురు (పార్వతి) | శివుడు | = | సాధువుల హృదయాన శయనించి ఉండువాడు, మంగళప్రదుడు (ఈశ్వరుడు) |
| పుత్రుడు | = | పున్నామనరకం నుండి తల్లిదండ్రులను రక్షించువాడు (కుమారుడు) | శ్రియఃపతి | = | లక్ష్మీదేవికి భర్త (విష్ణువు) |
| పురంధ్రి | = | గృహమును ధరించునది (ఇల్లాలు) | సన్న్యాసి | = | సర్వమూ న్యాసం (వదిలివేసిన) చేసినవాడు |

# ప్రకృతి - వికృతి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| అంబ | - | అమ్మ | చిత్రం | - | చిత్తరువు | భాగ్యం | - | బాగ్గెం |
| ఆజ్ఞ | - | ఆన | ఛాయ | - | చాయ | బ్రహ్మ | - | బొమ్మ, బమ్మ |
| ఆర్య | - | అయ్య | జ్యోతి | - | జోతి | ముక్తం | - | ముత్తెం |
| ఆసక్తి | - | ఆసత్తి | దోషం | - | దోసం | యాత్ర | - | జాతర |
| ఆహారం | - | ఓగిరం | ధర్మం | - | దమ్మం | లక్ష్మి | - | లచ్చి |
| ఉపాధ్యాయుడు | - | ఒజ్జ | నిద్రా, నిద్ర | - | నిదుర | లేఖ | - | లేక |
| ఈశ్వరుడు | - | ఈసరుడు | పక్షం | - | పక్క | రత్నం | - | రతనం |
| కష్టం | - | కస్తి | పక్షి | - | పక్కి | రాట్ | - | ఱేడు |
| కవి | - | కయి | పంక్తి | - | బంతి | రాశి | - | రాసి |
| కవిత | - | కైత | పట్టణం | - | పట్టం | రాజ్ఞి | - | రాణి |
| కాగితం | - | కాయితం | పుణ్యం | - | పున్నెం | వాటిక | - | వాడ |
| కావ్యం | - | కబ్బం | పుత్రుడు | - | బొట్టెడు | విజ్ఞానం | - | విన్నాణం |
| కుడ్యం | - | గోడ | పుష్పం | - | పూవు | విద్య | - | విద్దె, విద్దియ |
| కులం | - | కొలం | ప్రాణం | - | పానం | శక్తి | - | సత్తి |
| గుణం | - | గొనం | బంధువు | - | బందుగు | శృంగారం | - | సింగారం |
| గుహ | - | గొబ, గవి | భాష | - | బాస | శ్రీ | - | సిరి |
| గృహం | - | గీము | భిక్షం | - | బిచ్చం | సుఖం | - | సుకం |
| గౌరవం | - | గారవం | భక్తి | - | బత్తి | స్వామి | - | సామి |